# క్రాంతి

## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| కాబూల్ పతనం....... | 11 |
| టెర్రరిజం-విప్లవం....... | 15 |
| కా॥ దివాకర్‌కు జోహార్లు....... | 21 |
| ప్రత్యేక వ్యాసం....... | 24 |
| రాచకొండ. కనగల్ ....... | 29 |
| సాంకేతిక యుద్ధతంత్రం....... | 30 |
| నేపాల్ : చర్చల గమ్యం....... | 43 |



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక**

**సంపుటి : 25 సంచిక : 6** **నవంబరు-డిసెంబరు** 2001 **వెల : ఐదు రూపాయలు**


# విప్లవోద్యమంలో నూతన మలుపులను సూచిస్తున్న ప్రజా గెరిల్లా సైన్యం ఎదురుదాడులు!!

ప్రజా గెరిల్లా సైన్యం ఆవిర్భవించిన సందర్భంగా ఈ డిసెంబర్ మాసం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. పి.జి.ఏ. ఆవిర్భవించి సంవత్సరం గడచిన సందర్భంగా మన పార్టీ ప్రభావమున్న ప్రాంతాలు అన్నింటా ఎత్తుగడల ఎదురు దాడుల పరంపర మొదలైంది. ఈ డిసెంబర్ 2వ తేదీనే మన కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళీలు రెండేళ్ళ క్రితం 'కొయ్యూరు' కోవర్టు కుట్రలో అమరులయ్యారు. ఈ ప్రియతమ నేతలు అమరత్వం పొందిన రోజునే పి.జి.ఏ. ఆవిర్భవించింది. పి.జి.ఏ.ని స్థాపించి సంవత్సరమైన సందర్భంగా పార్టీ నవంబర్ 30 నుండి డిసెంబర్ 7 వరకు నిర్బంధ వ్యతిరేక వారాన్ని జరపాల్సిందిగా తన శ్రేణులకు పిలుపిచ్చింది.

ఉద్యమ చరిత్రలో ఈ సంవత్సరం మన పార్టీ ఎత్తుగడల ఎదురు దాడుల పరంగా కొత్త కోణాలను ఆవిష్కరించింది. ఈనిర్బంధ వ్యతిరేక వారంకి ముందే ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా సామ్రాజ్యపు అసమ యుద్ధాన్ని నిరసిస్తూ మన రాష్ట్రంలో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలో కోకాకోలా కంపెనీ బాట్లింగ్ యూనిట్‌పై మన గెరిల్లా దళం దాడి చేసింది. నేరుగా సామ్రాజ్యవాద కబంధ సంస్థనే లక్ష్యంగా చేసుకుని మనం చేపట్టిన ఆ దాడి దేశ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దోపిడీ సంస్థ ప్రకంపనలు సృష్టించగా ప్రజాతంత్ర వాదులను ఎంతగానో ఉత్సాహపర్చింది. జాతీయ, అంతర్జాతీయ మీడియాలో ఈ సంఘటనపై విశేషంగా చర్చ జరిగింది. అమెరికా సామ్రాజ్యవాదం ఆఫ్ఘనిస్తాన్‌పై తలపెట్టిన యుద్ధానికి వ్యతిరేకంగా మన విప్లవోద్యమం పేల్చిన సింబాలిక్ షాట్ ఆ దాడి. అక్టోబర్ నెలలో జరిగిన ఆ దాడి సామ్రాజ్యవాద గుత్తసంస్థపై జరిగిన ప్రత్యక్ష దాడి కాగా



పి.జి.ఏ. ఆవిర్భవించి సం॥రం గడచిన సందర్భంగా ఇపుడు మనం ఎంచుకున్న లక్ష్యాలు సామ్రాజ్యవాదులను అంటకాగుతున్న దేశీయ దళారీ నిరంకుశ బూర్జువాలను, రాజకీయ నాయకులను వణికించాయి. నిర్బంధ వ్యతిరేక వారం సందర్భంగా కార్పొరేట్ సంస్థలకు, పాలక రాజకీయ నేతలకు చెందిన ఫ్యాక్టరీలపై ప్రజాగెరిల్లా సైన్యం యూనిట్లు చేసిన మెరుపుదాడులు వాణిజ్య, పాలక వర్గాలను ఎంతగా ప్రభావితం చేశాయంటే టెర్రరిస్ట్ నిరోధక చట్టం (పోటో) కింద కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మన పార్టీని, ఎం.సి.సి.ని నిషేధించింది.

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, జార్ఖండ్, బీహార్, చత్తీస్‌ఘడ్... ఇలా దక్షిణ, మధ్య భారతదేశ వ్యాప్తంగా ఈ నిర్బంధ వ్యతిరేక వారం సందర్భంగా ఉద్యమం ఎంచుకున్న లక్ష్యాలపై మెరుపుదాడులు జరిగాయి. ఈ దాడుల పరంపర గతంలో ఎన్నడూ లేనంతగా సామ్రాజ్యవాద సంస్థలపై, వాటి తైనాతీలపై తీవ్ర ప్రభావం చూపి ఒత్తిడి కల్గించింది. ఈ దాడుల పరంపరను, దాని పర్యవసానాలను, ప్రభావాలను వరుస క్రమంలో పరిశీలిద్దాం.

నవంబర్ 29 నుంచి ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాలలో శత్రువుకు 'షాక్' కల్గిస్తూ పి.జి.ఏ. మెరుపుదాడులు మొదలయినాయి. మన రాష్ట్రంలో మెదక్, చిత్తూరు జిల్లాలో దళారీ బూర్జువా వర్గం, పాలకవర్గ రాజకీయ నేతల కుటుంబాల ఆస్థులపై, ఫ్యాక్టరీలపై దాడులు జరిగాయి. మెదక్ జిల్లాలోని రామనాథపురంలో కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి కృష్ణంరాజుకు చెందిన గోపీకృష్ణా ఇండియా గ్రానైట్ ఫ్యాక్టరీని గెరిల్లా దళాలు స్థానిక మిలీషియా కలిసి పేల్చేశాయి. నష్టం 2 కోట్ల రూ॥లని అంచనా. మరొక దళం ఈ

జిల్లాలోనే తూఫ్రాన్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో వున్న టాటా కాఫీ ప్రాసెసింగ్ ప్లాంట్‌ని పేల్చేయడంతో ఐదుకోట్ల రూ॥ల నష్టం జరిగింది. గెరిల్లా దళం అక్కడినుంచి వెళ్ళిపోతూ భారత వైమానిక దళ మాజీ ప్రధానాధికారి డెనిస్ లాఫాంటైన్ దగ్గర నుంచి రష్యా తయారీ మకరోవ్ 9 ఎం.ఎం. పిస్టల్‌ని లాక్కుని వెళ్ళింది. ఇక చిత్తూరు జిల్లా పీలేరు సమీపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ పాల శీతలీకరణ కేంద్రంని గెరిల్లా దళం పేల్చేసింది. నష్టం 15 లక్షల రూ॥లని అంచనా. ఈ మూడు వీరోచిత దాడులూ రాష్ట్ర వ్యాప్తంగా దోపిడీదారులను భయకంపితులను చేశాయి.

ఆ మరుసటి దినం ఆదిలాబాద్ జిల్లా అసిఫాబాద్ పట్టణంలోని కోర్టు భవనాన్ని పి.జి.ఏ. గెరిల్లాలు పేల్చేశారు. మెదక్ జిల్లాలో ఒక కాంగ్రెస్ నేత చంపబడ్డాడు. దండకారణ్య గెరిల్లా జోన్‌కి చెందిన బసగడ్డ ఏరియాలో ఒక కానిస్టేబుల్‌ని గెరిల్లాలు కాల్చి చంపారు.

మూడోరోజు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల్లో వరుస దాడులు జరిగాయి. స్థానిక మిలీషియాతో సహా 25 మంది గెరిల్లాలు ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో ఒక సీనియర్ బి.జె.పి. నేత ఇంటిపై దాడి చేశారు. అరబింద డేని అనే పేరుగల ఈ బి.జె.పి. నేత ఒరిస్సా రాష్ట్ర సహకార, చేనేత, వస్త్ర పరిశ్రమశాఖా మంత్రి. దాడి జరిగిన సమయంలో ఇతగాడు ఇంట్లో లేకపోవడంతో ఆ ఇంట్లో వున్న అతడి ముగ్గురు బంధువులను బయటికి రప్పించి ఇంటిని ముక్కలుగా పేల్చేశారు. అంతకుముందు ఈ పి.జి.ఏ. గెరిల్లా దళమే ఒక పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి అక్కడున్న ముగ్గురు పోలీసులను లొంగదీసుకుని స్టేషన్‌ని పేల్చివేసింది. ఒరిస్సా సరిహద్దుల కావల విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో మూడు పోలీస్ స్టేషన్లపై ఏక కాలంలో దాడి జరిగింది. ప్రతి దాడిలోనూ మిలీషియాతో సహా 50 మంది వరకు గెరిల్లాలు పాల్గొన్నారు. గంట సేపు కాల్పులు జరిపాక గెరిల్లాలు క్షేమంగా తప్పుకున్నారు.

విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో తెలుగుదేశం ఎం.ఎల్.ఏ. సత్యనారాయణకు చెందిన రెండు ఇళ్ళను పేల్చేశారు. మెదక్ జిల్లాలో ఒక కాంట్రాక్టర్ కూడా కాల్చి చంపబడ్డాడు. ఆంధ్రా పేపర్ మిల్‌కి చెందిన ఒక గెస్ట్‌హౌస్‌ని, ఆఫీస్‌ని పేల్చేశారు. నష్టం 10 లక్షల రూ॥లని అంచనా!

డిసెంబర్ 4న ఆదిలాబాద్ జిల్లాలో ఒక మండల రెవిన్యూ ఆఫీసును, చిట్యాల మండలంలో ఒక తెలుగుదేశం పార్టీ నేత ఇంటిని బాంబులు పెట్టి పేల్చేశారు. విజయనగరం జిల్లాలో ఒక పండ్ల తోటల కంపెనీ భవంతిని పేల్చేశారు. వీటిలో కొన్నింటిని స్థానిక మిలీషియానే నిర్వహించింది. ఖమ్మం జిల్లా సరిహద్దున వున్న చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో పామేడు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. ఇది ఖమ్మం జిల్లా చర్ల ప్రాంతానికి 18 కి.మీ. దూరంలో వుంది. దంతెవాడ జిల్లాల్లో డిసెంబర్ 2, 3 తేదీలలో విస్తృత దాడులు జరిగాయి. ఇక్కడి భూపాలపట్నం పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి క్షేమంగా తప్పుకున్నారు. డిసెంబర్ 2 రాత్రి బీజాపూర్ సమీపంలోని గంగులేరు పోలీస్ స్టేషన్‌పై దాదాపు 4 గంటల నుంచి 5 గంటలపాటు కాల్పులు జరిపారు. ఈ దాడుల్లో 50 నుంచి 200 మంది వరకు పాల్గొన్నారని వార్తలు. ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం మండలం సరిహద్దు నుంచి దంతెవాడ జిల్లాకు వెళ్ళే అడవి మార్గంలోగల రహదారిపై గెరిల్లాలు ఆరు ప్రాంతాల్లో గోతులు తవ్వితే వాటిలో మందుపాతర్లు అమర్చి వుంటారని పోలీసులు ఆ పక్కకు గూడా పోలేదు. ఈ సందర్భంగా బస్తర్ డివిజన్ పీపుల్స్‌వార్ కమిటీ హిందీ భాషలో కరపత్రం పంచింది. గిరిజనులకు కూడు, గుడ్డ ఇవ్వని ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ పటిష్టత పేరుతో వేల కోట్ల రూ॥లను వెచ్చిస్తున్నారని కరపత్రం ఆరోపించింది. డిసెంబర్ 7వ తేదీ రాత్రి 70 మంది పి.జి.ఏ. గెరిల్లాలు చత్తీస్‌గడ్ రాష్ట్రంకి చెందిని బస్తర్‌లోని బెజ్జి పోలీస్ స్టేషన్‌ని పేల్చేశారు.

దేశంలోని పలు ప్రాంతాలలోనూ, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పి.జి.ఏ. ఆవిర్భావ సందర్భంగా నిర్బంధ వ్యతిరేక నిరసన వారంలో జరిగిన ఈ విధమైన నూతన దశ దాడులూ, చర్యలూ పాలక వర్గాలను ఎంతగా కంపింప జేశాయంటే ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే ఐ.ఏ.యస్., ఐ.పి.యస్. అధికారులతో సమావేశం జరిపాడు. చంద్రబాబు ఈ నూతన దాడులతో ఎంతగా ఆందోళన చెందాడంటే, ఈ సవాలు నెదుర్కొనడానికి తమ వ్యూహాలను సమకూర్చుకోవాల్సిందిగా పోలీసులను కోరాడు. రాజకీయ నాయకులందరికీ వారి కదలికలు, ప్రయాణాల విషయంలో జాగ్రత్తగా వుండాల్సిందిగా రెడ్ అలెర్ట్ పంపించారు. భారతీయ పారిశ్రామిక సమాఖ్య (సి.ఐ.ఐ.) ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి పరిశ్రమలకు రక్షణ పెంచాల్సిందిగా డిమాండ్ చేశాడు. ఇలాంటి ప్రమాదాలను ఎదుర్కోవలసి వచ్చినట్లయితే సామ్రాజ్యవాద గుత్త సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టమని భయం. ''నక్సలైట్లు ఇలా ప్రైవేట్ రంగ పరిశ్రమల మీద దాడులు కొనసాగిస్తూ పోతే రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు దెబ్బతినడం ఖాయం. ఈ దాడులు ఎంత తీవ్రంగా వుంటే పెట్టుబడులు అంత ఘోరంగా పడిపోతాయని'' ఛాంబర్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఉపాధ్యక్షుడు హెచ్చరించాడు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే వారికి భరోసాగా చంద్రబాబు పైకి డాంబికాలు పోయినప్పటికీ నిజానికి అప్పటికే జరగాల్సిన నష్టం చాలా వరకు జరిగిపోయిందని పత్రికలు రాశాయి. గత మూడు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం–నక్సలైట్లకు మధ్య ఎడ తెరపి లేకుండా యుద్ధం సాగుతోందని, కొన్ని సందర్భాలలో నక్సలైట్ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తూ పోలీసులే పైచేయి సాధిస్తున్నట్లుగా కన్పించినా నక్సలైట్లు మధ్య మధ్య విడుపు, విరామాలతో ఎదురుదాడులకు దిగుతూ పోలీసులకు షాక్ తెప్పిస్తున్నారని పత్రికలు రాశాయి. కొన్ని సం॥ల క్రితం బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో బెల్జియం వర్కర్స్ పార్టీ నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్లో పీపుల్స్‌వార్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నాక పార్టీకి బ్రెజిల్, చాడ్, మెక్సికో, నేపాల్, ఫిలిప్పైన్స్, సెనగల్ వంటి దేశాల యం.యల్.యం. పార్టీల మద్దతు లభించిందని; నేపాల్ నుంచి ఉత్తర తెలంగాణా దాకా బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌ల మీదుగా సాగే విప్లవ మార్గాన్ని తెరవాలనే పథకంతో పీపుల్స్‌వార్ పనిచేస్తోందని, పి.జి.ఏ. ఆవిర్భవించి సం॥రం అయిన సందర్భంగా వివిధ ప్రాంతాలలో జరిపిన దాడులు ఈ పథకంలో భాగంగానే జరిగాయని జాతీయ పత్రికలు రాశాయి.

పత్రికల వార్తలు, ఊహలు ఎలా వున్నప్పటికీ, కోకాకోలా వంటి సామ్రాజ్యవాద గుత్త సంస్థలను, దళారీ నిరంకుశ బూర్జువాల, రాజకీయ నాయకుల కుటుంబాల ఆస్తులను, ఫ్యాక్టరీలను లక్ష్యంగా చేసుకుంటూ ఈ సం॥రం పార్టీ చేసిన దాడులకు ఎంతో రాజకీయ ప్రాధాన్యత వుంది. రాజకీయ, మిలటరీ కర్తవ్యాలను వేరుచేస్తూ రెండింటినీ సమన్వయిస్తూ కేంద్రీకరించటం ద్వారా పి.జి.ఏ. స్థాపన సార్థకత పొందింది. రాష్ట్రంలోనే కాక దేశ వ్యాప్తంగా కూడా ఏక కాలంలో దాడుల్ని సమన్వయించే పార్టీ సామర్థ్యాన్ని ఈ దాడులు స్పష్టంగా ప్రదర్శించాయి. వందలాదిమంది కేడర్‌ని చంపేసినా, వేలాది ప్రజల్ని కార్యకర్తల్ని బలప్రయోగంతో ఒత్తిడిపెట్టి లొంగుబాటు ప్రహసనాలను నడిపినా, పోలీస్ స్టేషన్లను

# పోలీస్ పహారాలో పారిశ్రామిక వాడలు, పట్టణాలు

డిసెంబర్ 2 నిర్బంధ వ్యతిరేక వారం సందర్భంగా రాష్ట్రమంతటా పోలీసు పహారాలో మునిగిపోయింది. ఉద్యమం బలంగా వున్న ప్రాంతాలలో గత 15 సం॥లుగా నిర్బంధ తీవ్రత కొనసాగుతున్నప్పటికీ రాష్ట్ర చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక వాడలు, పట్టణాలు ఈ సందర్భంగా నిర్బంధ వాతావరణంలో గడిపాయి. ఒకే ఒక్క రాత్రిలోనే ఏడు సంచలన దాడులతో పీపుల్స్‌వార్ పార్టీ అనూహ్యంగా రాష్ట్రంలో భారీ ఎదురుదాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో పలు నగరాల్లో, పారిశ్రామిక వాడల్లో పోలీసు బలగాలను మోహరించారు. పరిశ్రమలపై పీపుల్స్‌వార్ వినూత్న దాడులతో విశాఖ పట్టణంలోని పరిశ్రమలపై కూడా దాడిచేసే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు విశాఖ పారిశ్రామిక ప్రాంతాలలో పహారా గాశాయి. మఫ్టీలో కూడా పలుచోట్ల పోలీసు బలగాలను దింపారు. నగర పోలీసు కమీషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్ల భద్రతపై ప్రత్యేక ఏర్పాటు చేశారు. డిసెంబర్ 1న విశాఖ ఏజెన్సీలో పీపుల్స్‌వార్ దళాలు రెండు పోలీసు స్టేషన్‌లపై దాడికి ప్రయత్నించి మరో నాలుగుచోట్ల ప్రభుత్వ భవనాలను పేల్చి వేయడంతో నగర పోలీసుల కంటిపై కునుకు లేకుండా పోయింది. వార్ నగర కమిటీ కూడా అంతకు రెండు రోజుల క్రితం ప్రజాగెరిల్లా సైన్యంలో చేరండంటూ ప్రకటనను విడుదల చేసి పలుచోట్ల కరపత్రాలను వెదజల్లడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. దీనికితోడు డిసెంబర్ 2వ తేదీ నుంచి పోలీసులకు వచ్చిన బెదిరింపు కాల్స్ మరింత గందరగోళానికి గురిచేశాయి. 2వ తేదీ రాత్రి పది గంటల ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ పేల్చివేతకు సిద్ధమని పీపుల్స్‌వార్ ఆల్టిమేట్ ఇచ్చిందంటూ వచ్చిన పుకార్లు పోలీస్ అధికారులను పరుగులు పెట్టించాయి. వెంటనే గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో భారీ పరిశ్రమల వద్ద సి.ఐ.యస్.యఫ్. బలగాలను మోహరించి కట్టుదిట్టమైన భద్రత చేపట్టాయి. ముఖ్యంగా పోలీస్ కమీషనర్ ఖాన్, డి.సి.పి.లకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. నగర పోలీసు కమీషనరేట్‌లోని విశాఖ నగరం, గాజువాక, స్టీల్ ప్లాంట్, సింధియా, పెందుర్తి, పరవాడ ప్రాంతాలలో వీళ్ళు రాత్రంతా చెడతిరుగుతూ భద్రతా ఏర్పాట్లు సమీక్షించారు. నగరంలో వచ్చిపోయే ప్రాంతాలలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీని నిర్విరామంగా చేపట్టడం, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, అనుమానిత ప్రాంతాలలో పోలీస్ బృందాలు తనిఖీలు నిర్వహించడం, వార్ అనుకూల వర్గాలున్నట్లుగా భావిస్తున్న పలు ప్రాంతాలపై పోలీసులు దాడులు చేయటం, పౌరహక్కుల సంఘం, ఇతర ప్రజాసంఘాల నాయకుల ఇళ్ళపై కూడా రాత్రిపూట దాడులకు దిగటం... ఇలా ఒకటేమిటి.... విశాఖ పరిసరాలు యుద్ధ వాతావరణంలోకి వెళ్ళిపోయాయి.

ఇక కోస్తాలో గుంటూరు, పల్నాడు వంటి ప్రాంతాల్లో, రాయలసీమ దళ ప్రాంతాలలో, పట్టణాల్లో డిసెంబర్ 2కి ముందూ, తర్వాత వారాల తరబడి కూంబింగ్, తనిఖీలతో పోలీసులు జన జీవితంపై తీవ్రంగా నిర్బంధం మోపారు, ఆఫ్ఘన్‌పై అమెరికా దాడికి నిరసనగా గుంటూరు జిల్లా ఆత్మకూరులో కోకాకోలా ఫ్యాక్టరీని పేల్చేయటం, నర్సరావు పేట యస్.యన్.యస్. కాలేజీ నుంచి యన్.సి.సి. తుపాకులను అపహరించుకు పోవటం వంటి సంఘటనలతో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో గుంటూరు జిల్లా వ్యాప్తంగా కనీ వినీ ఎరుగని నిర్బంధాన్ని ప్రయోగించారు. గుంటూరు పట్టణంతో సహా జిల్లాలోని పలు పట్టణాలలో, ప్రాంతాల్లో వార్ కార్యకర్తలు మకాం వేసి సమన్వయంతో కార్యక్రమాలు చేపడుతున్నారని భారీ ఎత్తున ప్రచారంకి దిగటం, నెలల తరబడి విస్తృతంగా తనిఖీలు చేపట్టడం, అన్ని సరిహద్దు ప్రాంతాల్లో రాత్రివేళ పికెట్లు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించటం, చివరికి ఇది ఏ స్థాయికి పోయిందంటే వి.ఐ.పి.లు, మాజీ ప్రజా ప్రతినిధులు ప్రయాణాల్లో చెకింగ్‌లు, సోదాలతో విసిగిపోయి ఉన్నతాధికార్లకు ఫిర్యాదు చేయటం కూడా జరిగిపోయింది. ఈ మూడు నెలల్లో గుంటూరు జిల్లాలో ప్రయాణం యుద్ధ భీభత్సాన్ని తలపింప జేసిందంటే అతిశయోక్తి కాదు. బస్సులు, సరకుల లారీలు, జీపులు, కార్లు ఒకటేమిటి చివరకు సైకిళ్ళను, పాదచారులను సైతం వదలకుండా అనుమానం తగిలిన ప్రతి ఒక్కరినీ నిలేసి ఆపాదమస్తకం తనిఖీలు నిర్వహించారు.

రాయలసీమలో ఈ సం॥రం ప్రథమార్థంలో ఆయుధాల స్వాధీనంతో, పోలీసులపై దాడులతో మొదలైన నిర్బంధం సంవత్సరాంతంలో పరాకాష్టకు చేరింది. నిర్బంధ వ్యతిరేక వారంలో భాగంగా నవంబర్ 29న పీలేరులో ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన హెరిటేజ్ పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రజాగెరిల్లా సైన్యం పేల్చేయటంతో ఎస్పీ రామ్‌నారాయణ్ ఆధ్వర్యంలోని పోలీసు యంత్రాంగం గంగ వెర్రులెత్తి పోయింది. స్వయానా ముఖ్యమంత్రి ఫ్యాక్టరీపైనే పి.జి.ఎ. గురిపెట్టడంతో పరువు పోయిన ప్రభుత్వ యంత్రాంగం ఉద్యమ ప్రాంతాల్లో తీవ్రంగా నిర్బంధం మోపడమే కాక దళాన్ని మట్టుపెట్టేందుకు కూడా విఫలయత్నం చేసింది. రాయలసీమ ఐ.జి., అనంతపురం రేంజి డి.ఐ.జి.లు దగ్గరుండి కూంబింగ్ చేపట్టారు. దళం కదలికలను ఊహించి, కె.వి.పల్లి మండలం జిల్లేళ్ళమంద రెవిన్యూ గ్రామ పరిసరాల్లోని గూడబండ అటవీ ప్రాంతంలో దళం మకాం వేసిన ప్రాంతాన్ని చుట్టుముట్టి, పోలీసులు జరిపిన దాడి గెరిల్లాల అప్రమత్తత వల్ల పూర్తిగా విఫలమైంది. ఈ సంఘటనలో గెరిల్లాల కిట్ బ్యాగులు మాత్రం పోయాయి. దళాన్ని అడవుల్లో చుట్టుముట్టామని, దళాన్ని మట్టుపెట్టడం ఖాయమని పత్రికలలో, టెలివిజన్‌లలో బీరాలు పోయిన పోలీసు యంత్రాంగం చివరికి దళం క్షేమంగా తప్పుకోవటంతో, ఆ అడవిలో తప్పిపోయిన ఎద్దు కోసం తిరుగుతున్న పెళ్ళిపెంట గ్రామీణ పేద రైతు యువకుడు చంద్రయ్య నాయుడిని దారుణంగా కాల్చి చంపిన నక్సలైట్‌గా ప్రచారం చేశారు. చనిపోవడానికి రెండు గంటల ముందు దాకా ఇంటిదగ్గరే వున్న చంద్రయ్య కొత్తగా కొన్న ఎద్దు ముగుతాడు తెంపుకుని వెళ్ళి పోవడంతో వెతుక్కుంటూ ఉదయం 8 గంటలప్పుడు అడవిలోకి వెళ్ళాడు. గెరిల్లాలు తప్పుకొని పోవడంతో పై అధికారుల మెప్పుకోసం యస్.టి.యఫ్. పోలీసులు చంద్రయ్యను చంపి నక్సలైట్‌గా చిత్రీకరించారని, భార్య, ఒకటిన్నర ఏళ్ళ కొడుకు వున్న ఇతడు ఎకరం పొలం కూడా లేని పేద రైతని చిత్తూరు జిల్లా ఏ.పి.సి.యల్.సి. బృందం ప్రకటించింది. మరోవైపున పీలేరు, ఎర్రావారి పాలెం, కె.వి.పల్లి మండలాల్లో యస్.టి.యఫ్. పోలీసులు గ్రామాలపైబడి నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారనే నెపంతో ప్రజలను చిత్రహింసల పాలు చేశారు. గ్రామీణ వైద్యులపై నిఘా పెట్టారు. తెలంగాణా తరహా నిర్బంధాన్ని, నిఘాను నెలల పాటు సాగించారు.

పోతే దక్షిణ తెలంగాణాలో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేనంతగా నిర్బంధం స్థిరీకృతమై పోయింది. ఈ రకంగా రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ ముందూ, తర్వాతా పరిణామాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని సవాలు చేయటమే గాక, పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. పి.జి.ఎ. నూతన ఎదురుదాడులు రాష్ట్రం మొత్తాన్నే ప్రభావితం చేశాయి. అవి పారిశ్రామిక వర్గాలను మున్నెన్నడూ లేనంతగా కలవర పర్చాయి.

దుర్భేధ్యమైన కోటల్లాగా పేర్చినా శత్రువు గెరిల్లా చర్యలను అడ్డుకోలేక పోవడాన్ని ఈ దాడులు మరోసారి ఎత్తిచూపాయి. పైగా నూతన ప్రజాస్వామిక విప్లవపు మూడు లక్ష్యాలను టార్గెట్ చేయటం ద్వారా దేశ వ్యాప్తంగా పోరాడే ప్రజానీకానికి ఉత్సాహం కల్పించటమే కాదు. విప్లవపార్టీ కార్యకలాపాల గురించి జాతీయ స్థాయిలో చర్చలకు, ప్రచారానికి కూడా ఈ దాడులు ఊతమిచ్చాయి. ప్రైవేట్ పరిశ్రమలపై దాడి ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందంటూ పత్రికలూ, పార్టీలూ, పరిశ్రమ వర్గాలూ నెత్తీనోరూ బాదుకున్నా ఈ దాడులు ప్రస్తుతానికి ఆరంభమే కానీ అంతం కావని ప్రజాయుద్ధం పురోగమించే క్రమంలో దోపిడీ సంస్థలకు, పాలకవర్గాలకు 'ముందున్నది ముసళ్ళ పండగ' అని తేటతెల్లమైంది.

ఈ వరుస దాడుల పరంపర, సంచలనాత్మక చర్యలూ పాలక వర్గాలను ఎంత గాభరా పెట్టాయంటే కేంద్ర, రాష్ట్ర పాలక వర్గాలు ముసుగులో గుద్దులాటలు మాని తక్షణ చర్యకు పాల్పడినాయి. హోంశాఖ వెనువెంటనే తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టంతో అంతవరకు మినహాయించి వున్న పి.డబ్ల్యు.జి. యం.సి.సి.లను దేశ వ్యాప్తంగా నిషేధించింది. డిసెంబర్ 5న ఈ రెండు పార్టీలపై నిషేధంతో పోటో కింద 25 సంస్థలపై టెర్రరిస్ట్ ముద్రవేసినట్లయింది. అయితే ఈ నిషేధాలను, నిర్బంధాలను ఏమాత్రం లెక్క చేయకుండా మరుసటి రోజే చత్తీస్‌గడ్‌లో పి.జి.ఏ. గెరిల్లాలు రెండు చోట్ల మందుపాతరలు పేల్చారు. ఈ సంఘటనలో దంతేవాడ జిల్లా కుంట బ్లాక్ కార్యాలయ భవనం దెబ్బతింది. ఈ జిల్లాలోనే భేజి మార్కెట్ యార్డులో మందుపాతర పేల్చారు. ఈ జిల్లాలోనే మారుమూల గ్రామమైన ఝుగర్ గూడాలో గాంధీ విగ్రహాన్ని కూడా గెరిల్లాలు ధ్వంసం చేశారు. ఈ వరస సంఘటనలతో ఛత్తీస్‌గడ్‌లో నిషేధం బేదఖలు అయింది. మన రాష్ట్రంలోనూ డిసెంబర్ 7న విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల రెవిన్యూ కార్యాలయ భవనాన్ని గెరిల్లాలు శక్తివంతమైన బాంబులతో పేల్చివేశారు. రిమోట్ బాంబులు పేల్చిన ఈసంఘటనలో కంప్యూటర్ రూమ్ పూర్తిగా ధ్వంసం కాగా మిగిలిన భాగం పాక్షికంగా కూలిపోయింది. ఈ ఎమ్మార్వో కార్యాలయాన్ని కూడా పేల్చేయడానికి వారం రోజులకు ముందు చేసిన ప్రయత్నం విఫలమైంది. డిసెంబర్ 9న ఈ జిల్లాలోనే కురుపాం మండలం మొండెంఖల్ ఫారెస్టు గార్డు క్వార్టర్‌ను పి.జి.ఏ. దళం పేల్చివేసింది. ఫారెస్టు ఆఫీసర్ క్వార్టర్‌ని కూడా పేల్చేయడానికి జరిగిన ప్రయత్నం భగ్నమైంది. ఈ క్వార్టర్లు పోలీస్ స్టేషన్‌కి కేవలం 50 మీటర్ల దూరంలో వుండటం విశేషం.

అయితే ఇలాంటి నిషేధాలూ, నిర్బంధాలూ పదేళ్ళుగా పీపుల్స్‌వార్ పార్టీని ఏమీ చేయలేక పోయాయి. రాష్ట్రంలో 1992 నుంచి పార్టీ నిషేధం నీడలోనే వుంటూ వస్తోంది. ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, కోవర్ట్‌లు, ఓవర్ట్ (ప్రత్యక్ష దాడి)లు దళాల, నేతల నిర్మూలనలు ఇవేవీ పార్టీ మనుగడకు, పురోగమనానికి ఆటంకం కాలేక పోయాయి. ఆంధ్రప్రదేశ్ అవతల పార్టీని ఇతర రాష్ట్రాలలో నిషేధించినంత మాత్రాన పాలకవర్గాలు ఊడబొడిచేదేమీ వుండదు. ఆర్థిక, సామాజిక అంతరాలు కొనసాగేకొద్దీ ప్రపంచబ్యాంకు మార్గం దేశాన్ని మరింతగా ఊబిలోకి దించేకొద్దీ ప్రజల అసమ్మతి, నిరసన ఉద్యమాలకు నిత్యం ఊతమిస్తూనే వుంటాయని, నిషేధాలూ, నిర్బంధాలూ ఉద్యమ మూలాలను పెళ్ళగించలేవని గత పదేళ్ళుగా రాష్ట్రంలో నిరూపితం అవుతోంది. రేపు దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా నిషేధం, నిర్బంధాల వైఫల్యం ఇలాగే నిరూపితమవుతుంది. ఈ విషయం మందపు చర్మం పాలకులకు వంట బట్టకున్నా పాలనా యంత్రాంగానికి మాత్రం బాగానే బోధపడినట్లుంది. ఇప్పటివరకు పోలీసు యంత్రాంగం అవలంభిస్తున్న విధానం వల్ల ఫలితాలు రావని, సమస్యను సామాజిక, ఆర్థిక సమస్య పరిష్కారం దిశగా చూడాలని ఈ దాడుల సందర్భంగానే హైద్రాబాదులో ముఖ్యమంత్రి అధ్యక్షతన శాంతి భద్రతల సమస్యపై జరుగుతున్న ఉన్నతస్థాయి సమావేశంలో ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్మొహమాటంగా సూచించారు. దళారీ బూర్జువాల ఫ్యాక్టరీని, కేంద్రంలోని తన సహచర మంత్రి ఫ్యాక్టరీని, స్వయానా తన సొంత ఫ్యాక్టరీని ఒకేరోజు రాత్రి పేల్చివేయడంతో ఖంగుతిన్న ముఖ్యమంత్రికి తన సొంత పాలనా యంత్రాంగం కూడా నక్సలిజం సామాజిక ఆర్థిక సమస్యే అని తేల్చి చెప్పడంతో మింగుడుపడక పాలమారినంత పనై గుంటనక్క అవతారంతో ఆ సమావేశంలో 'శాంతిదూత' లాగా చిలక పలుకులు పలికాడు. వ్యక్తుల్ని హతమార్చటం కంటే వారిలో పరివర్తన తెచ్చేందుకే అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని హితబోధ చేశాడు. ఉత్తమ అధికారిగా పేరొందిన సి.ఐ. గాంధీని పవిత్రమైన కోర్టు హాలులోనే హత్య చేశారని వాపోయాడు. (కోపర్‌డంగ్ హంతకుడు ఉత్తమ అధికారి'ట. 'పవిత్ర'మైన కోర్టు హాలట). 'శాంతికోసం 'తపించిపోయిన' మాజీ హోంమంత్రి మాధవరెడ్డి' అంటూ సొల్లు కార్చాడు. సందేహమే లేదు. దోపిడీ దారుల 'శాంతి' కోసమే మాధవరెడ్డి తపించి, అలసిపోయి కనుమరుగైపోయాడు. ఇకపోతే ఈ 'శాంతిపక్షి' 'తుది పలుకులేమిటంటే పోలీసులు పేదలకు అండగా నిలవాలట. ఆహా! నోరువిప్పితే 'శాంతి' బోధలే... ఇకపోతే ప్రతి సం॥రం వందలాదిమంది నక్సలైట్లను లొంగదీస్తున్నా ఎప్పటికప్పుడు నక్సలైట్లు కూడా కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తూ పోలీసులకు సవాలుగా మారుతున్నారని, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి ప్రపంచమంతా గ్లోబల్ విలేజిగా మారుతుంటే అదే స్థాయిలో తీవ్రవాదం కూడా గ్లోబలైజ్ అవుతోందని ఇతగాడి ముక్తాయింపు. ఈ అంశాన్నే మరోలా చెప్పుకుందాం. సామ్రాజ్యవాదుల దోపిడీ కోసం ప్రపంచమే కుగ్రామం అయిపోతున్న దశలో ప్రజా పోరాటాలు సైతం గ్లోబలైజ్ అవుతున్నాయి. భారతదేశంలో, నేపాల్‌లో, ఫిలిప్పైన్స్ తదితర ఆసియా దేశాల్లో, దక్షిణ అమెరికాలో ప్రపంచమంతటా కూడా చెలరేగుతున్న పోరాటాలన్నీ సారాంశంలో సామ్రాజ్యవాదులకు వారి తైనాతీలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలే.

పి.జి.ఏ. ఆవిర్భావ దినం, నిర్బంధ వ్యతిరేక వారం సందర్భంగా ప్రజా గెరిల్లా సైన్యం జరిపిన ఎత్తుగడల పరమైన ఎదురుదాడులు దీన్నే ప్రతిబింబించాయి. ❑

**డిసెంబర్ 6ని మతతత్వ వ్యతిరేక దినంగా పాటించండి।**

**ఆఫ్ఘన్ ప్రజలపై అమెరికా దురాక్రమణ దాడిని ఖండించండి!!**

**పీపుల్స్‌వార్, యం.సి.సి.లపై దేశ వ్యాప్త నిషేధాన్ని తిప్పికొట్టండి!!!**

# బీహార్-జార్ఖండ్ రాష్ట్రాల్లో పి.జి.ఎ. దాడి

సెప్టెంబర్ 11న కైమూర్ జిల్లాలో మందుపాతర పేల్చడంతో మొదలుకుని, బీహార్-జార్ఖండ్ పి.జి.ఎ. యూనిట్లు శత్రువును ఆత్మరక్షణలో పడేస్తూ దాడి ప్రారంభించాయి. కేవలం రెండు నెలల కాలంలో నాలుగు ఆంబుష్‌లు విజయవంతంగా జరిగి వీటిలో 30 మంది దాకా పారా మిలటరీ బలగాలు, పోలీసులు హతమయ్యారు. పెద్ద సంఖ్యలో ఆయుధాలూ, మందుగుండును గెరిల్లాలు చేజిక్కించుకున్నారు. దీంతోపాటు శత్రు బలగాలపై విజయవంతంగా దెబ్బతీస్తూ ఈ ప్రాంతంలో ఎం.సి.సి. దాడుల పరంపర మొదలెట్టింది.



సెప్టెంబర్ 11 ఆంబుష్ సంఘటన కైమూర్ జిల్లా చెయిన్‌పూర్ రోడ్ ఏరియాలో జరిగింది. ఈ చర్యలో బీహార్ మిలటరీ పోలీస్‌కి చెందిన 6గురు జవాన్లు హతం కాగా ఒక ఎస్.ఎల్.ఆర్. కార్బైన్ గెరిల్లా పరమైంది. ఈ చర్యలో ముగ్గురు నక్సలైట్లు కూడా మరణించారని పత్రికలు తప్పుగా రాశాయి. నిజానికి పి.జి.ఎ. బలగాలు ఏ నష్టం లేకుండా తప్పుకున్నాయి.

అక్టోబర్ 3న గడ్వా జిల్లా భాగ్‌దాద్ ఏరియాలో పి.జి.ఎ. పేల్చిన మందుపాతరలో అయిదుగురు జిల్లా పోలీసులు చావగా నలుగురికి తీవ్రంగా గాయాలయినాయి. హతులయిన ఐదుగురిలో ఒక డి.ఎస్పీ. కూడా వున్నాడు. డి.ఎస్పి ఉదయం 11 గంటలప్పుడు 7 వాహనాల కాన్వాయ్‌తో ఏరియా నుంచి వెనుదిరుగుతుండగా ఇది జరిగింది. ఈవరుసలో ఇతగాడి వాహనం మూడోది. తొలి రెండు వాహనాలూ వెళ్ళేంత వరకూ గెరిల్లాలు వేచి వుండి ప్రత్యేకించి మూడో వాహనానికి గురిపెట్టారు. ఈ మందుపాతర వాహనాన్ని ముక్కలు ముక్కలుగా చేయగా ఐదుమంది అక్కడికక్కడే చనిపోయారు.

పాట్నా జిల్లా ధన్‌రువా థానా ఏరియాలో అక్టోబర్ 19న జరిగిన ఒక ఆంబుష్‌లో 7 గురు పోలీసులు హతమైపోయారు. సమీపంలోని పోలీస్ స్టేషన్‌కి చెందిన ఇద్దరు 'పేరుమోసిన' పోలీస్ అధికార్లు కూడా ఈ సంఘటనలో చచ్చారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ కుమార్ సుమన్, ఎ.ఎస్.ఐ. బాబూలాల్ సొరేన్‌లిద్దరూ తమ అణచివేత చర్యలతో ఏరియా వ్యాప్తంగా క్రూరులుగా పేరుగాంచారు. 100 మంది ప్రజలు పాల్గొన్నారని భావింపబడుతున్న ఈ చర్యలో గెరిల్లాలు ఐదు .303 రైఫిళ్ళను, ఒక కార్బైన్‌ని, ఒక రివాల్వర్‌ని, కొంత మందుగుండును స్వాధీన పర్చుకున్నారు. ఈ చర్య తర్వాత పోలీసులు పిచ్చెక్కినట్లుగా ప్రజలపై పడి అందరినీ నిర్బంధించారు. అయితే సమీప గ్రామాలపై వాళ్ళు దాడి చేసినపుడు పశువులు మాత్రమే వారికి కన్పించాయి. ప్రజలు మొత్తంగా వేరే ప్రాంతాలలో ఆశ్రయం తీసుకున్నారు. రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో జరిగిన ఈ చర్య శత్రు బలగాలను వణికించగా, రాష్ట్ర పోలీసులు తమ అధికార్లపై తిరుగుబాటు చేసినంత పనయింది. ముఖ్యమంత్రి ప్రకటించిన భారీ నష్ట పరిహారం, ఆర్.జె.డి. అధ్యక్షుడు ఆ ప్రాంతానికి రావటం ఉద్రిక్త పరిస్థితిని కాస్త చల్లార్చింది.

నవంబర్ 21న గయ జిల్లాలో కోయిర్‌బిఘా గ్రామ సమీపంలో ఐదు బీహార్ మిలటరీ పోలీసులతో సహా 6 గురు పి.జి.ఎ. పేల్చిన మందుపాతర బారిన పడి చచ్చారు. భూయాన్‌తొలా నుండి కాల్పుల గురించిన రిపోర్టుపై విచారణకు పెట్రోల్ పార్టీ వచ్చినపుడు ఆంబుష్ పాలబడ్డారు. ఆంబుష్ స్థలం నుండి 5 యస్.ఎల్.ఆర్.లను, కార్బైన్, రివాల్వర్‌లను గెరిల్లాలు చేజిక్కించుకున్నారు.

ఈ ప్రాంతంలో ఈ విధమైన విజయవంతమైన చర్యలతో పి.జి.ఎ. బలం పుంజుకుంటుండగా తమ సొంత ప్రజాసైన్యాన్ని కల్గి వుండటంలోని ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియ వచ్చింది. ❑

# విస్తరిస్తున్న ఉద్యమం-పెరుగుతున్న పి.జి.ఏ. దాడులు

నక్సలైట్ గ్రూపులు ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను నిజమైన గెరిల్లాజోన్లుగా మార్చేశాయి. పార్టీయూనిటీతో సంలీనం చెందాక పీపుల్స్‌వార్ పార్టీ ఆంధ్రప్రదేశ్ నుండి ఒరిస్సాకు తన కార్యకలాపాలను విస్తృతపర్చింది. యం.సి.సి. బీహార్ నుండి నూతనంగా ఏర్పడిన జార్ఖండ్ రాష్ట్రానికి విస్తరించింది. మరోవైపున పశ్చిమ బెంగాల్ మిడ్నపూర్ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతంలో కూడా పీపుల్స్‌వార్ దాడులు మొదలుపెట్టింది.

ఒరిస్సాలో ఇటీవల జరిగిన హింసాత్మక సంఘటనలు 2000 సం॥రంలో ఏర్పడిన ప్రజాగెరిల్లా సైన్యం ప్రథమ వార్షికం సందర్భంగా జరిగాయి. ఈ డిసెంబర్ 2న ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు దగ్గరగా వుండే మల్కన్‌గిరి జిల్లా పోటేరు గ్రామంలోని పోలీస్ ఔట్‌పోస్టుని పీపుల్స్‌వార్ పేల్చేంది. ఆ గ్రామంలోని జౌళి పరిశ్రమ-సహకార శాఖా మంత్రి అరవింద డేని ఇంటిపై బాంబు దాడి చేసింది. 50 మంది పైగా నక్సలైట్లు డిసెంబర్ 2 రాత్రి 9 గంటలకు ఔట్‌పోస్టు ఇన్‌చార్జ్‌ని, ఇద్దరు పోలీసులను చుట్టుముట్టి ఆయుధాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. తర్వాత వారిని బయటకు తరిమి ఔట్‌పోస్టుని పేల్చేశారు. తర్వాత వాళ్ళు పోటేరు నదిని దాటి సహకార శాఖా మంత్రి వ్యవసాయ క్షేత్రం వద్దకు పోయి ఇంట్లోని వారిని బయటకు పంపించి భవనాన్ని డైనమైట్లతో పేల్చివేశారు. అప్పుడక్కడ మంత్రి లేడు. బి.జె.పి.కి చెందిన ఈ మల్కన్‌గిరి శాసనసభ్యుడికి అప్పటికే నక్సలైట్ల నుండి సంరక్షణకుగాను జెడ్ కేటగిరీ భద్రతా స్థాయిని కల్పించి వున్నారు.

తర్వాత పోటేరు నుంచి వెళ్ళిపోతూ, ఆదివాసీ ప్రజలపై దోపిడీకి, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలోని పీపుల్స్‌వార్ కార్యకర్తలపై పోలీసు ఆపరేషన్లకు ప్రతీకారంగా ఈ దాడులు జరుపుతున్నట్లుగా రాసివున్న కరపత్రాలు పంచారు. ఆదివాసీ ప్రజలను పీడించడానికి వ్యతిరేకంగా సాగుతున్న మా పోరాటాన్ని దెబ్బతీయడానికై మల్కన్ గిరి జిల్లాలో సి.ఆర్.పి.యఫ్. బలగాలను దింపడానికి కారకుడయినందువల్లే మంత్రి ఇంటిపై దాడి చేసినట్లుగా ఆ కరపత్రంలో పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో మరిన్ని దాడులు చేయనున్నట్లుగా ప్రకటించారు. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతాలను 'యుద్ధ ప్రాంతం'గా పీపుల్స్‌వార్ ప్రకటించింది. కాబట్టి పై దాడులన్నీ దాంట్లో భాగంగానే జరుగుతున్నాయంటూ ఒరిస్సా డి.జి.పి. పేర్కొన్నాడు.

డిసెంబర్ 1న చత్తీస్‌గడ్‌లో ఆదివాసీ జిల్లా అయిన దంతేవాడలోని రెండు పోలీస్ స్టేషన్లపై పీపుల్స్‌వార్ కాల్పులు జరిపి, కుట్రు-బద్రి రోడ్డుమీద ఒక మందుపాతరను పేల్చింది. చత్తీస్‌ఘడ్‌కి చెందిన బస్తర్, కాంకేర్ జిల్లాల్లో పీపుల్స్‌వార్ బలంగా వునికిలో వుంది. స్థానికుల మద్ధతు లేకుండా ఈ సంఘటిత దాడులు జరగలేవు. ఒరిస్సా ఇటీవల కాలంలో తుఫానులు, కరువు కాటకాల బారిన పడింది. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో సంక్షేమ చర్యలను పూర్తిగా విస్మరించేశారు. ఆంధ్రలో లాగే ఈ విధంగా గ్రామీణ ప్రాంత అసమ్మతే ఒరిస్సాలోనూ పీపుల్స్‌వార్ పార్టీ పునాదులను దృఢపరుస్తోంది.

ఈ సం॥రం ఆగస్ట్ 10న నక్సలైట్లు ఒరిస్సా రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద దాడి జరిపారు. మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల, మోటు పోలీస్ స్టేషన్లపై 100 మంది నక్సలైట్లు ఏకకాలంలో దాడి జరిపి ఐదుగురు పోలీసులను హతమార్చి, 22 మందిని గాయపర్చారు. భారీ స్థాయిలో ఆయుధాలు స్వాధీనపర్చుకున్నారు. పోలీసుల కాల్పుల్లో ఇద్దరు పీపుల్స్‌వార్ కమాండర్లు చనిపోయారు.

పెరుగుతున్న నక్సలైట్ 'ఉపద్రవాన్ని' ఎదుర్కొనేందుకుగాను నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఒరిస్సాకి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి 350 కోట్ల రూ॥లతో కూడిన యాక్షన్ ప్లాన్‌ని ఆమోదించాల్సిందిగా కేంద్రాన్ని కోరింది. ఒరిస్సా రాష్ట్ర కార్యదర్శి కేంద్ర హోంశాఖ అధికారులను కలిసి నక్సలైట్ సమస్య తీవ్రతను, దాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యల అవసరాన్ని వివరించాడు. తగిన చర్యలు తీసుకోకపోతే ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితే ఇక్కడా ఏర్పడుతుందని చెప్పాడు. పోలీస్ స్టేషన్లను మెరుగుపర్చేందుకు, మరిన్ని పారామిలటరీ బలగాల నియామకానికి రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి నివ్వాల్సిందిగా కోరాడు.

నవంబర్ 1న జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ జిల్లాలోని తోప్చాంచి బ్లాక్ కార్యాలయంపై ఎం.సి.సి. దాడి జరిపి 13 మంది రాష్ట్ర సాయుధ బలగాలను హతమార్చి ఐదుగురిని గాయపర్చింది. బి.జె.పి. ముఖ్యమంత్రి బాబులాల్ మరాండీని వెక్కిరిస్తూ మొట్టమొదటి రాష్ట్ర ఆవిర్భావపు దినమైన నవంబర్ 15కి కొద్ది ముందుగా ఈ సంఘటన జరిగింది. రాష్ట్ర సాయుధ బలగాల పికెట్ వుంటున్న ఈ మండల కార్యాలయంపై 150 మంది నక్సలైట్లు ఒక్కపెట్టున దాడిచేసి 14 యస్.యల్.ఆర్.లు, 3 కార్బైన్‌లని వశపర్చుకున్నారు. గ్రామంలో సంత జరిగే రోజే ఈ చర్యకు పథకమేశారు. జాతీయ రహదారిపై గల ఈ సంత ప్రధాన ద్వారాన్ని కొందరు బాలబాలికలు అదుపులో వుంచుకుని మరీ దాడి సల్పారు. పోలీసులతో కాల్పుల్లో ఐదుగురు యం.సి.సి. కార్యకర్తలు కూడా చనిపోయారు. నవంబర్ 12న పలామూ జిల్లాలోని కర్కాట, ఉంటారి స్టేషన్ల మధ్య రైలు పట్టాలను యం.సి.సి. పేల్చేసింది. అదే సమయంలో డాల్టన్‌గంజ్, ఔరంగాబాద్ రోడ్డుమీద నాలుగు ట్రక్కులను, బస్సును, జీపును కూడా పేల్చేశారు. ఇటీవల దాకా దక్షిణ బీహార్‌లో ఖనిజవనరుల గనిగా, పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక యం.సి.సి. దాడులు మరింతగా పెరిగాయి.

గత కొద్ది నెలలుగా పశ్చిమ బెంగాల్‌లోనూ ప్రత్యేకించి ఒరిస్సా సరిహద్దులోని ఆదివాసీ ప్రాంతమైన మిడ్నపూర్ జిల్లాలో నక్సలైట్ కార్యకలాపాలు పెరిగాయి. ఇక్కడి అటవీ ప్రాంత మండలాల్లో పీపుల్స్‌వార్ యం.సి.సి. కూటమి ప్రాథమికంగా అధికార సి.పి.యం. పార్టీ సభ్యులపై గురిపెట్టాయి. నవంబర్ 28న జర్గ్రామ్ సబ్ డివిజన్‌లోని భీమార్జున్ గ్రామంలో సి.పి.యం స్థానిక కమిటీ కార్యదర్శిని నక్సలైట్లు కాల్చి చంపారు. ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలకు చెందిన నక్సలైట్లు పశ్చిమబెంగాల్‌లోని మిడ్నపూర్, బర్ద్వాన్ జిల్లాల్లో స్థావరాలు ఏర్పర్చుకున్నారని ఇంటెలిజెన్స్ శాఖ నివేదించింది. 1960ల చివర్లో పశ్చిమబెంగాల్‌లో మొదలైన నక్సలైట్ ఉద్యమం 1977లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపుగా ఉనికిలో లేకుండా పోయింది. 20 ఏళ్ళ తర్వాత తిరిగి ఉద్యమం ఇక్కడ మెల్లగా ఊపందుకోవడంతో జర్‌గ్రామ్ ప్రాంతంలో భారీ ఎత్తున పోలీస్ బలగాన్ని దింపారు. మిడ్నపూర్‌లోని అనేక నక్సలైట్ ప్రభావిత

ప్రాంతాలలో నిరుపేద ఆదివాసీ ప్రజలే ఎక్కువగా వున్నారు. డబ్బుతో, ఆహారంతో నక్సలైట్ నేతలు ఇక్కడి ప్రజలకు ఎరవేస్తున్నారని, వీరి జీవన ప్రమాణాలను మెరుగుపర్చితే అపుడు వారు ఏ తీవ్రవాద శక్తులతోనూ చేతులు కలపరని మిడ్నపూర్‌కి చెందిన పోలీసు అధికారి అన్నాడు. పోలీసు మెదళ్ళలో ఇలాంటి 'ఎరవేసే' భాషలు తప్ప మరో భాష తెలీదు గదా! 'లెఫ్ట్‌ఫ్రంట్' ప్రభుత్వం కూడా తానేం తక్కువ తినలేదన్నట్లుగా మేదినీపూర్, బర్ద్వాన్ జిల్లాలు నక్సలైట్ల ప్రాబల్యంలోకి పోకుండా అభివృద్ధి పథకం పేరిట ప్రజలకు 'ఎర' వేయటానికి పూనుకుంది. (ఫ్రంట్‌లైన్ 4-1-2002 ఆధారంగా).

❑

# ప్రజాగెరిల్లా సైన్యం ఎత్తుగడల ఎదురుదాడుల పరంపర

ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు రీజియన్‌కి చెందిన తూర్పుగోదావరి జిల్లాలో సెప్టెంబర్ 9న ప్రజా గెరిల్లాలు పేల్చిన మందుపాతర విస్ఫోటనలో ఐదుగురు సి.ఆర్.పి.యఫ్. జవాన్లు చావగా మరో 10 మంది గాయపడ్డారు. 20 మంది పోలీసులను తీసుకెళ్తున్న ప్రైవేట్ వాహనం తునాతునకలై పోయింది. పీపుల్స్ ప్రజా గెరిల్లాలు విసిరిన ఎర ఫలితమే ఈ మందుపాతర. ఆ రోజు ఒక ఆర్టీసీ బస్సుని గెరిల్లాలు హైజాక్ చేసి ప్రయాణీకులను, డ్రైవర్‌ని కండక్టర్‌ని దిగిపొమ్మని కోరారు. వీరి ద్వారా సమాచారం పోలీసులకు చేరింది. అపహరణకు గురైన బస్సును స్వాధీనం చేసుకోవడంలో స్థానిక పోలీసులకు తోడ్పడేందుకు సి.ఆర్.పి.యఫ్. జవాన్లు వచ్చారు. గెరిల్లాల ఎర బాగా ఫలించి జవాన్లు మందుపాతర బారిన పడ్డారు.

మూడు వారాలకు ముందుగా గుంటూరు జిల్లా చరిత్రలో అత్యంత ముఖ్యమైన చర్య జరిగింది. ఆగస్ట్ 21న నల్లమల అడవుల సరిహద్దు ప్రాంతంలో మునిసిపల్ ఎలక్షన్ల సందర్భంగా పోలీసులను తీసుకెళుతున్న జీపు మందుపాతర బారినపడి ఎస్.ఐ.తో సహా 10 మంది పోలీసులు చావగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గెరిల్లాలు గుర్తుపడతారనే భయంతో పోలీసులు అధికారిక జీపును తీసుకురాకున్నా పార్టీకున్న ప్రజా పునాదివల్ల పీపుల్స్‌వార్ గెరిల్లాలు ప్రైవేట్ జీపును సైతం చక్కగా గుర్తుపట్టారు. ఒక్కొక్కటి ఐదు కేజీల పేలుడు పదార్థం కల్గిన 4 బకెట్లలో పేలుడు పదార్థాలు కూరి వాటికి 300 కి.మీ. వైరును జతచేసి కెమెరా ఫ్లాష్‌తో పేల్చేశారు. ఈ మందుపాతర విస్ఫోటనతో పాలకవర్గాలు ఎంతగా వణికిపోయారంటే హోంమంత్రి, డి.జి.పి. దొర, ఇంటెలిజెన్స్ డి.ఐ.జి.లతో సహా ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో సంఘటనా స్థలికి పరుగెత్తుకొచ్చాడు. ఈ మందుపాతర ఎంత శక్తివంతమైనదంటే అది 4 మీటర్ల పరిధిలో 2 మీటర్ల లోతున పెద్ద గొయ్యిని సృష్టించింది.

అంతకు పదిరోజుల క్రితం ఒరిస్సాలో రెండు పోలీస్ స్టేషన్లపై ఏకకాలంలో జరిపిన దాడిలో ఎ.ఒ.బి. రీజియన్‌కి చెందిన ప్రజా గెరిల్లాలు భారీ ఎత్తున ఆయుధాలు స్వాధీన పర్చుకున్నారు. కలిమెల పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన 150 మంది గెరిల్లాలు ఒక ఎస్.ఐ.ని ఇద్దరు పోలీసులను హతమార్చాక స్టేషన్ పూర్తిగా కూల్చివేశారని పత్రికలు రాశాయి. ఈ దాడిలో చావగా మిగిలిన పోలీసులు లొంగిపోయి ఆయుధాలు స్వాధీనం చేశారు. ఈ సంఘటనలో ఏ.కె.-47 రైఫిల్స్, యస్.యల్.ఆర్.లు ఒక లైట్‌మెషిన్‌గన్, రైఫిల్స్, పిస్టోల్‌లతో సహా 40 ఆయుధాలు గెరిల్లాల స్వాధీనమైనాయని, హేండ్ గ్రైనేడ్‌లు, టియర్‌గ్యాస్ గన్, మందుగుండు సామాగ్రి కూడా గెరిల్లాల వశమైనాయని పత్రికలు రాశాయి.

మోటు పోలీస్ స్టేషన్‌పై జరిగిన మరో దాడి విజయవంతం కాలేదు. అనేక గంటలపాటు సాగిన ఈ పోరాటంలో ఇద్దరు పోలీసులు చావగా డి.సి.ఎమ్. కామ్రేడ్ క్రాంతి రణదేవ్‌తో సహా ఇద్దరు కామ్రేడ్స్ అమరులైనారు. ఈ దాడుల తర్వాత ఈ ప్రాంతంలోని నాలుగు పోలీస్ స్టేషన్లను (కలిమెల, మోటు, మల్కన్‌గిరి, దియా) పోలీసులు ఖాళీ చేశారని పత్రికలు రాశాయి.

జూలై చివరలో ఉత్తర తెలంగాణా పి.జి.ఏ. గెరిల్లాలు వరంగల్ జిల్లాలో శత్రు దుర్భేద్యంగా నిర్మించిన ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్‌పై భారీ ఎత్తు దాడి చేశారు. ''ఫిరంగి గుళ్ళ లాంటి వాటితో స్టేషన్ పైకి భారీ ఎత్తున గెరిల్లాలు కాల్పులు జరిపారని, ఈ దాడిలో క్రీడాకారులు వాడే షాట్‌పుట్ సైజులో పెద్ద పెద్ద ఇనుప గుళ్ళలాంటి బండరాళ్ళను వాడారని ఈ పేలుడు భూమిని కంపింపజేసి, స్టేషన్ గోడలపై పెద్ద పెద్ద రంధ్రాలను సృష్టించిందని'' 'హిందూ' పత్రిక రాసింది. ఈ దాడిలో ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్స్ చావగా, పారిపోడానికి చేసిన ప్రయత్నంలో ఒక పోలీసు, స్టేషన్ ఫెన్సింగ్‌కి పోలీసులే అమర్చిన విద్యుత్ ఘాతానికి గురయినాడు. ఉదయం 6.40 ని॥ లప్పుడు పేలుడు పదార్థాలతో కూడిన ఒక ట్రాక్టరు, పోలీస్ స్టేషన్ ముందున్న గుడి వద్దకు వచ్చి ఆగిందని, స్టేషన్‌లోని పోలీసులను, ఆ స్టేషన్ కాంప్లెక్స్‌లో నివసిస్తున్న పోలీసుల కుటుంబాలను షాక్‌లో ముంచెత్తుతూ ఆ ట్రాక్టరు పేలిపోయిందని 'హిందూ' పత్రిక తెలిపింది. నిముషంలోపే రెండో ట్రాక్టర్ స్టేషన్ గోడ వైపుకు చేరి పేలిపోయినపుడు గోడ బాగా దెబ్బతింది. ఈ సందర్భంగా జరిగిన దాడిలో ముగ్గురు పోలీసులు హతమైపోయారు.

దీనికి ముందు మే-జూన్ నెలల మధ్యకాలంలో మరో మూడు యాక్షన్లు జరిగాయి. మే 6న విశాఖపట్నం ప్రాంతంలో ఒక కానిస్టేబుల్ గెరిల్లాల దాడిలో చావగా మరో ముగ్గురు గాయపడ్డారు. జూన్ 9న రంగారెడ్డి జిల్లాలో ఒక ఎస్సై, ఒక కానిస్టేబుల్ హతమయ్యారు. జూలై 8న అనంతపురం జిల్లాలో ఒక పోలీస్, ఒక ఫారెస్టు గార్డు చావగా 8 మంది పోలీసులకు గాయాలైనాయి.

పి.జి.ఏ. ఆవిర్భావ సం॥రంలో రాష్ట్రం నలువైపులా పి.జి.ఏ. జరిపి ఎత్తుగడల దాడులు పాలకవర్గాల్లో కలవరం సృష్టించి, పీపుల్స్‌వార్ పనయిపోయిందని ప్రభుత్వం పదే పదే చేస్తున్న దుష్ప్రచారాన్ని నీరుగార్చాయి. రాయలసీమతో సహా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులపై దాడులు, ఆయుధాల స్వాధీనం కోసం దాడులు వరుసగా జరిగి శత్రువును బెంబేలెత్తించాయి. డిసెంబర్ 2, పి.జి.ఏ. డే సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనలతో పి.జి.ఏ. ఎత్తుగడల ఎదురు దాడుల పరంపర పరాకాష్టకు చేరింది. ❑

# దేశ వ్యాప్తంగా పుంజుకున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం!

# సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించేందుకు ఏకమైన ఎం.సి.సి.–పీపుల్స్‌వార్!!

# కోకాకోలా ఫ్యాక్టరీని పేల్చేసిన పీపుల్స్‌వార్!!!

ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ నెలకొన్న ఉద్యమం దేశంపై అమెరికా సామ్రాజ్యవాదపు ఆధిపత్యానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికగల కార్యాచరణగా మారింది. ఊరేగింపులు, ప్రదర్శనలు, బంద్‌లు, పాంప్లెట్లు, పోస్టర్ ప్రచారాలు, సామ్రాజ్యవాద గుత్తసంస్థల సరకుల బహిష్కరణ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా వేగం పుంజుకున్నాయి.

వీటన్నింటిలో, నవంబర్ మొదట్లో పలు స్వతంత్ర ప్రజాసంఘాలతో పాటు యం.సి.సి. పీపుల్స్‌వార్ రైతుకూలీ సంఘాలు పాట్నాలో జరిపిన నిరసన ప్రదర్శనే అత్యంత ప్రాధాన్యత గల సంఘటన అయింది. వివిధ సంస్థలకు చెందిన కార్మికులు, మేధావులు, విద్యార్థులతో పాటుగా ఈ రెండు పార్టీల రైతుకూలీ సంఘాలకు చెందిన 8,000 పైగా ప్రజలు ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడికి, ప్రపంచ వాణిజ్య సంస్థకి వ్యతిరేకంగా ఉమ్మడిగా ర్యాలీని నిర్వహించారు. పాట్నా ప్రధాన రహదారుల గుండా ఊరేగింపు సాగుతుండగా కూడలి రోడ్ల మీద అమెరికన్ జెండాని ప్రదర్శనకారులు తగులబెట్టారు. ఆఫ్ఘన్‌పై అమెరికన్ దాడికి వ్యతిరేకంగా, అమెరికా యుద్ధంలో కుమ్మక్కవుతున్నందుకు వాజ్‌పేయి, అద్వానీ తదితర కూటమికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చివరకు బహిరంగ సభగా మారింది. దీనికి ముందుగా ఈ రెండు పార్టీలు తమ మధ్య ఘర్షణలను ఆపుకుని శత్రువుకు వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాడాలంటూ ఒక ఉమ్మడి ప్రకటనను జారీ చేశాయి.

అంతకుముందు అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో భాగంగా చేపట్టిన అత్యంత ప్రధానమైన చర్యలో మన పార్టీ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా ఆత్మకూరు దగ్గర కోకాకోలా బాట్లింగ్ యూనిట్‌ని పేల్చేసింది. అమెరికా సామ్రాజ్యవాదపు అత్యంత ప్రముఖ నమూనాల్లో ఒకటైన కోకాకోలాపై మన గెరిల్లా దళం జరిపిన ఈ చర్య దేశంలోని బహుళజాతి గుత్త సంస్థల్లో ప్రకంపనలు సృష్టించింది. నిజానికి ఢిల్లీ శివార్లలో వున్న గుర్గావ్ పారిశ్రామిక ప్రాంతంలోని టి.ఎన్.సి.లు సైతం తమకు మరింత రక్షణ కావాలని డిమాండు చేయటమేగాక సొంత సెక్యూరిటీ సిబ్బంది సంఖ్యను కూడా పెంచుకున్నాయి.

అక్టోబర్ 20 అర్ధరాత్రి ఆత్మకూరులో కోకాకోలా కంపెనీ వద్దకు ఒక జీపు దూసుకొచ్చింది. కంపెనీ ముందుకు శరవేగంగా దూసుకొచ్చిన జీపును కంపెనీ బండిగా భావించిన సెక్యూరిటీ సిబ్బంది దాన్ని లోపలకు పంపడానికి గేట్లు తెరిచారు. ఆ జీపులో వచ్చిన 8 మంది పీపుల్స్‌వార్ గెరిల్లాలు వెనువెంటనే భద్రతాసిబ్బందిని వశపర్చుకుని వాళ్ళ చేతులు కట్టేశారు. ఇద్దరు గెరిల్లాలు సిబ్బందికి కాపలాగా వుండిపోగా తక్కినవారు ఫ్యాక్టరీలోకి వెళ్ళి జెలిటిన్ అమర్చి పేల్చేశారు. దాదాపు ఐదుకోట్ల రూ॥ల విలువైన ప్లాంట్ ప్రేలుడుకు ముక్కలు ముక్కలైపోగా బయట నిలిపివున్న మూడు వాహనాలనుకూడా పేల్చేశారు. గుంటూరు జిల్లా వార్ కార్యదర్శి కా॥ మోహన్ పేరిట విడుదల చేసిన కరపత్రంలో ఇలా రాశారు.

*''ప్రపంచంలోకెల్లా అతిపెద్ద టెర్రరిస్టుగా వుంటూనే, టెర్రరిజంపై పోరు ముసుగులో ఇతర దేశాలపై పెత్తనం చలాయిస్తున్న అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. అమెరికా యుద్ధానికి వ్యతిరేకంగా అక్టోబర్ 22న మా పార్టీ చేస్తున్న రాష్ట్ర బంద్‌ని విజయవంతం చేయాలని కోరుతున్నాం''.*

పీపుల్స్‌వార్ పార్టీ జరిపిన ఈ సంచలనాత్మక చర్య దేశంలో నడుస్తున్న టి.ఎన్.సి.లను తన్ని తరిమేయడానికి సమరశీల చర్యలు మొదలెట్టే అవసరాన్ని సూచిస్తూ దేశ ప్రజలకు మార్గం చూపింది. ఈ కంపెనీలు ప్రతి సంవత్సరం చట్టబద్ధంగా, చట్ట విరుద్ధంగా కోట్లాది రూపాయలను కొల్లగొట్టుకు పోతున్నాయి. దేశంలోని శీతల పానీయాల మార్కెట్‌ని గుత్తకు తీసుకుని దేశీయ బ్రాండ్లను కూడా మింగివేసిన ఈ కంపెనీలు భారత ప్రజలను నిలువు దోపిడీ చేయడానికి గాను కూడబలుక్కుని మరీ గుత్త ధరలను విధిస్తున్నాయి. దేశ ప్రజలను మోసగించేందుకు కోకోకోలా, పెప్సీ కంపెనీలు భారత దేశంలో తమకు నష్టాలొస్తున్నాయని 'కాకి లెక్కలు' చూపుతూ వస్తున్నాయి. భారత మీడియాలో ఈ నష్టాల గురించి బాగా ప్రచారం జరుగుతోంది. ఇది శుద్ధ దగా. వాస్తవంగా ఏం జరుగుతోందంటే అమెరికాలోని ప్రధాన కంపెనీ భారతదేశంలోని అనుబంధ కంపెనీకి (రహస్య) పానీయ మిశ్రమాన్ని అందిస్తున్నందుకుగాను అలవిగాని చార్జీలు విధిస్తూంది. ఆ విధంగా అమెరికాకి చట్ట విరుద్ధంగా అపార మొత్తంలో డబ్బు తరలిస్తూ భారతీయ విభాగానికి మాత్రం నష్టాలొస్తున్నట్లు చూపిస్తున్నారు. ఈ విధంగా కోకోకోలా 650 కోట్ల రూ॥లను, పెప్సీ 250 కోట్ల రూ॥లను నష్టంగా చూపెంచాయి. అయితే భారతీయ విభాగానికి పానీయ మిశ్రమాన్ని అధిక ధరకు అందించటం ద్వారా పై నష్టానికి రెండింతల లాభాన్ని అంటే 2,000 కోట్ల రూ॥ల లాభాన్ని అమెరికన్ కంపెనీలు తరలించుకు పోయాయి. దేశాన్ని ఈ రకంగా కొల్లగొట్టేందుకు ఇక్కడి దళారీ ప్రభుత్వం అనుమతించటమే గాక గత బడ్జెట్‌లో ఈ కంపెనీలకు సుంకాన్ని తగ్గించింది. ఆ రకంగా ఈ కంపెనీలు తమ లూటీని మరింతగా పెంచుకోగలిగాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ చర్య జరిగిన కొద్ది రోజులకే నేపాల్‌లో కూడా మావోయిస్టు గెరిల్లాలు ఖాట్మండూలోని కోకాకోలా ఫ్యాక్టరీని పేల్చేయటంతో ఈ రెండు చర్యలకు అంతర్జాతీయ ప్రాధాన్యత లభించింది.

మన రాష్ట్రంలో జరిగిన ఈ చర్య దేశ వ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన అసంఖ్యాక చర్యల్లో ఒకటి. కొత్తగా ఏర్పడిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక వేదిక (ఎఫ్.ఎ.ఐ.జి.) ప్రపంచ వాణిజ్య సంస్థకు భారత ప్రభుత్వం అమ్ముడు పోవడాన్ని నిరసిస్తూ నవంబర్ 2న ఢిల్లీలో ఒక ర్యాలీని, సదస్సుని జరిపింది. రాజ్ నివాస్ మార్గం నుండి ఎర్రకోటకు తరలి వస్తున్న ర్యాలీని పోలీసులు

నిషేధించారు. ప్రదర్శనకారుల్ని అరగంట పాటు నిర్బంధించారు. 16 రాష్ట్రాల నుండి 1,500 మంది ప్రతినిధులు హాజరైన ఒక రోజు సదస్సు ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారతదేశం ఉపసంహరించుకోవాలని దోహో రౌండ్ చర్చలను బహిష్కరించాలని, ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా బాంబుల దాడిని ఆపివేయాలని డిమాండ్ చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ దోహా చర్చల సమావేశానికి, టెర్రరిజం నిరోధక ఆర్డినెన్స్ (పోటో)కి వ్యతిరేకంగా ఈ సదస్సు తీర్మానాలు చేసింది. నవంబర్ 9 నుంచి 13 దాకా జరిగే దోహా రౌండ్ చర్చల సమయంలో దేశ వ్యాప్తంగా ప్రజానిరసనను నిర్వహించాలని ఫోరం ప్రకటించింది.

అంతకుముందు, నూతనంగా ఏర్పడిన 'శాంతి ప్రజాస్వామ్య కూటమి' (సి.పి.డి.) పతాక కింద పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మేధావులు కలిసి అక్టోబర్ 30న యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎర్రకోట నుంచి ఫిరోజ్ షా కోట్ల వరకు సాగిన ఈ ప్రదర్శనలో విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, మహిళా గ్రూపులు, ప్రజాస్వామిక సక్కుల సంస్థలు, ప్రముఖ వ్యక్తులు పాల్గొన్నారు. ప్రతి సంస్థా యుద్ధ వ్యతిరేక స్పందనలతో తమవైన కరపత్రాలను పంచాయి. 'శాంతి, ప్రజాస్వామ్య కూటమి' ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిని, మతతత్వాన్ని ప్రేరేపిస్తూ, ప్రజాతంత్ర హక్కులపై దాడి చేస్తున్న ప్రభుత్వ చర్యలను ఖండించింది.

తర్వాత, అమెరికా బ్రిటీష్ కంపెనీలు తయారు చేసిన ఉత్పత్తులను పూర్తిగా బహిష్కరించాల్సిందిగా ముస్లిం సంస్థలనేకం పిలుపిచ్చాయి. అక్టోబర్ 24న జమాత్-ఆల్-ఉలేమా జారీ చేసిన ఈ బహిష్కరణ పిలుపును దేశవ్యాప్తంగా మసీదులలో విస్తృతంగా ప్రచారం చేశాయి. విదేశీ సరకులకు వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని చైతన్య పర్చాలని ముస్లింలను కోరుతూ కరపత్రాలు పంచారు. అప్పటికే ముస్లిం ప్రజలు అధికంగా వున్న ప్రాంతాలలో కోక్, పెప్సీలు కన్పించకుండా పోయాయి.

దీంట్లో భాగంగా రాజస్థాన్ ముస్లిం ఫోరంకి చెందిన 25,000 మంది ప్రజలు కోక్, పెప్సీలతో సహా అమెరికా, బ్రిటీష్ ఉత్పత్తులను బహిష్కరించాల్సిందిగా పిలుపిస్తూ జైపూర్‌లో అమెరికన్ పతాకాలను తగులబెట్టారు.

అయితే మహారాష్ట్రలోని మాలెగావ్‌లో ఇలా బహిష్కరణకి పిలుపిస్తూ కరపత్రాలు పంచుతున్న ముస్లింలపై ప్రభుత్వం, హిందూ మతోన్మాదులు తీవ్రంగా దాడి చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఇలా చేయడమే చిత్రం. ముస్లిం యువత విదేశీ సరకుల బహిష్కరణకు పిలిపిస్తూ కరపత్రాలు పంచటం మొదలెట్టినపుడు రాష్ట్ర రిజర్వు పోలీసులు వారిపై దాడి చేసి కరపత్రాలను స్వాధీన పర్చుకున్నారు. అమెరికాకి వ్యతిరేకంగా ప్రచారం చేసే హక్కు తమకుందంటూ ముస్లిం యువత సమర్థించుకున్నపుడు ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా పోలీసులు వారిపై కాల్పులు జరిపి ముగ్గురిని చంపేశారు. తర్వాత పోలీసులు ముస్లింలపైనా, వారి ఆస్తులపైనా దాడి చేశారు. హిందూ మతోన్మాదులు కూడా పోలీసుల పక్షంలో చేరడంతో వీధి పోరాటాలు జరిగాయి. చుట్టుపక్కల గ్రామాలకు, కల్యాన్ పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు కూడా హింస విస్తరించింది. పోరాటం తీవ్రం కావడంతో దాదాపు వారం రోజులు కర్ఫ్యూ విధించారు. 20 మంది ముస్లింలు కాల్చి చంపబడ్డారు. అధికారికంగా చాలా తక్కువ సంఖ్యను సూచించారు. పలువురు గాయపడ్డారు. కోట్లాది రూపాయల ఆస్థి ధ్వంసమైంది. 650 మంది ప్రజల్ని అరెస్ట్ చేశారు.

చిత్రమేమిటంటే పోలీసులను ముస్లిం వ్యతిరేక కార్యక్రమంవైపు రెచ్చగొట్టిన ఆ కరపత్రం 'భారతీయులుగా వుండండి, భారతీయ సరకులనే కొనండి' అనే పిలుపిచ్చింది. ''దాదాపు 4,000 పైచిలుకు భారతీయేతర కంపెనీలు సరకుల అమ్మకాల నుండి పొందుతున్న లాభాల్లో ప్రతి పైసా కూడా సోమాలియా, బోస్నియా, ఇరాక్, పాలస్తీనా ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లోని అమాయక ప్రజలకు వ్యతిరేకంగా అమెరికా సాగిస్తూ వస్తున్న దురాగతాలకు ఉపయోగపడుతోంది'' అని ఆ కరపత్రం పేర్కొంది. టి.ఎస్.సి.లకు వ్యతిరేకంగా సాగిన ఈ ప్రచారాన్ని అణచి వేసేందుకుగాను ఆ ప్రాంతంలో వున్న 7 రాష్ట్ర పోలీస్ కంపెనీలతోపాటు, మరో ఎనిమిది సైనిక పటాలాలను (కాలమ్స్) పిలిపించారు. ప్రజల్లో భీతిని సృష్టించేందుకుగాను ఆ ప్రాంతం మొత్తంగా సైన్యం కవాతులు జరిపింది. అయితే ఇటువంటి పైశాచిక దాడుల వల్ల ప్రజల ఆగ్రహం మరింతగా పెరుగుతుంది. ప్రత్యేకించి ముస్లింలలో ఈ బహిష్కరణ పిలుపు మరింతగా ప్రభావం వేసింది.

బొంబాయిలో అమెరికా, బ్రిటన్ సరకులను బహిష్కరించాలంటూ ముస్లిం హోటల్ యజమానుల సంఘం పిలుపిచ్చింది. 500 మంది పైగా సభ్యులున్న ఈ సంఘం అప్పటికే కోకాకోలా, పెప్సీలను కస్టమర్ల కివ్వడం ఆపివేసింది. అలాగే అమెరికా, బ్రిటన్ బ్యాంకులతో వ్యవహారం నడపటాన్ని, క్రెడిట్ కార్డులను ఉపయోగించడాన్ని కూడా వారు వ్యతిరేకించారు. వారు తమ సభ్యత్వాన్ని 800కి పెంచుకోవడానికి పథకమేశారు. ముస్లిమేతర వ్యాపార వర్గాలను సైతం ఈ బహిష్కరణలో చేరాల్సిందిగా పిలుపిచ్చారు.

చివరకు పాలకవర్గాలకు, ప్రత్యేకించి వామపక్ష పార్టీలకు చెందిన ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు సైతం ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా యుద్ధానికి, ప్రపంచ వాణిజ్య సంస్థకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశాయి. నిజానికి 'స్వదేశీ' జపం చేస్తూ వచ్చిన 'సంస్థలే' ఈ వ్యవహారం మొత్తంలో చడీ చప్పుడూ లేకుండా వ్యవహరించాయి. దీనికి భిన్నంగా ఇవి అమెరికా ప్రకటించిన 'టెర్రరిజం పై యుద్ధం'తో పొత్తుకు పిలుపిచ్చేంత వరకూ పోయాయి. తమ బూటకపు స్వదేశీ నినాదాల బోలుతనాన్ని ఈ స్వదేశీ వాలాలు నగ్నంగా ప్రదర్శించుకున్నాయి. ఇకపోతే అధికారంలో వున్న వామపక్షం సైతం ఈ తరహా సంఘటనల సందర్భంగా చేసే లాంఛనప్రాయపు చర్యలను కూడా తిరస్కరించింది. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని ప్రగతిశీలంగా నిర్మించి వున్నతస్థాయికి తీసుకుపోయేందుకు కూడా వారు సిద్ధపడలేదు.

అయితే దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక మనోభావాలు చాలా బలంగా వున్నాయి. ఇవి రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కార్మికులూ, కర్షకులూ, విద్యార్థులు, మేధావులు, వివిధ ప్రజా విభాగాలు మన దేశంలోని దళారీ ఏజెంట్ల ద్వారా డబ్ల్యు.టి.ఓ., ఐ.యం.యఫ్., ప్రపంచబ్యాంకుల కూటమి అమలు చేస్తున్న విధ్వంసక విధానాలకు వ్యతిరేకంగా ముందుకొస్తున్నారు. ఈ వ్యతిరేకతను మరింత ఉధృతం చేసేందుకు విప్లవకర నాయకత్వం అవసరముంది. ఈ పరిస్థితుల్లో యం.సి.సి./పీపుల్స్‌వార్ పార్టీలు ఉమ్మడిగా పాట్నాలో జరిపిన సామ్రాజ్యవాద వ్యతిరేక ర్యాలీకి ఎనలేని రాజకీయ ప్రాధాన్యత వుంది. ❑

# తూర్పు-విశాఖ ఏజెన్సీలో పి.జి.ఏ. దాడులు

ప్రజాగెరిల్లా ఆర్మీ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పి.జి.ఏ. గెరిల్లాలు దాడులకు దిగారు. దీంట్లో భాగంగా విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలలో పలు మిలిటెంట్ సంఘటనలు జరిగాయి. తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్లపైన గెరిల్లాలు విరుచుకుపడ్డారు. తూ.గో. జిల్లాలోని వై.రామవరం పోలీస్ స్టేషన్‌ను డిసెంబర్ 1 అర్ధరాత్రి గెరిల్లాలు పేల్చివేసేందుకు జరిపిన యత్నం స్టేషన్ సెంట్రీ అప్రమత్తతతో విఫలమైంది. పెద్ద ఎత్తున స్టేషన్‌లో ముందే మోహరించి వున్న పోలీస్ బలగాలతో అరగంటసేపు ఎదురుకాల్పులు జరిగాక గెరిల్లాలు క్షేమంగా తప్పుకున్నారు. ఇదే సమయంలో మరో బృందం మండలంలోని వెదురు నగరంలో దాడులు చేశారు. రాజమండ్రి పేపరు మిల్లుకు చెందిన అధికారి క్వార్టర్‌తో పాటు సిబ్బందికి చెందిన మరో రెండు భవనాలను, ఒక వెయింగ్ బ్రిడ్జిని పేల్చి వేశారు. ప్రజాగెరిల్లా సైన్యంలో చేరాలని, ఆంధ్ర-ఒరిస్సా ప్రాంతాన్ని విముక్తి ప్రాంతంగా మలచాలని, రాజేశ్వరి (అనిత) కిషోర్, క్రాంతి రణదేవ్ తదితర నక్సలైట్ నాయకుల మృతికి నివాళినర్పిస్తూ వెదురునగర్‌లో బ్యానర్లు కట్టారు. అట్లే కొయ్యూరు పోలీస్ స్టేషన్‌పై, జి.కె.వీధి పోలీసు స్టేషన్‌పై కూడా 50 మంది పైగా నక్సలైట్లు దాడికి ప్రయత్నించగా బందోబస్తులో వున్న సి.ఆర్.పి.యఫ్. పోలీసులు తిప్పికొట్టారని, ఏజెన్సీలోని ఈ మూడు పోలీస్ స్టేషన్లను 'వీరోచితంగా' కాపాడుకున్న పోలీసులను పోలీస్ దొర ఉబ్బించేశాడు. ఇంకా విశాఖ ఏజెన్సీలోని గూడెం కొత్తవీధి మండలం యర్రవరం కేంద్ర కాఫీ పరిశోధనాశాలను, ఆర్.వి. నగర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజిని కూడా గెరిల్లాలు పేల్చివేశారు. ఏకకాలంలో జరిపిన ఈ దాడుల్లో దాదాపు 75 లక్షల రూ॥ల మేరకు నష్టం వాటిల్లిందని అంచనా. వందమంది నక్సల్స్ పథకం ప్రకారం నాలుగు బృందాలుగా విడిపోయి పోలీస్ స్టేషన్లపై కాఫీ పరిశోధనాంశాలపై, టెలిఫోన్ ఎక్స్ఛేంజిపై దాడి చేశారని ఏజెన్సీ పీపుల్స్‌వార్ చరిత్రలో ఇలా ఏక కాలంలో మూడుచోట్ల దాడి చేయటం ప్రథమమని పత్రికలు రాశాయి. నాలుగో బృందం సీలేరు నుంచి గూడెం వచ్చే మార్గంలోని లంకపాకల అటవీ ప్రాంతం వద్ద మాటువేసి పోలీసుల రాక కోసం ఎదురుచూసింది. రాత్రి కొయ్యూరు పోలీస్ స్టేషన్ నుండి సీలేరు, ధారకొండ ప్రాంతాలకు సమాచారం అందితే స్పెషల్ పార్టీ పోలీసులు వస్తారని గ్రహించి వారికోసం మాటువేస్తే పోలీసులు మొత్తానికి రానే రాలేదు. ఇంకా కొంతమంది చింతపల్లి, గూడెం మార్గంలోని అనేక చోట్ల పి.జి.ఏ. పేరిట, పార్టీ పేరిట కరపత్రాలు పంచారు.

మరో వైపున చింతపల్లి ఎమ్మెల్యే ఎం.వి.వి. సత్యనారాయణకు చెందిన రెండు ఇళ్ళను పేల్చేయడమేగాక రాజేంద్రపాలెం ఎమ్మార్వో, ఎంపి.పి.డి.వో కార్యాలయాలను గెరిల్లాలు ధ్వంసం చేశారు. ఎమ్మార్వో ఆఫీసులోని కంప్యూటర్లు ఈ పేలుడులో పూర్తిగా పాడైపోగా 10 లక్షల రూ॥లు నష్టం జరిగింది. పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ నాయకులు నల్లా ఆదిరెడ్డి, మహేష్, శీలం నరేష్‌ల మృతికి నిరసనగా గత ఏడాది డిసెంబర్ 2న ఆవిర్భవించిన భారీ విధ్వంసం విజయవంతం కావడంతో వార్ తమ పంతం నెగ్గించుకున్నట్లయిందని, ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పోలీసులు భారీగా గాలింపులు జరుపుతూ నక్సల్స్ చర్యలను తిప్పికొడుతున్నప్పటికీ పోలీసులు ఊహించని రీతిలో ఒకరోజు ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో మాటు వేసి దాడి చేసి భవనాల పేల్చివేతకు పాల్పడటం ఏజెన్సీ ప్రాంతంలో విపరీతంగా చర్చనీయాంశమైందని పత్రికలు రాశాయి. మొత్తంగా చూస్తే ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుండి డిసెంబర్ 10 వరకు ఏజెన్సీ ప్రాంతంలో ప్రజాగెరిల్లాలు 15 యాక్షన్లు చేశారు.

# తూర్పు కొండల్లో పి.జి.ఏ. ఆవిర్భావ దినోత్సవం

డిసెంబర్ 2, ఆదివారం మిట్ట మధ్యాహ్నం... నిలువెత్తు స్థూపాలు... పక్కనే రెపరెపలాడుతున్న సుత్తి, కొడవలి గుర్తుగా వున్న ఎర్రని జెండాలు... వాటి నీడలో సుత్తి, కొడవలి కలసి వున్న పి.జి.ఏ. జెండాలు... గాలిలో పేలిన ఎస్.జి.ఎస్. ఎస్.ఎల్.ఆర్.లు...ఈస్ట్ డివిజన్ పరిధిలోని విశాఖ జిల్లా గూడెం కొత్త వీధి మండలం గాలికొండ అటవీ ప్రాంతంలో ఆదివారం కన్పించిన దృశ్యం ఇది. అక్కడ ఆలివ్‌గ్రీన్ దుస్తులు, నెత్తిన ఎర్రచుక్క టోపీ, భుజాన తుపాకులు ధరించిన గెరిల్లాలు క్రమశిక్షణాయుతంగా సైనిక కవాతు చేశారు. వారితో పాటు పిల్లా పాపలతో తరలి వచ్చిన జనసందోహం పి.జి.ఏ. వర్ధిల్లాలి, ప్రజా రాజ్యం సాధిస్తాం, విముక్తి ప్రాంతాలను నిర్మిస్తామని నినాదాలిస్తూ సభా స్థలానికి చేరుకున్నారు. ఆదివారం జరిగిన పీపుల్స్ గెరిల్లా ఆర్మీ ఆవిర్భావ దినోత్సవం విశేషాలివి. మిలీషియా బలగాలు, గెరిల్లాలు మార్చింగ్ నిర్వహించారు. సభకు వచ్చిన ప్రజలు వాటిని అబ్బురంగా తిలకించారు. గిరిజనులు గొడ్డళ్ళు, విల్లంబులు వంటి ఆయుధాలు ఒక చేత్తో, మరో చేతితో డప్పు వాయిద్యాలతో సాయుధ సాంస్కృతిక యుద్ధకళా ప్రదర్శన జరిపారు. ఈ సభలో జిల్లా కమిటీ, ఏరియా కమిటీ సభ్యులు, స్పెషల్ గెరిల్లా దళ కమాండర్, వివిధ దళాల సభ్యులు ప్రసంగించారు. కేంద్రకమిటీ పంపిన సందేశ సారాంశాన్ని వివరించారు. ఈస్ట్ డివిజన్‌లో గత 15 సంవత్సరాలుగా 48 ఎదురుకాల్పుల సంఘటనలు జరిగాయని, ఎనిమిది రెయిడ్లు, 21 అంబుష్‌లు గెరిల్లా దళాలు నిర్వహించాయని, నిజమైన సాయుధ సంఘర్షణలలో 64 మంది శత్రు బలగాలను నేల కూల్చగా, పార్టీ కామ్రేడ్‌లు 81 మంది అమరులయ్యారని వారు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రజాయుద్ధం అనే పి.జి.ఏ. ప్రత్యేక బులెటిన్‌ని కార్యదర్శి కరుణ విడుదల చేశారు. ఈ వార్షికోత్సవానికి ఆహ్వానించిన అతి కొద్దిమంది పాత్రికేయులతో అనేక విషయాలు చర్చించిన నాయకులు కొయ్యూరు ఎం.డి.డి.వో, ఎమ్మార్వో కార్యాలయాలను ధ్వంసం చేయకముందు శనివారం స్వాధీన పర్చుకున్న కంప్యూటర్లను, గతంలో ఒరిస్సాలో మోటు, కలిమెల పోలీసు స్టేషన్లపై దాడి చేసి స్వాధీన పరచుకొన్న ఆయుధాలను పాత్రికేయులకు చూపించారు. గూడెం పోలీసు స్టేషన్‌లో వున్న శత్రువులను భయపెట్టేందుకు మెరుపుదాడి చేసి స్థానిక ఎమ్మెల్యేకి చెందిన రెండు గృహాలను ధ్వంసం చేశామని, నర్సీపట్నంలోని మరో కొత్త గృహాన్ని కూడా అతి త్వరలో పేల్చివేస్తామని వారు ప్రకటించారు. ప్రజల ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యే వారి సమస్యలను పట్టించుకోక పోవడం వల్లనే అతని నివాస స్థలాల్ని నేలకూల్చామని రాష్ట్రకమిటీ సభ్యుడు సుధాకర్ తెలిపారు. గాలికొండ ఏరియా కమిటీ కార్యదర్శి కరుణ నాయకత్వంలో జరిగిన ఈ విధ్వంసంలో ఎక్కువమంది మహిళలే పాల్గొన్నారని వారు తెలిపారు.

**('వార్త' పత్రిక నుండి....)**

**కాబూల్ పతనం అనంతర పరిణామాలు**

# ఆఫ్ఘనిస్థాన్‌పై తన విషపట్టును బిగించడమే అమెరికా యుద్ధం అసలు లక్ష్యం

2001వ సంవత్సరాంతానికి అంటే ఈ డిసెంబర్ మాసాంతానికి ఆఫ్ఘనిస్థాన్‌పై అమెరికా యుద్ధాన్ని ప్రారంభించి 11 వారాలు పూర్తయ్యాయి. ప్రస్తుతానికి ఈ యుద్ధం ముగిసినట్టా లేక కొనసాగుతున్నట్టా అనే ప్రశ్నకు సమాధానం అంత సులువైనదేమీ కాదు. ఎందుకంటే ఈ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పగల స్థితిలో అమెరికా లేదు. తన తదుపరి దాడి లక్ష్యాలుగా అది మరికొన్ని దేశాల జాబితాను ప్రకటిస్తోంది. కనుక తాత్కాలికంగా నైనా ఇక్కడ యుద్ధం ముగిసినట్లు భావించలేమా? అంటే ఇందుకు సమాధానం కూడా కష్టమే. ఏకకాలంలోనే ఒకటికి మించిన చోట్ల యుద్ధం చేయగల కండకావరంతో అమెరికా వుంటోంది. బిన్‌లాడెన్, ఒమర్‌లను బంధించడం లేక అంతమొందించడం తన యుద్ధ లక్ష్యంగా అమెరికా ప్రకటించుకుని యుద్ధానికి దిగింది. ఆ లక్ష్య సాధనలో అది ఘోరంగా విఫలమైంది. నిజానికి అమెరికా లక్ష్యం అది కానేకాదు. లాడెన్ బూచితో ఆఫ్ఘనిస్తాన్‌పై తన ఆధిపత్య విషపట్టుని బిగించడమే దాని అసలు లక్ష్యం. ఈ లక్ష్యసాధనలో తాను విజయం సాధించేసినట్లు అది సంబరపడిపోవచ్చు. కాని, అది సైతం భ్రమేనని తేలడానికి అట్టే సమయం పట్టకపోవచ్చు. ముందే దిబ్బ అయిపోయిన అఫ్ఘనిస్తాన్‌ని అమెరికా మరింత దిబ్బ చేసేసింది. వేలాది అమాయక ప్రజల్ని ఎడతెరిపి లేని బాంబుదాడులకి అమానుషంగా బలి చేసింది. వందలాది తాలిబాన్, ఆల్‌కాయిదా పోరాట యోధుల్ని ఊచకోత కోసింది. మరికొన్ని వందలమందిని బంధించింది. ఇంత చేసినా శక్తివంతమైన అమెరికా సామ్రాజ్యవాదం తాలిబాన్ యోధుల పోరాటస్ఫూర్తిని ఏమాత్రం దెబ్బ తీయలేకపోయింది. ఇది చెప్పడానికి ఎలాంటి విశ్లేషణలు, పరిశోధనలు అవసరం లేదు. అమెరికాలోని ప్రముఖ పత్రికలన్నీ ఈ వాస్తవాన్ని ఎలుగెత్తి చాటుతూ రాశాయి.

రష్యా, యూరోపియన్ దేశాల ప్రభుత్వాలు మెతక వైఖరిని అవలంభించడంతో మధ్య ఆసియా దేశాలు (ప్రభుత్వాలు) ఒకటొకటిగా అమెరికాకి సాగిలపడి పోయాయి. తీవ్ర పరిణామాలనెదుర్కోవలసి వస్తుందనే అమెరికా బెదిరింపులకి తలొగ్గేస్తూ సౌదీ అరేబియా, అరబ్ ఎమిరేట్స్‌తో సహా మధ్య ప్రాచ్యంలోని పదకొండు దేశాలు అమెరికా అక్కున చేరాయి. అమెరికా చేసిన ఒత్తిడికి బాధ, అవమానాలతో గొంతు పూడ్చుకుపోయిన పాకిస్తాన్ అధ్యక్షుడు ముషారఫ్ ''1971 తరువాత పాకిస్తాన్ అతి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది'' అంటూ డగ్గుత్తికతో ప్రకటించాడు. ''కొన్నిచోట్ల కేరట్ దుంప పెద్దది కావొచ్చు. మరికొన్ని చోట్ల బెత్తం పెద్దది కావొచ్చు'' అంటూ 'కేరట్–బెత్తం' విధానంతోనే అన్ని దేశాల ప్రభుత్వాల్ని అదుపు చేసింది అమెరికా! కానీ, తన స్వంత గడ్డ మీద సామాన్య ప్రజలతో సహా ప్రపంచ దేశాల ప్రజా సామాన్యమంతా కూడా అమెరికా తలపెట్టిన దురాక్రమణపూరిత యుద్ధానికి వ్యతిరేకమేననేది తిరుగులేని నిజం. ఇదెంత నిజమో, దేశ దేశాల్లోని దళారీ పాలకవర్గాలు వారి ప్రభుత్వాలు మాత్రమే గాక అక్కడి ప్రజలంతా కూడా 'ముక్త కంఠం'తో లాడెన్‌ని శపిస్తున్నట్టు, బుష్‌ని పూజిస్తున్నట్టు ఆయా దేశాల దళారీ పాలకవర్గాలు వారి ప్రచార సాధనాలు చేసే విష ప్రచారం అంత అబద్ధం! ''మానవతకి వ్యతిరేకంగా సాగే నేరాల అదుపుకే ఇదంతా'' అంటూ అమెరికా తన యుద్ధ నేరాన్ని, నేరస్థ యుద్ధాన్ని కప్పుకోజూసింది. ''ఇదేదో కొంతమందిని పట్టుకోవడంతోనే సరిపెట్టుకోవాల్సింది కాదు... వారి (టెర్రరిస్టుల) స్థావరాల్ని నాశనం చేయాలి; వారి మద్ధతు వ్యవస్థల్ని నాశనం చేయాలి; టెర్రరిజానికి వత్తాసునిచ్చే ప్రభుత్వాలకి ఉద్వాసన చెప్పాలి'' ''మేము ఒక సాధారణ పంథాగానే ప్రపంచ వ్యాపితంగా టెర్రరిజాన్ని దెబ్బతీస్తాం'' అంటూ తమ ఆధిపత్య, విస్తరణవాద దుష్ట సంకల్పాలని అమెరికా దేశ డిప్యూటీ రక్షణ కార్యదర్శి పాల్ వుల్ఫోవిడ్జ్ స్పష్టంగానే ప్రకటించాడు.

యుద్ధం ప్రారంభమై నెల దినాలు గడిచేటప్పటికే తాలిబాన్ శక్తులు పరారయ్యాయి. నవంబర్ 2వ వారానికే కాబూల్ (ఆఫ్ఘనిస్తాన్ రాజధాని) పతనం ప్రారంభమైంది. ఉత్తరాది కూటమి చొరవతోనే ఇది సాధ్యమైంది. ఇది దురుసుగా చొచ్చుకురాక పోయినట్లయితే అమెరికా చేసే అకాశ దొంగ యుద్ధాన్ని చాలా రోజుల పాటే తాలిబాన్ పోరాటకారులు ప్రతిఘటించ గలిగేవారు. ఉత్తరాది కూటమి చొరవ, చొరబాటుల్ని రష్యా ఉత్సాహంగానే ఆహ్వానించింది. అమెరికా అయిష్టంగానే దీన్ని అంగీకరించింది. ఉత్తరాది కూటమి చొరబాటు అనేది అమెరికా కంటే కూడా పాకిస్తాన్‌కి కంటగింపే! అయినా అమెరికాయే సర్దుకుపోయినపుడు ఇక తాను చేయగలిగేది ఏమీ లేక పాకిస్తాన్ సైతం సర్దుకుపోయింది. నవంబర్ 12, 13 తేదీలకే కాబూల్ ఉత్తరాది కూటమి వశమైపోయింది. తాలిబాన్‌లు కాందహార్‌కి తరలి పోయారు. ''ఇది తాలిబాన్ వ్యతిరేక శక్తుల ప్రముఖ విజయం'' అని రష్యా ప్రశంసించింది. ''ఈ సైనిక విజయం రాజకీయ విజయంగా తర్జుమా కాబడాల్సి వుంది'' అని ఫ్రెంచ్ ప్రధాని ప్రకటించారు. ''ఈ పరిణామాలు చాలా సంతృప్తికరంగానే వున్నాయి'' అంటూను ''మానవహక్కుల రక్షణకి దృఢ సంకల్పంతో పనిచేసే శక్తులన్నింటి ఉమ్మడి విజయం ఇది'' అని బుష్ అభివర్ణించాడు. ''తాలిబాన్ సైన్యం నుంచి భారీగా వలసలు జరగొచ్చు'' అని పెంటగాన్ ఆశించింది. (కాని అలా జరగక పోవడంతో అది ఆశాభంగానికి గురైంది) వీరంతా ఈ రకంగా విజయోత్సాహాలు ప్రకటించుకుంటుండగానే కాబూల్‌లో చల్లారిన పోరు కాందహార్‌లో రగుల్కొంది.

నవంబర్ 16 నుంచే కాందహార్‌లో తాలిబాన్ పోరాట యోధులు అమెరికా సైనిక శిబిరాలపైనా, ఉత్తరాది కూటమి సైనికులపైనా కాల్పులు ప్రారంభించారు. అమెరికా కాందహార్‌పై విమాన దాడులు ముమ్మరం చేసింది. నవంబర్ చివరలో (28, 29 తేదీలు) 'మజార్–ఎ–షరీఫ్' అనే పట్టణంలోని ఒక కోటలో చిక్కుకుపోయిన 500 మంది పైగా తాలిబాన్ పోరాటకారుల్ని అమెరికా, ఉత్తరాది కూటమి సేనలు ఊచకోతకి గురిచేసాయి. 'ఖిలా–ఇ–ఝాంగీ' అనే పట్టణంలో కూడా ఇలాంటి ఊచకోతే సాగింది. మజర్–ఏ–షరీఫ్ ఊచకోతపై క్షుణ్ణమైన పరిశీలన జరిపిన 'గార్డియన్' పత్రిక ''ఆఫ్ఘనిస్తాన్‌లో జరుగుతున్న ఎనిమిది వారాల యుద్ధంలో ఇది అత్యంత రక్తపాత ఘటన'' అని పేర్కొంది (డిసెంబర్ 1 నాటి సంచిక).

పై రెండు పట్టణాలలో జరిగిన మారణహోమాలని 'గార్డియన్' 'ఇండిపెండెంట్' 'న్యూస్‌వీక్' పత్రికలు, 'అసోసియేటెడ్ ప్రెస్', బి.బి.సి.లే బయటపెట్టాయి. ''లొంగిపోయిన, ఆయుధాలప్పగించిన

వందలాది తాలిబాన్ పోరాటకారుల్ని చేతులు కట్టేసి మరీ కాల్చి చంపారు. అదీ సి.ఐ.ఏ. పరిశీలకులు, పాత్రికేయుల సమక్షంలోనే జరిగింది'' అని ఆ పత్రికలు ఎలుగెత్తి మరీ చాటాయి.

ఆఫ్ఘనిస్తాన్‌కి శాంతి దళాల్ని పంపాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించిన తరువాతనే, ఆఫ్ఘనిస్తాన్‌లో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు సమితి భద్రతామండలి ఆమోదిస్తూ తీర్మానించిన తరువాతనే (నవంబర్ మూడో వారంలో) అమెరికా ఈ నరమేధాలకి ఒడిగట్టింది. ముట్టడికి గురైన కాబూల్ నుంచి తాలిబాన్‌లు సురక్షితంగా కాందహార్‌కి తరలిపోవడంపై నిర్ఘాంతపడిపోతూ'' తాలిబాన్‌లను తక్కువగా అంచనా వేయలేం'' అని ''ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడులు ఆగవు'' అని బుష్ ప్రకటించాడు. ''చావనైనా చస్తాను కానీ అమెరికాకి పట్టుపడేది లేదు'' అని లాడెన్ వీరోచితంగా ప్రకటించాడు.

ఈ పరిస్థితులు పరిణామాల మధ్యనే ఆఫ్ఘనిస్తాన్‌లో మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకి సంబంధించిన ఒప్పందం ఒకటి తేదీ 5-12-2001న జర్మనీలోని బాన్ నగరంలో జరిగింది. ఈ ప్రభుత్వానికి అధినేతగా హమీద్ కర్జాయ్ ఎంపికయ్యాడు. వెంటనే కొత్త ప్రభుత్వంలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. జనరల్ అబ్దుల్ రషీద్ దోస్తుం ఈ ప్రభుత్వాన్ని బహిష్కరించాడు. ''ఇది అమెరికా ప్రభుత్వం'' అని మాజీ మొజాహిద్దీన్ నేత హెక్మత్యార్ ఈసడించాడు. ''న్యాయం జరగలేదు'' అని మెజారిటీ పస్తూన్ తెగకి చెందిన ముఖ్య ఆధ్యాత్మిక నేత అసంతృప్తి వ్యక్తం చేసాడు, తాలిబాన్ సైన్యం ఎక్కువ భాగం ఈ తెగ నుంచి తయారైందే! ''ఇది పాశ్చాత్యులు ఆఫ్ఘనిస్తాన్‌పై రుద్దిన యుద్ధం'' అని తాలిబాన్ మాజీ పాక్ రాయబారి జయీఫ్ ధ్వజమెత్తాడు. ప్రభుత్వాధికార బాధ్యతలు చేపట్టిన వెంటనే ''లాడెన్, ఒమర్‌లు మా అదుపులో లేరు'' అని హమీద్ కర్జాయ్ ప్రకటించాడు 6/12). ''లాడెన్, ఒమర్‌లు మా భూభాగంలో చొరబడలేదు'' అని పాకిస్తాన్ ప్రకటించింది. అమెరికా యుద్ధోన్మాదాన్ని, యుద్ధ విధానాల్ని తూర్పారబడుతూ కొందరు నోబుల్ బహుమతి గ్రహీతలు ధ్వజమెత్తారు (డిసెంబర్ 2వ వారంలో) ఆఫ్ఘనిస్తాన్‌లో 1,300 మంది అమెరికా సైనికులు మోహరించగా, అమెరికా మిత్రదేశాలకి చెందిన బలగాలు తజకిస్తాన్‌కి చేరుకున్నాయి. ''ఉగ్రవాద నిర్వచనంపై ఎక్కువగా మాట్లాడం'' అని అమెరికా అధ్యక్షుడు బుష్ ఘరానాగా ప్రకటించాడు. ఔను మరి! టెర్రరిజం అనే దాన్ని నిర్దిష్టంగా స్పష్టంగా నిర్వచించుకోవడం అంటూ జరిగిన తరువాత ఇక ఆ పేరుతో ఇష్టానుసారంగా ఏ దేశంపైన అయినా దాడికి దిగి పోవడం ఎవరినైనా అణచిపారేయడం అనేవి సాధ్యం కావు కదా! అందుకు, ఈ వెసులుబాటు.

పశ్చిమాసియాలో రోజురోజుకీ తీవ్రమవుతున్న ఉద్రిక్తతలకి ప్రధాన కారణంగా వుండే ఇజ్రాయిల్ దూకుడుకి, ఆ దేశ ప్రధాని షరాన్ దూకుడుకి ముకుతాడు వేస్తున్నట్టుగా డిసెంబర్ ప్రారంభం వరకూ నటిస్తూ వచ్చింది అమెరికా. నవంబర్ మాసాంతానికే ఆఫ్ఘనిస్తాన్ తమ అదుపులోకి వచ్చేయడంతో అమెరికాకి ఇక ఇలాంటి నటన అవసరం తీరిపోయింది. కనుకనే ప్లేటు ఫిరాయించిన బుష్ ఇజ్రాయిల్ 'ఆత్మరక్షణ హక్కు పోరాటం'ని సమర్థిస్తూ పాలస్తీనాని, ఆ దేశాధినేత అరాఫత్‌ని ఆడిపోసుకోడం ప్రారంభించాడు. అరాఫత్ కార్యాలయంపైనే గాక అతడి నివాసంపై సైతం ఇజ్రాయిల్ బాంబులతో క్షిపణులతో దాడి చేయడాన్ని బరితెగింపుగా సమర్థించాడు బుష్! అప్పటికే స్వయానా ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి పెరెస్ ప్రధాని షరాన్ దూకుడుని నిరసించాడు. ఇంకో పక్క 3-12-2001న ఐక్యరాజ్యసమితి పాలస్తీనా వైఖరిని సమర్థిస్తూ 5 తీర్మానాలు ఆమోదించింది. అయినా బుష్ ఇజ్రాయిల్‌కి అనుకూలంగా పాలస్తీనాకు వ్యతిరేకంగా తన నిజరూపాన్ని బయట పెట్టుకున్నాడు.

అలానే ఆఫ్ఘనిస్తాన్‌పై తాను చేస్తుండిన యుద్ధంలో పాకిస్తాన్ అందించే మద్దతుకి వుండే కీలక ప్రాధాన్యత రీత్యా నవంబర్ 3వ వారం వరకు అమెరికా పాకిస్తాన్‌ని, దాని అధ్యక్షుడు ముషారఫ్‌ని అనేక ప్రశంసలతో ఉబ్బరిస్తూ వచ్చింది. ఒక బిలియన్ డాలర్లకి పైగా ఆర్థిక సహాయ ప్యాకేజిని ప్రకటించింది. బుష్-ముషారఫ్‌ల కౌగలింతల్ని చూసి భారత పాలకవర్గాలు, భారత ప్రభుత్వం ఈర్ష్యతో కళ్ళు కుట్టుకున్నాయి. ఔను మరి! అడక్కపోయినా కూడా అమెరికా పాదాల ముందు తాము దేన్నయినా అర్పించడానికి సిద్ధమేనని పదే పదే ప్రకటిస్తున్నా పట్టించుకోకుండా తమ సాంప్రదాయిక శత్రువుని అమెరికా దొర కౌగిలించుకోవడం తీవ్ర కంటగింపే కదా! కానీ, ఎంత తాత్కాలికంగానైనా, ఇంకెంత దీర్ఘకాలికం అయినా ఒకరిని చేరదీయడానికిగాని ఇంకొకరిని దూరంగా నెట్టేయడానికిగాని అమెరికాకి వుండే ఏకైక ప్రాతిపదిక దాని స్వార్థ ప్రయోజనాలు, స్వంత లక్ష్యాలే తప్ప వేరు కాదు. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్-పాలస్తీనాల మధ్య గాని భారత్ ఉపఖండంలో భారత్-పాక్‌ల మధ్యగాని వైరం పూర్తిగా సమసిపోవడాన్ని అమెరికా ఎంత మాత్రం కోరుకోదు. ఆ వైషమ్యాలు, వైరుధ్యాలు నిత్యం రగులుతూనే వుండాలని అది కోరుకుంటుంది. అప్పుడిక తన అవసరాలకు అనుగుణంగా అటూ ఇటూ మొగ్గుతూ తన ప్రయోజనాలు నెరవేర్చుకుంటూ వుంటుంది. భారత్-పాక్‌ల మధ్య సంబంధాల విషయంలో అమెరికా అనుసరించే విధానం ఇదేననడానికి ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా చేస్తుండిన యుద్ధ నేపథ్యంలో డిసెంబర్ 2వ వారం చివరినుంచి జరుగుతూ వచ్చిన కొన్ని ముఖ్య పరిణామాలే నిదర్శనం. పాకిస్తాన్ పట్ల తీవ్ర వ్యతిరేకతతో వుండే ఉత్తరాది కూటమి నేతృత్వంలో ఆఫ్ఘనిస్తాన్‌లో మధ్యంతర ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమెరికా వద్ద పాకిస్థాన్ పరపతి ప్రాధాన్యతలు కొంత పలుచబారాయి.

ఈ పరిస్థితులు పరిణామాలు మధ్య తనపై కొంత కినుక వహించిన భారత్‌ని బుజ్జగించుకుంటూ, టెర్రరిజాన్ని నిరోధించే నిర్దిష్ట చర్యలు చేపట్టాలని పాకిస్తాన్‌ని లాంఛనప్రాయంగా హెచ్చరిస్తూ అమెరికా తన ఆధిపత్య వ్యూహ చతురతని ప్రదర్శించుకు పోయింది. భారత్-పాక్‌ల మధ్య ఇప్పట్లో యుద్ధం రగలడం అనేది ఉపఖండంలో అమెరికా వ్యూహానికి, ప్రత్యేకించి ఆఫ్ఘనిస్తాన్‌లో తన స్థానాన్ని పదిలపర్చుకోడానికి పెద్ద ఆటంకం అవుతుంది. కనుక ఈ ఇరుదేశాల మధ్య యుద్ధం రగలకుండా చేయడానికి అమెరికా తన పాత్ర పోషించుకు పోయింది. ఆ రకంగా వెసులుబాటు కుదుర్చుకుని డిసెంబర్ 22న, ఆఫ్ఘనిస్తాన్‌లో ఏర్పడబోయే తాత్కాలిక ప్రభుత్వంపై దృష్టి సారించింది.

డిసెంబర్ 22, 2001న ఆఫ్ఘనిస్తాన్‌లో కర్జాయ్ నాయకత్వంలో 30 మందితో కూడిన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి పదవిని ఆశించి పొందలేక పోయిన ఉజ్బెక్ యుద్ధ ప్రభువు జనరల్ అబ్దుల్ రషీద్ దోస్తుం తీవ్ర నిరసన వ్యక్తం చేసాడు. రష్యాకు వ్యతిరేకంగా, అమెరికాకు వెన్నుదన్నుగా గతంలో (1989లలో) పనిచేసినవాడు. ఇతడు కొత్త ప్రభుత్వానికి పక్కలో బల్లెం అయ్యాడు. కీలకమైన విదేశాంగ, రక్షణ శాఖల్ని తజక్ నాయక త్రయం అబ్దుల్లా అబ్దుల్లా, యూసఫ్ ఖనూని, మహమ్మద్ ఖాశిం పాహింలు తన్నుకు పోయారు. పశ్చిమ ప్రాంతంలో హెరాత్ గవర్నర్ ఇస్మాయిల్ ఖాన్ సైతం తనకు ప్రభుత్వంలో స్థానం కల్పించలేదని మండిపడ్డాడు. 'అయ్యే చెట్టు ఆకుల్లోనే తెలుస్తుంది' అన్నట్టు ఈ ప్రభుత్వం ఎంత స్థిరంగాను,

# భారత పాలకుల అవధులు మీరిన లొంగుబాటుతత్వం

అమెరికా ప్రారంభించిన 'అంతర్జాతీయ టెర్రరిజం వ్యతిరేక సంకీర్ణం' లో చురుకైన భాగస్వామ్య పాత్ర కోసం భారత్ వెంపర్లాడి పోయింది. పాకిస్తాన్ ప్రేరేపిత 'సీమాంతర ఉగ్రవాదం'కి వ్యతిరేకంగా ప్రతి రోజు పెడ బొబ్బలు పెట్టడం ఎక్కువ చేసింది. పాకిస్తాన్‌కి వ్యతిరేకంగా అంతర్జాతీయ అభిప్రాయాన్ని కూడగట్టడానికి ఇదే అదునుగా భావించి తీవ్రస్థాయి దౌత్య యుద్ధానికి దిగింది. విదేశీ పర్యటనలు, ప్రత్యేకించి అమెరికా, బ్రిటన్, ఇజ్రాయిల్ పర్యటనల్ని ముమ్మరం చేసింది. ఏమైనా పాకిస్తాన్ వైపే కొంత మొగ్గతో అమెరికా వ్యవహరిస్తూ వచ్చింది. 'పాకిస్తాన్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదానికి' వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ప్రచారార్భాటాన్ని అమెరికా అధ్యక్షుడు బుష్ అంతగా సరుకు చేయలేదు. దేశాల మధ్య వైషమ్యాలకి మూలమైన కాశ్మీర్ సమస్యపై ఉభయులు ఒద్దికగా చర్చించుకొని బుద్ధిగా పరిష్కరించుకోమని హితవులు పలుకుతూ వచ్చాడు. ఈ విషయంలో అమెరికా జోక్యం చేసుకోదలచలేదు అంటూనే ఉభయదేశాలు కోరితే మధ్యవర్తిత్వం నెరపి సహకరించగలనని చెబుతూ వచ్చాడు. రాజుని మించిపోయిన రాజభక్తితో అమెరికా నుంచి పాక్‌ని కొంత దూరం చేసి తాము మరికొంత చేరువ అయిపోడానికి భారత పాలకవర్గాలు, ప్రభుత్వం పడ్డ పాట్లు ఇన్నన్ని కావు. అమెరికా వల్లించే టెర్రరిజం వ్యతిరేక యుద్ధంకి సంబంధించిన ప్రచార బాధ్యతను భారత్ తన తలకెత్తుకుంది.

ఇలా వుండగా డిసెంబర్ 13, 2001 నాటి ఉదయం 11.45 గం॥లకు స్వతంత్ర కాశ్మీర్ పోరాట సంస్థలకి చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన ఒక తీవ్రవాదుల బృందం భారత పార్లమెంట్‌పై దాడికి పాల్పడింది. శక్తివంతమైన ఆయుధాలతో తీవ్రవాదులు పార్లమెంట్ భవన ప్రాంగణంలోకి చొచ్చుకుపోయి కాల్పులు ప్రారంభించారు. పార్లమెంటు భద్రతాదళాలు ప్రతిఘటించాయి. నలుగురు తీవ్రవాదుల్ని భద్రతా దళాలు కాల్చివేయగా మానవ బాంబుగా వ్యవహరించిన మిగిలిన ఒక్క తీవ్రవాది భవనం గేటు వద్ద తననితాను పేల్చేసుకున్నాడు. తీవ్రవాదుల దాడిలో ఆరుగురు భద్రతా సిబ్బంది, ఒక తోటమాలి హతులయ్యారు. దేశ ఉపాధ్యక్షుడు కృష్ణకాంత్ దాడిలో చిక్కకుండా తృటిలో తప్పించుకున్నాడు. 'టెర్రరిజం అంతు చూస్తాం' అని అద్వానీ, 'ఉగ్రవాదంపై ఇక తుదిపోరు' అని వాజ్‌పేయి హుంకరించారు. 'పోటో' వ్యతిరేకులకి ఇది కనువిప్పు' అని అభిభాషించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, 'పోటో'ను వ్యతిరేకించడం అంటే దేశద్రోహ నేరమనే భావాన్ని ధ్వనింపజేసాడు. ఇది 'లష్కర్-ఎ-తోయిబా' 'జైష్-ఏ-మహమ్మద్'ల ఘాతుకమేనని భారత ప్రభుత్వం ప్రకటించింది. 'పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై భారత్ దాడికి దిగాలి' అని బి.జె.పి. తన చిరకాల వాంఛని వెళ్లగక్కింది. 'పాక్‌తో సంబంధాల్ని తెగతెంపులు చేసుకోవాలి' అని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఇక దేశంలోని పత్రికలు, టీవీలు వెళ్లగక్కిన పాక్ వ్యతిరేకత, టెర్రరిజంపై తొక్కిన చిందులు గురించి చెప్పనే అక్కర్లేదు. ఈ హోరులో 'రాజ్య టెర్రరిజం' (స్టేట్ టెర్రరిజం)కి మరింత పదునుపెట్టే నిర్దిష్టమైన చర్యలన్ని చాపకింద నీరులా నిర్నిరోధంగా చకచకా జరిగిపోనారంభించాయి.

డిసెంబర్ 13న భారత్ పార్లమెంటుపై జరిగిన దాడి సెప్టెంబర్ 11 నాటి ప్రపంచ వాణిజ్య సంస్థ, పెంటగన్ భవన సముదాయాలపై జరిగిన దాడి లాంటిదేనని, ఒక రకంగా అంతకంటే తీవ్ర స్వభావంతో కూడినదేనని; కనుక 'టెర్రరిస్టు' పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా తాము చేసే పోరాటానికి పూర్తి మద్దతుగా ప్రపంచ దేశాలన్నీ నిలవాలని, ప్రత్యేకించి అమెరికా నిలవాలని భారత ప్రభుత్వం వాదించనారంభించింది. ఇందులో తనకు అంతగా ప్రయోజనం లేదు గనుక అమెరికా భారత్ వాదనల్ని అలవోకగా తీసిపారేస్తూ చర్చల పల్లవినే మరోసారి వినిపించింది. భారత్ పార్లమెంట్‌పై దాడిని మాత్రం ఖండించింది. 'ఈ దాడిపై సాగే విచారణలో భారత్‌కి సహకరిస్తాం' అని కూడా హామీ పడింది. అమెరికా వైఖరిపై అలకబూనిన భారత ప్రభుత్వం 'సీమాంతర ఉగ్రవాదంపై మేం చేసే పోరాటంలో మాకు ఎవరి సలహాలు, సహాయం అక్కర్లేదు, మాకు మేముగానే చూసుకోగలం' అంటూ అక్కసుతో మాట్లాడింది. మాట్లాడటమే కాదు, పాక్ సరిహద్దుల్లోకి సైన్యాన్ని తరలించింది, పాక్ దళాలపై రెచ్చగొట్టుడు కాల్పులు ప్రారంభించింది. తనకొక నీతి మనకొక నీతి పాటించే అమెరికా వద్దంటే ఆగుతామా అన్నట్టు పాకిస్తాన్‌పై యుద్ధ ఆర్భాటానికి దిగింది. అయినా కూడా అమెరికా తాననుకున్నంతగా ఆందోళన చెందక పోవడంతో చప్పబడిపోయిన భారత ప్రభుత్వం యుద్ధం దిశగా వేసిన తప్పటడుగుని వెనక్కి ఎలా తీసుకోవాలో పాలుపోక 'మేముగా ఏనాడూ యుద్ధాన్ని కోరుకోము' అని గంభీరంగా ప్రకటించుకుని తన పరువుని దక్కించుకోడానికి తంటాలు పడింది.

పాకిస్థాన్ ప్రభుత్వం సరిహద్దు రక్షణకై తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే భారత్ ప్రదర్శించే అనవసర అసహనాన్ని ఎండగడుతూ అంతర్జాతీయంగా దౌత్యరంగంలో తన పైచేయిని చాటుకుంది. మొత్తంపై ప్రపంచం ముందు భారత ప్రభుత్వ వెర్రిమొఖం వెలవెల బోయింది. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా తలపడిపోయినట్లే తాను సైతం పాకిస్తాన్‌పై తలపడిపోవాలని తహతహలాడి పోయింది, తీవ్ర భంగపాటుకి గురైంది. ఇది సహజమే! అమెరికా లాంటి ఆధిపత్య శక్తిని ప్రపంచం ఇంతకుముందు ఎరుగదు. తన తరువాత వరుసక్రమంలో వుండే పన్నెండు ప్రపంచ దేశాల మొత్తం సైనిక వ్యయం ఎంత వుంటుందో అంతకంటే ఎక్కువగానే ఒక్క అమెరికా తన సైనిక రంగం మీద వ్యయపరుస్తోంది. ఇంత వ్యయభారాన్ని మోస్తూ కూడా ప్రపంచ దేశాల్ని కొల్లగొడుతూ, ఆ కొల్లతో తన దేశ ప్రజల్ని సాధ్యమైనంత సంపన్నులుగా అది వుంచగలుగుతోంది. ఆ రకంగా ఆంతరంగిక అసంతృప్తిని అడ్డుకుంటోంది. అలాంటి అమెరికాతో భారత్ తనని సరిపోల్చుకుని ఆలోచించడం వెర్రితనమే! ఏమైతేనేమి, భారత్ తన యుద్ధోత్సాహాన్ని కొంత అదుపు చేసుకోవాల్సి వచ్చింది.

పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదంపై పోరాటం పేరుతో ఆ దేశంపై ఏకాయెకిన భారత్ యుద్ధానికి దిగిపోవడాన్ని అయితే అమెరికా అనుమతించలేదు గాని, 'టెర్రరిజం' పేరుతో భారత పాలకవర్గాలు, ప్రభుత్వం దేశంలో రాజ్యహింసని పదును పెట్టుకోడానికి అమెరికా తన ఆశీర్వాదాల్ని ఆమోదాన్ని అందజేసింది. ఎందుకంటే, ఇది తనకే ఎక్కువ అవసరం. తన బహుళజాతి సంస్థలు, తన ప్రపంచబ్యాంకు ఆదేశాలకి అనుగుణంగా భారత పాలకవర్గాలు వారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుచుకోవాలి. పరమ ప్రజాకంటక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలు కార్యక్రమాలు భారత ప్రజల నెత్తిన రుద్దాలి. అందుకు వ్యతిరేకంగా ప్రజల్లో పెల్లుబికే నిరసనని తిరుగుబాట్లని పాశవికంగా అణచివేయాలి. అందుకే ఫాసిస్టు బి.జె.పి. నాయకత్వంలోని కేంద్ర సంకీర్ణ ప్రభుత్వం ఆఘమేఘాల మీద 'టెర్రరిజం నిరోధక ఆర్డినెన్స్' (పోటో) ని అమలులోకి తెచ్చేసింది. ఇది రేపు తప్పనిసరిగా 'టెర్రరిజం నిరోధక చట్టం' (పోటా) అనే భయంకర నల్లచట్టంగా స్థిరపడుతుంది. భారత ప్రభుత్వం ఈ మేరకు సంతృప్తి పడుతూ తన పాక్ వ్యతిరేక యుద్ధ ఉత్సాహాన్ని అణచుకోవాల్సి వచ్చింది.

ఉపఖండంలో భారత పాలకవర్గాలు అమలు చేయజూస్తున్న విస్తరణవాద వ్యూహం-ప్రపంచాధిపత్యం కోసం అమెరికా అమలు చేస్తున్న వ్యూహం-ఈ రెండింటి మధ్య తగినంత సమన్వయం కుదిరితే తప్ప పాక్‌పై తలపడిపోవడానికి తమ సేవక భారత దళారీ పాలకవర్గాల్ని, వారి ప్రభుత్వాన్ని అమెరికా అనుమతించక పోవచ్చు!

బలంగాను వుండగలదో, ఏ మేరకి ఆఫ్ఘన్ ప్రజల విశ్వాసాన్ని పొందగలదో ఆదిలోనే అర్థమై పోయింది.

ఈ పరిణామ పరంపరతో ఆఫ్ఘనిస్తాన్‌లో తాను సాధించనదేమిటో అర్థం కాని అయోమయ స్థితిలో అమెరికా పడిపోయింది. ప్రపంచం ముందు సర్వ భ్రష్టుత్వం పొందింది. అయినా ఆశించిన మేరకు ప్రయోజనం నెరవేరలేదు. ఇది అమెరికాని కలవరపరిచే నిజం. కాని, దురహంకార సామ్రాజ్యవాద అమెరికా తన నిజ స్థితిని అంగీకరించదు. అంగీకరిస్తే తన దేశ ప్రజల ముందు ముఖం ఎత్తుకోలేదు. ఈ దుస్థితి నుంచి తప్పించుకోడానికే ఆఫ్ఘనిస్తాన్‌లో ఇంకా చేయాల్సింది చాలానే వుందని బుకాయిస్తూ అక్కడ తిష్ట వేసుకు కూర్చుంది. ఆఫ్ఘనిస్తాన్‌లోకి మరిన్ని సైనిక బలగాల్ని ఉరకదోలించింది.

‘‘తాలిబాన్‌లు పతనమైపోయినా, ఆల్‌కాయిదా యోధులు బయటికొచ్చి లొంగిపోయినా కూడా మా సైనిక చర్య కొనసాగుతుంది. భవిష్యత్‌లో ఆఫ్ఘనిస్తాన్‌లో ఏ ఉగ్రవాదీ తలదాచుకో వీలులేని స్థితికి ఆదేశాన్ని తీసుకు రావడం మా లక్ష్యం. ఇందుకు చాలా సంవత్సరాలే పట్టవచ్చు’’ అని డిసెంబర్ చివరి వారంలో, చావు కబురు చల్లగా చెప్పినట్టు అమెరికా రక్షణ మంత్రి పాల్ వుల్ఫోవిడ్జ్ ప్రకటించాడు. ఈ ప్రకటనలో అమెరికా ప్రదర్శించే డాంబికాన్ని పక్కనబెడితే, దాని తిష్టవేసుకుపోయే వ్యూహమే ఇక్కడ ప్రధానంగా చూడాల్సింది.

‘ఒమర్ ఆచూకీ తెలిసిన వారికి కోటి డాలర్ల బహుమతి’ అంటూ అమెరికా విదేశాంగ మంత్రి రమ్స్ ఫీల్డ్ ప్రకటించాడు. అమెరికా దివాళాకోరు స్థితికి అద్దం పట్టే ప్రకటనలే ఇవి. తన అపార ఆర్థిక ప్రాభవం, సైనిక పాటవం, గూఢచౌర్య ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞానం సమస్తం లాడెన్ ఒమర్‌ల తాలిబాన్ ఆల్‌కాయిదాల పోరాట స్ఫూర్తి దీక్షల ముందు ఎందుకూ కొరగానివిగా పదే పదే రుజువైపోతున్న యదార్థాన్ని అమెరికా జీర్ణించుకోలేక పోతోంది.

ఇలాంటి వైఫల్య స్థితిలో, నైరాశ్య స్థితిలో లాడెన్ ఒమర్‌ల వేటకి వారు దాగున్నారని భావించే తోరాబోరా గుహలపై బాంబుల వర్షాన్ని కురిపించడానికి అమెరికా పూనుకుంది. ఈ బాంబుల ప్రేలుళ్ళలో చెలరేగే దుమ్మూ, ధూళీ, రాళ్లూ రప్పలూ అమెరికాని మరోసారి వెక్కిరిస్తాయే తప్ప అంతకు మించి అది ఈసారి కూడా సాధించబోయేది ఏమీ వుండదని భవిష్యత్ నిరూపించి తీరుతుంది. తాలిబాన్ నిప్పుల్లోకి దూర్చి అమెరికా తన చేతులు కాల్చుకుంది. కాలిన గాయాల్ని మాన్పుకోవడమే అది చేయగలిగేదల్లా! ❑

# జాతీయోన్మాదపు యుద్ధ ప్రేలాపనలను ఖండించండి!

భారత ప్రభుత్వం చేపడుతున్న యుద్ధ సన్నాహకాలను, పాకిస్తాన్ వ్యతిరేక జాతీయోన్మాదపు గావుకేకలను సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] తీవ్రంగా ఖండిస్తోంది. భారత ప్రభుత్వ యుద్ధ ప్రేలాపనలను తిరస్కరించాల్సిందిగా పీపుల్స్‌వార్ శాంతికాముకులైన భారత ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ భారత పాకిస్తాన్ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను సడలించేందుకు ప్రయత్నించాల్సిందిగా డిమాండ్ చేస్తోంది.

టెర్రరిజంపై యుద్ధం పేరుతో అమెరికా అగ్రరాజ్య ప్రయోజనాలకు వూడిగం చేయటం ద్వారా దేశ సార్వభౌమత్వాన్నే తాకట్టు పెట్టి అవధుల్లేని దాస్య ప్రవృత్తిని ప్రదర్శించిన ఎన్డీఏ ప్రభుత్వమే దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించే పేరుతో యుద్ధోన్మాదాన్ని రేకెత్తించడం కన్నా మించిన అసంబద్ధమైన విషయం మరొకటి వుండదు. ప్రపంచంలోకెల్లా అత్యంత నిరుపేద దేశాల్లో ఒకటైన ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా, బ్రిటన్‌ల నగ్న దురాక్రమణ దాడికి సైనిక స్థావరాలతో సహా అన్నిరకాల సదుపాయాలను కల్పిస్తామంటూ భారత ప్రభుత్వం బాహాటంగా ప్రకటించింది. ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని కనీసంగా లెక్కచేయకుండా ఆఫ్ఘనిస్తాన్ పట్టణాలు, గ్రామాలపైన అమెరికా సాగించిన క్రూరాతి క్రూరమైన బాంబుదాడిని భారత ప్రభుత్వం నిర్లజ్జతో సమర్థించింది. ఇపుడు మాత్రం పార్లమెంట్‌పై దాడి దేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడిగా అది గావుకేకలు పెడుతోంది. ఏ విధంగా చూసినా సరళీకరణ పేరుతో విచక్షణారహితమైన దోపిడీకి, లూటీకి తలుపులు తెరిచేయడం ద్వారా భారత పాలకవర్గాలు మన దేశ సార్వభౌమత్వాన్ని ఇప్పటికే లెక్కలేనన్నిసార్లు సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేసేశారు.

2002 ఫిబ్రవరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో, ప్రత్యేకించి ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో బి.జె.పి. సంకుచిత ప్రయోజనాలకు అనుగుణంగానే యుద్ధ సన్నాహకాలు జరుగుతున్నాయి. బి.జె.పి. రామజన్మభూమి కేంపెయిన్ ద్వారా అధికారంలోకి వచ్చింది. పతనావస్థకి చేరుకుంటున్న బి.జె.పి. కార్గిల్ పరిణామాల తర్వాతే ఎలాగోలా అధికారాన్ని చేజిక్కించుకో గల్గింది. ఇప్పుడు డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన దాడి బి.జె.పి.కి అనుకోని వరంలా దొరికింది. రాబోయే ఎన్నికల్లో ఉగ్రవాదమే కీలకాంశమని బి.జె.పి. ఇప్పటికే ప్రకటించేసింది. దీనికి పాక్ వ్యతిరేక, ముస్లిం వ్యతిరేకత, జాత్యహంకార ప్రేలాపనలు తోడవుతున్నాయి. భారత పాలకవర్గాలు భారత ప్రజల మౌలిక సమస్యలను ఏనాడో మర్చిపోయారు.

భారత ప్రజలకు సంబంధించినంతవరకు యుద్ధం అనేది ఒక క్రూరమైన పరిహాసమే. గ్రామీణ పట్టణ ప్రాంతాలు రెండింట్లో జీవన ప్రమాణాలు పడిపోవటం ఇప్పటికే తారాస్థాయికి చేరుకుంది. పెరుగుతున్న ధరలు ప్రజల నడ్డి విరిచేస్తున్నాయి. కార్గిల్ యుద్ధం భారత ప్రజలకు చెందిన 6,000 కోట్ల రూ॥లను హరించివేసింది. యుద్ధంలో ఎంతమంది సైనికులు మరణిస్తే అన్ని శవాల పెట్టెలు, పాలకులకు మరిన్ని లాభాలుగా పరిస్థితి తయారయింది.

పాలకవర్గాల కపటత్వాన్ని, అన్యాయమైన యుద్ధ పథకాలను తుదకంటా వ్యతిరేకిస్తానంటూ సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ప్రతిన చేస్తోంది. భారత ప్రభుత్వ యుద్ధ పథకాలకు వ్యతిరేకంగా నిలబడి పోరాటం చేయాల్సిందిగా పీపుల్స్‌వార్ పార్టీ భారతదేశంలోని అన్ని సెక్షన్ల ప్రజలకూ విజ్ఞప్తి చేస్తోంది.

**ప్రకాష్**

**కేంద్రకమిటీ తరపున**

28-12-2001 **సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]**

# టెర్రరిజం-విప్లవం

సెప్టెంబర్ 11 దాడులు, ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా యుద్ధం పరిణామాల వెలుగులో మార్క్సిస్ట్-లెనినిస్ట్ సర్కిల్స్ ముందుకు పలు ప్రశ్నలు తోసుకు వచ్చాయి. (ఇంటర్నెట్‌లో అయితే ప్రపంచ వాణిజ్య కేంద్రంపై విమాన దాడుల సందర్భ ఔచిత్యాన్ని గురించి ట్రాట్స్కీయిస్టుల ఆధ్వర్యంలోని పలు 'వెబ్‌సైట్'లలో పుంఖానుపుంఖాలుగా చర్చ జరుగుతోంది). అమెరికా ప్రభుత్వంతో నేరుగా తలపడిన శక్తుల పట్ల ఆఫ్ఘనిస్తాన్‌లో వీటికి వ్యతిరేకంగా చేయి కలిపిన శక్తుల పట్ల అంచనా, విశ్లేషణ, ఈ శక్తుల పట్ల కమ్యూనిస్టుల వైఖరి గురించి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకుగాను ఈ సందర్భంగా చేపట్టాల్సిన విధానాల అంచనా, విశ్లేషణ చుట్టూ పై ప్రశ్నలు ప్రాథమికంగా తిరుగుతూ వచ్చాయి.

అమెరికా సామ్రాజ్యవాదపు అమానవీయ, పైశాచిక, టెర్రరిస్ట్ స్వభావంకి సంబంధించి ఎవరికీ ఏ సందేహాలూ లేవు. మార్క్సిస్టులు మాత్రమే కాదు, వివిధ రకాల ఉదారవాదులు సైతం ఇలాగే అభిప్రాయ పడ్డారు. అదే విధంగా ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిని మార్క్సిస్టులే కాక, వివిధ రకాల ఉదారవాదులే కాక, అనేక ప్రతీఘాతుక ప్రభుత్వాలు కూడా వ్యతిరేకించాయి. ఈ అమెరికన్ దాడి పట్ల వ్యతిరేకత కూడా చర్చనీయాంశం కాలేదు. చర్చ జరిగిందల్లా అమెరికా పట్ల వ్యతిరేకత స్వభావం పైనే.

సామ్రాజ్యవాదులూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రతీఘాతుక పాలకులూ అమెరికా తలపెట్టిన దాడిని 'టెర్రరిజంపై యుద్ధం'గా వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 11 దాడి కారకులను భూమ్మీది అత్యంత క్రూర శక్తిగా వర్ణించారు. దీంతో పోరాటం ముసుగులో ఈ దుర్మార్గ పూరితమైన నగ్న హత్యాకాండని, దురాక్రమణపూరిత దాడిని అన్నిచోట్లా సమర్థించేస్తున్నారు. తమ సొంత బూర్జువా చట్ట పాలనని సైతం పాలకులు ఈ సందర్భంగా రద్దు చేసుకుంటున్నారు. 'టెర్రరిజంపై పోరాటం' పేరుతో ప్రపంచ వ్యాప్తంగా ఫాసిస్ట్ భీభత్సం మొదలై పోయింది.

ఈ పరిస్థితిలో కార్మికవర్గ వైఖరి ఎలా వుండాలి?

**ఈ సమస్య పట్ల వైఖరి**

టెర్రరిజం, మత ఛాందసవాదం వగైరా ఏ భౌతిక వాస్తవాంశాన్నయినా సరే, ఇతర అంశాలతో దాని అంతర్గత సంబంధాల వెలుగులోనే చూడాలి తప్ప దేనికదే విడివిడిగా కాదు. ప్రపంచంలో చోటు చేసుకుంటూ వస్తున్న పరిణామాలను అప్పుడు మాత్రమే ఎవరైనా వస్తుగత దృక్పథంతో చూడగలరు. మత ఛాందసవాదాన్ని కాని, టెర్రరిజాన్ని కానీ అంతర్జాతీయ రంగంలో తలపడుతున్న వర్గ శక్తుల సంబంధంలోంచే పరిశీలించాలి తప్ప పరిశుద్ధవాద కోణంలో అమూర్తంగా వాటిని చూడకూడదు.

రెండోది. ఏ వాస్తవికాంశాన్నయినా బూర్జువా దృక్పథానికి వ్యతిరేకంగా కార్మికవర్గ దృక్పథంతోనే చూడాలి. బూర్జువా దృక్పథంలో సైతం సామ్రాజ్యవాద ఫాసిస్ట్ దృక్పథమూ వునికిలో వుంటూ వస్తోంది. (బుష్, బ్లెయిర్‌ల ముఠా దీనికి సరైన ప్రతినిధులు) మరో వైపున ఉదారవాద/సర్దుబాటు దృక్పథం కూడా వునికిలో వుంటోంది. (ఇది ప్రపంచీకరణ వ్యతిరేక తరహా ఎన్జీవోల ద్వారా చక్కగా ప్రతిబింబిస్తోంది) కార్మికవర్గ దృక్పథం ఈ రెండింటితోనూ విభేదిస్తూనే, కొంచెం హేతుబద్ధతను ధ్వనిస్తూ, సామ్రాజ్యవాదపు కొన్ని లక్షణాలకు వ్యతిరేకంగా వుంటూండే ఉదారవాద/సర్దుబాటు దృక్పథం వలలో ప్రజలు చిక్కుకోకుండా కాపాడాల్సి వుంటుంది.

మూడు. సమస్యలను పరిష్కరించాలనుకుంటున్నపుడు ఎవరయినా అనేక వైరుధ్యాలలో ప్రధాన వైరుధ్యాన్ని గమనించాలి. ఇతర అన్ని వైరుధ్యాలనూ దీంతో సంబంధంతోటే చూడాలి.

నాలుగు. ముఖ్యంగా పీడితులకు, పీడకులకు మధ్య భేదాన్ని స్పష్టంగా గిరి గీసి చూడాలి. ఉదారవాద పద్ధతిలో లాగా ఈ విభజన రేఖను కార్మికవర్గ వైఖరి ఎన్నడూ పల్చబర్చకూడదు. వివిధ సామ్రాజ్యవాద శక్తులలో వుంటున్న కొన్ని వ్యతిరేకాంశాల పట్ల మన విమర్శనాత్మక వైఖరిపై విభజన రేఖను ఏ రకంగానూ చెరిపి వేయకూడదు.

చివరగా, ఒక నిర్దిష్ట సందర్భంలో ఎత్తుగడలను నిర్ణయించు కుంటున్నపుడు కార్మికవర్గం ప్రధాన శత్రువును ప్రత్యేకించి లక్ష్యంగా చేసుకుంటూ, కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా విశాల ఐక్య సంఘటనను నిర్మించేందుకు ప్రయత్నించాలి. దీంట్లో భాగంగా అన్ని ప్రగతిశీల శక్తులతో, మిత్రులుగా వుండదగిన వారందరితో పొత్తును కుదుర్చుకోవాలి. అట్లే శత్రు శిబిరంలోని వైరుధ్యాలను నేర్పుగా ఉపయోగించు కోవాలి.

ఇప్పుడు గతితార్కిక భౌతికవాద దృక్పథాన్ని ఉపయోగించుకుంటూ దాన్ని ప్రపంచంలో చోటు చేసుకుంటూ వస్తున్న సమస్యల పట్ల అన్వయించడానికి ప్రయత్నిద్దాం. (ఈ సమస్యలు భారత ఉపఖండంతో ప్రత్యక్ష సంబంధం కల్గి వుంటున్నాయి). అయితే ఇలా అన్వయించే ముందు మార్క్సిస్టు దృక్పథంతో 'టెర్రరిజం', 'అరాచకవాదం' అనే పదాలను అర్థం చేసుకోడానికి మొదట ప్రయత్నిద్దాం.

**అరాచకవాదం-టెర్రరిజం**

అరాచక వాదపు మొట్టమొదటి ప్రతినిధిగా పేరుకెక్కిన బకూనిన్, ఉనికిలో వున్న రాజ్య వ్యవస్థను కార్మికవర్గం నిర్మూలించాక కొత్త రాజ్య వ్యవస్థను నిర్మించరాదని, రాజ్యాన్నే రద్దు చేయాల్సి వుందని పేర్కొన్నాడు. వ్యక్తుల హత్యలు, భీభత్స చర్యలతో వ్యవస్థ కుప్పగూలి పోతుందన్నది అనార్కిస్టుల దృక్పథం. నిజమైన హీరోలు వ్యక్తులే తప్ప ప్రజలు కాదని వీరి అభిప్రాయం. వ్యక్తి విముక్తి కాకుండా ప్రజారాసులు విముక్తి కావటం అసాధ్యం అని వీరంటారు. (ఇందుకు భిన్నంగా మార్క్సిస్టులు వ్యక్తి విముక్తికి ప్రజారాసుల విముక్తి ముఖ్య షరతు అని భావిస్తారు). 20వ శతాబ్ది మొదట్లో అరాచకవాద సిండికలిస్టులు (శ్రామిక సంఘ వాదులు-పెట్టుబడిదారీ విధానం అంతమయ్యాక ఉత్పత్తి సాధనాలపై యాజమాన్య హక్కు ప్రభుత్వానికిగాక కార్మికులకు వుండాలనే వాదం) మిలిటెంట్ ట్రేడ్ యూనియన్‌తత్వమే విప్లవంగా పరిణమిస్తుందని నమ్మేవారు. టెర్రరిస్ట్ చర్యలతో కలగలసిన ఆర్థిక పోరాటాలే మిలిటెంట్ ట్రేడ్ యూనియనిజం.

మార్క్సిస్టులు అరాచకవాదపు, టెర్రరిజపు ఈ తత్త్వశాస్త్రాన్ని,

ఆర్గనైజేషన్ పద్ధతులను ఎల్లప్పుడూ ఖండిస్తూ వచ్చారు. అదే సమయంలో మొత్తం యుద్ధ తంత్రంలో భాగంగా బీభత్స చర్యలను (చూ. లెనిన్ 'గెరిల్లా యుద్ధతంత్రం'), తెల్ల బీభత్సాన్ని ఎర్ర బీభత్సంతో ఎదుర్కొనాల్సిన అవసరాన్ని మార్క్సిస్టులు ఎన్నడూ వ్యతిరేకించే వారు కాదు.

ప్రతీఘాతకులే తమను వ్యతిరేకిస్తున్న లేదా తమతో పోరాడాలని చూసిన వారందరిపై పదే పదే తెల్ల బీభత్సాన్ని సాగించారని చరిత్ర చాటి చెప్పింది. ప్రపంచమంతటా అమెరికా బీభత్సానికి చెందిన అసంఖ్యాక ఉదాహరణలు జగమెరిగిన సత్యమే. కమ్యూనిస్టు పార్టీ బలహీనంగా వుండి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి నేతృత్వం వహించలేనపుడు, సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకత బీభత్స చర్యలతో సహా ఏ రకమైన రూపానికైనా దారితీయగలదు. మత ఛాందసవాద తత్వంతో లేక మరో తరహాలో ప్రజలు ఈరోజు సాగిస్తున్న బీభత్స చర్యలనేవి ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం, దాని ఏజెంట్లు సాగిస్తున్న అమానుష అత్యాచారాలకు ప్రతిక్రియలే తప్ప మరేమీ కాదు.

మార్క్సిస్టులు సైద్ధాంతికంగా అరాచకవాదులను వ్యతిరేకించి నప్పటికీ, అరాచక వాదులు శత్రువుతో వీరోచితంగా పోరాడారని ఎవరయినా గమనించగలరు. బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమం భగత్‌సింగ్, కల్పనాదత్ వంటి టెర్రరిస్టుల (జాతీయ విప్లవకారుల), వారి సంస్థల వీరోచిత చర్యలకు సాక్షీభూతమై నిలిచింది. ఈనాటికీ అనేక ప్రపంచీకరణ వ్యతిరేక మిలిటెంట్ గ్రూపులకు ఈ విధమైన అరాచకవాద తత్వమే వుంది. గత సం॥రం బ్రిటన్‌లో, యూరప్‌లోని పలు దేశాల్లో మేడే సందర్భంగా మిలిటెంట్ చర్యలతో సంచలనం రేకెత్తించి, మేడే కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసిన వారిలో అరాచకవాదులూ వున్నారన్నది గుర్తుంచుకోవాలి. వీళ్ళ తత్వశాస్త్రం, ఎత్తుగడలూ సరైనవి కాకపోయినప్పటికీ సామ్రాజ్యవాదంపై పోరులో అరాచకవాదులు ఇప్పటికీ సానుకూల పాత్ర నిర్వహిస్తూనే వున్నారు. మతపరమైన టెర్రరిస్టులు కూడా ఈ కోవలోకే వస్తారు. ప్రధాన శత్రువైన సామ్రాజ్యవాదానికి, ఫాసిస్టులకి గురి పెట్టినంత కాలం మతపర టెర్రరిస్టులు సైతం కొంత సానుకూల పాత్రనే వహిస్తారు.

### పీడకుల హింసతో పీడితుల 'హింస'ను సమానం చేయొద్దు

మనం పీడకుల హింసకు, పీడితుల హింసకు మధ్య ఖచ్చితంగా ఒక విభజనను గీసి చూడాల్సి వుంది. ఈ హింసలు రెండూ బీభత్సాన్ని నెలకొల్పినట్లయితే రెండింటినీ సమానం చేసి ఖండించటం అనేది కేవలం లాంఛనగత తర్కం కిందికే వస్తుంది. ఇది వర్గ సారాంశాన్ని సైతం తోసి రాజంటుంది. పీడితులు తమలాంటి మరొక కమ్యూనిటీని కాక ప్రధాన శత్రువునే లక్ష్యంగా చేసుకున్నంతవరకూ, వారి పద్ధతులు తప్పుగా వున్నప్పటికీ వారి చర్యలు మాత్రం న్యాయమైనవిగానే వుంటాయి.

మధ్య ప్రాచ్యంలోనూ, ఇతర ప్రాంతాలలో అమెరికా విధానం సృష్టించిన భయానక చర్యలే సాధారణంగా ప్రపంచ ప్రజానీకంలోనూ, ప్రత్యేకించి అరబ్ దేశాల ప్రజానీకంలోనూ అమెరికా ప్రభుత్వం పట్ల ద్వేషభావాన్ని ప్రేరేపించాయి. తమ వూపిర్లను నలిపేస్తున్న వారితో పోరాడాలని ప్రజానీకం ఘోషిస్తున్నా, కమ్యూనిస్టు ఉద్యమం వెనుకంజతో, రివిజనిస్టుల అసమర్థతతో ప్రజలను ముందుకు నడిపించేవారే లేకపోయారు. ఇలాంటి స్థితిలో ఇజ్రేలీ/అమెరికా కూటమికి వ్యతిరేకంగా ఇస్లాం మత ఛాందసవాదులు తుపాకులెత్తి ఎదురొడ్డినపుడు ప్రజలు వారి వెన్నంటి నడవడంలో ఆశ్చర్యం లేదు.

ఇప్పుడుకానీ, ఏ నిర్దిష్ట సమయంలోకానీ, ప్రధాన వైరుధ్యాన్ని గుర్తించి దానిపై గురిపెట్టాల్సిన అవసరముంది. సర్వ సాధారణంగా సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులూ, ప్రజలకూ మధ్య వైరుధ్యాన్నే ప్రపంచంలో ప్రధాన వైరుధ్యంగా చెప్పవచ్చు. ఈరోజు సామ్రాజ్యవాదులలో కెల్లా అమెరికా సామ్రాజ్యవాదమే ప్రపంచ ప్రజల అత్యంత ప్రధాన శత్రువుగా వుంది. అందుకే అమెరికా సామ్రాజ్యవాద శక్తికి చెందిన రెండు అతి ప్రధాన దుర్గాలపై దాడి అనేది (పెంటగాన్ నుండి నడుస్తున్న దాని 'రాక్షస' యుద్ధ యంత్రాంగంపై, ప్రపంచ వాణిజ్య సంస్థ భవనాలు రెండూ కీలకంగా వున్న దాని ఆర్థిక శక్తిపై దాడి) అజేయమూ, దుర్భేద్యమూ అనుకుంటున్న అమెరికా సామ్రాజ్యవాదపు ప్రతిష్టని తునాతునకలు చేసింది. ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొన్న అవమానాలు, పీడనలు, దోపిడీ, నగ్న బీభత్సాలకు ప్రతీకార చర్యే సెప్టెంబర్ 11 దాడి.

అమెరికా ఆర్థిక, సైనిక శక్తి కేంద్రాలపై దాడుల తర్వాతే అమెరికా ప్రతిష్ట దాని 'పెద్దన్న' తత్వం ఘోరంగా దెబ్బతిని పోయిందనే వాస్తవాన్ని ఏ ప్రగతిశీల వ్యక్తైనా నొక్కి చెప్పాల్సిన అవసరం వుంది. ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడుల కారణంగా జరిగిన అనేకమంది పౌరుల మరణాలకు ఎవరైనా బాధపడతారు. అయితే పౌరుల మరణాలకు ఈ సందర్భంగా ప్రాధాన్యతనివ్వడం అంటే దాని నేపథ్యాన్ని వాస్తవంగా పక్కకు నెట్టేయడమే అవుతుంది. ఆకాశాన్నంటే డబ్ల్యు.టి.సి. భవంతులపై, దుర్భేద్యమైన పెంటగాన్ రక్షణ కేంద్రంపై దాడి చేసి, ధ్వంసం చేయగలిగిన సామర్థ్యంతో దగద్ధగాయమైన అమెరికా సైనిక ప్రతిష్టపై జరిగిన ఆ సాటి లేని సాహసోపేత దాడులకు సంబంధించిన విషయమే ఈ సందర్భంగా ముందుపీఠికి రావాలి. అమెరికా సైనిక, ఆర్థిక బల సంపన్నతతో పోలిస్తే ఏ రకంగానూ పోటీపడలేని ఇస్లామిక్ శక్తుల చేతుల్లో మహా ఘనత వహించిన అమెరికా సామ్రాజ్యవాదులు ఘోరమైన రాజకీయ, సైనిక పరాభవం పొందారు. ఈ నగ్న సత్యంతో ఒసామా బిన్‌లాడెన్, అతనికి ఆతిథ్యమిచ్చిన తాలిబాన్‌లపై అమెరికా యుద్ధ సన్నాహకాలు, ప్రచార యుద్ధాలూ సన్నిహిత సంబంధం కల్గి వున్నాయి. డబ్ల్యు.టి.సి.పై జరిగిన దాడుల్లో అనేకమంది పౌరులు చనిపోవటం అనే అంశాన్ని బి.జె.పి., సి.పి.యం. వంటి రాజకీయ పార్టీలు, చివరకు కొన్ని ఎం.ఎల్. గ్రూపులు సైతం ఎత్తి చూపాయి. వాస్తవానికి ఈ పార్టీలు, గ్రూపులూ అమెరికా ఘోర పరాభవాన్ని, పరాజయాన్ని పొందిందనే కీలకాంశాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. ఇకనుండి ఎంతమంది అమాయక పౌరులు చనిపోయారన్నది సమస్య కాదు, అధిగమించరాని, అజేయమైన శక్తిగా అమెరికాకున్న కీర్తి ప్రాభవం ఒక్క దెబ్బకు తుడిచిపెట్టుకు పోవడమన్నదే ఈ రోజు అన్నింటికంటే ముఖ్యమైన అంశం.

ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికా మొదలెట్టిన బీభత్సం అన్యాయ పూరితమైనది. దానికి వ్యతిరేకంగా జరిగిన ప్రతిచర్యే న్యాయమైంది.

### ఇస్లామిక్ మత ఛాందసత్వం పట్ల మన వైఖరి

ప్రపంచీకరణ విధానాలతో సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదమూ ప్రపంచ ప్రజలపై భారీ దాడికి పూనుకున్నాయి. ప్రత్యేకించి పీడిత దేశాల ప్రజలు మరింతగా బాధితులయ్యారు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, భావజాల, సైనిక రంగాలన్నింటినీ నయా వలసవాద దాడి క్రూరంగా చుట్టుముడుతోంది. ప్రస్తుత ప్రపంచవ్యాప్త

మాంద్యంతో ఈ దాడి మరింతగా తీవ్రతరమైంది.

ఈ అనంతమైన దోపిడీ, అవమానాలు పీడితులలో పరాయీకరణ భావాన్ని మరింతగా పెంచుతున్నాయి. ఈ పరిస్థితికి నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలిగి వుండే కమ్యూనిజం వెనుకంజ వేయడంతో తమ ఆత్మగౌరవాన్ని, వునికిని కాపాడుకునేందుకుగాను ప్రజలకు తమ జాతి మూలాల్ని, మతాన్ని ఆశ్రయించటం తప్ప వేరే మార్గమంటూ లేకుండా పోయింది. ఎప్పుడైతే ఇస్లామిక్ మత ఛాందసవాదులు తమను పీడిస్తున్న వారిపైకి తుపాకి గురిపెట్టారో అప్పుడే ఇస్లామిక్ ప్రపంచం మొత్తంలో మత, అమెరికా వ్యతిరేక మనోభావాలు బలంగా కలగలసిపోయి ముందుకొచ్చాయి. కమ్యూనిస్టుల వెనుకంజ, రివిజనిస్టుల విద్రోహమే అమెరికా వ్యతిరేక ఇస్లామిక్ మత ఛాందసవాదం, ఇతర జాతి సంబంధ ధోరణులు పీడితులలో బలంగా పాతుకు పోవడానికి కారణమైనాయి. పైగా 1980లలో సోవియట్ యూనియన్‌తో తలపడ్డంలో, కమ్యూనిజానికి వ్యతిరేకంగా కసరత్తు చేయడంలో భాగంగా అమెరికాయే స్వయంగా ఇస్లామిక్ మత ఛాందసవాదాన్ని పెంచి పోషించింది. ఇస్లామిక్ మత ఛాందసవాదపు ప్రస్తుత పెరుగుదలకి ఈ రెండే ప్రధాన కారణాలు.

మత ఛాందసవాదులు తమ పోరాటంలో ప్రధాన శత్రువుపైకి గురిపెట్టినంత కాలం వాళ్ళు అమెరికా సామ్రాజ్యవాదానికి, దాని బడితొత్తులకి వ్యతిరేకంగా పోరాటంలో సానుకూల పాత్ర నిర్వహించగలరు. ఆల్‌ఖైదా, ఇతర ముజాహిదీన్ శక్తులనేకం అమెరికా ప్రభుత్వంపైనా, దాని ఏజెంట్లయిన ఇజ్రేయిల్, భారత ప్రభుత్వాలపైనే ప్రధానంగా గురిపెడుతున్నారు. లాడెన్ యంత్రాంగం అమెరికన్ రాయభార కార్యాలయాలపైనా, న్యూయార్క్, వాషింగ్టన్‌లలోని దాని అధికార కేంద్రాల మీదా గురి పెట్టింది. అరబ్ ముజాహిదీన్‌లు ఇజ్రేలీ యూదు దురహంకారులపైనే ప్రధానంగా గురిపెట్టారు. కాశ్మీరీ గ్రూపులు భారత రాజ్య వ్యవస్థపై ప్రధానంగా గురిపెట్టారు. భారతదేశంలోని ఇస్లామిక్ ఉలేమా 'భారతీయులుగా వుండండి, భారతీయ సరకులనే కొనండి' నినాదంతో అమెరికా, బ్రిటీష్ సరకులను బహిష్కరణకు పిలుపిచ్చాడు. ఇది ఈ అన్ని శక్తులలోని సానుకూలాంశం.

భూస్వామ్య వైఖరి కల్గి వుండి, అటు భూస్వామ్య బూర్జువా ప్రయోజనాలకో (ప్రత్యేకించి వ్యాపార రంగంలో) లేదా, పెటీబూర్జువా ప్రయోజనాలకో కట్టుబడి వుండటమే ఈ శక్తులలో చాలా మందిలో కనిపించే వ్యతిరేకాంశం. ఇది వారి వర్గ స్వభావం. వీరికున్న ఈ భూస్వామ్య స్వభావం వల్లే వీరిని అంటుకోరాదని, తాలిబాన్లలాగా వీళ్ళు ఉనికిలో వున్న వ్యవస్థ స్థానంలో మరింత భయానక వ్యవస్థను ప్రతిష్టించుతారని తరచుగా వాదనలు జరుగుతుంటాయి. **అయితే ఒక నిర్దిష్ట పోరాటపు అంతిమ ఫలితం మీద మాత్రమే ఆధారపడి పొత్తులు కుదుర్చుకోవాలనుకున్నట్లయితే అటువంటపుడు కార్మికవర్గంతో తప్ప మరే ఇతర శక్తితోనూ పొత్తు కుదుర్చుకోవటం సాధ్యపడదు.** ఈరోజు, సామ్రాజ్యవాదంపై పోరాటాన్ని కార్మికవర్గమే విజయవంతంగా నడిపించగలదు. చివరకు అనేక ప్రపంచీకరణ వ్యతిరేక బృందాలకు, వారి అరాచక ధోరణులకు వునికిలో వున్న బూర్జువా/సామ్రాజ్యవాద వ్యవస్థకి మించి వేరే ప్రత్యామ్నాయం అన్నది లేదు. **ఇలాంటి వాదనలు నిజమే అయితే మావో, చైనా కమ్యూనిస్టు పార్టీ సైతం చాంగ్‌కైషేక్ వంటి పచ్చి ఫ్యూడల్, సామ్రాజ్యవాద అనుకూల, ప్రతీఘాతుక శక్తితో ఎన్నటికీ పొత్తు కుదుర్చుకుని వుండకూడదు మరి.**

విషయమేమిటంటే, ఈ శక్తులు అమెరికా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నంత కాలం వీరికి ద్వంద్వ స్వభావముంటుంది. మొదటిది. ఫ్యూడల్ స్వభావముంటుంది కాబట్టి వీరు ప్రగతి నిరోధకులు. రెండోది. ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువుతో పోరాటంలో వీళ్ళకూ పాత్ర వుంది. వీరిలోని మొదటి అంశాన్ని ఎండగడుతూనే రెండో అంశంతో ఎవరైనా పొత్తు గలపవలసి వుంటుంది.

పైగా మతం అనేది ఎన్నడూ పరిశుద్ధంగా వుండలేదు. అది ఆనాటి రాజకీయాలతో ఏదో ఒక విధంగా సంబంధంలో వుంది. కొన్ని సందర్భాలలో అది సానుకూల పాత్ర నిర్వహించింది. మరికొన్ని సందర్భాలలో ప్రతికూల పాత్రను, చివరకు ఫాసిస్ట్ పాత్రను సైతం నిర్వహిస్తూ వచ్చింది. ఇదొక భౌతిక వాస్తవం. మార్క్సిస్ట్ దృక్పథంలోంచి చూసినా మతం 'ప్రజలకు మత్తుమందే' తప్ప మరొకటి కాదు. అందుచేత హిందూమతంలోని వివిధ సంఘ సంస్కరణ ఉద్యమాలతోకాని (చార్వాకులు, లోకాయతులు, బౌద్ధమతం, భక్తి ఉద్యమం, కబీర్, గురునానక్ మున్నగువారు), పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావ కాలంలో కేథలిక్ మతంకి వ్యతిరేకంగా ప్రొటెస్టెంటిజం వునికిలోకి వచ్చినపుడుకానీ ఆయా కాలాల్లోని ప్రగతిశీల ధోరణులతో మతం ముడిపడి వుంది. ఈరోజు బి.జె.పి.కి చెందిన హిందూ మతోన్మాదం, అబార్షన్‌లు నిర్వహించే క్లినిక్ డాక్టర్లను చంపేసే ఫాసిస్టులకు చెందిన కేథలిక్ మతోన్మాదం, ఇజ్రాయిల్ పాలకుల యూదు మతోన్మాదం వంటివి ఇస్లామిక్ తరహా మత ఛాందసవాదానికే మాత్రం తీసిపోయేవి కావు. పైగా ఇస్లామిక్ మతఛాందసత్వం ధోరణి చాలావరకు అమెరికా వ్యతిరేకత వైపు మళ్ళగా, మిగిలిన పై మతాలన్నీ అత్యంత ఘోరమైన తరహా సామ్రాజ్యవాద, ఫాసిస్టు పాలకులతో బలంగా పెనవేసుకుని వున్నాయి. మతఛాందసవాదపు విభిన్న రీతులలో వ్యత్యాసం గమనించాలి తప్ప వాటిని పేటికవే విడివిడిగాను, అస్పష్టంగాను చూడకూడదు. ప్రత్యేకించి ఆ కాలంలోని రాజ్యంతో, వివిధ రాజకీయ ధోరణులతో సంబంధంలో మత ఛాందసత్వాన్ని చూడాలి దాన్ని ఎప్పుడూ ఒక ధోరణితోనే సమానం చేసి చూడకూడదు. ఈరోజు కొన్ని మతఛాందసత్వాలు ఫాసిస్టుల, సామ్రాజ్యవాదుల సాధనాలుగా వుండగా, మరికొన్ని వాటికి వ్యతిరేకంగా వుంటున్నాయి.

### ప్రధాన శత్రువుపై గురిపెట్టాలి

ఏ నిర్దిష్ట కాలంలోనైనా సరే ప్రధాన శత్రువుకేసి గురిపెట్టాలన్నదే ఇక్కడి విషయం. **ఒక నిర్దిష్ట కాలంలో ప్రధాన శత్రువును స్పష్టంగా గుర్తించకపోతే, దానికి వ్యతిరేకంగా వర్గ ప్రాతిపదికన పొత్తును స్పష్టంగా ఏర్పర్చుకోలేకపోతే అవి శత్రువును అన్నివైపుల నుండి చావగొట్టే ఎత్తుగడలు కావనే అర్థం.** ఇలాంటి అస్పష్ట ఎత్తుగడలు వామపక్ష ఒంటెత్తు వాదం నుంచి తోకపట్టుకుని పోయే వాదం వరకు వూగిసలాడుతుంటాయి.

ఉదా॥కి సోవియట్ సామ్రాజ్యవాదుల దురాక్రమణ దాడి కాలంలో ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రధాన వైరుధ్యం ఆఫ్ఘన్ ప్రజలకూ, దురాక్రమణదారులు, వారి దేశీయ తొత్తులకు మధ్య వుండేది. ఆ సమయంలో దురాక్రమణదారులకు వ్యతిరేకంగా పోరాడే శక్తులు (వీరిలో చాలామంది అమెరికా మద్దతుగల యుద్ధ ప్రభువుల నాయకత్వంలో వుండేవారు) దేశభక్తియుత ఫ్రంట్‌గా ఐక్యం కావలసి వచ్చింది. దేశంలోని కమ్యూనిస్టు పార్టీ బలం ఫ్రంట్ స్వభావాన్ని నిర్దేశించేది. సోవియట్ దురాక్రమణదారులు

దేశం నుంచి తరిమివేయబడగానే ప్రధాన లక్ష్యం మారిపోయి ఉత్తరాది కూటమికి, తాలిబాన్‌కి చెందిన భూస్వామ్య, అర్ధభూస్వామ్య శక్తులపైకి కేంద్రీకరించటం జరిగింది. ఈరోజు తిరిగి విదేశీ (అమెరికా) దురాక్రమణతో దురాక్రమణదారులు; వారి స్థానిక తొత్తుల మీద కేంద్రీకరిస్తూ ప్రధాన లక్ష్యం మారిపోయింది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దురాక్రమణతో పోరాడుతున్న శక్తులన్నీ అమెరికా సామ్రాజ్యవాదంతో ప్రపంచవ్యాప్త పోరాటంతో అనుకూల పాత్రను నెరవేరుస్తున్నాయి. ఈరోజు ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా బలగాల ఓటమి అనేది ఆఫ్ఘన్ జాతి, ప్రజల అభివృద్ధికి ముఖ్యమైన అంశం మాత్రమే కాదు, అది ప్రపంచంలోని ఇతర దేశాలలో అమెరికా దురాక్రమణ పథకాలను అడ్డుకునే అత్యంత ముఖ్య అంశంగా కూడా వుంటుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో విజయంతో అమెరికా ప్రపంచ వ్యాప్తంగా ఇరాక్, సోమాలియా, సూడాన్, మరో 50, 60 దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి సంబంధించిన పథకాలను బాహాటంగానే ప్రకటిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా పరాజయం పొంది వుంటే అది ప్రపంచంలోని ఇతర దేశాలలో అమెరికా మిలటరీ బీభత్స యంత్రాంగపు ముందడుగును ఓ మేరకైనా అడ్డుకునేది. అమెరికా సామ్రాజ్యవాదంపై బహుముఖ పోరాటంలో ఆఫ్ఘన్ ప్రతిఘటనకు (అది ఎంత ఫ్యూడల్ స్వభావంతో వుంటున్నప్పటికీ) వున్న ప్రాధాన్యతను తోసిపుచ్చడం హ్రస్వదృష్టి అవుతుంది. అమెరికా, దాని తొత్తులు తన్ని తరిమివేయబడినట్లయితే ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రధాన లక్ష్యం తిరిగి మరోసారి భూస్వామ్య, అర్ధ భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా వుంటుంది.

కొనసాగుతున్న ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమంపై సెప్టెంబర్ 11 దాడులు ప్రతికూల ప్రభావం కల్గించాయని తరచుగా వాదిస్తున్నారు. అయితే వాస్తవాలు ఏం సూచిస్తున్నాయంటే ఈ ఉద్యమం దృష్టి కొంత మేరకు యుద్ధ వ్యతిరేక ఉద్యమంగా మారినప్పటికీ అది కూడా బలాన్ని పుంజుకుంది. ముస్లిం దేశాలలోనే కాక యావత్ ప్రపంచంలోనూ భారీస్థాయిలో జరుగుతున్న యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు ఈ ఉద్యమం పెరుగుదలకు సంకేతాలే. ఈ నిరసన ప్రదర్శనలు యూరప్ వ్యాప్తంగానూ, అమెరికా పెద్ద పట్టణాల నుంచి చిన్న పట్టణాల వరకు వ్యాపించి దేశవ్యాప్త స్వభావం తీసుకున్నాయి. ఇంతేకాదు అమెరికాలో రాజకీయాలతో సంబంధం లేని విశాల ప్రజారాసులు సైతం ఈ దాడుల తర్వాత అమెరికాను ప్రపంచంలో చాలామంది ప్రజలు ఎందుకు ద్వేషిస్తున్నారో తెలుసుకోగోరుతూ రాజకీయాల్లోకి, చర్చల్లోకి అడుగుపెట్టారని వార్తలొచ్చాయి. మాంద్యం కారణంగా ప్రజల జీవన పరిస్థితులు దారుణంగా పడిపోయిన కారణంగానే కావొచ్చు, ప్రజల్లో జాగరూకత పెరుగుతోంది.

కాబట్టి ఈరోజు టెర్రరిజంతో పోరాటం పేరుతో అమెరికా ప్రపంచ వ్యాప్తంగా దురాక్రమణకు దిగుతుండగా సామ్రాజ్యవాద వ్యతిరేక విస్తృత ఐక్య సంఘటనలో భాగంగా, అమెరికా దాడికి వ్యతిరేకంగా అన్ని శక్తులనూ ఐక్యం చేయాల్సిన అవసరం వుంది. ఇలా ఐక్య పరుస్తున్నపుడు కమ్యూనిస్టులు ఇతర వర్గ శక్తుల పరిమితులను తెలియజేస్తూ మతఛాందసవాదుల, అరాచక వాదుల, పర్యావరణవాదుల, తదితరుల ప్రభావంలోని ప్రజలను ఒక స్థిరమైన సామ్రాజ్యవాద వ్యతిరేక కార్మికవర్గ దృక్పథానికి మళ్ళించేందుకు తీవ్రంగా ప్రయత్నించాలి. ❑

(27వ పేజీ తరువాయి...)

సైన్యంలోనూ పోలీసుల్లోనూ వుండేదంతా పేదవాళ్ళే. అయితే ప్రభుత్వం ఇంతకాలం పేదవాళ్ళ చేత్తోనే పేదవాళ్ళ కళ్ళు పొడుస్తూంది. పేదవాళ్ళపైకి పేదవాళ్ళ చేతనే తుపాకులు కాల్పిస్తున్నది. ఇలా కాల్చే పోలీసులు ఏడుస్తూనే తుపాకులు కాలుస్తున్నారని మనకు తెలుసు. చివరకు ఇదేమవుతుంది. భస్మాసురుని కథలాగ తయారవుతుందంటే ఆశ్చర్యం లేదు. ప్రపంచంలోని పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు అందరూ సైన్యం మీదే ఆధారపడుతున్నారు. పేదవాళ్ళతోనే ఆ సైన్యాన్ని తయారు చేసుకుంటున్నారు. ఆ సైన్యం చేతుల్లోనే వాళ్ళు చచ్చేరోజు దగ్గరకొచ్చింది. పదేళ్ళ క్రితం ఈ మాటలు మీరు నమ్మలేక పోవచ్చు. కానీ ఈరోజు పోలీసులు ఎదురు తిరిగారంటే, సైన్యాన్ని పిలిస్తే వాళ్ళు కాల్చడానికి సిద్ధపడలేదన్న రహస్యం మనకు తెలిస్తే ఈ పేదవాళ్ళ సైన్యం ఎప్పటికైనా ప్రభుత్వానికి వ్యతిరేకమే అని సులువుగానే బోధపడుతుంది. మన విప్లవం గెలిచే రోజు వచ్చే సరికి ఈరోజు పోలీసుల చేతుల్లో వున్న తుపాకులలో సగం మన పక్షం చేరితే ఆశ్చర్యం ఏమీ లేదు. ఈ ప్రభుత్వం మీద కసి దీర్చుకోవడానికి వారికి అదే దారి. వారిని ఆలోచించుకోమని కోరుతున్నా. ఏదో మేం తిట్టామని కోపం తెచ్చుకోవలసిన పని లేదు. పోలీసు జులుం నశించాలని మేమంటే మొరార్జీ దేశాయి జులుం నశించాలనే అర్థం. ఎందుకంటే మీ అంతట మీరు జులుం చేయడం లేదు. ఆయన తరపునే చేస్తున్నారు. పోలీసుల అత్యాచారాలు నశించాలంటే దోపిడీ ప్రభుత్వాల అత్యాచారాలు నశించాలనే అర్థం. దోపిడీ ప్రభుత్వాల అత్యాచారాలు ఒకనాడు మీకు అర్థం కాకపోయినా ఈనాడు తప్పక అర్థమవుతున్నాయి. ఇది వరకు ఒడ్డున కూర్చున్నపుడు మీరేమన్నారు? కార్లెందుకు తగలబెట్టాలి? విధ్వంసకాండ ఎందుకన్నారు? మీరు కంట్రోలు రూం ఎందుకు తగలబెట్టారో ఆలోచించండి. దాన్ని విధ్వంసం చేయాల్సిన పరిస్థితి మీకు ఎందుకు వచ్చిందో సరిగ్గా అందుకే విద్యార్థులు కూడ అనేక చర్యలు చేయాల్సి వస్తుంది. ఇవాళ మీకు అది తప్పలేదు.

కామ్రేడ్స్!

ఇది విప్లవాల యుగం. విప్లవాలు జయించే యుగం. ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదం నాశనమయ్యే యుగం. ఈ యుగంలో మనకు ప్రధానమైన ప్రమాదం రివిజనిస్టు మాయోపాయమే. వీళ్ళు భూస్వాముల, దోపిడీదారుల, దోపిడీదారుల ఏజంట్లే అనే యదార్థం నమ్మండి. వాళ్ళ మాయోపాయం నుండి బయటపడండి. పోరాటానికి సిద్ధం కండి. అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు, ప్రభుత్వోద్యోగులు, రైతులు, కార్మికులు విప్లవ సిద్ధాంతం గైడెన్సులో కార్మికవర్గ నాయకత్వం క్రింద విప్లవానికి సంసిద్ధం కండి. విజయం మనదే.

**విప్లవం వర్ధిల్లాలి!**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) జిందాబాద్!**
**సోవియట్ సామ్రాజ్యవాదం నశించాలి!**
**అన్ని రకాల రివిజనిజం నశించాలి!**
**జనతా ప్రజాతంత్ర విప్లవం వర్ధిల్లాలి!**
**వ్యవసాయ విప్లవం వర్ధిల్లాలి!**
**దున్నేవారికే భూమి కావాలి।**
**ఆర్.వై.యల్. జిందాబాద్!**
**ఆర్.యస్.యు. జిందాబాద్!**
**విప్లవం వర్ధిల్లాలి!** ❑

# పి.జి.ఏ. క్యాంపెయిన్ విజయాలను, వేసవి నిర్బంధ క్యాంపెయిన్‌లో పొందిన నష్టాలను గతితార్కికంగా సమతుల్యం చేద్దాం!!

2001 జనవరి నుండి ఏప్రిల్ వరకు ఆంధ్ర రాష్ట్రకమిటీ ప్రకటించిన పి.జి.ఏ. క్యాంపెయిన్ అనుకున్న మేరకు విజయవంతం కాకపోయి నప్పటికీ శత్రువు దూకుడుకు అడ్డుకట్ట లేయడంలో చక్కటి పాత్ర నిర్వహించింది. పి.జి.ఏ. క్యాంపెయిన్ మొత్తంగా శత్రు క్యాంపెయిన్‌ని ఎంతగా భీతిల్ల జేసిందంటే ఈ సంవత్సరం తొలి నాలుగు నెలలూ మన ఉద్యమ ప్రాంతాల్లో శత్రువు తన కదలికలను పూర్తిగా నిలిపివేశాడు. మార్చి నెల నుండి రాష్ట్రమంతటా పి.జి.ఏ. క్యాంపెయిన్‌లో భాగంగా పలు చోట్ల పోలీస్ క్యాంపులపై, పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి పి.జి.ఏ. గెరిల్లాలు ఆయుధాలు చేజిక్కించుకున్నప్పటికీ పి.జి.ఏ. గెరిల్లాల పైకి దూకుడుగా దాడికి రాలేక పోయాడు. రాయలసీమలో ప్రప్రథమంగా పోలీస్ క్యాంపులపై, పోలీస్ పికెట్‌లపై దాడికి దిగడం ద్వారా ప్రజా గెరిల్లాలు ప్రజలపై మంచి ప్రభావం వేశారు. అయితే రాష్ట్ర వ్యాప్త స్వభావంతో సాగిన పి.జి.ఏ. దాడుల పరంపరకు శత్రు స్పందన పరిమితంగానే వుండింది. 'శత్రువు పురోగమించినపుడు క్షేమంగా వెనుదిరగటం, శత్రువు తిరోగమించినపుడు గెరిల్లా దాడులతో చికాకు పెట్టడం' అనే గెరిల్లా యుద్ధతంత్రపు, ఎత్తుగడలలో మొదటి అంశాన్ని శత్రువు తనకు అన్వయించుకునేలా ఈసారి పి.జి.ఏ. క్యాంపెయిన్ సాగింది.

ప్రతి వేసవి కాలపు నిర్బంధ క్యాంపెయిన్‌ని అత్యంత దూకుడుగా సాగిస్తూ, అనుకూల పరిస్థితులలో గెరిల్లాలను వెంటాడి, సాధ్యపడితే పెను నష్టాలకు గురిచేసే వ్యూహాన్ని ప్రతి సం॥రం అవలంభిస్తూ వచ్చిన శత్రువు ఈసారి పి.జి.ఏ. క్యాంపెయిన్ సందర్భంగా తొలిదశలో పూర్తిగా ఆత్మరక్షణా ఎత్తుగడలకు దిగి ఖచ్చితంగా పాటించాడు. రాష్ట్ర వ్యాప్తంగా పి.జి.ఏ. దాడుల పరంపర సాగుతున్న నేపథ్యంలో ఈ ఆత్మరక్షణా ఎత్తుగడల్లో భాగంగానే శత్రువు చిన్న చితకా పోలీస్ స్టేషన్లను ఎత్తేసి పట్టణ కేంద్రాలకు తరలించాడు. ప్రభుత్వం, పోలీస్ బలగాల ప్రతిష్టకే భంగకరమైన ఈ చర్యను గురించి మీడియా పదే పదే ప్రచారం చేస్తున్నప్పటికీ డి.జి.పి. దొర తదితర పోలీస్ ఉన్నతాధికారులు తమ చర్యలను సమర్థించుకున్నారు. పైగా పీపుల్స్‌వార్‌పై పోరాటంలో తామెన్నుకున్న వ్యూహంలో భాగంగానే స్టేషన్ల ఎత్తివేత జరుగుతోందని పదే పదే ప్రకటించుకున్నారు. ఈ రకంగా పోలీస్ దాడులను గెరిల్లాలు నిలవరించి నిలబడటం అనే సర్వసాధారణంగా జరుగుతూ వస్తున్న చరిత్ర ఈసారి రాష్ట్రంలో అక్షరాలా తిరగబడింది. దెబ్బకాచుకోవటం ఈసారి శత్రువు వంతయింది. పి.జి.ఏ. నాలుగు నెలల క్యాంపెయిన్‌లో మొత్తంగా చూస్తే అనుకున్న విధంగా ఫలితాలు రాకపోయినప్పటికీ శత్రువును నిలువరించడంలో మాత్రం ఈ క్యాంపెయిన్ బాగా విజయవంతమైంది.

ఈసారి పి.జి.ఏ. క్యాంపెయిన్ సందర్భంగా శత్రువు అసాధారణ చర్యలు చేపట్టాడు. రకరకాల రూపాల్లో ఇది జరిగింది. పోలీస్ స్టేషన్లు ఎత్తేయటం, దాడులు జరగనున్నాయని ముందే గ్రహించి గ్రామీణ, మండల స్థాయి పోలీస్ స్టేషన్ల నుంచి ఆయుధాలన్నింటినీ తరలించేయటం, ఉద్యమ ప్రాంత గ్రామాల్లోకి, బస్తీల్లోకి పోలీసులు ఒకరొకరుగా పోరాదని ఆంక్షలు విధించటం, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాగెరిల్లాలు ఎన్నిచోట్ల ఎరవేసినప్పటికీ, ఎంతగా కవ్వించినప్పటికీ శత్రువు ఏ మాత్రం స్పందించక పోవటం ఇవన్నీ ఏ రకంగా చూసినా అసాధారణ చర్యలే. జనవరి-ఏప్రిల్ మాసాల్లో నిశ్చయంగా చొరవ ప్రజా గెరిల్లాలది కాగా దెబ్బకాచుకోవడం శత్రు బలగాల వంతయింది. ఈ నాలుగు మాసాలలో గెరిల్లాలు పోలీసులకు 'ఎర' వేసినప్పటికీ, కల్పించినప్పటికీ వాటికి స్పందించి అడుగు ముందుకు వేయరాదని పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేయటమేగాక నిక్కచ్చిగా వాటిని అమలు చేసింది. పి.జి.ఏ. క్యాంపెయిన్ నేపథ్యంలో అనివార్యంగా రిట్రీట్ (వెనుకడుగు) ఎత్తుగడలను అవలంభించటం పోలీసుల వంతయింది. పోలీస్ అధికారగణం ఈ విషయాన్ని పత్రికలలో స్పష్టాతి స్పష్టంగా తేల్చి చెప్పింది. ఈ క్రమాన్నంతటినీ పి.జి.ఏ. ఎత్తుగడల దాడులు సాధించిన ఘన విజయంగానే పేర్కొనాలి.

పి.జి.ఏ. క్యాంపెయిన్ ఫలితంగా ఇన్ని అనుకూలాంశాలను మనం సాధించుకున్నప్పటికీ క్యాంపెయిన్ అనంతరం వాటికి వ్యతిరేకంగా ప్రతికూలాంశాలను కూడా మనం చవిచూడాల్సి వచ్చింది. గెలుపు ఓటమి రెండూ యుద్ధ లక్షణాలే అయినప్పటికీ, శత్రువు అనివార్యంగా చేపట్టిన వెనుకంజ (రిట్రీటింగ్) విధానాలను మనం సరిగా అర్థం చేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకుని వుంటే పి.జి.ఏ. క్యాంపెయిన్ తర్వాత వేసవి క్యాంపెయిన్ చివర్లో మనకు వరుస దెబ్బలు, నష్టాలు తగిలేవి కావు. ఎత్తుగడల రీత్యా పి.జి.ఏ. క్యాంపెయిన్ కాలంలో తాము రిట్రీటింగ్ పద్ధతిని ఎంచుకుంటున్నామని శత్రువు చేసిన ప్రకటనని మనం మరింత నిశితంగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టి వుంటే వేసవి క్యాంపెయిన్ చివర్లో మనకు వరుస నష్టాలు జరిగేవి కావు. మనం పి.జి.ఏ. క్యాంపెయిన్‌లో వున్నామని గ్రహించినందువల్లే శత్రువు ఎప్పటి లాగా వేసవి క్యాంపెయిన్ తొలి దశలో దూకుడుగా మన పైకి రాకుండా అదనుకోసం కూచున్నాడు. ఈసారి శత్రువు అవలంభించిన ఆత్మరక్షణా ఎత్తుగడలను మనం మరింతగా గ్రహించి వుండాల్సింది. శత్రువు తాత్కాలికంగా వెనుకంజ వేసినప్పటికీ మన కదలికలనూ, చర్యలనూ, పథకాలనూ ఎంతగా అధ్యయనం చేశాడంటే, ఎంత నిశితంగా మన బలహీనతలను పరిశీలించాడంటే నాలుగు నెలల కాలంలో మనం సాధించిన విజయాలు తదుపరి రెండు నెలల్లో (మే-జూన్) పెను నష్టాలుగా పరిణమించాయి.

ఏ.ఓ.బి. ప్రాంతంలో మార్చి నెలలోనే శత్రువు మన మిలీషియా సభ్యులను (కా॥ బంగారాజు, సత్తిబాబు) కర్నాటక నుండి పోరాట ప్రాంత అధ్యయనం కోసం వచ్చిన కా॥ రాజేశ్వరి (అనిత)ని పొట్టన బెట్టుకున్నాడు. మే నెలలో గుంటూరు జిల్లాలో బెల్లంకొండ దళంపై కాల్పులు జరిపి నలుగురు కామ్రేడ్స్‌ని చంపేశారు. బెల్లంకొండ దళంపై వేసవి క్యాంపెయిన్‌లో భాగంగా శత్రువు తలపెట్టిన తొలి దాడితోనే మనం మరింతగా అప్రమత్తతను పాటించాల్సి వుండింది. పి.జి.ఏ. క్యాంపెయిన్ ఫలితాలు ఓ మేరకు అందించిన ఉత్సాహం, వేసవి క్యాంపెయిన్ ముగుస్తోందని భావించిన మన ఏమరిపాటు స్థితి అనేవి మే-జూన్ రెండు నెలల్లోనే ఆంధ్ర, ఉత్తర తెలంగాణాలలో ఐదు దళాలపై శత్రు దాడికి దారి తీసి చివరి దశలో పెద్ద నష్టాల్ని కల్పించాయి. మే నెలలో గుంటూరు జిల్లాలో బెల్లంకొండ దళంపై, మహబూబ్‌నగర్ జిల్లాలో పానగల్ దళంపై, జూన్

నెలలో నల్గొండ జిల్లాలో కనగల్, రాచకొండ దళాలపై వెంట వెంటనే శత్రువు జరిపిన దాడుల్లో మనం భారీ నష్టాలనే చవిచూశాం. ఈ నాలుగు దాడుల్లో దక్షిణ తెలంగాణా రీజినల్ కమిటీ సభ్యుడు, నల్గొండ జిల్లా కమిటీ కార్యదర్శి, విప్లవోద్యమ సాంస్కృతిక నేత అయిన కా॥ దివాకర్‌తో పాటు కనగల్ దళం ఏరియా కమిటీ కార్యదర్శి కా॥ భాస్కర్‌ని, పానగల్ దళం కమాండర్ కా॥ రంగన్న, కనగల్ ఎల్.జి.ఎస్. కమాండర్ కా॥ కవిత, హైద్రాబాద్ సిటీ సి.ఓ. కా॥ త్రిమూర్తులు వంటి సీనియర్ కామ్రేడ్స్‌ని, అనుభవజ్ఞులను మనం కోల్పోయాం. దళ సభ్యుల్లో కామ్రేడ్స్ యాదగిరి, మహేష్, గురువయ్య, మరో మిలిటెంట్ (బెల్లంకొండ దళం) లను, కామ్రేడ్స్ సెమీపాషా, నిర్మల, కిరణ్, రవి (పానగల్ దళం)లను, కామ్రేడ్స్ శ్యాం, పద్మ (కనగల్ దళం)లను, కా॥ లత, తదితర కామ్రేడ్స్‌ని (రాచకొండ దళం) వరుసగా కోల్పోయాం. ప్రకాశం జిల్లా ఎర్రగొండ పాలెం పోలీస్ స్టేషన్‌పై జరిపిన రెయిడ్‌లో కా॥ సంతోష్ (నల్గొండ జిల్లా)ని కోల్పోయాం. ఈ సంఘటనల్లో అన్నెం పున్నెం ఎరుగని ఆదివాసీ మహిళ, పసిపాలను కూడా దారుణంగా శత్రువు చంపేసి 'క్రాస్ ఫైరింగ్' మరణాలుగా ప్రకటించాడు. ఇక వరంగల్ చంద్రగిరి కొండల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 12 మంది కామ్రేడ్స్‌ని ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ కోల్పోయింది.

మన దళాలకు దళాలనీ తుడిచి పెట్టేసే రీతిలో శత్రువు సాగించిన ఈ ఆకస్మిక దాడులలో మనం పొందిన నష్టాలు చిన్నవేం కావు. ఏ రకంగా చూసినా ఇవి భారీ నష్టాలే. ఈ నష్టాలకు కారణాలను ఎన్నింటినయినా చెప్పుకోవచ్చు. కాని ఎత్తుగడల రీత్యా శత్రువును తక్కువగా అంచనా వేస్తున్న క్రమంలో మనం లిప్తకాలం ఏమరుపాటుకు గురవుతున్న స్థితే మన నష్టాలకు కారణం. శత్రువు మన ప్లాన్‌లను ఎంతగా అధ్యయనం చేయగలుగుతున్నాడంటే, ఉద్యమ నిర్మాణంలో మనం తీసుకు వస్తున్న అతి చిన్న మార్పులపై సైతం వాడు తగిన అంచనాలకు వస్తూ ఎప్పటికప్పుడు శరవేగంగా నూతన పద్ధతులకు దిగిపోతున్నాడు. యాక్షన్ టీంలను మనం ఏర్పర్చిన వైనం తెలిసిన వెంటనే వాటి నిర్మాణాన్ని పరిశీలించి రాజకీయ నాయకుల భద్రతకు, మనపై నిఘాకు సంబంధించి వాడెంచుకున్న నూతన విధానాలే ఇందుకు తిరుగులేని సాక్ష్యం. వేసవి క్యాంపెయిన్‌లో ఈసారి మనం పెద్దగా నష్టపోలేదని భావిస్తున్న క్షణాల్లోనే మనకు తగిలిన ఈ పెనుదెబ్బలు పిడుగుపాటులా మీదపడ్డాయి. మన ఈ నష్టాలకు శత్రువు ఘనతకన్నా, వాడి విధానాలను వెంటవెంటనే అర్థం చేసుకోవడంలో మన వెనుకబాటుతనం, వైఫల్యం అనేవే ప్రధాన కారణం. మందుపాతర పేల్చిన భారీ సంఘటన వెనువెంటనే కనగల్ దళం ప్రయాణ కదలికలను శత్రువు వూహించి మెరుపు మెరిసేంతలో దొంగ దెబ్బ తీశాడు. ఇక ఒకే ఏరియాలో దీర్ఘకాలం మకాం పెట్టడం గెరిల్లాలకు ఆత్మహత్యా సదృశ్యం అని తెలిసి కూడా రాచకొండ ఏరియాలో పనుల ఒత్తిడితో దళం ఒకే ఏరియాలో రోజుల తరబడి వుండిపోవడం, వివిధ ప్రాంతాల నుండి ప్రజలను పిలిపించుకోవడం జిల్లా కార్యదర్శిని, ముఖ్యమైన కామ్రేడ్స్‌ని కోల్పోయేంత భారీ నష్టాల్లోకి మనల్ని నెట్టింది. నాయకత్వం పనులకు ఇస్తున్న ప్రాధాన్యతల పరంగా జరుగుతున్న లోపాలు పెను నష్టాలకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా మైదాన ప్రాంతాల్లో మనం ఇంకా పద్ధతులను చాలా మార్చుకోవాల్సి వుంది.

అందుకే ఈసారి పి.జి.ఏ. క్యాంపెయిన్‌లో మనం సాధించిన విజయాల నుండి, మొత్తంగా శత్రువు వేసవి క్యాంపెయిన్‌లో మనం పొందిన నష్టాల నుండి మనం గుణపాఠాలు తీసుకోవాలి. శత్రువును ఎత్తుగడల పరంగా నిజమైన పులిలాగే చూడాలి తప్ప, కాగితం పులిలాగా భావించి ఏమరుపాటున వుండరాదన్నది అత్యంత ప్రధానమైన గుణపాఠం. విషయాలు స్థానాలు మార్చుకుంటాయని, విజయాలు ఊహించనంత వేగంగా అపజయాలుగా మారుతాయని మావో పదే పదే చెప్పిన యుద్ధ సూత్రం నుండి మనం ఏమరపాటుకి గురికారాదు. ఈ వేసవి క్యాంపెయిన్‌లో శత్రుదాడిలో నేలకొరిగిన అమరులకు, ప్రియతములకు నిజమైన నివాళిని ఈ రకంగానే మనం అందించాలి. శత్రువు విధానాలను నిత్యం పరిశీలించటం, వాటికనుగుణంగా మన పద్ధతులను మార్చుకుంటూ వాడి కుట్రలను ఛేదించటం, పైచేయి సాధించటం కోసం కృషి సాగించడం ద్వారానే అమరులందరికీ నిజమైన నివాళులు అర్పించగలం. ఈ సందర్భంగానే వేసవి క్యాంపెయిన్‌లో అమరులైన వారి జీవిత వివరాలను అందిన మేరకు ప్రక్క పేజీ నుండి ప్రచురిస్తున్నాం. ❑

## విప్లవ జోహార్ల మధ్య ధర్మన్న అంత్యక్రియలు

**విజయవాడ, జూన్ 21 : నల్గొండ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లో అశువులు బాసిన ఆ జిల్లా పీపుల్స్‌వార్ కార్యదర్శి దివాకర్ అలియాస్ ధర్మన్న (38) కు గురువారం మధ్యాహ్నం ఇక్కడి స్వర్గపురిలో విప్లవ జోహార్ల మధ్య అంత్యక్రియలు జరిగాయి. అశ్రునయనాలతో 15 ఏళ్ల ఏకైక కుమారుడు చితికి నిప్పంటించాడు. అంతకుముందు సిద్ధార్థనగర్ కరుణ ఆసుపత్రి నుండి బయలుదేరిన అంతిమయాత్రలో నల్గొండ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మాజీ నక్సలైట్లు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. మూడు గంటలపాటు సాగిన అంతిమయాత్రలో అడుగడుగునా పీపుల్స్‌వార్ అనుకూల, చంద్రబాబు వ్యతిరేక నినాదాలు నగర వీధుల్లో మిన్నుమిట్టాయి. విజయవాడ నగర చరిత్రకు సంబంధించి పోలీస్ కాల్పుల్లో బలైన ఒక వార్ నాయకునికి ఇంత భారీఎత్తున అంతిమయాత్ర జరగటం ఒక ఎత్తయితే దారి పొడవునా ప్రజానీకం ఎక్కడివారు అక్కడ నిలబడి ధర్మన్న భౌతికకాయాన్ని సందర్శించుకోటం విశేషం. నల్ల, ఎర్ర జెండాలు, బ్యానర్లతో అలంకరించిన వాహనంపై ధర్మన్న భౌతిక కాయాన్ని ఉంచగా వార్ మాజీ నాయకుడు కొండపల్లి సీతారామయ్య ఆ వాహనం ముందుగా కొంత దూరం నడిచి అంతిమయాత్రను ప్రారంభించారు. ప్రజా గాయకుడు గద్దర్ మరికొందరు కళాకారులు డప్పు వాయిద్యాల మధ్య అగ్రభాగాన వుండి ముందు కనిపిస్తూ పోలీస్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ధర్మన్న మరికొందరు నాయకులకు నివాళులర్పిస్తూ మరోపక్కన చంద్రబాబు నియంతృత్వ, పోలీస్‌రాజ్యాన్ని దుయ్యబడుతూ గీతాలు ఆలాపించారు. నగ్జల్బరీ... నగ్జల్బరీ...లాల్‌సలామ్...పీపుల్స్‌వార్ వర్ధిల్లాలి..జోహార్ ధర్మన్న...చంద్రబాబు నశించాలి..బాబు మూల్యం చెల్లించుకోక తప్పదు...ప్రతీకార చర్య తప్పదు అంటూ కార్యకర్తలు దారిపొడవునా నినదించారు. ధర్మన్న తండ్రి జగన్నాధరావు, సతీమణి పుష్పలత ఇతర కుటుంబ సభ్యులు భోరున విలపిస్తూనే కాలినడకన అంతిమయాత్రలో పాల్గొనటం పలువురికి కంటతడి పెట్టించింది. కార్యకర్తలు కొందరు కర్రలు చేతిలో పెట్టుకుని ప్రభుత్వ విధానాలకు నిరసిస్తూ కదం తొక్కారు. పోలీసులు మాత్రం ఎటువంటి కవ్వింపు చర్యలకు దిగకుండా ముందు జాగ్రత్తగా వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఇంటెలిజెన్సీ సిబ్బంది ప్రతి ఒక్కరి కదలికలను గమనించారు. అంతిమయాత్రలో ప్రతి జంక్షన్ సంస్మరణ సభ వేదికగా మారింది. ఎన్‌కౌంటర్ జరిగిన తీరు, చంద్రబాబు దుర్మార్గపు చర్యలను ఆయన అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గద్దర్ తదితరులు పాటలు, ఉపన్యాసాల రూపంలో ప్రజలకు వివరించారు. ధర్మన్న ఆశయాలు సాధిస్తాం సాధిస్తాం అంటూ కార్యకర్తలు ప్రజల ఎదుట ప్రతినబూనారు.**

**('ఆంధ్రభూమి' పత్రిక నుండి.....)**

# పాణిగ్రాహి అడుగు జాడల్లో ప్రాణాలర్పించిన కామ్రేడ్ దివాకర్‌కి ఎర్రెర్రని జోహార్లు!

2001 జూన్ 19న రాచకొండ గుట్టల్లో గ్రేహౌండ్స్ పోలీసులతో ఆరు గంటల పాటు జరిగిన హోరాహోరీ పోరాటంలో పీపుల్స్‌వార్ పార్టీ నల్గొండ జిల్లా కార్యదర్శి కా॥ దివాకర్ తోటి ఏడుగురు సహచరులతో పాటు అమరుడయ్యాడు. రాచకొండ గుట్టల్లో సమావేశమైన జిల్లా ఉద్యమ నాయకత్వంపై ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఒక్కుమ్మడిగా దాడి జరిపి గుండ్ల వర్షం కురిపించిన సంఘటనలో రాచకొండ దళం ఆరుగంటల పాటు ఊపిరి సల్పని కాల్పుల్లో ఎదురునిల్చి ఖాకీమూకల్ని కలవరపెట్టి ముందుకు వచ్చిన గ్రేహౌండ్స్ పోలీసుని మట్టి కరిపించింది. ఈ సంఘటనలో మన దళం నుంచి ఒక బ్యాచ్ క్షేమంగా వెను దిరిగినా, సుదీర్ఘ సమయం శత్రువును నిలువరించిన ఆ పోరులో జిల్లా కమిటీ కార్యదర్శి, దక్షిణ తెలంగాణా రీజినల్ కమిటీ సభ్యుడు కా॥ ధర్మన్న తోటి సహచరులతో పాటు అమరుడయ్యాడు. దళం వద్దకు తల్లితో పాటు వచ్చిన రెండేళ్ళ పసిపాపను సైతం పోలీసులు క్రూరంగా హతమార్చి క్రాస్ ఫైరింగ్ కట్టుకథ అల్లారు.



దాదాపు రెండు దశాబ్దాల విప్లవ జీవిత చరిత్రను కల్గిన నిజమైన కమ్యూనిస్టు, 15 సం॥లపాటు విప్లవ సాంస్కృతిక రంగంలో చిరస్మరణీయ పాత్రను నిర్వహించిన సహజ కళాకారుడు కా॥ దివాకర్. కళాకారుడూ, ఆర్గనైజరూ, 'సజీవ మేధావీ' మూడు పాయలుగా కలిసి పోయిన బహుముఖాల వ్యక్తిత్వానికి అచ్చమైన ప్రతీకే కా॥ దివాకర్. అపార జనాదరణ కల్గిన సహజ కళాకారుడుగా మొదలై వర్గ పోరాట యోధాను యోధుడిగా గతితార్కికంగా పరివర్తన చెందిన విశిష్ట వ్యక్తిత్వం కా॥ దివాకర్‌కి పెట్టని సుగుణం.

నిజమైన వీరుల కోసం ప్రజల్లోనే వెతుక్కోవాల్సి వుంటుందని కా॥ మావో ఒక కవితలో అంటాడు. సరిగ్గా అలాంటి నేపథ్యంలోంచే పుట్టుకొచ్చిన వ్యక్తి దివాకర్. కన్న తల్లిదండ్రులది కరువు సీమగా పేరుమోసిన కడప–కర్నూలు జిల్లాలు కాగా, పుట్టి పెరిగింది ప్రకాశం జిల్లాలోని ఆదివాసులైన చెంచులు జీవిస్తున్న అడవి ప్రాంతం గిద్దలూరు దగ్గర వెంకటాపురం. చదివింది గుంటూరు జిల్లాలో. పుట్టిందీ, పెరిగిందీ, చదివిందీ వేరైనా సామాజిక నేపథ్యం మాత్రం ఒక్కటే. దళితుడు. తల్లి, తండ్రి మామూలు బడిపంతుళ్ళే అయినా పుట్టి పెరిగిన ఊరిలో, చదువు సాగించిన గుంటూరులోనూ ఈ దళిత నేపథ్యపు నిత్య అవమానాల, అగ్రవర్ణ అహంకారాల, అణచివేతల చరిత్రలో నలుగుతూనే సమాజ అంతరాలని తరచి తరచి చూస్తూ వచ్చాడు. 'అంటరాని' కుల ముద్రతో అభిజాత్యాల, అణచివేతల కొలిమిలో కాలి కాలి కుమిలి కుమిలి కసితో కదనరంగాన్నెంచుకున్నాడు కా॥ దివాకర్. సామాజిక నిచ్చెన మెట్లలో కిందికి తొక్కివేయబడినా చదువుల్లో కనపర్చిన సామర్థ్యతే తనకి స్కాలర్‌షిప్‌తో ఉన్నత చదువులు సాగించే అవకాశం కల్పించింది. ఇంటర్మీడియట్ విద్యను ముగించాక గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చేరాకే దివాకర్ పీడిత కుల నేపథ్యానికి, నిత్యవమానాల చరిత్రకి దిశా నిర్దేశం జరిగింది.

అది ఎమర్జెన్సీ అప్పుడే ముగిసిన కాలం. జగిత్యాల రైతాంగ పోరాటాల వెల్లువతో దేశమంతటా తెలంగాణా వైపుకి చూపు సారించిన రోజులు. ఆ పోరాటం వెనువెంటనే కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ ఉద్యమంగా అభివృద్ధి చెందింది. ఈ పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావ ప్రచారం జరుగుతున్న కాలంలోనే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పలువురు యువతీ యువకులు సాంస్కృతిక కళాభినివేశంతో విప్లవోద్యమం ముంగిట్లోకి వచ్చారు. వీరే తర్వాత ఆంధ్రప్రదేశ్ జననాట్య మండలిలో చేరారు. ఆనాటి ఆ యువతీ యువకులలో కా॥ దివాకర్ ఒకరు. దక్షిణ కోస్తా జిల్లాల జననాట్య మండలికి రూపురేఖలు దిద్దిన కా॥ యేసు (రాజన్న, సత్యం) నేతృత్వంలో విప్లవోద్యమం వైపు ఆకర్షితుడైన కా॥ దివాకర్ ఆనాటి నుండి వెనుదిరగలేదు. శ్రీకాకుళ రైతాంగ పోరాటంలోకి యోధులుగా వెళ్ళి 1969లో అమరులయిన డాక్టర్ చాగంటి భాస్కరరావు, డాక్టర్ మల్లికార్జున్ లను వైద్యులుగా తీర్చిదిద్దిన గుంటూరు మెడికల్ కళాశాలే కా॥ దివాకర్‌ని 10 సం॥ల తర్వాత ప్రజల పాటల సాంప్రదాయంతో ఉద్యమంలోకి నడిపించింది.

1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ఆదివాసులపై ప్రభుత్వం హత్యాకాండ జరిపిన సంఘటనే కా॥ దివాకర్‌ని విప్లవ సాంస్కృతికోద్యమం వైపు నెట్టింది. ఇంద్రవెల్లి సంఘటన నాటికి గుంటూరు కేంద్రంగా కోస్తా జిల్లాలన్నింట్లోనూ ప్రదర్శనలు ఇస్తూ జననాట్యమండలి ఏర్పడింది. నాలుగైదేళ్ళలోనే అది రాష్ట్ర స్థాయి సెంట్రల్ టీం రూపొందడానికి తోడ్పడింది. ఈ సెంట్రల్ టీమ్‌లోంచే జననాట్యమండలి రాష్ట్ర నాయకత్వం నలుగురయిదుగురిలో ఒకడిగా దివాకర్ ఎదిగాడు. ఈ పరిణామ చరిత్రను చూస్తే, దండకారణ్యం వైపుగా విస్తరిస్తూ, ప్రజా పోరాటాలను వర్గ పోరాట వున్నత రూపాల్లోకి తీసుకు పోయేందు కోసం ప్రజాపంథాను అమలుచేస్తూ 1980లలో ఎదుగుతున్న పీపుల్స్‌వార్ పార్టీ పెంపకంలో పెరిగి సాగినవాడే కా॥ దివాకర్. సరిగ్గా ఈ పోరాట నేపథ్యంలోనే సత్యంగా పేరొందిన కా॥ యేసు, విప్లవమే జీవితాశయంగా అజ్ఞాత జీవితంలోకి అడుగుపెట్టి చంద్రవంక దళాన్ని నడుపుతూ గుంటూరు, నల్గొండ జిల్లాలలో కృష్ణానదీ తీరప్రాంతంలో ఉద్యమాన్ని విస్తరింపజేస్తూ అమరుడయినాడు. ఈ చరిత్రలో భాగంగానే కా॥ దివాకర్ సైతం వైద్య విద్యను మూడో సం॥రంలో

వదిలేసి తోటి కళాకారులతో పాటు జననాట్యమండలిని నిర్వహిస్తూ వచ్చాడు. ఒక కళాకారుడిగా సుబ్బారావు పాణిగ్రాహి అడుగుజాడలనూ అనుసరించి, వైద్య విద్యార్థిగా చాగంటి భాస్కర్, దేవినేని మల్లికార్జునుల బాటపట్టిన దివాకర్ ఆనాటి నుంచి లిప్తమాత్రంగా కూడా వెనుదిరిగి చూసుకోలేదు.

విద్యార్థి దశలో 'గ్రామాలకు తరలిరండి' క్యాంపెయిన్ టీమ్‌లనుండే కా॥ దివాకర్ గాయక, నట జీవితం మొదలైంది. ఇంద్రవెల్లి హత్యాకాండకి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జె.యన్.యం. ప్రదర్శించిన రగల్‌జెండా బ్యాలెట్‌లో పాల్గొనడం ద్వారా దివాకర్ నట జీవితం మొదలైంది. ఏకలవ్యుడు గురుదక్షిణ కోసం వేలిసే కోసి ద్రోణుడికి అందించిన చరిత్రను తలపింపజేస్తూ, గిరిజన గోండు భూములను కాజేయడానికి పూనుకున్న షావుకారు, కాగితంపై గోండు వేలిముద్రకు పెన్నులో సిరా అయిపోగా గోండు చేతిని లాక్కుని వేలుపై పెన్నుతోనే పొడిచి రక్తం కార్చి కాగితంపై నెత్తుటి వేలిముద్రని వేయించుకుని ఆ భూముల్ని కాజేసే సన్నివేశాన్ని దివాకర్ నటించి చూపడం ప్రజల హృదయాలను పిండేది. నల్గొండ అడవి ప్రాంతంలో గుట్టల మధ్యన ఆరుగంటల పాటు హోరాహోరీ కాల్పుల తర్వాత లంబాడీ ప్రజల గుడిసెల మధ్యన దివాకర్ పొందిన అమరత్వం ఆత్మగౌరవం కోసం, విముక్తి కోసం గిరిజనుల పోరాటంలో ప్రాణాలర్పించిన మహోన్నత జీవిత పరివర్తనను సజీవంగా చిత్రిక పట్టింది.

కళాకారుడిగా దివాకర్‌కి రాడికల్ రాజకీయాలే జన్మనిచ్చాయి. బాల్యంలో పాటంటే, నటనంటే తెలీనివాడు 1982 నుండి '95 వరకు పల్లెనుండి ఢిల్లీ వరకు పట్టణాల్లో, అడవుల్లో పాట, ఆటలతో విప్లవభేరి మోగించాడు. హిందీ భాషలో ప్రావీణ్యత వున్న వాడైనందున పీపుల్స్‌వార్ రాజకీయాలను ప్రచారం చేసే క్యాంపెయిన్‌లో సెంట్రల్ టీంలో భాగమై దేశమంతా తిరిగాడు. రగల్‌జెండాలో గోండు పాత్ర ధరించినా, కారంచేడు బిడ్డలు ఒగ్గుకథ చెప్తున్నా, నక్సల్బరీ బిడ్డలులో రాడికల్ విద్యార్థుల ఆత్మ త్యాగాన్ని గొంతెత్తి గానం చేస్తున్నా దివాకర్ గొంతులో తరతరాల అణచివేత నుంచి పెకిలివస్తున్న ప్రతిఘటన విస్ఫోటనలా ప్రతిధ్వనించేది. 'ఎగిరి దొరగాడి గుండెలో తన్నిన దళిత పులులమ్మా' అంటూ తనకే సొంతమైన ధిక్కార స్వరంతో, విరుపుతో కారంచేడు అగ్రవర్ణ మదాంధకారాన్ని సవాలు చేస్తూ పాడుతున్నపుడు దివాకర్ దళిత జీవితపు అవమానాల చరిత్ర నేపథ్యం అందులో కొట్టొచ్చినట్లు కన్పడేది.

1984లో ప్రకాశం జిల్లా ఆలకూరుపాడు గ్రామంలో 8 రోజులపాటు విరసం నిర్వహించిన వర్క్‌షాప్‌లో దివాకర్ తన తోటి కళాకారులతో పాటు విద్యార్థిగా పాల్గొన్నాడు. నాటిక, నాటకం, స్ట్రీట్‌ప్లే, బుర్రకథ వంటి ప్రజా కళారూపాల్లో శిక్షణ నివ్వడానికి ఏర్పడిన ఆ వర్క్‌షాప్‌లో దివాకర్ ముఖ్యంగా స్ట్రీట్‌ప్లే, బుర్రకథలో శిక్షణ పొందడానికి పాల్గొన్నాడు. తెలంగాణా సాయుధ పోరాట కాలంలో దానికి మద్ధతుగా షేక్ నాజర్ గుంటూరు జిల్లాలో ప్రారంభించిన బుర్రకథకు మళ్ళీ ప్రాణం పోసి కోస్తా ప్రాంతాల్లో ప్రయోగించాలని దివాకర్ తపన పడ్డాడు. ఈ రెండు ప్రక్రియలూ ప్రత్యేకించి అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతాలకు, పట్టణ కేంద్రాలకూ అత్యంత అవసరమైనవని తన అభిప్రాయం. 1990లో అనంతపురం జిల్లా చాబాలలో నెలరోజుల పాటు సాగిన జె.యన్.యం. వర్క్‌షాప్‌లో ప్రత్యేకంగా స్ట్రీట్‌ప్లే పైన దృష్టి పెట్టాడు. ఈ వర్క్‌షాప్‌లోనే జె.యన్.యం. తరపున స్ట్రీట్ ప్లే బుక్‌లెట్ కూడా తెలుగులో వచ్చింది.

1985లో ప్రకాశం జిల్లాలో కారంచేడులో దళితులపై వూచకోత అనంతరం చీరాల విజయనగర్‌లో నెలకొన్న కారంచేడు దళితుల శిబిరంలో దివాకర్ తన తోటి కళాకారులతో పాటు నెలల తరబడి వుండి ప్రతిరోజూ సాంస్కృతిక ప్రదర్శనలిస్తూ బాధితులకు స్థైర్యం నిలబెట్టడంలో తీవ్రంగా కృషి చేశాడు. ఆ క్యాంపులో ఆర్.యస్.యు., ఆర్.వై.యల్. విరసం కామ్రేడ్స్‌తో కలిసి జె.యన్.యం. సమిష్టిగా కత్తి పద్మారావు అవకాశవాద నాయకత్వాన్ని ఎండగట్టింది. కారంచేడు మారణకాండకు ప్రధాన బాధ్యుడైన చెంచురామి నాయుడిని పార్టీ ఖతం చేశాక తోటి కళాకారులతో పాటు దివాకర్ కూడా రహస్య జీవితంలోకి వెళ్ళిపోయాడు.

1985 నుండి '98 కాలంలో కోస్తా ప్రాంతంలో నెల్లూరు నుండి గుంటూరు దాకా కా॥ కుమారితో సహా (1996లో అమరురాలైంది) తోటి సహచరులతో కలిసి రైతాంగ పోరాటాలను నడిపాడు. జె.యన్.యం. 18 వార్షికోత్సవం సందర్భంగా 1990లో అజ్ఞాతంలోంచి బయటకొచ్చాడు. 'ఆట, మాట, పాట, బంద్ అయిపోయిన నిర్బంధ కాలంలో అజ్ఞాతంలో వున్న జె.యన్.యం. బృందం ఈ సందర్భంగా ప్రదర్శనలిచ్చేందుకు గాను బయటకొచ్చింది. అయితే 1990 ఫిబ్రవరి నుండి మే దాకా అంటే వరంగల్‌లో చారిత్రాత్మక రైతుకూలీ మహాసభలు జరిగేంత వరకు అతి స్వల్ప కాలం మాత్రమే జె.యన్.యం. బహిరంగంగా పనిచేసింది. వరంగల్ మహాసభలోనే ఒక ప్రొఫెషనల్ దర్శకుడి శిక్షణలో ఒక డ్రామాను కూడా దివాకర్, తోటి కళాకారులు ప్రదర్శించారు. ఈ శిక్షణా సమయంలోనే ప్రొపెషనల్స్ ప్రజా కళాకారులకు నేర్పడం కంటే వారే ప్రజా కళాకారుల నుండి నేర్చుకోవలసింది ఎంతో వుందని దివాకర్ తదితరులు బలంగా అభిప్రాయానికొచ్చారు.

'90 మేలో రైతుకూలీ మహాసభ తర్వాత నిర్బంధం తీవ్రతరమైంది. ఒకవైపు నిర్బంధం, మరోవైపు ఉవ్వెత్తున ఎగుస్తున్న ప్రజా ఉద్యమాల నేపథ్యంలో రైతాంగ పోరాటాలను దేశమంతటా ప్రచారం చేయడానికిగాను 20 మంది సభ్యులు కల జె.యన్.యం. బృందం తొలుత మధ్యప్రదేశ్ వెళ్ళింది. కా॥ గద్దర్, సంజీవ్, దివాకర్ తదితరులతో కూడిన ఈ బృందం జగదల్‌పూర్, కాంకేర్, భిలాయ్ పట్టణాల్లో ప్రచారం చేసింది. భిలాయ్ ఉక్కు కర్మాగారం వద్ద ప్రదర్శన ఇస్తుండగానే మధ్యప్రదేశ్ ప్రభుత్వం జె.యన్.యం. బృందాన్ని రాష్ట్రం నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసులు ఈ బృందాన్ని వెంటనే అరెస్ట్ చేసి రాష్ట్ర సరిహద్దులకావల భద్రాచలం దగ్గర వదిలేశారు. తిరిగి కాంకేర్, జగదల్‌పూర్, కుంట మీదుగా సాగిన ఈ ప్రయాణ క్రమంలో జనావాసాలు వున్న చోట్లల్లా పోలీస్ ఎస్కార్టుతో వున్న ఈ బృందంపై ప్రజల దృష్టి పడేది. జనం వున్న చోటల్లా బృందం ఆగి ప్రదర్శనలిచ్చింది. కుంటాలోకి ప్రవేశించే ముందు దివాకర్, తోటి కళాకారులు దట్టమైన దండకారణ్యంలోని ఎత్తైన ప్రాంతంలో ఎర్రజెండాను ఎగరేసి అమరుల రక్తంతో తడిసిన ఎర్రజెండాపై పాట పాడారు. (సరిగ్గా పదేళ్ళు గడచాక ఆ ఎర్రజెండానే మరింతగా ఎరుపెక్కిస్తూ కా॥ దివాకర్ అమరుల అత్యున్నత సంప్రదాయంలో భాగమయ్యాడు). 91 చివర నాటికే తిరిగి అజ్ఞాత జీవితానికి వెళ్ళిపోయాడు.

జననాట్యమండలి పర్‌స్పెక్టివ్ రూపొందాక జె.యన్.యం.లోని ముఖ్య కళాకారులతో పాటు దివాకర్ కూడా దళాల్లో జె.యన్.యం.ని నిర్మించేందు కోసం అజ్ఞాతవాసంలోకి వెళ్ళాడు. ప్రజల్ని సాయుధం చేయటంలో పోరాటం సాధించిన పురోగమనంలో ఇదో భాగం. అజ్ఞాతంలోని

(తరువాయి 28వ పేజీలో...)

# చరితార్థుడు!!



ఒక కళాకారుడిని, వ్యక్తిగా సాధుశీలిని రాచకొండ గుట్టల్లో చంపివేశాక ధర్మన్న హతమైనట్లుగా ప్రకటించిన పోలీసులు తను దివాకర్‌గా జననాట్యమండలి కళాకారుడనిగాని, పదేళ్ళకు పైగా రాష్ట్రంలో లక్షలాది మంది ముందు ప్రదర్శనలిచ్చిన సాంస్కృతిక కార్యకర్త అనిగానీ చరిత్రలో ఒక రికార్డుగా, వాస్తవంగా కూడా పేర్కొనలేక పోయారు. ఇనుము ఉక్కుగా మారినట్లుగా సాంస్కృతిక, సాయుధ పోరాటాల రాపిడిలో మన కళ్ళముందే మన కాలపు యోధుడిగా రూపొందిన దివాకర్ ఈ పదేళ్ళ కాలంలో ఉద్యమం బయటి సమాజానికి కనబడింది తక్కువే కావచ్చుగానీ గెరిల్లా జీవితంలో సహచరులను, ప్రజలను ఆటపాటల సంస్కృతితో అనునిత్యం ప్రభావితం చేస్తూ వచ్చాడు. నిర్మాణపరమైన నూతన బాధ్యతలతో తలమునకలవుతూ కూడా సాయుధ జననాట్యమండలి ప్రతి మలుపులోనూ దివాకర్‌లోని కళాకారుడు చెలమ నీటిలా ఉబికి వస్తూ కన్పిస్తుంటాడు. సుదీర్ఘ ప్రయాణాల తీవ్ర శ్రమలో అలసిపోయే గెరిల్లాలకు తన చెణుకులతో, మిమిక్రీ మేనరిజాలతో అలసటను లిప్తలో పోగొట్టే ఒయాసిస్సులా వుండేవాడు. ముఖ్యంగా చంద్రబాబు పాలనపై వీడియో చిత్రం తీయాలని జె.యన్.యం. నిర్ణయించుకున్నప్పటినుండి కా॥ దివాకర్ చంద్రబాబు పాత్ర పోషణకు గాను రేడియో 'ప్రజలతో ముఖ్యమంత్రి ముఖాముఖి' కార్యక్రమాన్ని వింటూ చంద్రబాబు హావభావాలను, మాట తీరును, ఎంతగా ఆపోసన పట్టాడండే, గెరిల్లాల క్యాంపుల్లో, క్లాసుల్లో అక్షరాలా చంద్రబాబు 'గబ్బు' లేపుతూ వచ్చాడు. సాధారణ కేడర్ నుండి కేంద్రకమిటీ కార్యదర్శి దాకా ఈ 'అభినయ' చంద్రబాబు మిమిక్రీ నైపుణ్యతా పారవశ్యాన్ని చవిచూసినవారే. 'ఏమండీ సెంద్రబాబుగోరూ' అంటూ మహిళా కామ్రేడ్స్ అలుపు తీర్చుకుంటూ అడిగే ప్రశ్నలకు 'సెప్పండమ్మా, సెప్పండి బ్రదర్' అంటూ చంద్రబాబును అచ్చుగుద్దుతూ 'గెరిల్లాలతో ముఖాముఖి'ని అత్యంత సహజంగా, సజీవంగా నిర్వహించిన దివాకర్ కళాభినయాన్ని గెరిల్లాలు ఎన్నడూ మర్చిపోలేరు. రాష్ట్ర స్థాయి రాజకీయ తరగతులలో తీరిక లేకుండా విద్యార్థిగా పాల్గొంటూనే, అడవిలో మృగ్యమైన వనరులతో ఆ వీడియో చిత్రాన్ని తీస్తున్నపుడు జె.యన్.యం. బృందానికి, నటులకు స్ఫూర్తిగా నిలవడానికి దివాకర్ పడ్డ శ్రమ మాటల కందనిది. స్క్రిప్టులో సహజత్వానికి భిన్నంగా ఒక్క పదం వచ్చినా సరే అది మొత్తం సందర్భాన్ని పలుచ బారుస్తుందంటూ దివాకర్ తీసుకున్న, చెప్పిన జాగ్రత్తలు లోపలా, బయటా జననాట్య మండలి ప్రదర్శనలకు నిత్యం మెరుగుదలు దిద్దేవి. ఉద్యమంలో చెడు ధోరణులపై దిద్దుబాటు ఉద్యమం సందర్భంగా తాను స్వయంగా రాసి రూపొందించిన 'ఉదారవాదం' స్ట్రీట్ ప్లే గత మూడేళ్ళుగా ఎక్కడ వేసినా అద్భుతంగా నడుస్తోందంటే సహజ, సజీవ సంభాషణలను ఎన్నుకోవడంలో దివాకర్ పడ్డ శ్రమ, నైపుణ్యాలే కారణం.

ఇకపోతే విప్లవ పాటల్లో మహోధృతంగా సాగే వేగాన్ని, ఆవేశాన్ని, ఆర్తిని, కారుణ్యాన్ని, ధిక్కారాన్ని చూడాలంటే దివాకర్ పాడే పాటల్ని విని తీరాలి. తను గతంలో చెప్పిన 'కారంచేడు బిడ్డలు' ఒగ్గుకథ దళితులపై తరతరాల అణచివేత నుంచి పెకిలివస్తున్న ప్రతిఘటనలోని ప్రతిధ్వనికి సజీవ రూపమై నిలిచింది. పీడిత ప్రజానీకం గొంతులో పలికే రక్తచలన సంగీత శ్రుతి దివాకర్ పాట. 2000 సం॥రం డిసెంబర్‌లో 15వ రాష్ట్ర కాన్ఫరెన్సు సందర్భంగా 'కంపెనీకి జీతాలు పెరిగినాయ్' సంవాద పాటలో కార్మికుడిగా దివాకర్ అభినయం 100 మంది గెరిల్లాలతో కూడిన క్యాంపునే మొత్తంగా ఉర్రూతలూగించింది. పావలా జీతం పెరిగితేనే పొంగిపోయే కార్మికుడి వుషారును తన స్వంతం చేసుకుని ఆ హావ భావాలను స్టెప్స్ రూపంలో చూపిస్తుంటే క్యాంపు మొత్తంగా ఈలలు, చప్పట్లతో లీనమై చూసింది. ఆ క్షణంలో క్యాంప్ పరిసరాలు దివాకర్ మయమైపోయాయి. అన్నిటికీ మించి తన స్వరం పీడితుల, దుఃఖితుల ఆర్తిని, వారి వేదనలోని కారుణ్యాన్ని ఎంతగా శిఖరాయమాన స్థాయికి తీసుకుపోయేదంటే అలాంటి సందర్భాలలో కండ్లు చెమర్చని వారు వుండబోరనడం అతిశయోక్తి కాదు. ఈ మహాసభల్లోనే "తల్లి వలపోత" పాటకు నేపథ్య,లో దివాకర్ ఆలపించిన విషాద రాగం సృష్టించిన మహా వేదన మొత్తం క్యాంప్‌ని నిరుత్తరంగా మార్చింది. ఆ విషాద గంభీర క్షణాల్లో హృదయాలు బరువెక్కడం అనే పదం చాలా చిన్నదై పలుచబారి పోయింది. పసిబిడ్డల కుండే నిర్మలత్వం తన గొంతులో విషాదంగా మారి జనహృదయాలను రగిలించిన చరిత్ర క్రమంలో పాట దివాకర్‌గా, దివాకరే పాటగా చరితార్థమయ్యారు.

15వ రాష్ట్ర మహాసభల్లో ప్రతినిధిగా పాల్గొన్న దివాకర్ 6 నెలలు గడవకముందే నెత్తుటి జ్ఞాపకాలు మిగిల్చి పోయాడు. అత్యంత వెనుకబాటుతనంలో వున్న దళితులు కూడా రాజకీయంగా ఎదిగి వచ్చేందుకు పార్టీ నిర్మాణంలో వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కాన్ఫరెన్స్‌లో వచ్చిన ప్రతిపాదనకూ, జరిగిన సీరియస్ చర్చకూ దివాకరే ఆద్యుడయ్యాడు. దక్షిణ తెలంగాణాలో ఓ జిల్లా కాన్ఫరెన్సులో దళితులకు పార్టీ ప్రమోషన్లలో రిజర్వేషన్లు వుండాలంటూ ఓ కామ్రేడ్ చేసిన ప్రతిపాదన రాష్ట్ర మహాసభ ముందుకు రాగా కా॥ దివాకర్ సున్నితంగా ప్రకటించిన అభిప్రాయం సభలో లోతైన చర్చకు దారితీసింది. కేడర్ ఎంపికలో కుల ప్రాతిపదికను కాక, వర్గ ప్రాతిపదికనే కొనసాగించాలని రిజర్వేషన్లు అవసరం లేదని మహాసభ అభిప్రాయ పడుతూనే దళిత కామ్రేడ్స్‌ను అభివృద్ధి చేసి నాయకత్వ స్థానాలలోకి తెచ్చేందుకు పార్టీ అంతటా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, ఇందుకుగాను నిర్దిష్టంగా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్, ఎస్.సి./ఎస్.జెడ్.సి. స్థాయి కాన్ఫరెన్సుల్లో దళితులకు 10 శాతం ప్రాతినిధ్యం ఇవ్వాలనే ప్రపోజల్ తీర్మానాన్ని తర్వాత జరగబోయే పార్టీ అఖిల భారత కాంగ్రెస్‌కి ప్రతిపాదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఏ.పి. రాష్ట్ర మహాసభ చేసిన ఈ ప్రతిపాదనను తర్వాత అఖిల భారత కాంగ్రెస్ కూడా ఆమోదించడం ఈ సందర్భంగా గమనార్హం.

సాంస్కృతిక, రాజకీయ రంగాలు రెండింట్లోను కా॥ దివాకర్ సాధించిన ఈ పరిణతి తుదివరకు ఈ రకంగా పలు సందర్భాలలో నిరూపితమవుతూ వచ్చింది. ప్రజల సాంస్కృతిక సాంప్రదాయాన్ని, సాయుధ పోరాట వారసత్వాన్ని తలదాల్చిన దివాకర్ 20 సం॥ల పాటు ఈ వినిర్మల చరిత్రతోనే ముందుకు సాగాడు. సహనం, సౌజన్యత, సాధుత్వాల అరుదైన మేలు కలయికగా ఈ మనిషి మిగిల్చిన నెత్తుటి జ్ఞాపకాలు విప్లవాకాశంలో చిరస్మరణీయాలై మిలమిలలాడు తుంటాయి.

# యువజనులారా! రైతాంగాన్ని విప్లవానికి సన్నద్ధం

## 1979 జూన్ 2, 3 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాడికల్ యువజన సంఘం

*[క్రాంతి పత్రిక ఆవిర్భవించి 25 సం॥లు అయిన సందర్భంగా గత సంచికను 25 సం॥ల ప్రత్యేక సంచికగా తీసుకు రావటమే గాకుండా, ఈ పాతికేళ్ళ ఉద్యమ క్రమంలో మైలురాళ్ళుగా నిలిచిన సంఘటనలపై క్రాంతిలో నమోదయిన పాత వ్యాసాలు, రచనలలో కొన్నింటిని నేటి క్రాంతి పాఠకుల దృష్టికి తీసుకు వస్తున్నాం. ఏ.పి.ఆర్.వై.యల్. రెండో రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా 1979 జూన్ 3న బహిరంగ సభలో, నాటి సి.పి.ఐ. (యం-యల్) నేత (ఆనాటికి పీపుల్స్‌వార్ ఏర్పడి వుండలేదు) కా॥ కె.యస్. ఉపన్యాసాన్ని 15-6-1979 నాటి క్రాంతి సంక్షిప్తంగా ప్రచురించింది. 20 వేలకు పైగా ప్రజలూ, విద్యార్థి, యువజనులు హాజరైన ఖమ్మం మహాసభలు రాష్ట్ర యువజనోద్యమంలో నూతన అధ్యాయాన్ని రచించి ఆర్.వై.యల్. కార్యాచరణపై గణనీయ ప్రభావం చూపాయి. ఆ చారిత్రక సందర్భంగా క్రాంతిలో ఆనాడు వచ్చిన ఈ ఉపన్యాసాన్ని నేటి పాఠకుల కోసం తిరిగి ప్రచురిస్తున్నాం- సంపాదకులు]*

సోదరులారా! సోదరీమణులారా!

పండితాపురం రైతాంగ పోరాటంలో ప్రాణాలర్పించిన వీరనారి నాగలక్ష్మిగారికి, కా॥ బాలయ్య గారికి ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ (మా-లె) తరపున మరోసారి విప్లవాభివందనాలు అర్పిస్తున్నాను. వారు ప్రజా పోరాటంలో ప్రాణాలర్పించిన అమరజీవులు. కమ్యూనిజాన్ని అణచి పారేస్తామని విర్రవీగి చివరకు కుక్కచావు చచ్చిన జీవన్మృతులు హిట్లర్, ముస్సోలినీలకు పట్టిన గతే పోలీసులు ప్రభుత్వం అండ చూసుకుని విర్రవీగే మల్లయ్యలకు కూడా పట్టక తప్పదు.

కామ్రేడ్స్!

ఒక్క పండితాపురంలోనే కాదు, ఇవాళ ఆంధ్రదేశంలో అనేక చోట్ల పోరాటాలు జరుగుతున్నాయి. జగిత్యాల, సిరిసిల్లా తాలూకాలలో భూస్వాములకు, దళితులకు మధ్య జరుగుతున్న పోరాటాన్ని అణచివేయడానికి చెన్నారెడ్డి ప్రభుత్వం పోలీసు బలగాన్ని పంపింది. 'కల్లోలిత ప్రాంతం' అని ప్రకటించి, పోలీసు క్యాంపులు పెట్టి వేలాదిమందిని అరెస్టు చేసింది. అయితే ఆ పోరాటాలు ఆగిపోలేదు. ఆదిలాబాద్ జిల్లాకు కూడా విస్తరించాయి. ఇంకా విస్తరిస్తాయి కూడ. విప్లవ పోరాటంలో వుండే లక్షణమే అది. రబ్బరు బంతిని ఎంత గట్టిగా కొడితే అంత పైకి లేచినట్లు విప్లవ పోరాటాలను అణచివేయడానికి ఎంత తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తే అవి అంతగానూ తీవ్రమవుతాయే తప్ప ఆగిపోవు.

1948 ప్రాంతాల్లో, పటేల్ తెలంగాణా పోరాటాన్ని కాలరాచి పారేస్తానన్నాడు. ఆయన చచ్చిపోయాడు కానీ ఆ పోరాటం చచ్చిపోలేదు. దోపిడీ వర్గాల ప్రభుత్వాన్ని శాశ్వతంగా అంతం చేసేదాకా ఈ పోరాటాలు జరిగి తీరుతాయని పండితాపురం రైతాంగం, కరీంనగర్ రైతాంగం రుజువు చేసారు.

ఒక్క పండితాపురంలోనూ, ఆదిలాబాద్, కరీంనగర్‌లోనూ మాత్రమే కాదు, ప్రపంచమంతటా ఇలాంటి పోరాటాలు జరుగుతూనే వున్నాయి. పోల్‌పాట్ నాయకత్వం క్రింద కంపూచియాలో, దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నమీబియాలో, ఆఫ్రికాలో అడవిజాతి రైతాంగం, దక్షిణ అమెరికాలో ప్రజలు ప్రపంచ వ్యాపితంగా దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు.

ప్రపంచంలో విజ్ఞానం చాలా పెరిగి మనిషి సుఖంగా బ్రతకటానికి చాలా సౌకర్యాలు లభించాయి. కానీ భారత దేశం మాత్రం చాలా వెనకబడి వుంది. మన రైతు ఇక్ష్వాకుల కాలం నాటి నాగలితో వ్యవసాయం చేస్తున్నాడు. మన దేశంలో పండింతే రైతుకు తినడానికి తిండి లేదు కరువులు వస్తున్నాయి. భారతదేశంలో తత్వవేత్తలు దీనికి కారణం పాప పుణ్యాలన్నారు. అదే నిజమైతే పండితాపురంలో మల్లయ్యగారొక్కరే పుణ్యాత్ములు, ఆ వూళ్లో మూడు వేల మంది జనం పాపం జేసుకు పుట్టినవాళ్ళే కావాలి. ఇది ఎంత అసందర్భమో అందరకూ తెలుసు. కారల్ మార్క్సు ఏం చెప్పారంటే ఈ కరువు కాటకాలు మనుషులు తెచ్చి పెట్టుకున్నవే కానీ, దేవుడు చేసినవి కాదనీ, మనిషికి కూడు, గుడ్డ, గూడూ కావాలి. ఏ విప్లవాలయినా, ఏ పోరాటాలయినా అన్నీ వీటి కోసమే. ఉత్పత్తి సాధనాలన్నింటినీ వ్యక్తుల చేతుల్లోంచి తీసివేసి సంఘపరం చేస్తే పనిచేసే మనుషులంతా ఫలితం అనుభవిస్తారు. అప్పుడు కరువు కాటకాలకు ఆస్కారం వుండదు. ఇదే సోషలిజం. ఉత్పత్తి సాధనాలు వ్యక్తుల చేతుల్లోనే వుండి జనమంతా కష్టపడి పనిచేసినా ఆ ఫలితం కొద్దిమంది చేతులలోకే వెళ్ళి పోతుంది. అందువల్ల వ్యక్తిగత ఆస్తి వున్నంతకాలం దేశంలో కరువుకాటకాలు తప్పవు. వ్యక్తిగత ఆస్తిని కాపాడుతూనే కరువు కాటకాలు లేకుండా చేస్తామని ఏ మహా నాయకుడు చెప్పినా అది పరమ అబద్ధం అని నమ్మండి. అందుకని కమ్యూనిస్టు పార్టీ చెప్పేదేమంటే దోపిడీ వర్గాల చేతుల్లో నుండి అంటే మన దేశంలో పెద్ద పెద్ద భూస్వాములు, పెద్ద పెట్టుబడిదారుల చేతిలో నుండి రాజ్యాధికారం కష్టపడి పనిచేసే వాళ్ళ చేతుల్లోకి మారాలి. అప్పుడే ఎవరి కష్టార్జితం వాళ్ళకు దక్కుతుంది. ఇది మామూలు మాటలతోనూ, విజ్ఞప్తులతోనూ జరగదు. దోపిడీ వర్గాలను జబర్దస్తీగా మనం బయటకు తోసెయ్యాలి. మరి వాళ్ళకు పెద్ద సైన్యం వుందిగదా మనం ఏం చెయ్యాలి. ముందు ప్రభుత్వాన్ని తోసెయ్యాలా? లేదా? మనం రాజ్యాధికారాన్ని గుంజుకోవాలా? వద్దా? మీరొక నిర్ణయానికి రండి. దారి అదే దొరుకుతుంది.

దేశం మొత్తంమీద ఫ్యూడలిజం నిర్మూలించబడాలి. సామ్రాజ్యవాద దోపిడీని అరికట్టాలి. ఈ ప్రభుత్వాలు వుండగా ఆ పని జరగదు. ముందు ప్రజాతంత్ర విప్లవం వస్తే, సోషలిజం కమ్యూనిజం ఎలా నిర్మించాలో దారి తర్వాత వెతుక్కోవచ్చు. అందుకనే కమ్యూనిస్టులం, ప్రజాతంత్ర విప్లవం కోసం పోరాడుతున్నాం.

కామ్రేడ్స్!

భారతదేశంలో జరుగుతున్నట్లే ఇతర దేశాలలో కూడ ఈ పోరాటం జరుగుతోంది. ఈ విషయం ముందుగా పసిగట్టాడు కనుకనే మార్క్సు 130 ఏళ్ళ కిందటే ''ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!'' అన్నాడు. ప్రపంచ వ్యాపితంగా అల్లుకుపోయిన పెట్టుబడిదారీ విధానం నశించి

# చేయండి! తెగించి పోరాడండి! విజయం మనదే!

## రెండవ రాష్ట్ర మహాసభలో కమ్యూనిస్టు పార్టీ (యం-యల్) నాయకులు కా॥ కె.యస్. పిలుపు

సోషలిజం నిర్మించబడాలంటే ప్రపంచ పీడిత ప్రజలందరూ ఏకం కావాలి. ఆ నినాదం వాస్తవం అయ్యే పరిస్థితి ఈనాడు వస్తూ వుంది. ప్రపంచంలో ప్రతీచోటా దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు.

మన పొరుగునే వున్న థాయ్‌లాండ్, మలేసియా, ఇండోనేషియా బర్మాలో కూడా ప్రభుత్వ సైన్యాలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు ప్రజా సైన్యాలను ఏర్పరచుకొని పోరాడుతున్నారు. భారత దేశంలో ప్రజలు కూడా ఆయుధాలు పట్టి పోరాడితే తప్ప విముక్తి లేదని గ్రహించి వేళ్ళు తన్నుకుపోయిన రివిజనిజాన్ని ప్రతిఘటించి 10 సం॥ల క్రితం నక్సల్‌బరీలో సాయుధ రైతాంగం పోరాటం ప్రారంభించారు. అలా నక్సల్‌బరీలో అంటుకున్న నిప్పురవ్వ మన రాష్ట్రంలోనే వున్న శ్రీకాకుళంలో జాజ్వల్యమానమయింది. ప్రపంచమంతటా కూడా రైతాంగ పోరాటాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఇవాళ ప్రతి ఒక్కరూ బ్రతుకు తెరువు గురించి ఆలోచించుకొని అవసరాలు తీరడానికి ప్రభుత్వంతో పోరాడక తప్పదని గుర్తిస్తున్నారు. కానీ ఎవరికి వారు పోరాడితే ఈ ప్రభుత్వం దిగిరాదు. మనందరం కలిసి ప్రతిఘటించాలి. రైతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కష్టపడే వాళ్ళంతా ఒకటి కావాలి. ఇదే కమ్యూనిస్టు పార్టీ చెప్పేది. భ్రమలు మానుకొని, ఈ ప్రభుత్వాన్ని దించేసి పీడిత ప్రజల చేతుల్లో అధికారం పెట్టే విప్లవానికి మీరు సన్నద్ధమయితే మీ కోరికలు నెరవేరుతాయి. లేకపోతే ఇలాగే బురదగుంటలో బతకాల్సిన గతి మరికొంత కాలం తప్పదు. ఛైర్మన్ మావో చెప్పినట్లు తుపాకీ గొట్టంలోంచే రాజ్యాధికారం వస్తుంది. మీరు పోట్లాడదల్చుకుంటే మాతో చేరండి. మేము అరచేతిలో వైకుంఠం చూపెట్టడం లేదు. సులువుగా అధికారం వస్తుందని చెప్పటం లేదు. పోరాడాలనుకున్న తర్వాత చాలామంది ఆహుతి అవుతారు. ఇప్పటికి పోయింది చాలా తక్కువ. తెలంగాణా పోరాటంలో 40 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పది సం॥ల పోరాటంలో ప్రభుత్వం మరి కొంతమందిని పొట్టనబెట్టుకుంది. ఇప్పుడు మనం సుఖపడుతున్నామా? మీలో ఎంతమంది సుఖపడ్తున్నారో గుండెల మీద చేయి వేసుకొని చెప్పండి. జీవచ్ఛవాల లాగా బతుకుదామా? లేక పోరాటంలో మనం చచ్చినా మేలే కాని మన పిల్లలైనా సుఖపడ్తారని నిర్ణయించుకుందామా? ఇది మనం ఇప్పుడు తేల్చుకోవాలి. ఇప్పుడు కూడా ఆలస్యం చేస్తే ఇలాంటి దుర్గతిలోనే పడుండాల్సిన శిక్ష చరిత్ర మనకు వేస్తుంది. ఆకలితో చచ్చేకంటే, పోరాటంలో చావడం మేలు పోరాడితే తప్ప లాభం లేదు. ఎవరికి వారు పోరాడినా లాభం లేదు. అందరూ కల్సి పోరాడాలి. ప్రజలు ఈ సంగతి తెల్సుకోవాలి. అయితే ఎవరి నాయకత్వంలో పోరాడాలి? ఇప్పటికి భారతదేశ ప్రజాస్వామిక విప్లవం రెండు నాయకత్వాలను చూసింది.

మొదటి పోరాటం సంస్థానాధిపతుల క్రింద నాశనమైతే, పెట్టుబడిదారుల నాయకత్వం క్రింద రెండవసారి విప్లవానికి నష్టం జరిగింది. ఇది భారతదేశంలోనే కాదు, ప్రపంచమంతటా పెట్టుబడిదారులు ఇలాగే మోసం చేస్తున్నారు. అందుకనే విప్లవాలకు నాయకత్వం వహించ వలసినది కార్మికవర్గం మాత్రమేనని మావో స్పష్టంగా చెప్పారు. భారత విప్లవం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద మాత్రమే విజయవంతం కాగలదు. అయితే భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ పుట్టి 50 ఏళ్ళు అయింది. ఈ 50 ఏళ్ళ చరిత్ర చూస్తే మావో చెప్పిన డ్రాగన్ కథ నాకు గుర్తుకొస్తుంది. డ్రాగన్‌ను చూడాలి చూడాలి అని ఉబలాటపడ్డ రాకుమారుడు తీరా అది గుమ్మంలో కొచ్చేసరికి గుండె ఆగి చచ్చిపోయాడట. ఇండియాలో రివిజనిస్టుల పని అలా వుంది. విప్లవం సమ సమాజం అని ఇన్నేళ్ళూ కేకలు వేసి, తీరా విప్లవం ఎజెండాలో కొచ్చేసరికి డ్రాగన్‌ను చూసిన రాజ కుమారుడిలా అయిపోయారు. ఇలా ఎందుకు జరిగింది? పార్టీ నాయకత్వం చాలా కరప్టు అయిపోయింది. దోపిడీ వర్గాలతో స్నేహాలేర్పర్చుకుని, వారితో కలిసి పోయారు. గనుకనే విప్లవమంటే వారికి సింహ స్వప్నంగా వుంది.

ఇండియాలో కమ్యూనిస్టు పార్టీకి మరొక తేడా వుంది. ఆంధ్ర దేశంలోనూ భారత దేశంలోనూ కమ్యూనిస్టు పార్టీ భూస్వాముల ఇళ్ళలో పుట్టి కార్మిక వర్గాన్ని వెతుక్కుంటూ బయలు దేరింది. తెలంగాణ సంగతే చూడండి. 1939లో ఇదే ఖమ్మంలో నేనొక పెద్దింటి పెళ్ళికి వచ్చినపుడు రావి నారాయణ రెడ్డిగారు కలిసి మేం పార్టీలో చేరాలనుకుంటున్నామన్నారు. వునికేపాడు అనే గ్రామంలో వీళ్ళందరినీ మొట్టమొదట తీసుకొచ్చి పార్టీలో జేర్చారు. ఆ రోజుల్లో 20 మంది పార్టీలో కొస్తే 19 మంది రెడ్డి ప్రభువులే. వాళ్ళతో పుట్టింది పార్టీ. తెలంగాణా పోరాటం జరుగుతూ వుంటే వీరంతా ఎక్కడున్నారో గుర్తుకు తెచ్చుకోండి. రావి నారాయణ రెడ్డిగారు బొంబాయిలో వున్నారు. సరే ఆ కథలా ముగిసింది. తెలంగాణా పోరాటం అంతా వృధా అయిపోయిందని నేననుకోవడం లేదు. నైజాంకు స్థానం లేకుండా చేసాము. అంతవరకూ విజయం. భూస్వామ్య విధానం రద్దుజేసి పొలాలు పంచుకుంటామన్నాం. అందులో ఓడిపోయాం. ఆ పోరాటం ఇప్పటికీ కొనసాగించవలసే వుంది. అందులో భాగంగా జరిగిందే పండితాపురం పోరాటం.

కామ్రేడ్స్!

ఆ విధంగా పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం మరోసారి ద్రోహం చేయడంతో, ఇంకా విప్లవ చేవ చావని యువకులు ఆ విప్లవాన్ని కొనసాగించాలనే పట్టుదలతో నక్సల్‌బరీ రైతాంగ పోరాటాన్ని ప్రారంభించారు. నక్సల్‌బరీ శ్రీకాకుళాలలో పోరాటాలు నడిచాయి. పండితాపురం జగిత్యాలల్లో నడుస్తున్నాయి? ఇక రేపు దేశమంతా కూడ పోరాటాలు నడుస్తాయి. యువతరం ఆ విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఆ విశ్వాసాన్ని నిజం చేయడానికి రాడికల్ యువజన సంఘం పుట్టింది. ఆ కర్తవ్యాన్ని అది నిర్వహిస్తుంది. అయితే ఇవాళ రాడికల్ యువజనులు, విద్యార్థులు గ్రామాలకు పోయి, రైతాంగానికి విప్లవ చైతన్యం కలిగించి సంఘటిత పర్చడానికి ప్రయత్నిస్తూ వుంటే మార్క్సిస్టు పార్టీ నాయకులు కుళ్ళుబోతు తనంతో నక్సలైట్లు ద్రోహులని, గూండాలనీ, హంతకులనీ దుష్ప్రచారాన్ని చేసారు. ఈ పెద్ద మనుష్యులే ఎన్నికలకు ముందు నక్సలైట్లు దేశభక్తులు, వీరులు అంటూ వారిని చంపించిన కాంగ్రెస్ ప్రభుత్వం మీద విచారణ జరిపించాలని భార్గవ కమీషన్ చుట్టూ తిరిగారు. నక్సలైట్లను సి.పి.యం. వారు తిట్టారని సి.పి.ఐ. వాళ్ళు అంటే లేదు నక్సలైట్ల దేశభక్తిని గుర్తించడంలో మేము ఎప్పుడూ ముందున్నామంటూ ప్రజాశక్తిలో పేజీలకు పేజీలు రాశారు. మరి తీరా ఎన్నికలు అయిపోయిన

తర్వాత ఇవాళ సి.పి.ఐ. వారి కంటే కూడా పెద్దగా నక్సలైట్ల మీద యుద్ధానికి వారు తొడ చరుస్తున్నారు. ఎందుకు? ప్రపంచంలో రివిజనిజం పట్ల వుండే అసహ్యాన్ని సొమ్ము జేసుకోవాలని ఉబలాటపడ్డ మార్క్సిస్టు పార్టీ వారికి విప్లవం అనే పెద్ద పులి తోక పట్టుకొని ఆటలాడినట్లయింది. సుందరయ్యగారు రివిజనిజం పట్ల ప్రజల్లో వున్న అసహ్యాన్ని సొమ్ముజేసు కోవాలనుకున్నారే కానీ, తీరా శ్రీకాకుళం రైతులు పోరాడుతూంటే వారికి నాయకత్వం వహించడానికి సిద్ధపడలేదు. అదే సమయంలో రష్యాలో పార్టీని స్వాధీనం చేసుకున్న రివిజనిస్టు ముఠాకు చైనా పార్టీ నాయకత్వం క్రింద విప్లవకారులకు మధ్య అంతర్జాతీయంగా బ్రహ్మాండమైన సిద్ధాంత చర్చ జరుగుతూ వుంటే అందులో స్పష్టంగా ఏ పక్షమూ వహించకుండా ఎటూ తేల్చి చెప్పకుండా పచ్చి అవకాశవాదం అవలంభించారు. కానీ అవకాశవాదంతో మనుషులు ఎల్లకాలం బతకలేరు. కంపూచియాపై వియత్నాం దురాక్రమణ చేస్తే ఇవాళ ఏదో ఒకటి చెప్పాల్సొచ్చింది. రెంటికి కాకుండా పోతామనే భయంతో మార్క్సిస్టు పార్టీ వారు ఇపుడు రష్యాను భుజాన వేసుకుని చైనాను తిట్టడానికి సి.పి.ఐ. కంటే ఎక్కువగా పెద్ద పెద్ద వ్యాసాలు రాయడానికి మొదలు పెట్టారు. ప్రపంచం మొత్తంమీద చైనాను వ్యతిరేకించడం, దేశంలో నక్సలైట్లకు వ్యతిరేకంగా పోరాటం ఇదే ఇపుడు వారి కార్యక్రమం నక్సలైట్ల మీద పోరాటం అని పేరుపెట్టుకుని ఆంధ్ర దేశంలో జరుగుతున్న రైతాంగ పోరాటంలో భూస్వాముల పక్షం వహించడానికి ఆ విధంగా తమ కేడర్‌ను మభ్యపెట్టి జోకొట్టడానికి వారు ఇదంతా చేస్తున్నారు. పండితాపురంలో మల్లయ్య పక్క వున్నామంటే ఎవరైనా మొఖాన కొడతారేమోననే భయం. నక్సలైట్ల మీద పోరాటం పేరుతో అక్కడ జేరి అదే పని చెయ్యొచ్చు, కానీ మీ బండారం త్వరలోనే బయట పడక తప్పదు. నక్సలైట్ల మీద పోరాటం అంటే వ్యవసాయ కూలీలమీద, పేద రైతుల, మీద ప్రపంచ వ్యాప్తంగా జరిగే సోషలిస్టు విప్లవం మీద పోరాటం. నక్సలైట్లతో పోరాడటమంటే భూస్వాములు, పెట్టుబడిదారుల చంకలో దూరటమే. ఈ సత్యం మీరెన్ని ముసుగులేసుకున్నా దాగదు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలకొచ్చారు కాబట్టే అబద్ధ ప్రచారం మీద బ్రతకాలనుకొంటున్నారు. మేం ఓంకార్‌ను చంపడానికి ప్రయత్నిస్తున్నట్లు తడవకోరకంగా ప్రచారం చేస్తూ బతుకుతున్నారు.

కానీ కామ్రేడ్స్!

అబద్ధాల మీద బతికే రోజులు పోయాయి. ఓంకార్ సంగతి మీరే ఆలోచించుకోండి. నక్సలైట్లు తనను చంపడానికి ప్లాను వేసుకు తిరుగుతున్నారని పత్రికల్లో స్టేట్‌మెంట్స్ ఇచ్చి పది రోజుల తర్వాత కా॥ రాజు నిద్ర పోతూండగా గొడ్డళ్ళతో నరికి చచ్చిపోయాడనుకుని విడిచి వెళ్ళారు. మరోసారి రెండు వందల మందిని ప్రోగేసుకుని మరొక కామ్రేడ్ ఇంటిపై బడి అతనిని చంపుదామని ప్రయత్నించారు. అతను రెండు నెలలు ఆసుపత్రిలో వుండి బతికి బయటపడ్డాడు. ఆయన ఎందుకు బతికాడో, వీళ్ళనేం జేస్తాడో అదీ చూద్దాం. అప్పుడూ ఇలాగే ముందుగా పత్రికల్లోనూ, అసెంబ్లీలోనూ గోల గోల చేశాడు. సుందరయ్యగారు అసెంబ్లీలో అన్నారు. తాము మేకపోతుల్లా చావదలచుకోలేదనీ పోట్లాడే చస్తామనీ. నక్సలైట్లు కూడా మేకపోతుల్లా ఎప్పుడూ లేరు. ఒక వంక ఇలా తొడలు చరుస్తూ ఇంకొక వంక ఓంకార్‌పై బాంబు లేశామంటున్నారు. అదీ హైదరాబాదులో. చిత్రం ఏమంటే ఆ బాంబుల్లో ఒకటీ పేలలేదట. మేం వేసిన బాంబులు ఎక్కడా బీరు పోలేదు మరి. బాంబులే వేయదల్చుకుంటే హైదరాబాదులోనే వేసేంత పిచ్చాళ్ళమా? మేము భూస్వాములతోనూ, చెన్నారెడ్డి ప్రభుత్వం తోనూ కలిసిపోయామట; అసలు సంగతేమంటే నర్సంపేట తాలూకాలో భూస్వాముల్లో సి.పి.యం. ఒకరి ప్రక్కనుంటే మిగతా పార్టీలన్నీ రెండో ప్రక్కనుంటాయి. భూస్వాముల్లో రెండు సెక్షన్ల మధ్య జరిగే పోట్లాటలో తక్కిన అన్ని పార్టీలకూ ఓంకార్ కామన్ శత్రువైపోయాడు. అవి భూస్వాముల మధ్య తగాదాలు మాకు వాటితో సంబంధం లేదు. ఇపుడు ఖమ్మం జిల్లాలో కూడా చూడండి. సి.పి.ఐ. వాళ్ళని సి.పి.యం. వాళ్ళు వాళ్ళని వీళ్ళు చంపుకుంటున్నట్లు పత్రికల్లో కన్పడుతుంది. వాస్తవమేమంటే ఒక పార్టీ వెంగళరావు వెనక చేరితే మరోటి సిద్ధారెడ్డి వెనుక చేరుతుంది. వీళ్ళిద్దరి మధ్య తగాదా ఏమంటే ఆ ఇద్దరి దౌర్భాగ్యుల్లోనూ ఎవడు అభ్యుదయవాదని. పేర్లేమి పెట్టుకున్నా అవి భూస్వాముల మధ్య కొట్లాటలు. మార్క్సిస్టు పరిభాషలో వాటిని ''అంతర్గత వైరుధ్యా''లంటాము. భూస్వాముల ముఠాల్లో సి.పి.ఐ. ఒకదాని వెనక, సి.పి.యం. మరోదాని వెనక చేరి ఇద్దరూ కలిసి మొత్తానికి పేదలకు పంగనామాలు పెడుతున్నారు. ఓంకార్ చేసేది కూడ ఇదే. అయితే ఒక మెట్టు పైకెక్కాడు. తెలంగాణా పోరాట కాలంలో పైపంచతో వరంగల్ జిల్లాకు వచ్చి పోరాటం తర్వాత అక్కడే స్థిరపడి పోయిన ఓంకార్, ఇపుడు నర్సంపేటలో ఒకటి, వరంగల్‌లో ఒకటి రెండు డాబాలు కట్టాడు. హైదరాబాద్ తిలక్ రోడ్డులో మరోటి కట్టిస్తున్నాడు. ఈ విప్లవకారుడికి, ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చింది? భూస్వాముల ఏజెంటు ఆయనా? మేమా? నక్సలైట్లను భూస్వాములతో కలిసి పోయారని విమర్శించ దలుచుకుంటే సూర్యుని మీద వుమ్మి వేయడానికి ప్రయత్నించినట్లే అవుతుంది. మార్క్సిస్టు పార్టీ సోదరులారా ఓంకారు నడ్డం పెట్టుకుని మీరు మాతో యుద్ధం చేయదల్చుకుంటే మీరు ఎక్కుతున్నది కుంటి గుర్రం అని జ్ఞాపకం పెట్టుకోండి, మార్క్సిస్టు పార్టీ క్యాడరుకు నేను మనవి చేసేదేమంటే మేము మిమ్మల్ని రివిజనిస్టు లంటున్నది మీ విప్లవ దీక్షను శంకించి కాదు. మీ నాయకత్వం చేస్తున్న ద్రోహాన్ని చూసి మాత్రమే. కామ్రేడ్స్, మీ విప్లవ దీక్షను, చైతన్యాన్ని విప్లవం పట్ల మీ ఆకాంక్షను, చైతన్యాన్ని విప్లవం పట్ల మీ ఆకాంక్షను ఇది వరకులాగే మనసులో దాచి పెట్టుకునే రోజులు చెల్లిపోయాయి. బాహాటంగా బజార్లోకి రండి. మీ నాయకత్వాన్ని చీవాట్లు పెట్టండి. విప్లవం పేరు చెప్పుకుని డాబాల మీద డాబాలు లేపుకునే ఓంకార్లని నాయకత్వం నుంచి లాగి పారేయండి. పండితాపురం లాంటి పోరాటాలు జరుగుతూంటే రైతుల పక్షాన నిలబడమని చెప్పండి. అది దేశానికి మంచిది. మేమూ సహకరిస్తాము. అలాగే సి.పి.ఐ. వెనుక కూడ చిత్తశుద్ధిగల క్యాడరు వున్నారు. పోరాటం వుధృతమయ్యేకొద్దీ ఏనాటికైనా వీరంతా విప్లవంలో కలిసి వస్తారనే నమ్మకం నాకు వుంది.

రష్యా సామ్రాజ్యవాదం అమెరికాతో పోటీపడుతూ మరో యుద్ధానికి కాలు దువ్వుతోంది. పత్రికలు చూసేవాళ్ళకు ఈ ప్రమాదం అర్థమై వుండాలి. మూడవ ప్రపంచ యుద్ధం వస్తే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఇప్పటికే కరువు కాటకాలతో, అధిక ధరలతో సతమతమవుతున్న పీడిత ప్రజానీకం ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు మరెన్ని ఈతి బాధలకు గురికావాలో వూహించలేము. 1945లో యుద్ధం అయిపోయిన తర్వాత వచ్చిన బెంగాల్ కరువులో సెకండుకు ఒకరు చొప్పున ఒక్క బెంగాల్‌లోనే 30 లక్షల మంది చచ్చి పోయారు. ఈసారి మరొక యుద్ధమే వస్తే ప్రపంచ పీడిత ప్రజానీకం ఇంతకంటే దుర్భర పరిస్థితుల్ని ఎదుర్కోక తప్పదు. అందువల్ల ప్రపంచ ప్రజానీకం అంతటితోనూ కలిసి మనం కూడా యుద్ధాన్ని రానివ్వం అని ముక్తకంఠంతో నినదిద్దాం. అయినా సామ్రాజ్యవాదులు లక్ష్యపెట్టకుండా యుద్ధానికే తలపడితే చరిత్ర చెప్పిన పాఠాల గురించి వారిని హెచ్చరిద్దాం. యుద్ధాల వల్ల ప్రజానీకం నష్టపడటం ఖాయం కానీ యుద్ధం తరువాత విప్లవాలు చెలరేగక తప్పదని కూడ చరిత్ర

తేల్చి వేసింది. సామ్రాజ్యవాదులారా! మొదటి ప్రపంచాన్ని పంచుకోడానికి మీరు ప్రయత్నిస్తే రష్యాలో విప్లవం గెలిచింది. మీరు రెండవసారి యుద్ధానికి తలపడితే మీరు అనుకోని విధంగా 80 కోట్ల చైనాలో విప్లవం వచ్చింది. తూర్పు యూరప్ దేశాల్లో ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. చరిత్రను లెక్క చేయకుండా తిరిగి యుద్ధానికి తలపడితే ఈసారి ప్రపంచ వ్యాపితంగానే సామ్రాజ్యవాదం నశించిపోక తప్పదు. ప్రపంచ వ్యాపితంగా సోషలిజం విజయవంతమై తీరుతుంది.

భారతదేశంలో విప్లవం గెలుపొందటానికి మహత్తరమైన అవకాశాలు ఏర్పడ్డ సమయమిది. అయితే ఈ సమయంలోనే రివిజనిస్టు పార్టీల విద్రోహం వల్ల విప్లవానికి సమర్థవంతమైన నాయకత్వం సమకూడలేదు. ఆ లోటును భర్తీ చేయడానికి ఆర్.వై.యల్., ఆర్.యస్.యు. గట్టిగా కృషి చేయాలి. గట్టిగా కృషి చేయడమంటే మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం బాగా అధ్యయనం చేసి గ్రామాలకు పోయి పీడిత రైతాంగంతో మమేకమై పోరాటానికి వారిని సన్నద్ధం చేయాలి. మావో ఆలోచనా విధానం గైడెన్సుతో కార్మికవర్గ పార్టీ నాయకత్వం క్రింది రైతాంగ పోరాటాలలో ముందుపీఠిన నిల్చి వారికి నాయకత్వం అందించాలి. అపుడు మనం తప్పనిసరిగా విజయవంతం కాగలం. విద్యార్థులు, యువజనులకే కాదు ఉపాధ్యాయులకు, ప్రభుత్వోద్యోగులకు, మేధావులందరికీ నేను విజ్ఞప్తి చేసేదేమంటే మావో చెప్పినట్లు మీరంతా నిజంగా విప్లవానికి అంకితం కావలసిన సమయం ఆసన్నమైంది. మీ మేధస్సును శక్తియుక్తులను విప్లవానికి తోడుగా వినియోగించండి. మీ ఆకాంక్షలు నెరవేరుతాయి. విప్లవం గెలుస్తుంది. ఆ సమయం వచ్చింది. అందుకుమీరు తయారు కావాలని కమ్యూనిస్టు పార్టీ (మా-లె) తరఫున నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రజలు విప్లవానికి ఆయత్తమౌతున్న ఈ సమయంలోనే రివిజనిస్టులు మరో కొత్త వేషంతో రంగం మీదికి వస్తున్నారు. వామపక్ష ఐక్యసంఘటన కావాలని గోల చేస్తున్నారు. ఇది దేని కోసం? ఏం చేయడం కోసం? భారత దేశంలో బడా పెట్టుబడిదారులను నిలబెట్టడానికా? పడగొట్టడానికా? దోపిడీ పాలనను కూలదోయడానికే అని మీరు స్పష్టంగా చెప్పండి మేము చేరుతాము. కానీ మాకు తెలుసు ఏదో మాయాజాలంతో దీన్ని నిలబెట్టడానికే మీరు పాటుపడుతున్నారు. ఎమర్జెన్సీకి ముందు జయప్రకాష్ నారాయణ్ గారు ఇలాగే ఇలాంటి పెద్ద పెద్ద పేర్లతోనే బీహారు, గుజరాత్‌లలో పెద్ద పెద్ద పోరాటాలే లేవదీశాడు. అపుడు మేం అడిగాం ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ప్రారంభించిన మీ పోరాటం ఆవిడపోతే ఆపేస్తారా? లేక దోపిడీ ప్రభుత్వాలు పోయే వరకు కొనసాగిస్తారాని. ఆనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోట్లాడిన వారందరినీ జనతా పార్టీగా కూడగట్టి ఎన్నికల్లో నిలబెడితే వీళ్ళంతా పోరాటం చేసేవాళ్ళే గదా అనే భ్రమతో ప్రజలు ఓట్లువేసి గెలిపించారు, కానీ ఏమైంది. ఆ జనతాపార్టీ చేస్తున్న ఘోరాలు చూస్తూ జయప్రకాష్ చావలేక బ్రతకలేక బతుకుతున్నాడు. అలాంటి చరిత్రను ఈ వామపక్ష ఐక్య సంఘటన కూడ తిరిగి సృష్టించదలచుకుంటే అది విప్లవానికి మరోసారి ద్రోహం చేయడమే. ఇలాంటి అనుమానాలు ఎందుకు అని అడగవచ్చు, ఈ మధ్యనే ఈ రివిజనిస్టు పార్టీలు జరిపిన ''భూమి పోరాట వార తతగం చూస్తే అనుమానించక తప్పటం లేదు. భూమికోసం పోరాడే వాళ్ళు కలెక్టరాఫీసుల్లోనూ, తాలూకాఫీసుల్లోనూ పోరాడతారా? కలెక్టరాఫీసులో భూమి ఎక్కడుంది? భూమి కావాలంటే పండితాపురం వెళ్ళాలి, జగిత్యాల వెళ్ళాలి. ప్రతి ఊరికి వెళ్ళాలి. కాని మన రివిజనిస్టులు అలా చెయ్యరే. పోనీ ఏదో వొకటి చేస్తున్నారు భూమి పోరాటమనే పేరయినా వార్తల్లో కొస్తుందని సంతోషించాము. కానీ ఇంతలోనే చెన్నారెడ్డి పంచాయితీ ఎన్నికలు వాయిదా వేశారు. వీరి భూమి పోరాటం కూడ వెనక్కు పోయింది. ఇలా ఎలక్షన్ స్టంట్‌ల కోసం వేసుకునే వేషమే అయితే ఈ ఐక్య సంఘటన వల్ల విప్లవానికి ద్రోహమే జరుగుతుంది. వీరు కట్టదలుచుకున్న ఐక్య సంఘటన ఎవరితో? జనతాలో చాలామంది ప్రజాస్వామిక వాదులున్నారు. వారందరూ వస్తేనే ఐక్య సంఘటన అంటున్నారు బసవపున్నయ్యగారు. ఇందిరాగాంధీ చెడ్డదే గానీ, ఆమె వెనకాతల చాలామంది ప్రజాస్వామిక వాదులున్నారు. వారు వస్తేనే నిజమైన ఐక్య సంఘటన అంటున్నారు, రాజేశ్వర రావుగారు. ఆ రకంగా ఇది ప్రజలు విప్లవ పోరాటాలకు సమాయత్తమౌతున్న కాలంలో జనతాలోంచి కొందరిని, కాంగ్రెసులోంచి కొందరిని కలిపి ఏదో ఒక రకంగా అధికారంలోకి రావాలనే దుష్ప్రయత్నమే తప్ప వేరేం కాదు. వీళ్ళు గెలవలేరు, గెలిచినా జనతా పార్టీ కంటే ఇందిరాకంటే చేయగలిగేది చేసేది కూడ ఏం లేదు. అందుకని ఈ వామపక్ష ఐక్య సంఘటనల్ని వ్యతిరేకించమని నేను కోరుతున్నాను. పోరాటానికి తయారుకండి అని మనవి చేస్తున్నాను. విముక్తికి వేరే మార్గం లేదు.

విప్లవం చేయాల్సిందే కానీ మనం ఎలా గెలుస్తాం అంటున్నారు కొందరు. రష్యాలో గెలిచిందంటే అక్కడ చాలామంది సైనికులు ఎదురుతిరిగారట. ప్రభుత్వానికి పెద్ద సైన్యం, తుపాకులు, టాంకులు వుండగా మనం ఎలా గెలుస్తాం అంటున్నారు. నేను ముందే చెప్పాను. పోరాడాలని కృతనిశ్చయం వుంటే దారి అదే దొరుకుతుంది. వాళ్ళ పద్ధతులు వాళ్ళకుంటే మన పద్ధతులు మనకున్నాయి. ఎంత పెద్దదయినా తాచుపాము చీమల చేతిలో చావదా? అమెరికావోడు వియత్నాం రైతుల చేతుల్లో ఓడిపోలేదా? వియత్నాం విస్తరణవాదులు కంపూచియా ప్రజల చేతుల్లో చావుదెబ్బ తినడం లేదా? మంది మన పక్షాన వుంటారు కనక మనది న్యాయమైన పోరాటం కనుక మనం గెలిచి తీరుతాం. ఆయుధాలంటారా అవే వస్తాయి. మాట వరసకు చెప్పున్నానుకోకండి. పోలీసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతారని మీరు ఎన్నడైనా అనుకున్నారా? వారూ పోరాడాల్సిన అవసరం వచ్చింది. పోలీసులు ఎదురు తిరిగితే సైన్యాన్ని పిలిపించారని కాల్పుల్లో కొందరు పోలీసులు చనిపోయారని, కొందరు ఆసుపత్రిలో చేరారని, అహ్మదాబాద్‌లో కంట్రోలు రూం ధ్వంసం చేసివేశారని, కొన్నివేల రూపాయలో లక్షల రూపాయలో నష్టం వచ్చిందని ఎన్నో ఆయుధాలు కన్పడ్డం లేదని వార్తలు వస్తున్నాయి. ఈ తుపాకులెత్తుకు పోయిన పోలీసులందరూ ఏం చేయాలో మీరే ఆలోచించండి. దొరికితే మొరార్జీ వీళ్ళను ముద్దు పెట్టుకుంటాడా? విధిలేక పోరాటంలోకి దిగిన ఈ పోలీసులు తుపాకులు ఎత్తుకు పోయిన తర్వాత నాలుగైదు నెలలు ఎక్కడో దాక్కొని తర్వాతయినా నక్సలైట్లను వెతుక్కుంటూ వస్తారు. వారెక్కడున్నారో వెతుక్కుంటూ మనం వెళ్తాం. ఎందుకంటే వారి పోరాటం మన పోరాటం ఒకటే. మీకు తెలుసు. మేం రహస్య జీవితంలో వున్నపుడు మేం కనబడితే కొందరు పోలీసు ఆఫీసర్లు చూసి చూడనట్లు తప్పుకున్నారు. వాళ్ళ మనస్సులో కూడ ఈ ప్రభుత్వం పోవాలనుంది కనుక విప్లవానికి వారు చేయగల్గిన సహాయమిది. ఈరోజు సామ్రాజ్యవాదం, అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు బయటికి ఎంత బలంగానైనా కనపడవచ్చు. కానీ, మావో చెప్పినట్లు వారంతా కాగితం పులులే. కాగితం పులి అంటే అర్థం మొరార్జీ ఎక్కిన విమానం నడవదని, వాళ్ళ టాంకుల్లో పెట్టిన తుపాకీ పేలదనీ కాదు. వారికి ఎన్ని తుపాకులు, టాంకులు వున్నా వాటిని నడిపేవాళ్ళంతా పేదవాళ్ళే. వెంగళరావు కొడుకో, సిద్ధారెడ్డి కొడుకో పోలీసుల్లో చేరరు. సంజీవరెడ్డి మనవడో ఇందిరాగాంధీ కొడుకో సైన్యంలో చేరరు.

(తరువాయి 18వ పేజీలో...)

(22వ పేజీ తరువాయి...)

సాంస్కృతిక సేన గెరిల్లా దళాలతో పాటు యూనిఫాంతో వుంటూ ప్రదర్శనలిచ్చేది. ఈ చరిత్రలో కా॥ దివాకర్ భాగమయ్యాడు. సాంస్కృతిక సైనికుడిగా అజ్ఞాతవాసం ఆరంభించిన దివాకర్ తరువాత సాయుధ గెరిల్లాగా రూపొందాడు. ఈ విధంగా అట్టడుగు దళిత కులం నుంచి, నిరుపేద నేపథ్యం నుంచి వచ్చి వైద్య వృత్తిని తృణప్రాయంగా వదిలి, పదేళ్ళపాటు ప్రజా సాంస్కృతిక కార్యకర్తగా, ఆర్గనైజర్‌గా, నాయకునిగా రూపొందిన దివాకర్ కళాకారులకుండే విస్తృత జనాకర్షణను అవలీలగా అధిగమించి అజ్ఞాత జీవితానికి వెళ్ళి అక్కడ సాయుధ గెరిల్లాగా, క్యాడర్‌గా జీవితం మొదలెట్టి ప్రాంతీయ స్థాయి నాయకత్వానికి ఎదిగాడు. నల్గొండ జిల్లా కార్యదర్శిగా, దక్షిణ తెలంగాణా రీజినల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పోరులో నేలకొరిగాడు.

అమెరికా సామ్రాజ్యవాదపు పెంపుడు కుక్కగా రాష్ట్రాన్ని ఏలుతున్న చంద్రబాబునాయుడి నాలుగేళ్ళ పాలనపై (1995-99) జననాట్య మండలి 2000 సం॥రంలో తీసిన వీడియో చిత్రం కా॥ దివాకర్ కళాకౌశలానికి, రాజకీయ అవగాహనకి అద్దం పట్టింది. ఈ నాటకంలో దివాకర్ స్వయంగా చంద్రబాబు పాత్ర వేశాడు. చిరుగడ్డం పెట్టుకుని, చూపుడువేలితో బెదిరించే చంద్రబాబు మానరిజం కూడా పట్టుకుని దివాకర్ ఇందులో ప్రదర్శించిన నటనా కౌశలం కాగితం పులిలాంటి చంద్రబాబును అచ్చంగా తలపింపజేసి కడుపుబ్బా నవ్వు పుట్టిస్తుంది. మరోవైపు చంద్రబాబు మాటల్లో, చేతల్లో వ్యక్తమవుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఫలితాల పట్ల జనం క్రోధంతో రగిలిపోయేలా చేయటంలో దివాకర్ నటన సఫలీకృతమయింది.

దక్షిణ తెలంగాణా జె.యస్.యం. కార్యక్రమాల నివేదిక కాని, యాదగిరి గుట్ట పోలీస్ స్టేషన్‌పై దాడి జరిగిన వెనువెంటనే జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన నాటి నల్గొండ జిల్లా కమిటీ కార్యదర్శి కా॥ కిరణ్ (ప్రభాకర్)పై తీసుకొచ్చిన పుస్తకం కాని దివాకర్ సాంస్కృతిక నాయకత్వానికి అద్దం పడతాయి.

శ్రీకాకుళ పోరాట కాలంలో డాక్టర్ చాగంటి భాస్కరరావు, సుబ్బారావు పాణిగ్రాహిలు మేధావులకు, కళాకారులకు ఆదర్శనీయులుగా నిల్చినట్లే, కా॥ దివాకర్ పీపుల్స్‌వార్ నేతృత్వంలో సాగుతున్న అభివృద్ధి చెందిన తెలంగాణా విప్లవోద్యమానికి నమూనాగా వెలుగొందుతాడు. 1985-90ల మధ్యకాలంలో గడిపిన అజ్ఞాత జీవితం కాక, 1991-2001 మధ్యలో పదేళ్ళపాటు గడిపిన అజ్ఞాత జీవిత క్రమంలో దివాకర్ దక్షిణ తెలంగాణా రీజినల్ కమిటీ స్థాయి నాయకత్వానికి ఎదిగాడు. '98 వరకు నల్గొండ జిల్లా కార్యదర్శిగా వుండిన ముక్కా వెంకటేశ్వర్లు (కిరణ్)కి నిజమైన వారసుడిగా దివాకర్ నిరూపించుకున్నాడు. కా॥ కిరణ్ అమరత్వం తర్వాత జిల్లా కేడర్ల, ప్రజల స్థైర్యాన్ని నిలబెట్టడమేగాక వర్గ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకుపోయాడు.

కా॥ దివాకర్ నల్గొండ జిల్లా కార్యదర్శిగా వున్న కాలంలోనే పీడిత ప్రజలు అత్యంత తీవ్రంగా అసహ్యించుకున్న మాధవరెడ్డి (మాజీ హోంమంత్రి) జిల్లాలోనే పేలిన మందుపాతర దెబ్బకు ఎగిరి చచ్చాడు. 1998లోనే దివాకర్ వ్యక్తిత్వాన్ని, ప్రజల్లో తనకున్న విలువను దెబ్బతీసేందుకు శత్రువు తీవ్రంగా ప్రయత్నించాడు. విద్రోహి నయీముద్దీన్ ప్రజాగాయని బెల్లి లలితను కిడ్నాప్ చేయించి 17 ముక్కలుగా నరికి చంపించి రాజ్యం వత్తాసుతో ఈ కళంకాన్ని దివాకర్‌కి ఆపాదించాలని ప్రయత్నించాడు. అయితే లలిత, దివాకర్‌ల చరిత్రను కళంకపర్చాలని ధర్మన్న పేరుతో ఫోర్జరీ లెటర్ రాసింది విద్రోహి నయీముద్దీనే అని ఒక తెలుగు పత్రిక సాక్ష్యాధారాలతో సహా నిరూపించింది.

ప్రజాయుద్ధంలోనూ, ప్రజా సాంస్కృతిక సైన్యంలోనూ అంకిత భావం కల్గిన, మచ్చలేని యోధుడు కా॥ దివాకర్. తన నిర్మాణపరమైన, నాయకత్వపరమైన లక్షణాలతో సాయుధ, సాంస్కృతిక రంగాలు రెండింటిలోనూ దక్షిణ తెలంగాణా స్థాయి రీజినల్ నాయకత్వానికి ఎదగ గలిగాడు.

జూన్ 9 నాటి ఎన్‌కౌంటర్‌లో చంపబడిన కనగల్ అమరులకు నివాళి నర్పించేందుకోసం, జూన్ 20, 21 తేదీలలో జిల్లా బంద్ నిర్వహించేందు కోసం నల్గొండ జిల్లాలోని దళాలతో సమావేశం జరుపుతున్న సందర్భంలోనే కా॥ దివాకర్ సైతం అమరుడయినాడు. కళాకారుడూ, రచయిత, నటుడు, గాయకుడు, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమ నేత ... ఇలా 20 సం॥ల విప్లవ జీవిత క్రమంలో తాను అధిరోహించిన ఉన్నత శిఖరాలు ఎన్నయినా కావచ్చుగాక, కాని ఏ స్థాయికి ఎదిగినా తొలినాళ్ళ నుంచి తనలో రూపొందిన ఆ వినయం, సహన భావం, సౌజన్యతల నుంచి కా॥ దివాకర్ ఎన్నడూ వైదొలగలేదు. కళారంగంలో ఇంతటి నిరుపమాన వైవిధ్యాన్ని సాధించినా, కా॥ దివాకర్‌లో ఎక్కడ కూడా కాగడా పెట్టి వెతికినా అహంకారం అనేది కనబడదు. ఈ ఒక్క లక్షణమే సాంస్కృతిక రంగంలో తనను మకుటాయమానంగా, మణిపూసగా నిలిపి వుంచింది. కేడర్ నుంచి నాయకత్వం దాకా ప్రతి ఒక్కరూ దీన్నుంచి నేర్చుకోవాలి. మట్టిలోంచి రూపొందిన మాణిక్యంలా ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో ప్రేమమూర్తిగా, సాధుశీలిగా నిలిచిన కామ్రేడ్ దివాకర్ రక్తప్లావిత ఆచరణను 'క్రాంతి' స్మరించుకుంటూ వినమ్రంగా అంజలి ఘటిస్తోంది. ❑



## ఆ పాప స్మృతిలో.....

**రాజ్యాన్ని ప్రశ్నించినందుకు తల్వారులతో నరికిచంపారు. తెలం'గానం' చేసినందుకు 17 ముక్కలుగా నరికి పొలాల్లో, బావుల్లో వెదజల్లారు. ఈ పసిగుడ్డు ఎవర్నీ నిలదీయలేదు. దేనిమీదా పాడలేదు. ఇలాంటి ఇంకే 'నేరానికీ' పాల్పడలేదు. ఒక కవి అన్నట్లు 'పాలు తప్ప పాపం ఎరుగని బాల్యం'..... అమ్మతో కలిసి రాచకొండ గుట్టల్లోకి పోయింది. అడవికీ, ఆదివాసీ పసిపాపకి అదొక జాతి సహజ బంధం. అందుకే చంపేశారు. క్రూరంగా, ఘోరంగా చంపేశారు. నిండా రెండేళ్ళు లేవు... రాజ్యం ఎంతగా పతనమై వుంటే తప్ప ఇది 'క్రాస్ ఫైరింగ్' మరణమవుతుంది! ఈ పసి హృదయపు నిర్మలాంతఃకరణ ముందు తలవంచి వినమ్రంగా.....**

# బూటకపు ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన కనగల్ దళ కామ్రేడ్స్‌కి అరుణారుణ జోహార్లు!

నల్గొండ జిల్లా నాంపల్లి మండలం నామానాయక్ తండా సమీపంలో జూన్ 9 శనివారం నాడు గ్రేహౌండ్స్ పోలీసులు కనగల్ దళ సభ్యులు ఆరుగురితో సహా ఒక ఆదివాసీ మహిళను అసమ యుద్ధంలో పొట్టన బెట్టుకున్నారు. ఒక బావి దగ్గర స్నానాలు చేస్తూ వంట వండుకుంటూ నిరాయుధంగా వున్న దళ సభ్యులను వందలాది పోలీసులు చుట్టుముట్టి గ్రైనేడ్‌లు విసిరి గాయపర్చి, కాల్చి చంపి బూటకపు ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. శత్రువుకు అనుకూలమైన వేసవి కాలం క్యాంపెయిన్ చివరి దశలో ఏమరుపాటుకు గురై శత్రు వలలో చిక్కిన కనగల్ దళ సభ్యులను అరెస్టు చేయడానికి, చట్టం ప్రకారం విచారణ జరపటానికి వున్న అవకాశాలను పోలీసులు ఏ మాత్రం ఖాతరు చేయలేదు. నిజానికి ఆ దళ సభ్యులలో మృతులందరినీ పూర్తిగా గుర్తించటం కూడా సాధ్యం కాలేదు. కానీ చంద్రబాబు నాయుడు, డి.జి.పి. దొరల కావలికుక్కలుగా పనిచేస్తున్న గ్రేహౌండ్స్, ఏ.పి.యస్.పి. పోలీసులు ఏకపక్షంగా, ఏ విచారణ లేకుండా తమంతట తామే మరణశిక్ష విధించి కనగల్ దళ సభ్యులను పాశవికంగా చంపేశారు. ఈ సంఘటనలో కనగల్, క్రిష్ణపట్టి ఎల్.జి.ఎస్.లతో కూడిన ఏరియా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ భాస్కర్ అమరుడు కావడం నల్గొండ జిల్లా ఉద్యమానికి తీవ్ర నష్టం కల్గించింది. కా॥ భాస్కర్‌తో పాటు కనగల్ ఎల్.జి.ఎస్. కమాండర్ కా॥ కవిత; శ్యాం, పద్మ తదితర కామ్రేడ్స్ కూడా అమరులయ్యారు. అందిన మేరకు ఈ సంఘటనలో అమరులయిన వారి జీవిత వివరాలను (ఫోటోలు లభ్యమైన మేరకు) ఇక్కడ ప్రచురిస్తున్నాం.

## కా॥ భాస్కర్

కా॥ భాస్కర్ అసలు పేరు సుంకర రామ్మోహన్ రావు. వూరు వరంగల్ జిల్లా, చిట్యాల మండలంలోని కుందనపల్లి. కాల క్రమంలో తండ్రి టీచర్ అయినప్పటికీ తన బాల్యం పేదరికంలోనే గడిచింది. వూరి వాడే అయినా దళితుల ఇండ్లలోనే గడిపే సంస్కారం, ఇంటిపనులు, వంటపనులు చేయటం చిన్నప్పటి నుండి అలవాటు. భారతీయ సమాజంలో 'మినీ విప్లవం'లా కనిపించే ఈ నూతన సంస్కృతీ సంస్కారం తనను సహజంగానే విప్లవంపట్ల ఆకర్షితుడిని చేసింది. వూర్లో సంఘం లేనందువల్ల పార్టీతో పరిచయం కాకున్నా, కరీంనగర్ జిల్లా జమ్మికుంట కాలేజీలో ఇంటర్ మొదటి సం॥రం చదువుతున్న సమయంలోనే విప్లవ రాజకీయాలతో ప్రభావితం అయ్యాడు. తమ క్లాసులో తెలుగు టీచర్‌గా వస్తున్న వ్యక్తి విప్లవ కవి కావటం గొప్ప స్ఫూర్తిగా వుండేది. కాలేజీ లైబ్రరీలలో, మేగజైన్లలో అభ్యుదయ సాహిత్యం చదవటం తనలో సాహిత్యాభిలాషను బాగా పెంచింది. సాహిత్య అధ్యయనం పట్ల గాఢానురక్తి, చదివి విన్న విషయాలను తేదీలతో సహా బాగా గుర్తు పెట్టుకోవటం తర్వాత విప్లవ జీవితంలో తనకెంతో ఉపకరించాయి.

ఇంటర్ మధ్యలో ఆపి, మెదక్ జిల్లా జహీరాబాద్‌లోని పాలిటెక్నిక్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. ప్రజా సంఘాల మీటింగులన్నింటికీ వెళ్ళడం, విస్తృతంగా పుస్తకాలు కొనడం, చందాలు పోగేసి కాలేజీలో మంచి గ్రంథాలయాన్ని ఏర్పర్చి విప్లవ సాహిత్యాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం వ్యాపకమైంది. పాలిటెక్నిక్ పరీక్షలయిన వెంటనే పార్టీ కాంటాక్టులోకి రావడంతో గ్రామీణ వుద్యమంలో అడుగిడినాడు. మొదట్లో 1985లో వరంగల్ జిల్లా ములుగు ప్రాంతంలో సత్యం పేరుతో పనిచేశాడు. అప్పట్లో దళాలు లేవు 1+1 పద్ధతి వుండేది. ఫైల్స్, అమీబియాసిస్‌తో బాధపడుతున్నా, తోటి కామ్రేడ్స్‌తో పాటు తమ సి.ఒ. కూడా ఇంటికెళ్ళి పోయినా నిబ్బరంగా నిలబడినాడు. కానీ తల్లి ప్రేమకు కట్టుబడి పోవడం అనే 'బలహీనత' వల్ల సం॥రం తర్వాత ఇంటికెళ్ళాక తల్లి వత్తిడితో ఇంటి దగ్గరే వుండి పోయాడు. తన పొరపాటును గుర్తిస్తూనే, విప్లవం పట్ల అనురక్తిని వదులుకోకుండా, గ్రామంలోనే సంఘ నిర్మాణం చేయాలని అనుకున్నాడు. ఆనాటికి తమ వూరికి వచ్చే సి.ఒ. కూడా ఇంటికెళ్ళి పోవడంతో పార్టీ కాంటాక్టు దొరకని స్థితి. ఇంట్లో పెళ్ళి వత్తిడి, గ్రామంలో యువకులు వుండలేని నిర్బంధ పరిస్థితి, దీంతో 3 సం॥ల పాటు హైదరాబాద్‌లో, ఒరిస్సాలో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ బతికాడు. ఈ 3 సం॥లలో పార్టీ కాంటాక్టు లేదు. ఎక్కడ ఉద్యోగం చేసినా ప్రజల్తో సన్నిహితంగా వుండటం, పై స్థాయి అధికారులతో సైతం రాజకీయ చర్చలు జరుపుతూ అభ్యుదయ సాహిత్యాన్ని అందిస్తూ వారిని సానుభూతిపరులుగా మార్చేందుకు ప్రయత్నించేవాడు. తల్లిదండ్రులు కట్నంతో కుదిర్చిన పెళ్ళిని కాదని, తన భావాలతో సరిపడగల వ్యక్తితో స్నేహ సంబంధం పెంచుకుని, రాజకీయ జ్ఞానం అందించి 3 సం॥ల తర్వాత వూర్లోనే 1990లో స్టేజి మ్యారేజ్ చేసుకున్నాడు. తన పెళ్ళి వూరులో కులాంతర వివాహాలకు దారి తీయాలని తపన పడేవాడు.

పెళ్ళి తర్వాత పార్టీకి షెల్టర్ ఇస్తూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో టెక్నికల్ పనులు చేసిపెడుతుండేవాడు. పార్టీ సలహాతోనే కెమికల్ సప్లయిర్‌గా పనిచేస్తున్న బిజినెస్‌నే కవర్‌గా ఉపయోగించుకున్నాడు. పిల్లలు వద్దని బలంగా అనుకున్నా, తగిన జాగ్రత్తలు పాటించనందుకు పాప పుట్టింది. ఆడపిల్లలు లేని ఇంట్లో పెద్దలు ఎంత సంబరపడ్డా పాపను వారివద్దే వదిలితే ఆమె పార్టీకి దూరమయ్యే అవకాశం వుంటుందని 4 నెలల పాపతో 1992 మార్చి నెల్లో పూర్తికాలం పార్టీలోకి వచ్చేశారు. మరో సం॥రం తర్వాత పాపను సానుభూతిపరులకు అప్పగించారు. బిజినెస్‌లో తన వాటాగా వచ్చిన 30 వేల రూ॥లను పార్టీకి ఫండ్‌గా ఇచ్చాడు.

1995 ఏప్రిల్ దాకా ఏ.పి. రాష్ట్రకమిటీ టెక్ వర్క్‌లో వుంటూ పుస్తకాల గోడౌన్ మెయిన్‌టెయిన్ చేయటం, పంపిణీ, జిరాక్స్, బైండింగ్ తదితర అవసరాలు తీరుస్తూ చిన్నా చితకా పనులనేకం చేయడంలో బాగా శ్రమించేవాడు. '95 ఏప్రిల్ నెల్లో నల్గొండ జిల్లా క్రిష్ణపట్టి దళంలో శాక్ మెంబర్‌గా అయ్యాడు. '95లోనే ఆలేరు ఏరియాలో పట్టణ సి.ఒ.గా పనిచేశాడు. '96 ఫిబ్రవరిలో రాష్ట్రకమిటీ పనులపై తిరిగీ టెక్ రంగానికి వెళ్ళాడు. రెండోసారి టెక్ వర్క్‌లో ప్రింటింగ్, బైండింగ్, ట్రాన్స్‌పోర్ట్ వంటి రిస్క్‌తో కూడుకున్న పనులన్నీ ఎంతో పట్టుదలతో చేసేవాడు. కాంటాక్టు స్థలాల్లో అత్యంత జాగరూకతతో వుండటం, కాంటాక్టుల విషయంలో క్రమశిక్షణను పాటించడం చేసేవాడు. రెండేళ్ళ తర్వాత తిరిగి గ్రామీణ ప్రాంతానికి వెళతానన్న షరతు ప్రకారం 1998లో టెక్ రంగం నుండి నేరుగా క్రిష్ణపట్టి శాక్‌లోకి వచ్చాడు. కొద్ది రోజులకే పావురాలగట్టు సంఘటన జరగడం... దళం తిరగలేని స్థితి, కనగల్, క్రిష్ణపట్టి దళాల్లో సభ్యుల

లొంగుబాట్లు, తదితర పరిస్థితుల్లో నిబ్బరంగా వుంటూనే మిగిలిన క్యాడర్ మానసిక స్థైర్యాన్ని నిలబెట్టేందుకు కృషి చేశాడు. ఈ సంఘటనలో సోమ్లానాయక్ దుష్కృత్యానికి తీవ్రంగా గాయపడిన తన సహచరి ఏమైందో కూడా తెలీని స్థితిని, బాధను అధిగమించి నిలబడ్డాడు. '98లోనే రాచకొండ దళానికి డిప్యూటీ కమాండర్‌గా వెళ్ళాడు. దళంలో వుంటూనే రాష్ట్రకమిటీ పంపే పనులపై బయటి రాష్ట్రాలకు పోయి వచ్చేవాడు. వచ్చీరాని భాషలతోనే వ్యవహారాలు నెరవేర్చగలననే ఆత్మవిశ్వాసం మెండుగా తనలో వుండేది. ఈ క్రమంలో ఆయుధాల సరఫరా వంటి రిస్క్‌తో కూడిన పనులను కూడా నిబ్బరంగా పూర్తి చేసుకొని రావడానికి కృషి సల్పాడు.

'98లో కనగల్ కమాండర్‌గా ప్రమోట్ అయ్యాక భాస్కర్‌గా ఏరియా ప్రజల్లో, కేడర్‌లో మంచి ముద్ర వేశాడు. కనగల్, కృష్ణపట్టి దళాలను ఎల్.జి.ఎస్.గా మార్చినప్పటి నుంచి రెండు దళాలకు ఏరియా కార్యదర్శి అయ్యాడు. క్యాడర్‌కి రాజకీయ పరిజ్ఞానం అందిస్తూ, సన్నిహితంగా మెలుగుతూ వారి నమ్మకాన్ని పెంపొందింప జేసుకున్నాడు. ఏరియాలో కలిసిన ప్రజలను ప్రతి ఒక్కరినీ ఏదో రకంగా విప్లవానికి సాయపడేలా చైతన్యవంతం చేయడానికి గట్టిగా కృషి చేశాడు.

సౌత్‌లో రిపేరింగ్ క్యాంపు జరిగినపుడు నిర్వహణ కమిటీలో వున్నప్పటికీ తను కూడా స్టూడెంట్‌గా చేరాలనే కోరికను బలవంతంగా అణచుకొని ఖాళీ సమయాన్ని పూర్తిగా వర్క్‌షాప్‌లోనే గడిపేవాడు. బాధ్యుల నుండి, టీచర్ నుండి పర్మిషన్ తెచ్చుకొని ఖాళీ సమయం కాస్త దొరికినా రిపేరింగ్ నేర్చుకునేవాడు. ప్రధానంగా ఏరియా వెపన్‌గా గ్రేనేడ్ ప్రాముఖ్యతను లోతుగా అర్థం చేసుకోవడం వల్ల వాటిని తయారు చేయడంలోనూ నైపుణ్యతను సాధించడం కోసం కృషి చేశాడు. ఆ రంగంలో పార్టీ అనుభవాలను తెలుసుకోవడం, తన వద్ద వున్న వెపన్ రిపేరింగ్ గురించి పూర్తి పట్టు సాధించడమేగాక తన దళంలో వున్న వెపన్స్ అన్నీ కూడ రిపేర్ చేయగలగడం అవసరమని గుర్తించి నేర్చుకోవడం... శత్రువు దాడిని ఎదుర్కోవాలంటే అతి తక్కువగా ఆయుధాలు కలిగివున్న మనం వాటిని ఎంత జాగ్రత్తగా కాపాడుకోవాలో అనే విషయాన్ని గుర్తించడమేగాక ఆచరించడానిక పడే ఆ తపన అరుదైనది. ఎన్నో చోట్ల క్యాంపులు నిర్వహించినా అంత ఆసక్తి కనబరుస్తూ రిపేరింగ్‌కు సంబంధించి నోట్స్‌తో సహా రాసుకున్న కామ్రేడ్స్... ధర్మన్న, భాస్కర్‌లే అని టీచర్ అన్నాడంటే... ఆ విషయంలో వారు మనకు ఆదర్శంగా నిలుస్తారు. రీజినల్ కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన విషయాలను ఆచరణలో పెట్టేందుకు తపన పడేవాడు. అందులో భాగంగానే పి.జి.ఏ. క్యాంపెయిన్‌లో చాలా ఉత్సాహంగా పాల్గొని సర్వేలూ, యాక్షన్లూ చేయడంలో నిరంతరం శ్రమించాడు. అందులో కొన్ని విజయం సాధించినా, మరికొన్ని ఫెయిల్ కావడమనేది ఇంతకాలంగా మనం ఆ రంగంలో ఎంత వెనకబడి వున్నామో తెలుపుతుందనీ... అయినా అది ఒక గొప్ప అనుభవాన్ని, విశ్వాసాన్ని పెంపొందించిందనీ భావించాడు.

వ్యక్తిగా కా॥ భాస్కర్ చాలా మృదు స్వభావి. ఎప్పుడైనా ఏ ఒక్కరి గురించయినా నెగటివ్‌గా మాట్లాడక పోయేవాడు. ఇతరులు మాట్లాడినా నొచ్చుకునేవాడు. మహిళా కామ్రేడ్స్ విషయంలోనూ మొదటి నుండి సానుభూతి, గౌరవం కలిగి వుండేవాడు. దళంలోని మహిళా కామ్రేడ్స్‌ను ఆత్మన్యూనతాభావం నుండి బయట పడవేసేందుకు ప్రయత్నించేవాడు. మహిళా కామ్రేడ్స్ కొందరికి ఆర్గనైజేషనల్ విషయాలకన్నా ఇతర విషయాలపై ఆసక్తి వుండటానికి గల కారణాలను తరచి చూసి, వాటినుండి బయట పడేయటానికి మార్గాలను అన్వేషించేవాడు. సాహిత్య సృజన కలిగి వుండి తనలోని భావుకతకు కవితల రూపం ఇవ్వటానికి ప్రయత్నించేవాడు. తన ఊరు కుందనపల్లి కాబట్టి ఊరులో నుండి నాలుగు అక్షరాలు తీసి ''కుందన్'' అని పెట్టుకున్నాడు. నల్గొండ జిల్లా కార్యదర్శి కా॥ కిరణ్‌పై ఓ మంచి కవిత రాశాడు. తనను వ్యక్తిగా కాక నల్గొండ ఉద్యమానికి వేలుబట్టి నడిపించిన తీరును చిత్రించిన ఆ కవితను కిరణ్‌పై వేసిన పుస్తకంలో మొదటి కవితగా వేశారు. అతని ప్రతి కవితలోనూ ప్రజల కోసం మరింత పట్టుదలగా కృషి చేద్దామనే సందేశం ఇమిడి వుండేది. కా॥ భాస్కర్ చివరి వరకు ప్రజల కోసం పోరాడుతూ అమరుడయి తన శపథాన్ని నిలుపుకున్నాడు.

బాధాకరమైన విషయమేమంటే అతని శవాన్ని తల్లిదండ్రులు గుర్తు పట్టలేని విధంగా శత్రువు ముఖమంతా తూట్లు పొడిచాడు. దాంతో వారు తమ కొడుకు శవాన్ని గుర్తుపట్టలేదు. ఒకసారి తన తల్లిని చూడ్డానికి వెళ్ళినపుడు తను ఎలాంటి స్థితికి నెట్టివేయబడ్డాడో జీవితాంతం మరువలేదు తను. అందుకే మళ్లీ తన తల్లిదండ్రులను చూడటానికి ఇంటికి వెళ్లాలనే ఆలోచనే ఎన్నడూ దరి చేరనీయలేదు. కానీ, చివరి రోజుల్లో మాత్రం ఒకసారి తన తల్లిదండ్రులతో, బంధువులతోనూ ఉత్తర ప్రత్యుత్తరాలను కొనసాగించడం ద్వారా వారిని విప్లవ సానుభూతిపరులుగా నిలబెట్టుకోవాలనే తపన పడ్డాడు.. ఎంతోమంచి కదలిక వున్న కనగల్ ఏరియా ఉద్యమం భాస్కర్ ఆధ్వర్యంలో గుణాత్మకమైన మార్పుకు దారితీస్తున్న తరుణంలో మొత్తం దళాన్ని కోల్పోవడం ఏరియా ఉద్యమానికి తీరని నష్టం. రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడంలోనూ, చేసుకున్న సమీక్షల వెలుగులో ఆచరణను మలచుకోవడంలోనూ, ఆయుధాల రిపేరింగ్‌లో ప్రావీణ్యతను సంపాదించడంలోనూ, క్యాడర్ పట్ల ప్రేమతో వారిని సున్నితంగా డీల్ చేయడంలోనూ కా॥ భాస్కర్ నుండి మనం నేర్చుకోవలసినది ఎంతో వుంది. కా॥ భాస్కర్ విప్లవ జీవితాన్ని మనం అనేక విషయాల్లో స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకొని, మరింత దృఢంగా ముందుకు సాగుదాం.

## కా॥ భవాని (కవిత)

పోలీసుల మూకుమ్మడి దాడిలో నేలకొరిగిన కనగల్ దళ సభ్యులలో కవిత ఒకరు. కామ్రేడ్ కవితగా కనగల్ దళంలో పీపుల్స్‌వార్ పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలిగా ఇప్పుడు పోలీసులు ప్రకటిస్తున్న వ్యక్తి హైదరాబాద్ నగరంలో చాలా మందికి స్నేహితురాలు భవాని. భవాని-భవానిలాగే వుండి వుంటే జీవితాంతం వంటింటిలో చెమటలు కారుస్తూ బతికి వుండేది. కానీ పి.జి.ఏ.లో దళ ఏరియా కమిటీ సభ్యురాలుగా, కవితగా ఆమె పొందిన పరిణామం సాదాసీదా మనుషులను ప్రజా ఉద్యమాలు ఎంతటి ఉన్నతులుగా మారుస్తున్నాయనేందుకు తార్కాణంగా నిలబడుతుంది. సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబంలో భవానీ పుట్టింది. పిల్లలకు చదువు చెప్పటం సంగతేమో కానీ ఇంట్లో అందరికీ తిండి పెట్టడం కూడా గగనమై పోయిన కుటుంబ నేపథ్యంలో ఏడవ తరగతితోనే ఆమె చదువుకు స్వస్తి చెప్పింది. ఇంటి పనుల్లో కాలం గడుపుతున్న భవానీ కుటుంబం హైదరాబాద్‌కి తరలి వెళ్ళాక జీవితం కొత్త మలుపు తిరిగింది. క్రమంగా ఆమె మహిళా సంఘాలతో పరిచయంలోకి వచ్చింది.

రాష్ట్రంలో 1990ల నుండి పెల్లుబుకుతున్న ప్రజా ఉద్యమాల నేపథ్యంలో ముఖ్యంగా మహిళా విముక్తి ఉద్యమాల ప్రభావంలో భవాని

విప్లవోద్యమ రాజకీయాల వైపు ఆకర్షితురాలైంది. ప్రజా ఉద్యమాల పట్ల దీక్షతో ప్రతి కొత్త విషయాన్ని గ్రహించాలనే కుతూహలంతో భవాని తన చైతన్యాన్ని పదునెక్కించుకుంది. పీడిత మహిళలను విముక్తి చేయాలంటే పాలకవర్గాలను కూలదోయటమొక్కటే మార్గమని గ్రహించాక ఆమె ఇక వెనక్కి తిరిగి చూడలేదు. కొంతకాలం హైదరాబాద్‌లో ప్రజాసంఘాల కార్యక్రమాలలో పాల్గొని, ఆ తర్వాత విప్లవ, అజ్ఞాత జీవితాన్ని ఎంచుకుంది.

తరువాత దాదాపు ఎనిమిది సంవత్సరాలుగా విప్లవోద్యమ నిర్మాణ బాధ్యతలలో వేరు వేరు స్థాయిలలో పాలుపంచుకొన్న ఆమె కవితక్కగా నల్గొండ-మహబూబ్‌నగర్ సరిహద్దు ప్రాంతాల గ్రామాల పోరాట ప్రజానీకానికి తలలో నాలుకగా ఎదిగింది. విప్లవ జీవిత క్రమంలోనే ఆమె సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) జంటనగరాల కమిటీ కార్యదర్శి కామ్రేడ్ రామేశ్వర్ సహచర్యాన్ని ఎంచుకుంది. 1997 ఫిబ్రవరిలో ఆయన మెదక్ జిల్లాలో ఒక బూటకపు ఎన్‌కౌంటర్లో చంపివేయబడిన తర్వాత కూడా విప్లవోద్యమంలో తను ముందుకే సాగింది.



నల్గొండ జిల్లాలో శాక్‌మెంబర్‌గా పనిచేస్తూ జూన్ 9న పోలీసులు చేసిన దాడిలో ఆమె అమరురాలైంది. ఒక విప్లవ కవి అన్నట్లు ఆమె ప్రజలు సానబెట్టిన వజ్రం. ఆమె అంతిమయాత్రలో వివిధ ప్రజాసంఘాలకు చెందిన వందలాది స్నేహితులూ, సానుభూతిపరులూ పాల్గొన్నారు. హైదరాబాదు నగరంలోని మల్కాన్‌గిరితో మొదలయిన అంతిమయాత్ర ఊరేగింపు అక్కడికి 2 కిలోమీటర్ల దూరంలో అంబర్‌పేట స్మశానంలో బహిరంగ సభగా మారింది. కా॥ గద్దర్, సాయిబాబా, జ్యోతి, రత్నమాల, చలసాని ప్రసాద్ వంటి వివిధ ప్రజాసంఘాల నేతలు హాజరై కా॥ కవితకు నివాళులు అర్పించారు.

అఖిల భారత ప్రజా ప్రతిఘటనా వేదిక ప్రధాన కార్యదర్శి జి.ఎన్.సాయిబాబా చెల్లెలయిన భవాని తల్లిదండ్రులకు ఒక్కతే కూతురిగా, ఇద్దరు అన్నదమ్ముల మధ్య ముద్దుల చెల్లెలిగా పెరిగింది. సాధారణ యువతిగా ప్రారంభమయిన భవాని జీవితం ఎన్నెన్నో గ్రామాల పోరాట ప్రజానీకానికి ఆప్తురాలైన దళ సభ్యురాలిగా, నాయకురాలిగా, కామ్రేడ్ కవితగా పరిణామం చెందింది. ఈ పరిణామం కేవలం భవాని అనే ఒకానొక యువతిది మాత్రమే కాదు. ఇవాళ రాష్ట్రంలో వేలాదిమంది యువతీ యువకుల జీవితాలు ఈ పరిణామ మార్గంలో పయనించడానికి ఈ వ్యవస్థ కారణమవుతోంది. దోపిడీ పీడనలు లేని సమసమాజాన్ని సాధించాలనే ఒక అద్భుత స్వప్నాన్ని కంటూ వేలాదిమంది యువతీ యువకులు పోరాట మార్గాన్ని చేపడుతున్నారు. ఈ పోరాటాన్ని అతి క్రూరంగా అణచివేసి, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం శాంతి మండలాన్ని ఏర్పర్చాలని ప్రయత్నిస్తున్న పాలకవర్గాలు ఆ నవయువ స్వప్నాల్ని దుర్మార్గంగా చిదిపి వేస్తున్నాయి. ప్రపంచబ్యాంకు పాలనలో ఆంధ్ర రాష్ట్రానికి సామంతుడుగా పనిచేస్తున్న చంద్రబాబు హయాంలో ఈ హత్యాకాండ పెచ్చరిల్లి పోయింది.

భవాని మన కళ్ళముందర గత దశాబ్ద కాలంలో ఒక సామాన్యమైన, చదువుకూడా అంతగా లేని మహిళగా ప్రారంభమై ఎంత దృఢమైన విప్లవ దీక్షను అలవర్చుకున్నదో, ఎన్ని ముఖ్యమైన బాధ్యతలలో సహచరి అయినా ఎంత వినమ్రంగా, సంయమనంతో వ్యవహరించిందో, ఎంత ఆదర్శప్రాయమైన జీవితం గడిపిందో అందరికీ అంత ఆత్మీయమైన, అర్థమైన జ్ఞాపకాలను మిగిల్చి పోయింది. 30 ఏళ్ళ జీవితంలో, పదేళ్ళ విప్లవ పథంలో హృదయానికి ఎంతో దగ్గరివైన ఎదురుదెబ్బలను సహించింది. ఒక ఏడాదిపాటు ఒక ప్రజాసంఘం మామూలు కార్యకర్తగా, వాలంటీర్‌గా ఏ శషభిషలూ లేకుండా పనిచేసింది. 'నిశ్శబ్దంగా నిమగ్న'వలె పిలుపు రాగానే అంతే మామూలుగా వెళ్ళిపోయింది. ఎక్కడా తన ఆరోగ్యం, సుఖం, సౌకర్యం గురించి ఆలోచించలేదు. ఎందరో అమరవీరుల వలె మన కళ్ళముందు రూపొందిన ఒక విప్లవ స్ఫూర్తి ఆమె. భవానీ గెరిల్లాగా పొందిన ఈ గుణాత్మక పరిణామం మనకు ఈ ప్రపంచాన్ని మార్చగలమన్న విశ్వాసాన్ని ఇనుమడింప జేస్తుంది.

## కా॥ రమేష్ (శ్యాం)

నల్గొండ జిల్లా, మర్రిగూడెం మండలంలో మదినేని గూడెం గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. తల్లీతండ్రులకు పెద్ద కొడుకు. 1998 అక్టోబరులో వాళ్ళ బావి దగ్గర కనగల్ దళం షెల్టరు తీసుకోవడంతో దళానికి పరిచయం అయ్యాడు. వాళ్ళ బావి దగ్గర దళం వచ్చినప్పుడల్లా నేనూ పార్టీలోకి వస్తాను అంటూ దళం వెంటబడేవాడు. అలా ఆకర్షితుడైన కా॥ రమేష్ 1999లో దళం ఏ.పి.టి.కి. వస్తున్నపుడు నాంపల్లి మండలం సాములపల్లి గ్రామంలో పోలీసుల పట్టుకొని చిత్రహింసలు పెట్టినా దళం ఏ.పి.టి. చెప్పకుండా దళాన్ని కాపాడాడు. దళం సమాచారం చెప్పక పోవడంతో పోలీసులు జైళ్లో పెట్టారు. 3 నెలలు జైలు జీవితం గడిపి జైలు నుండి విడుదలైన తరువాత పార్టీలో ఫుల్ టైం సభ్యుడుగా చేరాడు. దళంలో మంచి నమ్మకమైన సభ్యుడుగా మిలటరీ మెన్‌గా శత్రువు గుండెలో వణుకు పుట్టించే విధంగా తను బాద్యతలు నిర్వహించాడు. శత్రువు కా॥ శ్యాంను పట్టిస్తే 23 వేల రూపాయలు ఇస్తామంటూ గ్రామంలో అతని పోటోలు, వాల్ పోస్టర్లు అతికించాడు. తక్కువ కాలంలో ఏ.సి. మెంబర్‌గా తన బాధ్యతలు చేపట్టాడు. టి.డి.పి. మాజీ మండలాధ్యక్షుడు ముప్పన నర్సింహారెడ్డిని, వి.ఏ.ఓ. వెంకట్‌రెడ్డిని ఖతం చేయడంలో ప్రధాన పాత్ర వహించాడు. 9-6-2001న నాంపెల్లి మండలం నామానాయక్ తండా ఎన్‌కౌంటర్‌లో సెంట్రీగా వున్న కా॥ శ్యాం శత్రువుతో హోరాహోరీ పోరాడుతూ అమరుడయ్యాడు.

### కా॥ మల్లేష్ (రాచకొండ అంజయ్య), కా॥ ఇందిర (నాగలక్ష్మి) :

22, 18 సం॥ల వయస్సుగల ఈ కామ్రేడ్స్ నారాయణపురం గ్రామస్థులు. ఈ ఇద్దరు కామ్రేడ్స్ పెళ్ళి చేసుకున్న కొద్ది రోజులకే అరెస్టు అయి, 3 నెలలపాటు జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత భార్యాభర్తలు ఇద్దరూ పొట్టకూటికోసం బట్టలుతికి జీవితం గడిపేవారు. అయినా పోలీసుల వేధింపులు ఆగలేదు, చంపుతామని బెదిరించేవారు. అందుకనే ఈ కామ్రేడ్స్ ప్రజల కోసం పనిచేసి వారి జీవితాన్ని ప్రజా విముక్తికై అంకితం చేయడం కోసం పూర్తి కాలం కార్యకర్తలుగా 6 నెలల క్రితమే వచ్చి కనగల్ దళ సభ్యులుగా అన్ని పనుల్లో ధైర్యంగా పాల్గొంటూ అందరితో కలసిపోయేవారు. విప్లవంపట్ల, ప్రజల పట్ల వారి అపార నమ్మకం మరవలేనిది. ప్రజా విముక్తి కోసం పనిచేసి అమరులైన ఈ ఇద్దరు కామ్రేడ్స్ అందరికీ ఆదర్శ దంపతులైనారు.

అట్లాగే ఈ ఎన్‌కౌంటర్ నుండి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠాలు కూడా వున్నాయి. శత్రువు ఎండాకాలం మనం జాగ్రత్తగా వుంటామనీ, మనం పి.జి.ఏ. క్యాంపెయిన్‌లో వున్నామని అదనుకోసం ఎదురుచూస్తూ మిన్నకుండి పోయాడు. కొంత ఎండాకాలం తగ్గిందని మనం ఏమరుపాటుగా వున్న స్థితిలోనే దాడిచేసి మనలను దెబ్బతీసాడంటే వాడు మన కదలికనూ, మన ప్లాన్‌లనూ ఎంతగా అధ్యయనం చేయగలుగుతున్నాడో... ఎంత కరెక్ట్ అంచనాలకు రాగలుగుతున్నాడో అర్థమవుతున్నది. కానీ మనం ఇంకా వాడి విధానాలను వెంటనే అర్థం చేసుకోవడంలో వెనకబడే వున్నాము. మైదాన ప్రాంతాలలో మనం ఇంకా పద్ధతులను మార్చుకోవాల్సి వుంది. వాడి విధానాలను నిత్యం పరిశీలిస్తూ వాటికి అనుగుణంగా మన పద్ధతులను మార్చుకుంటూ వాడి కుట్రలను ఛేదిస్తూ, పైచేయి సాధించడం కోసం కృషి చేయడం ద్వారానే ఆ అమరులకి నిజమైన నివాళులు అర్పించగలం.

❑

# హోరాహోరీ పోరాటంలో నేలకొరిగిన రాచకొండ అమరులకు విప్లవ జోహార్లు!

జూన్ 19, 2001న నల్గొండ జిల్లాలోని రాచకొండ దళంపై గోడకొండ్ల గుట్టల్లో కసాయి పోలీసులతో 6 గం॥ పాటు జరిగిన హోరాహోరి పోరాటంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన 8 మంది కామ్రేడ్స్‌తో పాటు మౌనిక అనే పసిపాప అమరులైనారు. రాచకొండ దళం ఏరియా గోడకొండగుట్టలో కా॥ దివాకర్‌తో పాటు అమరులైన కా॥ లత, హైదరాబాద్ సిటీ సి.ఒ. కా॥ త్రిమూర్తులు, మరో ఐదుగురు కామ్రేడ్స్‌తో పాటు అన్నెం పున్నెం ఎరుగని సంవత్సరన్నర పసిపాపను కూడా పోలీసులు దారుణంగా కాల్చి చంపారు. తమ వెచ్చని నెత్తురుతో ఎర్రజెండాని మరింత ఎరుపెక్కించి ప్రజల హృదయాలలో ఎగురవేసిన ఈ కామ్రేడ్స్ అందరికీ 'క్రాంతి' నివాళి నర్పిస్తోంది. అందిన మేరకు వీరి వివరాలు.....

(కా॥ దివాకర్ జీవిత వివరాలు ముందు పేజీల్లో ఇవ్వడమైంది.)

### కా॥ త్రిమూర్తులు

కా॥ త్రిమూర్తులు (రామకృష్ణ, సుధాకర్) పశ్చిమ గోదావరి జిల్లా తణుకు దగ్గర ఒక చిన్న గ్రామంలో, రజక కుటుంబంలో పుట్టాడు. పొట్ట చేతపట్టుకొని పట్నమొచ్చి కుటుంబాన్ని పోషించాలనుకున్న త్రిమూర్తులు మన ఉద్యమ ప్రభావంతో పూర్తికాలం కార్యకర్తగా వచ్చి దోపిడీకి పరిష్కారం చూపిస్తున్న క్రమంలో 2001 జూన్ 19 వ తేదీన నల్గొండ జిల్లా చింతపల్లి మండలం గొడకొండ్ల వద్ద జరిగిన హోరాహోరి పోరులో అమరుడయ్యాడు.

1996లో కా॥ త్రిమూర్తులు పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. తను పార్టీలోకి రాకముందే ఒక ఐ.టి.ఐ. విద్యార్థిగా హెచ్.ఎమ్.టి.కి అనుబంధంగా పనిచేస్తున్న వర్క్‌షాపులో ఒక నైపుణ్య కార్మికుడిగా పనిచేసేవాడు. కార్మికునిగా కష్టపడి చేసే మనస్తత్వం కల్గిన వ్యక్తి. తను పార్టీతో సంబంధంలో లేకముందే అక్కడ ఒక యూనియన్ పెట్టి కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయించి కార్మికుల ఆదరణను చూరగొన్న కార్మిక నాయకుడు. ఈ క్రమంలో దొంగ యూనియన్‌ల లీడర్లు రెండుసార్లు దాడి చేసి యూనియన్‌ను రద్దు చేసుకోమని బెదిరించినా వాళ్ళ దాడులను తిప్పికొడుతూ ఆ పరిసర ప్రాంత రైతాంగ ప్రజల మద్దతును చూరగొని కార్మిక పోరాటాలకు రైతాంగం మద్ధతును కూడగట్టిన నాయకుడు. ఆ క్రమంలో పోలీసులు కేసులు పెట్టి అరెస్టు చేశారు. ఈ క్రమంలో 1996లో పార్టీ కాంటాక్టులోకి వచ్చాడు. తను బయట వుండగానే అతనంటే అమితంగా ప్రేమించిన వ్యక్తి తను పార్టీలోకి పోతున్నపుడు తాను కూడా వస్తానని పట్టుపట్టి పార్టీలోకి వచ్చింది. వీళ్ళ పెళ్ళి ఒకటి రెండు రోజుల్లో జరుగుతుందనగా 1997 మార్చి 23వ తేదీన మెదక్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా॥ సంజీవ్‌తో పాటు ఆ కామ్రేడ్ (జ్యోతి) అమరురాలైంది. కా॥ త్రిమూర్తులు కొద్ది గాయాలతో బయటపడినాడు. తిరిగి పట్టణోద్యమ నిర్మాణంలో నిమగ్నమై వుండగా సిటీ పార్టీ అంతా నష్టపోయివున్న క్రమంలో చాలా రోజులు పార్టీ కాంటాక్ట్స్ లేకపోయినప్పటికీ కార్యక్రమం కొనసాగించాడు. 1999 మొదట్లో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసుల చేత చిక్కి దాదాపు 10 నెలలు జైలు జీవితం అనుభవించాడు. జైలు కమ్యూన్ కమిటీ సభ్యునిగా కమ్యూన్ సభ్యుల సమస్యలను ఓపికతో అర్థం చేయించి పరిష్కరించేవాడు. అలాగే వాళ్ళకు రాజకీయాలు, చదువులు చెప్పడంలో మంచి టీచర్. 10 నెలల జైలు జీవితం తర్వాత తిరిగి ఉద్యమంలో అడుగుపెట్టిన వెంటనే మెదక్‌లో శత్రువు జరిపిన దాడి నుండి ప్రతిఘటిస్తూ బయటపడినాడు. తిరిగి హైద్రాబాద్ నగర కార్మికోద్యమ బాధ్యతలు చేపట్టి వాటిని ముందుకు తీసుకుపోతున్న క్రమంలో రాచకొండలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. ఆ కామ్రేడ్ అమరుడవ్వడం సిటీ ఉద్యమానికి ఎంతో నష్టదాయకం. ఈ కామ్రేడ్ దళంలో వున్నప్పుడు దళసభ్యులకు విషయాలను ఓపికగా చెప్పడంలో, క్లాసులు, చదువు చెప్పడం ఎంతో ఓపికగా

చేసేవాడు. ఇతర కామ్రేడ్స్‌కు ఎంత ఓపికగా నేర్పించినాడో తను కూడా నిరంతరం ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో పట్టుదలతో ఏ కొంత సమయం దొరికినా అధ్యయనంపై నిర్దిష్టంగా కేంద్రీకరించేవాడు. ఒక కార్మికునిగా తన జీవితం నడుపుకొంటూ అందులోని దోపిడీని చూసి కార్మిక నాయకునిగా ఎదిగి కార్మికవర్గ నాయకత్వ పార్టీలో కార్మిక రంగాన్ని ముందుకు తీసుకుపోవడంలో తన వంతు కృషి చేస్తున్న క్రమంలో అమరుడయ్యాడు. కా॥ త్రిమూర్తులును కోల్పోవడం సిటీ ఉద్యమానికే కాదు మొత్తంగా మన రాష్ట్ర ఉద్యమానికే నష్టం. కార్మికవర్గం యొక్క వర్గపొందికను పెంచాల్సిన అవసరముంది అని పార్టీ సీరియస్‌గా గుర్తించి అటువైపుగా కేంద్రీకరిస్తున్న క్రమంలో కార్మిక రంగంలోని ఒక మంచి కామ్రేడ్‌ను నాయకత్వంగా ఎదిగి పట్టణోద్యమానికి ఆధారపడదగ్గ వ్యక్తిని కోల్పోవడం తీవ్ర నష్టమే.

## కా॥ మొట్టు సరిత (లత)

నల్గొండ జిల్లా యస్.జి.యస్. డిప్యూటీ కమాండర్ అయిన కా॥ లత 6 గంటలపాటు శత్రువుతో జరిగిన హోరాహోరీ ఎన్‌కౌంటర్లో వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలర్పించింది. ఒక సామాన్య మహిళగా వుండిన కా॥ లత తన సహచరుడు విప్లవకారుడని, తనకన్నా విప్లవాన్ని మిన్నగా ప్రేమిస్తున్నాడని, నిజమైన సహచర్యం విప్లవంతో ముడిపడి వుందని గ్రహించి క్రమంగా విప్లవబాట పట్టింది. 8 సం॥ల విప్లవ జీవితంలో జిల్లా ఉద్యమంలో జరిగిన ప్రతి మలుపుని అర్థం చేసుకుంటూ, అడుగులేస్తూ అభివృద్ధి చెందింది. ఒక క్రమశిక్షణ కల్గిన కామ్రేడ్ ఆదర్శవంతంగా నిలిచింది. మహిళలను విప్లవంలో ఇముడ్చుకోవాలనే తపన నిరంతరం తనలో వుండేది. విప్లవోద్యమంపై చంద్రబాబు సాయుధ దాడి, చుట్టుముట్టి అణచివేత పెరుగుతున్న క్రమంలో సాయుధంగా తన్ను తాను తీర్చి దిద్దుకుంది. వీరవెల్లి పోలీసు క్యాంపు పోలీసుల్ని బెంబేలెత్తించి యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్‌పై దాడిలోను, కుదాబక్షిపల్లి పోలీసు క్యాంపుపై దాడిలోనూ సాహసంగా పాల్గొంది.

## కా॥ జ్యోతి (వలిగొండ రేణుక)

పోరాటాల గడ్డ వీరులు పుట్టినిల్లు అయిన నారాయణపురం ముద్దుబిడ్డ కా॥ సాగర్ అమరత్వంతో ఉత్తేజితురాలయ్యి విప్లవం లేకుండా మహిళల బ్రతుకులు మారవని అతి చిన్న వయస్సులోనే గ్రహించి 6 నెలల క్రితం దళంలో చేరి పార్టీ రాచకొండ దళంలో చేరింది. తను పార్టీలోకి పూర్తికాలం రాకముందు తన వూర్లో జ్యోతి అనే మహిళను భర్త కిరోసిన్ పోసి చంపితే మహిళలను ఏకంచేసి ధర్నా చేయించింది. ఈ సంఘటన ఆ గ్రామాలలో మంచి ప్రభావాన్ని చూపింది. మహిళా సంఘంలో చురుకుగా పనిచేసింది. ఎప్పుడైనా మహిళలకు క్లాసులు పెట్టినప్పుడు తను వస్తే అయిపోయిన తరువాత తనని వెళ్ళమంటే వెళ్ళనని ఏడ్చేది. మంచిగా డ్యాన్సు చేయడం, పాటలు పాడుతూ అందరితో కలసి మెలసి వుండేది. రాజకీయ నాయకుల ఇన్‌ఫార్మర్స్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు దళానికి అందజేసేది. దళంలోకి పూర్తికాలం వచ్చిన తరువాత రాచకొండ దళం నుండి కృష్ణపట్టి దళంకి వెళ్ళమని పార్టీ చెబితే ఎలాంటి శషబిషలు లేకుండా వెళ్ళింది. అలాగే మళ్ళీ ఇంకో జిల్లాకు మారమన్నా తొణకకుండా తను ఎక్కడికైనా వెళ్తానని చెప్పింది. కా॥ జ్యోతి గోడకొండ్ల ఎన్‌కౌంటర్లో వీరోచితంగా పోరాడుతూ అమరురాలయింది.

## కా॥ పద్మ (భాషమ్మ)

రంగారెడ్డి జిల్లా, మంచాల చిత్తపురం మండలం, పెద బంటు కుటుంబంలో కా॥ పద్మ మూడో కూతురుగా, ఇద్దరు అక్కలకు చెల్లెలిగా, ఇద్దరు తమ్ముళ్ళకు అక్కగా పుట్టింది. తన తండ్రి కుటుంబాన్ని పట్టించుకోక పోవడంతో తాను కుటుంబానికి పెద్ద దిక్కై బరువు బాధ్యతలను తనపై వేసుకొని ఉన్న కొద్దిపాటి భూమిని సాగుచేసుకుంటూ తన తల్లీ తండ్రికి సహాయంగా వుంటూ, కూలి పనులకు వెళ్తూ తన కుటుంబాన్ని పోషించేది. ఆ రకంగా ఆ గ్రామ ప్రజల్లో మంచి పేరు కూడా సంపాదించింది. తన గ్రామం చుట్టుపక్కల ఉవ్వెత్తున లేస్తున్న ప్రజా పోరాటాలకు ఉత్తేజితురాలైన భాషమ్మ అనతి కాలంలోనే గ్రామ విప్లవ మహిళా సంఘంలో సభ్యురాలైంది. సంఘంలో పనిచేయవద్దని తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపినా తాను మాత్రం సంఘాన్ని వదలనని చెప్పింది. ఆ గ్రామ భూస్వామి అయిన జంగారెడ్డిపై పోరాడడంలో ముందు నిలిచిన భాషమ్మ ఈ దోపిడీ సమాజాన్ని అంతం చేయాలని పట్టుదలతో పార్టీలో చేరి మహిళలపై జరుగుతున్న సకల అన్యాయాలకు, అణచివేతలకు, వర్గ సమాజం, పురుషాధిక్యతే కారణమని దానికి పోరాటమొక్కటే సరైన మార్గమని ఎంచి సం॥ క్రితమే సాయుధమై ఆలేరు దళంలో కొంత కాలం పనిచేసి తర్వాత రాచకొండ దళ సభ్యురాలిగా పనిచేస్తున్న క్రమంలో జరిగిన గోడకొండ్ల ఎన్‌కౌంటర్లో వందలమంది ఎస్.ఎస్.ఎఫ్. పోలీసు బలగాలు చుట్టుముట్టినా శత్రువుకు లొంగిపోకుండా వీరోచితంగా పోరాడుతూ అమరురాలయ్యింది.

## కా॥ మధు (బత్తుల శంకర్)

చౌటుప్పల్ మండలం, తంగడిపల్లి గ్రామంలో పేద గౌడ కుటుంబంలో పుట్టిన కా॥ మధు 31 సం॥ క్రితం జన్మించాడు. గతంలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేశాడు. 7 సం॥రాల క్రితం దళంతో పరిచయం ఏర్పడి, సానుభూతిపరుడిగా ఇంటిదగ్గర వుంటూ తన పనులు తాను చేసుకుంటూ దళానికి సహాయ సహకారాలు చేస్తూ, నిరంతరం పార్టీని అంటి పెట్టుకుంటుండే వాడు. తనకు ముగ్గురు కొడుకులు ఉన్నా, వాళ్ళను చదివించుకుంటూ కుటుంబ పోషణ మొత్తం తనే చూసుకునేవాడు. ఇంటి దగ్గర వుండి పార్టీ పనులు, ఇంటిపనులు చేస్తున్న క్రమంలో శత్రువుకు అర్థమై, తనకోసం సీరియస్‌గా తిరుగుతుంటే శత్రువుకు భయపడకుండా రహస్యంగా గ్రామంలోనే వుంటూ పార్టీ అప్పజెప్పిన పనులు చేస్తూ, పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఒకరోజు రాత్రి పోలీసులు ఇంటిని చుట్టుముట్టి అరెస్టు చేయడం జరిగింది. దాంతో ఆ గ్రామంలోని ప్రజలందరూ ఒకటై రాత్రికి రాత్రే ట్రాక్టర్‌ను తీసుకొని వందలాది మంది ప్రజలు కదిలి, పోలీసు స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి కా॥ మధును వెంటనే కోర్టుకు హాజరుపర్చాలని పట్టుబట్టారు. దాంతో శత్రువు కా॥ మధును వెంటనే కోర్టుకు హాజరుపర్చాడు. 6 నెలలు జైలు జీవితం గడిపి మళ్ళీ బైటికి వచ్చిన తరువాత పార్టీతో సంబంధాల్లో వుంటూ, పార్టీ ఇచ్చిన పనులు కొనసాగిస్తూండేవాడు. ఇంటిదగ్గర కుటుంబ ఒత్తిడి, పోలీసుల వేధింపులు కూడా ఎక్కువ అవటంతో తన భార్య, ముగ్గురు పిల్లలను తీసుకొని హైద్రాబాద్‌కు పోయి అక్కడ ప్రింటింగ్ ప్రెస్, జిరాక్స్ షాపు నడిపించేవాడు. తన వ్యక్తిగత పనికంటే పార్టీ పని ముఖ్యమని భావించిన వ్యక్తి కా॥ మధు. ఏరియాలో మంచి ప్రజా నాయకుడిగా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నాడు. పార్టీ పనుల కోసం దళం దగ్గరికి

పిలిపించడంతో వచ్చి దళంతో 5 రోజులు గడిపి గోడకొండ్ల ఎన్‌కౌంటర్‌లో అమరుడైనాడు.

ఇంకా కొన్ని వేరు వేరు సంఘటనలలో క్రింది కామ్రేడ్స్ అమరులైనారు. వారి వివరాలు:

**కా॥ వీరాస్వామి (బూడిద పాపయ్య)**

రంగారెడ్డి జిల్లా మండలం మంచాల గ్రామంలో లోయపల్లిలో 25 సం॥ల క్రితం దళిత పేద కుటుంబంలో జన్మించాడు. కష్టజీవి కష్టాలకు, కరువులకు రైతుల ఆత్మహత్యలకు, దోపిడీ కారణం తెలుసుకున్న వీరాస్వామి పోరాటం ద్వారానే ప్రజలు దోపిడీ నుండి బయట పడుతారని, పేద ప్రజల రాజ్యం రాకుండా పేదలకు ఒరిగేది ఏమీలేదని 3 నెలల క్రితం పూర్తికాలం కార్యకర్తగా వచ్చి రాచకొండ దళం నుండి, కనగల్ దళ సభ్యునిగా పనిచేశాడు. ఈ క్రమంలో లోయపల్లి అనే వూర్లో మల్లమ్మ అనే సంఘ నాయకురాల్ని అదే వూళ్లో విప్లవ రైతుకూలీ సంఘంలో పనిచేస్తున్న శ్రీను ప్రేమించి పెళ్ళి చేసుకుని ఆ తరువాత కిరోసిన్ పోసి కాల్చి చంపేశాడు. ఈ సంఘటనను చూసి కా॥ పాపయ్య దళానికి తెలిజేశాడు. ఈ సంఘటనకి సంబంధించి వూళ్ళో మీటింగ్ పెట్టి శ్రీను దుర్మార్గాన్ని ప్రజలకు తెలియజెప్పి వాడికి దేహశుద్ధి చేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు. ప్రజల్లో కలిసిపోవడం, కామ్రేడ్స్‌లో కలిసిపోవడమే కాకుండా ఎంతో చొరవగా వున్న కా॥ వీరాస్వామి పసునూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు.

**కా॥ ఎడ్ల యాదయ్య (అజయ్)**

నారాయణపురం మండలంలో గొల్ల కులంలో పుట్టిన కా॥ యాదయ్య చిన్న వయస్సులోనే దళాన్ని కలిసేవాడు. చదువుకుంటూ ఆర్.యస్.యు. లో కొంతకాలం పనిచేశాడు. దళం తన వూరికి వచ్చినప్పుడల్లా దళానికి అన్నం తీసుకురావడం, సెంట్రీ చేయడం చేసేవాడు. తర్వాత రైతుకూలీ సంఘ నాయకుడిగా వుంటూ గ్రామంలో జరిగే దౌర్జన్యాలను వ్యతిరేకించేవాడు. ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని, తనకి ఒక బిడ్డ పుట్టిన తర్వాత పూర్తి కాలం పార్టీలోకిరాలేక అతనికి చేతనైన పని చేసేవాడు. ప్రసాద్ అనే కానిస్టేబుల్‌ను చంపడానికి దగ్గరుండి సమాచారం అందించిన నెపంతో పోలీసులు పట్టుకెళ్ళి చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. ❑

## ప్రాణార్పణ చేసి రాష్ట్ర నాయకత్వాన్ని కాపాడిన కా॥ రామస్వామికి అరుణారుణ జోహార్లు!

విప్లవోద్యమాన్ని, ఉద్యమ నాయకత్వాన్ని కాపాడేందుకు అమూల్యమైన ప్రాణాలనే తృణప్రాయంగా అర్పించిన వీరయోధులెందరో చరిత్రలో నమోదైనారు. ప్రాణాల మీది తీపితో, అవధులు మీరిన వ్యక్తిగత స్వార్థంతో ఉద్యమ ప్రాణాలనే హరించివేసిన బలహీనులూ, విద్రోహులు కూడా ప్రపంచ విప్లవ చరిత్రలో చాలామందే వున్నారు. నిరుపమాన త్యాగాలు, పచ్చి స్వార్థాలు కోకొల్లలుగా చరిత్రకెక్కి వుండగా రామస్వామి అనే ఈ అజ్ఞాత యోధుని ధీరత్వం గురించి తిరిగి ఇపుడు చాటి చెప్పాలా అనే ప్రశ్నకు అవుననే సమాధానమే వస్తుంది.

కా॥ రామస్వామి దళిత యువయోధుడు. పీపుల్స్‌వార్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కార్యదర్శితో సహా పలువురు నాయకులను కాపాడే క్రమంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల పాశవిక హింసను ధిక్కరించి ప్రాణాలర్పించిన అమరయోధుడు. శత్రువుతో పోరాడుతూ తోటి సహచర కామ్రేడ్స్ జీవితాలను నిలబెట్టేందుకు బలిదానం చేసిన ధీరోదాత్తులలో కా॥ రామస్వామి ప్రథముడు కాడు, అలాగని చివరి వాడూ కాడు. అయితే 'లంపెన్'గా ముద్రపడి విప్లవకారుడిగా పరివర్తన చెందిన కారణంగానే రామస్వామి గురించి ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన అవసరముంది. జులాయిగా పెరిగిన నేపథ్యం నుంచి లోకల్ గెరిల్లా దళ కమాండర్‌గా పరిణమించిన **24** సం॥ల వయస్సున్న రామస్వామి గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారే మహా పరిణామ చరిత్రకు అచ్చమైన నమూనాగా నిలిచాడు.

నాలుగేళ్ళ క్రితం పీపుల్స్‌వార్‌లో చేరతానని రామస్వామి అడిగినపుడు నిరుపేద తండ్రి తీవ్రంగా దెప్పిపొడిచాడు. "నీతి, నిజాయితీ కలిగినోళ్ళ పార్టీరా అది. పదిమందికి మేలు చేయటం సంగతేమోకానీ జులాయిగా బతుకీడ్చుకొస్తున్న నీలాంటి వాళ్ళకు దాంట్లో చోటెక్కడ?" అంటూ దెప్పి పొడిచిన తీరు రామస్వామికి శూలాలై తగిలాయి. తండ్రి దెప్పుళ్ళి నిద్రలో కూడా మరువని రామస్వామి అతి త్వరలోనే విప్లవానికి బాటలేయటం నేర్చుకున్నాడు. పలు విషయాల్లో నైపుణ్యం కల్గిన తను నల్లమల చెంచు గ్రామాలలో విస్తృతంగా తిరిగి వారి భాషతో పరిచయం పెంచుకున్నాడు. ఈ 'అనాగరిక' ప్రపంచంలో తన విప్లవ ప్రయాణం మొదలెట్టి చెంచుల హృదయాలను చూరగొన్నాడు.

రామస్వామిని చెంచులు క్రమంగా తమ రక్షకుడిగా పరిగణించ సాగారు. ఈ గ్రహింపే స్థానిక గెరిల్లా దళం ఏర్పాటుకు దారి తీసి అతడిని కమాండర్‌గా చేసింది. రాష్ట్రకమిటీ ప్లీనమ్ జరిగే సమయంలోనే ఈ లోకల్ గెరిల్లా దళం ఏర్పడటం కాకతాళీయం. నల్లమల అడవిదారులను ఆపోసన బట్టిన రామస్వామి ఈ ప్లీనమ్ సందర్భంగా కొరియర్ బాధ్యతలు చేపట్టాడు. కళ్ళకు గంతలు కట్టినప్పటికీ నల్లమల అడవిని ఆ మూల నుంచి ఈ మూల దాకా చుట్టేయగల సమర్థుడు రామస్వామి అని పేరు పొందాడు. కొరియర్‌గా తన పనిని చక్కగా నిర్వర్తించాడు. చుట్టుపక్కల పోరాట ప్రాంతాల నుండి పలువురు సీనియర్ కామ్రేడ్స్‌ని ప్లీనమ్ జరుగుతున్న ప్రాంతానికి క్షేమంగా తోడ్కొని వచ్చాడు. అవతల నుండి వచ్చేవారికి ఉత్తరాలు అందిస్తూ పిల్లగాలిలా కనుమరుగయ్యేవాడు.

ప్లీనమ్‌కి అత్యంత ప్రముఖ నాయకులు రావలసి వుండింది. ఇద్దరు

రాష్ట్రకమిటీ అగ్రనేతలను తీసుకురావడానికిగాను ఏ.పి.టి. ఉత్తరాలు పంపాల్సి వచ్చింది. సమస్యల్లా ఏమిటంటే సమీపంలోని పట్టణంలో పోలీసులు భారీ ఎత్తున తిష్టవేసి వున్నందువల్ల ఆ ఉత్తరాలను బయటకు తీసుకుపోవాల్సిన కొరియర్లు వేరే దారిని సూచించలేక పోయారు. ఇతర మార్గాలు వారికి తెలియవు.

పరిస్థితిని గమనించిన రామస్వామి నాయకత్వంతో తనకో రహస్య మార్గం తెలుసునని చెప్పాడు. రాయలసీమ రీజియన్‌లో ఆరోజు పార్టీ బంద్‌కి పిలుపిచ్చినందువల్ల ప్రత్యేకించి పోలీసులు ఆరోజు మరీ ఎక్కువగా తిరుగుతున్న విషయం తెలిసి కూడా ఈ పనికి సిద్ధమయ్యాడు. పైగా ఆ ప్రాంతంలోని చెంచు ప్రజలలో ఎంతో పేరుగాంచిన రామస్వామి 'కొరకరాని కొయ్యగా' తయారై పోలీసుల కంట్లో అప్పటికే నలుసై నానుతుండేవాడు. అతడు చేసిన ఆర్గనైజేషనల్ కార్యకలాపాలతో అప్పటికే బాగా శత్రువు దృష్టిలో పడ్డాడు. ఈ పరిస్థితుల్లో అతి ముఖ్యమైన పనితో ప్రయాణం మొదలెట్టిన రామస్వామి పలుచోట్ల పోలీసుల నుండి తప్పించుకున్నాడు. కాని అవతల నుంచి కొరియర్ వచ్చి కలిసే ప్రాంతంలోనే అనుకోకుండా పట్టుబడ్డాడు. ప్లీనం గురించి ఏ ఆధారాలూ లభించని శత్రువు పార్టీ నాయకుల ఆనుపానుల గురించి చెప్పమంటూ రామస్వామిపై అన్ని పద్ధతులనూ ప్రయోగించాడు. తీవ్రంగా చిత్రహింసలకు గురిచేశాడు. శత్రువు ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. రామస్వామి నోట్లోంచి ఒక మాట కూడా రాలేదు. తానెవరిని కలియబోతున్నాడనే విషయం కూడా బయటపెట్టలేదు.

రామస్వామిని కలవాల్సి వున్న కామ్రేడ్ ఆ పని కాక అవతల వైపున ఏం జరిగి వుంటుంది అని ఆలోచిస్తూ వెనుదిరిగాడు. తిరుగు ప్రయాణంలో అసాధారణ స్థాయిలో పోలీసుల కదలికలను గమనించి అతను కలవరపడ్డాడు.

రామస్వామి శత్రువు చేత చిక్కినపుడు తన ప్రాణాన్ని కాపాడుకోవాలనుకున్నట్లయితే బెంగుళూరులో గోవిందరెడ్డి చేసిన విద్రోహానికి అవలీలగా పాల్పడగలిగేవాడు. కానీ నిజమైన విప్లవకారుడిగా తన కామ్రేడ్స్‌కి, ఉద్యమానికి ద్రోహం తలపెట్టలేక పోయాడు. తనను పనిమీద పంపించిన వారి జీవితాలు ఎంత విలువైనవో తనకు తెలుసు. ప్లీనం జరుగుతుండిన ప్రాంతానికి 30 కి.మీ. చుట్టూ పోలీసుల జాడే కనిపించ లేదంటే రామస్వామి చేసిన త్యాగం విలువ ఏమిటో ఎవరికయినా అర్థమవుతుంది. కా॥ రామస్వామికి ప్లీనమ్ విప్లవ జోహార్లు అర్పించింది. ఆ ఏరియాలో పనిచేస్తున్న కామ్రేడ్స్ రామస్వామి శక్తి సామర్థ్యాలను, ఉద్యమానికి అతడు అందించిన తోడ్పాటును నల్లమల ప్రాంతంలో పార్టీ మరింతగా వేళ్ళూనుకోవడానికి అతడు అందించిన సహకారాన్ని స్మరించుకున్నారు.

రామస్వామి అమరుడైనాక తోటి కామ్రేడ్స్ అతని కిట్‌లో సోదరుడు రాసిన ఉత్తరాన్ని చూశారు. రామస్వామి ఎల్.జి.ఎస్. కమాండర్‌గా బాధ్యతలు చేపట్టినాడని విని తానెంతగానో సంతోష పడుతున్నట్లుగా సోదరుడు అందులో రాశాడు.

నిజమైన, త్యాగదీక్ష కలిగిన కామ్రేడ్‌గా మారటం ద్వారా రామస్వామి ఒకనాడు తండ్రి తన గురించి అన్న మాటలు తప్పని రుజువు చేశాడు. ప్రజల ఆశలు, విశ్వాసాలపై నిర్మించబడే పార్టీ ఎన్నటికీ ఓడింపబడదని తన ప్రాణ త్యాగం ద్వారా రామస్వామి శత్రువుకు చాటి చెప్పాడు. ధైర్య సాహసాలకి, విప్లవ నిబద్ధతకి ఉజ్వలమైన నమూనాగా నిలబడటం ద్వారా కా॥ రామస్వామి విప్లవాకాశంలో సదా జీవిస్తుంటాడు. ❑

## డిసెంబర్ 6 మతతత్వ వ్యతిరేక దినం సందర్భంగా బంద్ పాటించిన దండకారణ్యం

1992 డిసెంబర్ 6న బి.జె.పి. ఆరెస్సెస్ ఫాసిస్ట్ మూకలు అయోధ్యలో బాబ్రి మసీదును కూల్చివేసిన దుర్ఘటనకి నిరసనగాను, ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణ దాడికి వ్యతిరేకంగానూ సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] దండకారణ్య బంద్‌కి పిలుపిచ్చింది. దక్షిణ బస్తర్ డివిజన్‌లో కొంటా, దర్నపాల్ ఏరియాలలో బంద్‌ని పాటించారు. ఈ రీజియన్‌లో పలు మిలిటెంట్ నిరసన చర్యల్ని చేపట్టారు.

డిసెంబర్ 6న కొంటా నుండి జగదల్‌పూర్ వరకు ఐదుచోట్ల జాతీయ రహదారిని పెద్ద పెద్ద బండరాళ్ళు దొర్లించి చెట్లను నరికేసి దిగ్బంధనం చేశారు. ఒకచోట 350 మంది ప్రజలు రోడ్డు దిగ్బంధన చర్యలో పాల్గొన్నారు. మరి రెండుచోట్ల కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో ఇలాంటి చర్యల్లో పాల్గొన్నారు. స్త్రీ పురుషులు కలిసి పాల్గొన్న ఈ చర్యల ఫలితంగా జాతీయ రహదారిపై రోజంతా ట్రాఫిక్ స్తంభించి పోయింది.

డిసెంబర్ వేకువజామున 2 గంటలకు ప్రజా మిలీషియా రెండు దళాలకు చెందిన 50 మంది సభ్యులు ఈ ఏరియాలో బ్లాక్ (మండలం) ఆఫీసును పేల్చేశారు.

డిసెంబర్ 5, నడిరేయిలో 175 మంది ప్రజా మిలీషియా సభ్యులు పోలంపల్లి గెస్ట్‌హౌస్ వద్దకు చేరుకుని బిల్డింగ్ మొత్తాన్ని 6 గంటల వ్యవధిలో కూల్చివేసి చదును చేసేశారు. పట్టుబడ్డ విప్లవకారులను చిత్రహింసలు పెట్టేందుకు, ప్రజల నుండి సమాచారం రాబట్టడానికి పోలీసులు ఈ గెస్ట్‌హౌస్‌ని తరచుగా వాడుతున్నందువల్ల అదంటే ప్రజలకు మంట పుట్టేది. ఈ బిల్డింగ్‌ని ప్రజలు పడగొడుతుండగా విషయం తెలుసుకుని అటువైపుగా వచ్చిన పోలీసులు గుంపులు గుంపులుగా వున్న జనాన్ని చూసి ముందుకు రావడానికి సాహసించక తిరుగుదోవ పట్టారు.

ఈ సందర్భంగానే దర్నపాల్ పోలీస్ స్టేషన్ వద్ద నలుగురు సభ్యుల గెరిల్లా దళం బాంబు పేల్చి పోలీసులలో కలవరం సృష్టించింది.

అదేరోజున భెజి పోలీస్ స్టేషన్‌పైన కూడా గెరిల్లాలు బాంబ పేల్చారు. ❑

# పార్టీపై దేశవ్యాప్త నిషేధంపై సి.సి. పత్రికా ప్రకటన

మా పార్టీ అయిన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] మరియు మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ పైనా వాటి ప్రజాసంఘాలపైనా కేంద్రంలోని ఎన్డీఏ ఫాసిస్టు ప్రభుత్వం విధించిన నిషేధాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది మా రెండు పార్టీలూ బలంగా వేళ్ళూనుకున్న దేశ పీడిత ప్రజానీకంపై బాహాటమైన దాడే తప్ప మరొకటి కాదు. పాలకవర్గాలచే ప్రోత్సహించబడి దేశంలో పెరుగుతున్న ఫాసిజంలో భాగమే ఈ నిషేధం. ఇది ప్రజల చేతుల్ని కట్టిపడేసి ఆ రకంగా అన్యాయానికి వ్యతిరేకంగా నోరెత్తకుండా చేయాలని చూస్తుంది. నిషేధమున్నా, లేకున్నా న్యాయమైన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం భారతదేశపు విశాల ప్రజారాసులను పీడనకు, దోపిడీకి వ్యతిరేకంగా కూడగట్టడానికి ప్రయత్నిస్తూనే వుంటానని పీపుల్స్‌వార్ పార్టీ బహిరంగంగా ప్రకటిస్తోంది. దేశ ప్రజలను, కొల్లగొట్టి, చంపుతున్న పాలకవర్గాల మురికి తెట్టును తుడిచి పెట్టేందుకోసం మా పార్టీ ప్రజాయుద్ధాన్ని పురోగమింప జేస్తుంది.

మొదట్లో వాళ్ళు జాతుల పోరాట సంస్థలను, ముస్లిం సంస్థలను నిషేధించారు. ఇప్పుడు విప్లవ సంస్థలను నిషేధించారు. తరువాత సకల ట్రేడ్ యూనియన్ సంస్థల హక్కులను నిషేధిస్తారు. అంతిమంగా వాళ్ళు నామమాత్రంగా వున్న వాక్ స్వేచ్ఛను, సంఘాలు పెట్టుకునే హక్కులను సైతం కాల రాచేస్తారు. ఈ చర్యల పట్ల మౌనంగా వుండటం ఫాసిస్టులు తమ దాడులను మరింతగా పెంచేందుకోసమే తోడ్పడుతుంది. వాళ్ళ ఉద్దేశ్యం సుస్పష్టం. పారిశ్రామిక వివాదాల చట్టంలో మార్పుల కోసం ప్రయత్నించటం. 'పోటో' లో జర్నలిస్టుల స్వేచ్ఛపై నిబంధన విధించటం అనేవి పెరిగిపోతున్న తమ దోపిడీ పీడనల పాలనను వ్యతిరేకించే ఎవరినైనా పాశవిక శక్తితో అణచివేయడానికి పాలకవర్గాలు పథకం వేస్తున్నాయన్న అంశాన్ని ఎత్తి చూపుతున్నాయి.

సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాల ప్రయోజనాలకు సేవచేసేందు కోసం, దేశ ప్రజలపై పథకం ప్రకారం దాడుల్ని మొదలు పెట్టేందుకు 'టెర్రరిజం వ్యతిరేకత' అనేది ముసుగుగా మారింది. ప్రజాగ్రహం నుండి, టి.ఎన్.సి.ల బడా బూర్జువాల పెను లాభాలను, భూస్వామ్య, వున్నతాధికార్ల, రాజకీయ నాయకుల అక్రమ సంపదను కాపాడేందుకు ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తున్నారు. అందుకనే భజరంగ్‌దళ్, రణవీర్ సేన, తదితర సాయుధ ఫాసిస్టు ముఠాలతో గూడిన బాహాటమైన టెర్రరిస్టు సంస్థలను నిషేధించడాన్ని పాలకవర్గం కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదు.

సామ్రాజ్యవాదంపై, వారి తైనాతీలపై ఎక్కుపెట్టిన ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ప్రపంచవ్యాప్తంగా 'టెర్రరిజంపై వ్యతిరేకత' అనేది ప్రచారాయుధంగా మారింది. ఆఫ్ఘనిస్తాన్‌పైనా, ప్రస్తుతం పాలస్తీనాపైనా దాడి అనేది ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదులు, దాని తొత్తులూ మొదలుపెట్టిన ప్రపంచ వ్యాప్త భీభత్సానికి నాంది మాత్రమే. అమెరికా ప్రాదేశిక రాజకీయ ప్రయోజనాలను వ్యతిరేకించే శక్తులను అణచిపారేసేందుకు భారత పాలకులు ఇజ్రాయిల్‌తో కలిసి అమెరికా యుద్ధ యంత్రాంగం చేతిలో ప్రధాన సాధనాలుగా మారి పోయారు. అంతర్జాతీయ ఉగ్రవాదంపై పోరాటం పేరుతో భారత పాలకులు అమెరికాకి పూర్తిగా దాసానుదాసులై పోయారనేందుకు భారత-అమెరికాల రక్షణ యంత్రాంగాల మధ్య ఇటీవల జరిగిన అత్యున్నత స్థాయి సమావేశాలూ, కుదుర్చుకున్న అవమానకరమైన ఒప్పందాలే సాక్ష్యం. ఆర్థిక రాజకీయ రంగాలలో అమెరికా చెప్పిందానికల్లా భారత పాలకులు గంగిరెద్దులా తలాడిస్తూ పోవడంలోనూ ఇదే రకమైన దాస్య ప్రవృత్తిని మనం చూడొచ్చు. ఇది భారత ప్రజానీకంపై, జీవన పరిస్థితులపై వినాశకర ప్రభావాన్ని వేయబోతోంది. పెరుగుతున్న అమెరికా-భారత కూటమికి, వారి ఆర్థిక సంస్కరణల విధానాలకి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజా ఉద్యమాలను అణచి పెట్టడంపైన ఈ నిషేధం దృష్టి సారించింది.

మొత్తం 25 సంస్థలపై విధించిన ఈ నిషేధాన్ని తక్షణం తొలగించాల్సిందిగా సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] డిమాండ్ చేస్తోంది, పోటోను, రాష్ట్రాల స్థాయిలో అమలులో వున్న ఇదే రకం చట్టాలను బుట్ట దాఖలు వేయాల్సిందిగా పీపుల్స్‌వార్ పిలుపిస్తోంది. కేంద్ర, రాష్ట్రాలు రెండింట్లోనూ అమలవుతున్న అన్నిరకాల అప్రజాస్వామిక చట్టాలనూ తొలగించాల్సిందిగా పీపుల్స్‌వార్ డిమాండ్ చేస్తోంది.

ఇటీవలి నిషేధాలకు వ్యతిరేకంగా, పోటోకి, ఇలాంటి అప్రజాస్వామిక చట్టాలకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాటాలు చేయాలని దేశ ప్రజానీకానికి పీపుల్స్‌వార్ విజ్ఞప్తి చేస్తోంది. సామ్రాజ్యవాదానికి, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు ఆటస్థలంగా మన దేశాన్ని పాలకులు మార్చి వేస్తుండటాన్ని తీవ్రంగా వ్యతిరేకించమంటూ పీపుల్స్‌వార్ ప్రజారాసులకు విజ్ఞప్తి చేస్తోంది. సామ్రాజ్యవాదులను తన్ని తరిమేయాలని, దేశంలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణిపై పోరాటానికిగాను ఐక్యమవ్వాలంటూ సకల ప్రజాతంత్ర, విప్లవ శక్తులకూ పీపుల్స్‌వార్ పిలుపిస్తోంది.

**కేంద్రకమిటీ**

**6/11/2001. సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]**

---

(47వ పేజీ తరువాయి...)

చర్చల ప్రతిపాదనను అటకెక్కించాలనే చంద్రబాబు పన్నాగాన్ని మాత్రం గట్టిగానే అడ్డుకున్నాయి.

ఇందుకు కారణం చర్చల పట్ల ప్రతిపక్ష పార్టీలకి అంతటి నిజాయితీ, ఆసక్తి వుండటం కాదు. ప్రతిపక్ష స్థానంలో వుంటూ తమ మాట నెగ్గించుకోవాలనే పట్టుదల కాదు. దీని వెనకుండే ప్రధాన కారణమల్లా 'చర్చలు' పట్ల ప్రజల నుండి వ్యక్తమవుతున్న నిజమైన ఆసక్తి, ఆరాటాలే! చర్చలు జరిగి తీరాలని; తద్వారా ప్రభుత్వ పాశవిక దమనకాండ కొంతమేరకైనా కట్టడి కావాలని; మన ఉద్యమ పురోగమనానికి మరింత వెసులుబాటు చిక్కాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. మనది ప్రజాపునాదితో కూడిన ఉద్యమం కనుకనే ప్రజల నుండి ఇలాంటి స్పందన సహజం. నయవంచక చంద్రబాబు ప్రభుత్వం, దాని కిరాయి పోలీసులు ఈ నిజాన్ని అరిగించుకోలేక పోతున్నారు. సరిగ్గా ఈ కారణంగానే మన ఉద్యమ ప్రజాపునాదిని దెబ్బతీసే దుర్లక్ష్యంతోనే పోలీసుల హత్యాకాండలు సాగుతున్నాయి. ఉద్యమాభిమానులైన మన పునాది వర్గాల ప్రజలపై వారి తెల్ల భీభత్సం మరిన్ని వికృత రూపాలలో పెరుగుతోంది. విప్లవకర ప్రజాపంథాని దృఢంగా అంటిపెట్టుకుని వుంటూ మనం ఈ దమనకాండని ఎదిరిద్దాం, ఓడిద్దాం! ❑

# ప్రజాయుద్ధ భావనను అభావం చేయలేని సాంకేతిక యుద్ధ ''మాయాజాలం''

ప్రపంచీకరణ నేపథ్యంలో భారత–అమెరికాల మధ్య చిక్కనవుతున్న సైనిక బంధం వల్ల భారీ పారా మిలటరీ, మిలటరీ బలగాలకు, కొన్ని రాష్ట్రాల సాయుధ పోలీసు బలగాలకు అత్యాధునిక ఆయుధాలు, సైనిక సాధనాల వాడకంతో పరిచయం రాన్రానూ పెరుగుతోంది. ఈ క్రమంలో ఇంత వరకు, మీటర్ ఇమేజ్ స్కానర్లు, (మీటర్ దూరం పరిధిలో కూడా వస్తువును, లక్ష్యాన్ని స్పష్టాతిస్పష్టంగా గుర్తించగల ఇమేజ్ స్కానర్లు) హ్యాండ్ హెల్డ్ థర్మల్ ఇమేజర్లు (గెరిల్లాల కదలికలను రాత్రులంద కూడా పసిగట్టే నూతన నైట్ విజన్ సాధనాలు), శబ్దం ఏ మాత్రం చేయని మానవ రహిత నిఘా విమానాలు వంటి అత్యాధునిక సాంకేతిక ఆయుధ వ్యవస్థలు భారత రక్షణ బలగాల వాడుకలోకి వచ్చాయి. ప్రధానంగా కాశ్మీర్ జాతి విముక్తి పోరాటాన్ని అణచివేసే లక్ష్యంతో తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లతో నిరంతరం పాల్గొంటున్న భారత సైన్యాలకు వీటిని అందిస్తున్నారు. అట్లే గెరిల్లా వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహించే బలగాలకు, ఈశాన్య జాతి పోరాటాల అణచివేత బలగాలకు కూడా వీటినందిస్తున్నారు. ఇక నూతన నైట్ విజన్ సాధనాలను ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో విప్లవ గెరిల్లా వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహించే స్పెషల్ పోలీస్ బలగాలకు (గ్రేహౌండ్స్–వగైరా) ఇప్పటికే ఓ మేరకు అందించారు. పాశ్చాత్య దేశాల నుండి, ఇజ్రాయిల్ నుండి భారత ప్రభుత్వం వీటిని సమకూర్చుకుంటోంది. తన పరిధిలోకి వచ్చిన మనుషులను వారి శరీర ఉష్ణోగ్రతను బట్టి గుర్తించి ( అన్ని వేళల్లోనూ) సంకేతాలను అందజేసి, సైనికులను అలర్ట్ చేసే 'హేండ్ హెల్డ్ థర్మల్ ఇమేజర్ల పనివిధానం గురించి ఈ మధ్యే వచ్చిన 'కోడ్‌రెడ్' వంటి హాలివుడ్ మిలటరీ సినిమాలలో, డిస్కవరీ ఛానల్‌లోని 'వార్ జోన్' వంటి మిలటరీ ప్రోగ్రామ్‌లలో స్పష్టంగా చూపిస్తున్నారు. ఈ కోవలోని అత్యధునాతన రాడార్ సాధనమే ఫోపెన్ రాడార్.

కీకారణ్యంలో చెట్లు చేమలు, గుబుర్లు, పొదరిండ్ల మధ్య దాక్కుని వున్న వారి లక్ష్యాలను పసిగట్టడానికి ఈ ఫోలియెజ్ పెనెట్రేషన్ (ఫోపెన్) రాడార్‌ల వాడకం తప్పనిసరి అని ఎలెక్ట్రానిక్ రాడార్ అభివృద్ధి సంస్థ నిపుణులు పేర్కొంటున్నారు. తమిళనాడు, కర్నాటక ప్రభుత్వాలను ఎస్.టి.ఎఫ్.ని. ముప్పతిప్పలు పెడుతూ వందల కోట్ల రూ॥లను వృధా చేయిస్తున్న స్మగ్లర్ వీరప్పన్ జాడ పసిగట్టాలంటే ఈ ఫోపెన్ రాడార్‌ని వాడి తీరాలంటూ వీరంటున్నారు. ఇది అమెరికా వుత్పత్తి. కీకారణ్యాలలో అనుమానాస్పద కదలికలను పసిగట్టడానికి ఈ రాడార్‌లో 'డాప్లర్' విధానాన్ని వినియోగించారు. లక్ష్య ప్రదేశంలోని కాంతి లేదా ధ్వని తరంగాల్లో హెచ్చుతగ్గులను బట్టి వస్తువుల కదలికలను కనిపెట్టే విధానాన్ని 'డాప్లర్' విధానం అంటారు. దాచిపెట్టిన, పొదరిండ్లలో దాక్కున్న లక్ష్యాలను ఆటోమేటిక్‌గా గుర్తించటం (ఆటోమేటిక్ టార్గెట్ రికగ్నిషన్–ఎ.టి.ఆర్.) కోసం వైడ్ బ్యాండ్ సాంకేతిక విధానాలపై సామ్రాజ్యవాదులు ఇటీవల బాగా దృష్టి కేంద్రీకరించారు. 200 నుండి 900 మెగాహెర్జ్‌ల వరకు బ్యాండ్ విడ్త్‌తో సిద్ధం చేసే రాడార్ సూక్ష్మ నేత్రం (సింథటిక్ ఆపర్చర్) అత్యంత శక్తివంతం కాగలదని, అర్ధమీటర్ సైజులోని లక్ష్యాలను సైతం నఖశిఖ పర్యంతం శోధించగలిగిన సత్తాను ఇది కల్గి వుంటుందని ఈ రాడార్ బొమ్మల విశ్లేషణ, ప్రాసెసింగ్‌తో అప్పటికప్పుడు, దాక్కున్న లక్ష్యాల గుట్టు బట్టబయలవుతుందని నిపుణుల వ్యాఖ్య. శరీరానికి ఓ బుల్లి కంప్యూటర్‌ని తగిలించుకుని కూంబింగ్ చేస్తున్న అత్యాధునిక సైబర్ సైనికులు ఈ రాడార్ బొమ్మల విశ్లేషణ, ప్రాసెసింగ్‌ను ఉపగ్రహాల ద్వారా తక్షణమే అందుకుని, దాక్కుని వున్న లక్ష్యాలపైకి దాడికి సిద్ధం కాగలరు. పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికే వాడుకలో వున్న ఈ రాడార్‌ను భారత రక్షణ పరిశోధనా రంగం సొంతంగా సిద్ధం చేసుకోవాలంటే ఏడెనిమిదేళ్ళు పడుతుంది. కాబట్టి తక్షణం అవసరమనుకున్నట్లయితే అమెరికా వద్ద కొనుగోలు చేయటమే మార్గమని ఎలెక్ట్రానిక్ రాడార్ అభివృద్ధి సంస్థ నిపుణుల అభిప్రాయం.

సాంకేతిక యుద్ధం పేరిట ప్రచారమవుతున్న ఈ ఆధునిక 'మాయాజాలం'ని ఎలా అర్థం చేసుకోవాలి? యుద్ధానికి సంబంధించి ఇటీవలి దశాబ్దాలలో నెలకొన్న సాంకేతికాభివృద్ధి 'యుద్ధ కళ'ని యుద్ధ తంత్రాన్ని సమూలంగా మార్చివేయగలిగిందా? అమెరికా అణుబాంబు బూచిని చూపిస్తూ యుద్ధ స్వభావమే మారిపోయిందని 1960ల మొదట్లో సామ్రాజ్యవాదంతో సహజీవనం గురించి ప్రచారానికి దిగిన కృశ్చేవ్ నుండి మొదలుకుని నేటి సాంకేతిక యుద్ధవాదుల వరకు ఈ ప్రశ్నమీద లేని గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. సాంకేతికాభివృద్ధి నిస్సందేహంగానే యుద్ధ సమీకరణలపై తీవ్ర ప్రభావం చూపింది. గత కాలాల్లోని యుద్ధాలతో పోలిస్తే ఆధునిక యుద్ధ సాంప్రదాయాలు కాని, యుద్ధ ఆశయాలు కాని చాలా విభిన్నంగా వుంటున్నాయి. యుద్ధాల గతిలో ఈ విస్పష్టమైన మార్పు చోటు చేసుకున్నప్పటికీ సాంకేతిక జ్ఞానం వల్ల యుద్ధ స్వభావంలో మౌలిక మార్పు లేదనే చెప్పాలి. యుద్ధమూ, యుద్ధ స్వభావమూ ఎందుకు మారలేదనే అంశం యుద్ధ కళను అర్థం చేసుకోవటంలో చాలా కీలకమైనది.

## సాంకేతిక నిఘా వ్యవస్థలు

టెక్నాలజీ కత్తి వాదర అనేది యుద్ధ సమీకరణలపై తీవ్రమైన ప్రభావాన్నే చూపింది. ఎందుకంటే 2000 సం॥ల క్రితం చైనాలో 'యుద్ధ కళ' పుస్తకం రాసిన సున్ జు పేర్కొన్న యుద్ధ మెలకువలను లేజర్ గైడెడ్ బాంబులు, నైట్ విజన్ సాధనాలు, యంత్ర సమన్విత (మెకనైజ్‌డ్) సైనికులు, హంతక యుద్ధ విమానాలతో కూడుకున్న ఆధునిక సాంకేతిక యుద్ధ లక్షణాలతో పోల్చడం కష్టమే. గూఢచర్యపు ఉపగ్రహాలు, సమాచార సేకరణా విమానాలు, ప్రపంచ వ్యాప్త నిఘా వ్యవస్థలు ఉనికిలోకి వచ్చిన ఈ రోజుల్లో సమాచార సేకరణా పద్ధతులు కూడా గతంతో పోల్చలేనంత వ్యత్యాస పూరితంగా వుంటున్నాయి. శత్రు రహస్యాలను గూఢచారులే (మనుషులే) స్వయంగా కనుగొనాలనే పాత భావనను ఆధునిక సమాచార వ్యవస్థలు అధిగమించాయి. ఒకే ఒక్క ఉదా॥గా చెప్పాలంటే అమెరికా ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న ఎకలాన్ (Echelan) ప్రాజెక్ట్ ద్వారా ఉపగ్రహాలు, మైక్రోవేవ్స్, సెల్యులార్, ఫైబర్ ఆప్టిక్ ట్రాఫిక్ తదితర కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా సమాచారాన్ని సేకరించి, వడగట్టి విశ్లేషించే అత్యాధునిక పద్ధతికి రంగం సిద్ధమైంది. ఈ ప్రాజెక్ట్‌లో వాడుతున్న కంప్యూటర్లు పేర్లను, పాస్‌వర్డ్‌లను, టెలిఫోన్ నంబర్లను, ధ్వనిని కూడా గుర్తిస్తాయని రోజుకు 300 కోట్ల ఇ-మెయిల్స్‌ను ఇవి పసిగడతాయని (ఇది ఇంటర్నెట్ ద్వారా ఇపుడు పంపుతున్న ఇ-మెయిల్స్‌లో 90 శాతం) ప్రచారం జరుగుతోంది.

120 అమెరికా ఉపగ్రహాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా వివిధ కేంద్రాల నుండి సమాచారాన్ని సేకరించగలగడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. అయితే ఈ అత్యాధునిక నిఘా వ్యవస్థలేవీ సెప్టెంబర్ 11 దాడిని అడ్డుకోలేక పోయాయన్నది గమనార్హం. ఈ రకంగా అప్పుడూ ఇప్పుడూ కూడా సర్‌ప్రైజ్ (మెరుపు) దాడులకు యుద్ధంలో ఆస్కారం వుంటూనే వస్తోంది. ప్రపంచంలో ఏ మనిషి ఎప్పుడూ దేన్ని గురించి ఆలోచిస్తుంటాడో కనిపెట్టే 'సెన్సర్లు' వస్తే తప్ప సెప్టెంబర్ 11 దాడులకు చరమ గీతం పాడటం సాధ్యం కాదని నిపుణుల వ్యంగ్య వ్యాఖ్య. పైగా ప్రచ్ఛన్న యుద్ధానంతరం గూఢచారుల (మనుషుల) కంటే యంత్ర నియంత్రిత నిఘా వ్యవస్థలకు పాశ్చాత్య దేశాలు అతిగా ప్రాధాన్యమిచ్చినందువల్లే సెప్టెంబర్ 11 దాడుల తరహా సంఘటనలను ఆ సమాజాలు ముందుగా పసిగట్టలేక పోయాయని ఇపుడు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మనిషి-యంత్ర వ్యవస్థల పోటీలో అంతిమ ప్రాధాన్యత మనిషిదే అనేదే పరమ సత్యం. అయితే ఈ రెండూ సమర్థంగా వినియోగంలోకి వచ్చినపుడు అవి ప్రత్యర్థుల విజయ అవకాశాలను, దాడులను ప్రతిభావంతంగా అడ్డుకుంటాయి. మానవ ప్రమేయం లేని సాంకేతిక నిఘా వ్యవస్థలు ఎందుకూ కొరగావన్నదే సెప్టెంబర్ 11 దాడుల సారాంశం. ఈ ఒక్క కోణం నుంచి తప్ప సాంకేతిక వ్యవస్థలను తక్కువగా అంచనా వేయటం ఏ ఉద్యమానికైనా ప్రాణాంతకమే అవుతుంది. ప్రభుత్వానికి దొరికిన ఒకే ఒక్క సమాచారం శ్రీలంకలో ఉధృతంగా సాగుతున్న 'జనతా విముక్తి పెరమణ' (జె.వి.పి. సింహళ జాతీయ పోరాట సంస్థ) మొత్తం అగ్ర నాయకత్వాన్ని పదేళ్ళ క్రితం నిర్మూలించి వేసిందంటే యుద్ధతంత్రంలో సమాచార ప్రాధాన్యత ఎంతో తెలుస్తుంది. ఈ రకంగా, సమాచారాన్ని రాబట్టడంలో గతంలో కంటే ఈ కాలంలోనే శత్రువుకు సాంకేతిక పరంగా అవకాశాలు మెండుగా వున్నాయి. (గత 3 నెలలుగా 'ఒకే ఒక్కడి' (బిన్‌లాడెన్) సెల్ కాల్‌ని ఆరా తీయటం కోసం అమెరికా విశ్వ ప్రయత్నం చేస్తోందన్నది మరవరాదు).

## హైటెక్ సైనికులు

సామ్రాజ్యవాదులు అసమ యుద్ధాల్లో వెనుకబడిన దేశాలకు చెందిన వేలాది, లక్షలాది సైనికులను, ప్రజలను క్రూరాతి క్రూరంగా చంపడానికి వెనుకాడరు గానీ ఈ యుద్ధాల్లో సొంత సైనికులను నష్టపోవడానికి మాత్రం సిద్ధంగా వుండరు. రెండో ప్రపంచ యుద్ధానంతరం కొరియా యుద్ధంలో వియత్నాం విప్లవ పోరాటంలో, చిన్న దేశాల్లో వేల సంఖ్యలో సొంత సైనికులను పోగొట్టుకుని దేశీయ ప్రజానీకపు తీవ్ర నిరసనను చవిచూసిన అమెరికా కానీ బ్రిటన్ తదితర యూరప్ దేశాలు కానీ తమ సైనికులకు నష్టం జరగని రీతిలో యుద్ధతంత్రాన్ని, వ్యూహాలను నిర్వహించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాయి. పరాయి దేశాలలో అడుగుపెట్టి భూతల యుద్ధాలను సాగించటం 1950 తర్వాత సామ్రాజ్యవాదులకు ప్రాణాంతకంగా మారింది. వియత్నాంలో ఘోర పరాజయం తర్వాత ప్రత్యేకించి అమెరికా పరాయి దేశాలతో నేరుగా తలపడ్డం కంటే ఆయా దేశాల ప్రభుత్వ సైన్యాలకు, లేక అమెరికా అనుకూల తిరుగుబాటు సైన్యాలకు శిక్షణ ఇచ్చి తన చేతికి బురద అంటకుండా ప్రపంచ ఆధిపత్య వ్యూహాలను అమలు చేయటం సాగించింది. ఈ పరోక్ష యుద్ధ వ్యూహానికి 1990లలో ఎదురు దెబ్బలు తగిలాయి. కువైట్‌ని ఆక్రమించటం ద్వారా ఇరాక్ మధ్యాసియాలో అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు గండి కొట్టడంతో సామ్రాజ్యవాదుల యుద్ధతంత్రం మలుపు తిరిగింది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత ఏక ధ్రువ ప్రపంచ ఆధిపత్యానికి అర్రులు చాచిన అమెరికాకు వ్యతిరేకంగా మధ్యాసియాతో సహా ప్రపంచమంతటా ఇస్లామిక్ మత ఛాందసవాదం తన మీదకే సాయుధ చర్యలతో పోరుకు దిగడంతో అమెరికా ప్రత్యక్ష చర్యలకు కూడా సిద్ధమైపోయిన నేపథ్యంలో గత దశాబ్దంలో అమెరికా యుద్ధతంత్రం మారింది. ఒకవైపు ప్రపంచమంతటా తక్కువ స్థాయి ఘర్షణల (యల్.ఐ.సి.) యుద్ధ వ్యూహాన్ని అమలు చేస్తూనే, మరోవైపు ప్రపంచమంతటా తనకు ప్రధాన శత్రువుగా తయారై కూచున్న 'ఇస్లామిక్ టెర్రరిజం'తో పోరాడటానికిగాను అమెరికా ప్రత్యక్ష చర్యలకు కూడా తలపడాల్సి వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా తన ప్రయోజనాల రక్షణకు సంబంధించిన ఈ అవసరం యుద్ధతంత్రంలో కూడా మార్పులకు దారి తీసింది. ఇది రెండు పరిణామాలకు దారి తీసింది. ఇంతవరకూ నడచిన యుద్ధాల చరిత్రకు భిన్నంగా వైమానిక, క్షిపణి దాడులకు యుద్ధంలో ప్రాధాన్యత ఇవ్వటం. 1991లో ఇరాక్‌పై అమెరికా సాగించిన ప్రత్యక్ష దాడితో నూతన సాంకేతిక యుద్ధ వ్యూహం రంగం మీదికి వచ్చింది. భూతల యుద్ధానికి, పదాతి సైనికులకు దన్నుగా వాయుసేన క్షిపణి వ్యవస్థలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సంప్రదాయ యుద్ధ విన్యాసంతో పాటు సాంకేతిక యుద్ధ వ్యూహం '90లలో విస్తృత ప్రచారం పొందింది.

రెండు. ఇరాక్‌లో, సోమాలియాలో, ఆఫ్ఘన్లో తదితర దేశాలతో ప్రత్యక్ష చర్యలకు తలపడే సందర్భాలలో సొంత సైనికులకు నష్టం లేకుండా చూసుకోవడం, స్వదేశంలో సైనికుల కుటుంబాల నుండి, ప్రజల నుండి నిరసన తలెత్తకుండా చూసుకోవడం, అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలకు తప్పనిసరైంది. సొంత సైనికుల రక్షణకు సామ్రాజ్యవాదులు రెండు పద్ధతులు అవలంబిస్తున్నారు. యుద్ధంలోకి నేరుగా తాము దిగకుండా తమకు వ్యతిరేకంగా వున్న 'ధూర్త' దేశాల్లో తిరుగుబాటు సేనలకు ఆయుధాలిచ్చి యుద్ధంలోకి నెడుతూ వారిని పావులుగా ఉపయోగించుకుంటూ, వెనుక భాగంలో తాముండి సొంత సేనలకు నష్టాలు లేకుండా చూసుకుని ఫలితాలు సాధించటం.

గత 50 ఏళ్ళుగా పలు సందర్భాలలో పరాయి దేశాల సైనికులను బలిపెట్టి తాము లాభపడటాన్ని సామ్రాజ్యవాదులు ఒక విధానంగానే అమలు పరుస్తున్నారు. నేటి ఆఫ్ఘన్ యుద్ధంలో సైతం ఉత్తరాది కూటమి సైనికులను ముందుకు నెట్టకుండా అత్యాధునిక సాంకేతిక సంపత్తి కల అమెరికా సైనికులు అడుగు ముందుకు పెట్టలేదన్నది స్పష్టం. దీంట్లో నూతనత్వం లేదు గాని, అనివార్యంగా తన సైనికులే యుద్ధంలో ముందు పీఠిన నిలబడాల్సి వస్తే, తమ పరిధిలో తాము మాత్రమే కొన్ని ప్రత్యేకమైన, తీవ్రమైన సైనిక చర్యలు చేపట్టాల్సి వస్తే, ఇలాంటి సందర్భాలలో సొంత సైనికులను కాపాడుకోవటం, వారిని శత్రు దుర్భేధ్యంగా తయారు చేయటం ఎలా అనే అవసరం లేంచే సామ్రాజ్యవాదులు '21వ శతాబ్దపు భూతల సైనికులు' అనే భావనను తీసుకొచ్చారు. గత దశాబ్ది పొడవునా అనేక పాశ్చాత్య సైనిక బలగాలలో ఈ 21వ శతాబ్ది భూతల సైనికులు' (21 సి.యల్.డబ్ల్యు.) భావన ఒక సీరియస్ అధ్యయనాంశంగా మారింది. ఇంతకూ 21 సి.యల్.డబ్ల్యు. అంటే ఏమిటి?

సమీప భవిష్యత్తులోనే సామ్రాజ్యవాద మిలటరీ బలగాల్లో రూపొందనున్న 'హైటెక్ పదాతి సైనికుడి' గురించిన వర్ణనే 21 సి.యల్.డబ్ల్యు. భావన. ఆకాశంలోనూ, సముద్రంమీదా పోరాడే వారుకాక, నేలమీద పోరాడే సైనికుల కోసం రూపొందిన నూతన, భవిష్యత్ మిలటరీ అభివృద్ధికి సంబంధించిన భావననే '21వ శతాబ్ది భూతల సైనికుడు' అని

పిలుస్తున్నారు. ప్రధాన ఆయుధం, మందుగుండు సామగ్రి తప్ప యుద్ధ క్రమంలో ఆటంకంగా వుండే ఏ ఇతర అనుబంధ వస్తువులూ, సైనికుల శరీరంపై భాగమై వుండరాదనే సాంప్రదాయిక నిర్వచనాన్ని ఈ నూతన భావన తోసిపుచ్చుతోంది. ఈ నూతన భావనలో రూపొందించబడుతున్న సైనికుల మూపులపై గ్లోబల్ పొజిషనింగ్ రిసీవర్‌ని నిర్వహించే 9 పౌండ్ల బరువుగల బ్యాక్-టాప్ కంప్యూటర్ వుంటుంది. ఇంకా మీనియేచర్ కెమెరా, లేజర్ రేంజ్ ఫైండర్, వీడియో మరియు థర్మల్ వెపన్ సెట్స్, రేడియోలను కూడా ఈ హైటెక్ సైనికులు ధరిస్తారు. ఇకపోతే అమెరికన్ తరహా యం-16 లేక యం-4 మోడ్యులర్ కార్బైన్ వీరి ప్రధాన ఆయుధం. దీనికి లేజర్ రేంజ్ ఫైండర్ లేక డిజిటల్ కంపాస్, డేలైట్ వీడియో కెమెరా, లేజర్ ఎయిమింగ్ లైట్, థెర్మల్ సైట్‌లు అమర్చబడి వుంటాయి.

ఈ తరహా సైనికుడి వెనుక భాగంలోని బ్యాటరీతో పనిచేసే పరికరంకి చెందిన వైర్లు, సైనికుడి హెల్మెట్‌కి లేక సన్‌గ్లాసెస్‌కి అమర్చి వుంటాయి. ఈ హెల్మెట్/సన్‌గ్లాసెస్ పైభాగంలో ఉపగ్రహాల నుండి వచ్చే మెసేజ్‌ని ప్రదర్శించేందుకు ఒక చిన్న స్క్రీన్ (మోనిటర్) వుంటుంది. ఇక అతడి ఆయుధానికి పగటిపూట అవసరాలకు వీడియోసైట్, రాత్రిపూట అవసరాలకు థెర్మల్ సైట్‌ని ఇంకా లేజర్‌తో పనిచేసే రేంజ్ ఫైండర్ (శత్రువు వున్న పరిధిని సూచించేది) లాంటివి అమర్చబడి వుంటాయి. భవిష్యత్ సైనికుడిని రూపకల్పన చేస్తున్న పాశ్చాత్య యుద్ధ శాస్త్ర నిపుణులు 2025 నాటికి తాము ట్యాంకుల్లా విధ్వంసం సృష్టించగలిగే విడి పదాతి సైనికులను రూపొందిస్తామని, వాళ్ళు నేటి కిరాయి సైనికుల కంటే యుద్ధావసరాలకు మరింత అనువుగా వుంటారని ప్రకటిస్తున్నారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు ఒక పదాతి సైనికుడు శత్రువు ఆనుపానులను పసిగట్టి వీడియో చిత్రాలుగా ప్రసారం చేయగల బొద్దింకల్లాంటి రోబోట్ పరికరాలను శత్రువు దాగి వున్న భవనాలలోకి పంపించగల సామర్థ్యాన్ని కలిగి వుంటాడని, ఈ రోబోటిక్ పరికరాలు (బగ్స్) శత్రువును లొంగదీసుకునేందు కోసం ప్రాణాంతకం కాని మత్తు పదార్థాలను వెదజల్లగలుగుతాయని నిపుణులు ధీమా ప్రకటిస్తున్నారు.

అయితే శతాబ్దాలుగా సైన్యాలు పరస్పరం తలపడుతున్నట్లుగానే భూతలంమీది ఆధునిక సైనికులు కూడా బురద నేలలో దేక్కుంటూ పోతూ, మహా ఇబ్బందికరమైన ప్రాంతాలలో కదులుతూ, శత్రువుతో పోరాడాల్సిన పరిస్థితుల్లోనే వున్నారు. కానీ, వ్యత్యాసమల్లా ఏదంటే ఆధునిక సైనికులు అధునాతన సాంకేతిక సాధనాలూ, అత్యంత నిర్దిష్టమైన (ఆక్యురేట్) సమర్థమైన ఆయుధాలూ, విస్తృతమైన సమాచార సాంకేతిక సాధనాలూ, కలిగి వుండటమే. ఇక సైనికుల ఆయుధాలు గతించిన కాలాలతో పోలిస్తే మరింత తేలిక బరువుతో కూడినప్పటికీ బహు శక్తివంతమై వుంటున్నాయి. ఆధునిక రైఫిళ్ళు గత 50 సం॥లకు పైగా సాగుతున్న టెక్నాలజీ మీదే ఆధారపడి వుంటున్నప్పటికీ అవి ఇపుడు మరింత సామర్థ్యతతోనూ, బలువుతోనూ పనిచేస్తున్నాయి.

యుద్ధతంత్రం మొత్తంగా జిత్తులమారి తనంతో కూడి వుంటుదని ‘యుద్ధకళ’లో సున్-జూ రాశాడు. శత్రువు ఆనుపానులు కనిపెట్టి వాడి ఆయుధ, సాంకేతిక వ్యవస్థపై నిఘా పెట్టి బలాబలాలను బేరీజు వేసుకొని దాడికి దిగటం శతాబ్దాలుగా యుద్ధతంత్రంలో భాగమైనట్లే, శత్రువు నిఘాకి దొరక్కుండా, తన బలాన్ని, సైనిక, సాంకేతిక సంపత్తిని మరుగున పెట్టి అనూహ్య రీతిలో దాడి చేయటం అనేది కూడా ప్రాచీన కాలం నుండి కొనసాగుతోంది. ఇవి రెండూ ఒక దానిపై మరొకటి అధిగమించే క్రమంలోనే యుద్ధ తంత్రం, యుద్ధ సాంకేతిక వ్యవస్థలు చరిత్రలో అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఆధునిక కాలంలో వైమానిక శక్తిని ఇది మరింతగా వృద్ధి పర్చింది. భూతల సైనికులు భూమ్మీదనుండి వందలాది కిలోమీటర్ల దూరంలోని శత్రు విమానాలను వెంటాడి కూల్చగల ఉపరితల క్షిపణులను ప్రయోగించడం సాధ్యమైనాక రాడార్‌కి దొరకని, నిఘాకు అందని తరహా యుద్ధ విమానాల తయారీకి రంగం సిద్ధమైంది. దీంట్లో భాగంగానే 1981లో బి-2 బాంబర్ తయారీ కోసం పరిశోధన మొదలైంది. మెరుపు వేగంతో, ఖచ్చితమైన గురితో దాడి చేయగలిగే స్టెల్త్ యుద్ధ విమానాలకు మలివిడత అభివృద్ధి రూపమే ఈ బి-టూ బాంబర్. శత్రు రాడార్‌కి దొరక్కుండా వుండి దాడి చేయగల అధునాతన సాంకేతిక ఆవిష్కరణకి ఇది ప్రతిరూపం. ఒకే ఒక్కసారి ఆకాశంలోనే ఇంధనాన్ని నింపితే చాలు, ప్రపంచం మొత్తంలో ఎక్కడ వున్న టార్గెట్‌నయినా కొట్టగల శక్తి సామర్థ్యం బి-2 యుద్ధ విమానాలకుంది. సాంప్రదాయక ఆయుధాలను, అణ్వాయుధాలను, గ్రేవిటీ బాంబులను, అధునాతన క్రూయిజ్ క్షిపణులను ఇలా ఇంతవరకూ ఉనికిలోకి వచ్చిన అన్ని ఆయుధాలనూ మోసుకుపోయి ప్రయోగించగల ఈ బి-2 విమానం కాక్‌పిట్‌లోని 136 విడి విడి కంప్యూటర్ల సహాయంతో పనిచేయగలదు. పదేళ్ళ క్రితం ఇరాక్ భూభాగంపై అడుగు పెట్టకుండానే ఇరాక్ సైనిక వ్యవస్థను, ఇతర టార్గెట్‌లను ధ్వంసం చేయటంలో స్టెల్త్ ఫైటర్ సిరీస్‌లోని యఫ్-117 యుద్ధ విమానాలే కీలక పాత్ర వహించాయి.

ఇక ఆఫ్ఘన్‌పై ప్రస్తుత అమెరికా దురాక్రమణ దాడి విషయానికి వస్తే అమెరికా దాడికి దిగకముందు నెల రోజుల పాటు పైలెట్ రహిత రోబోట్ విమానాలు ఆఫ్ఘనిస్తాన్ గగనతలంపై నెమ్మదిగా విహరిస్తూ తాలిబాన్ సైన్యాల కదలికలకు సంబంధించిన ఛాయా చిత్రాలను అమెరికా సైన్యంకి అందించి రంగం సిద్ధం చేశాయి. ఇవి 40 గంటల పాటు ఏకధాటిగా విహరిస్తూ సింగిల్ టార్గెట్‌ని కానీ, వందలాది టార్గెట్‌లను కానీ పసిగట్టి వాటి ఛాయా చిత్రాలను పంపిస్తుంటాయని పేరొందాయి. అత్యంత అననుకూలమైన, ఇబ్బందికరమైన ప్రాంతంలో సంచరిస్తూ మందు పాతరలను వెతుకుతూ, మందుపాతరలను పసిగట్టిన వెంటనే వాటికి అతుక్కుపోయి అక్కడికక్కడే వాటిని పేల్చేసే పీత రూపంలోని ఐ రోబోట్ (iRobot) లు కూడా ఆఫ్ఘన్‌పై అమెరికా దాడిలో వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి మానవరహిత రోబోట్ విమానాలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, థెర్మల్ ఇమేజింగ్ యంత్రాలూ, యుద్ధ రంగంలోని రోబోట్లు (మైన్ స్వీపర్లు) అమెరికాకు ఈ దాడిలో సైనిక నష్టాన్ని ఎంతగా తగ్గించి వేశాయంటే అమెరికా దాడి మొదలైన మూడు నెలల తర్వాత మాత్రమే మొట్టమొదటి అమెరికా సైనికుడు శత్రుదాడిలో హతమైపోయాడు. ఇంకా బయోమెట్రిక్స్‌లో, కృత్రిమ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ.) లో పురోగతితో 2020 సం॥రం నాటికి ఆధునిక యుద్ధ రంగంలో రోబోటిక్ విప్లవం మొదలవుతుందని అమెరికా, యూరప్ యుద్ధ సాంకేతిక శాస్త్రవేత్తలు అంటున్నారు.

యుద్ధతంత్రంలో, యుద్ధ సాంకేతిక నైపుణ్యంలో పెనుమార్పులకు దారితీస్తున్న ఈ సాంకేతిక యుద్ధ ‘మాయాజాలాన్ని’ ఎలా అర్థం చేసుకోవాలి? చరిత్రలో దోపిడీదారులు యుద్ధాలను అసమ యుద్ధాలుగా మార్చిన సుదీర్ఘ క్రమంలో భాగమే ఈ ఆధునిక యుద్ధతంత్రం. తేడా అల్లా ఏదంటే సామ్రాజ్యవాదులు ఈ అసమ యుద్ధాలను మరింత

అసమానంగా, మరింత అన్యాయంగా, మరింత వివక్షాపూరితంగా మార్చివేస్తున్నారంతే. పరస్పరం తలపడుతున్న శక్తులు, బలాబలాల మధ్య అంతరం అగాధపూరితంగా పెరిగి పోతోంది. దోపిడీ యుద్ధాలకు, ప్రజాయుద్ధానికి మధ్య బలా బలాలకు, సాంకేతిక శక్తికి సంబంధించిన అంతరాన్ని ఈపరిస్థితి మరింతగా పెంచి వేస్తోంది. ఈ అర్థంలో చూస్తే ఈనాటి వాస్తవ పోరాటాలు, యుద్ధాలు ఇంకేమాత్రం పరస్పరం తలపడే పోరాటాలుగా లేవు. ఇది యంత్రాలతో, రోబోట్లతో ఏకపక్షంగానూ, మరింత గందరగోళంగానూ సాగుతున్న పరోక్ష యుద్ధం, ఎదురెదురు పోరాట స్వభావం లేని అతి దూరపు యుద్ధం. ఈ స్థితి వాస్తవ పోరాటాలను అభాసగా మారుస్తోంది. అయితే ప్రాచీన కాలం నుంచి నేటి దాకా యుద్ధ తంత్రం ఒకదాన్ని మరొకటి అధిగమించే పరస్పర విరుద్ధ కోణాల్లోంచే అభివృద్ధి చెందుతున్నది. ఈరోజు శత్రు దుర్భేద్యమైందిగా కన్పిస్తున్నది రేపు దూదిపింజకంటే తేలికైనదిగా కూలిపోవచ్చు. సామ్రాజ్యవాదులు ప్రపంచంపై మోపుతున్న ఈ అసమ యుద్ధం పోరాట శక్తుల మధ్య ఎంతగా అగాధపూరితమైన వ్యత్యాసాన్ని సృష్టించినా, దోపిడీ వ్యతిరేకమైన ప్రజాయుద్ధ లక్ష్యాన్ని, ప్రజాయుద్ధ ఆవశ్యకతని అది ఏ మాత్రం మార్చలేదు. పైగా సాంకేతిక యుద్ధ తంత్రం దోపిడీ, పీడనలకు వ్యతిరేకమైన మానవుల ఆకాంక్షలను ఎన్నటికీ చంపలేదు. అణ్వాయుధమైనా, సాంకేతిక యుద్ధతంత్రమైనా వర్గ దోపిడీని, ప్రపంచ జాతులపై సామ్రాజ్యవాద పీడనను ఎన్నటికీ శాశ్వతం చేయలేదు. ఒక చిన్న దేశపు ప్రజానీకం పీడనకు, దోపిడీకి వ్యతిరేకంగా ఏకత్రాటి మీద నిలబడి ఐక్యంగా పోరాడితే అతిపెద్ద సామ్రాజ్యవాద దేశాలను కూడా ఓడించగలదన్న మావో ప్రజాయుద్ధ భావన ఇప్పటికీ సందర్భోచితమైనట్టిదే. సాంకేతిక యుద్ధతంత్రం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేర్చే సాధనమే తప్ప ప్రజల ఆకాంక్షలను అది పట్టించుకోదు. ఈ అత్యంత ప్రధానమైన బలహీనతే సాంకేతిక యుద్ధతంత్రపు బలాన్ని, సామర్థ్యాన్ని నిర్వీర్యం చేస్తుంది. ఇదే అంతిమంగా ప్రజాయుద్ధపు విజయాన్ని కూడా ఖాయం చేస్తుంది. ❑

## సామ్రాజ్యవాదులు, అణుబాంబులు ఎన్నటికీ కాగితం పులులే!

''ఒక మహా రాక్షసుడిలా కనబడే అమెరికా సామ్రాజ్యవాదం, అంతస్సారంలో మరణ శయ్యపై పోరాటంలో వున్న కాగితం పులే. నేటి ప్రపంచంలో వాస్తవంగా ఎవరు ఎవరిని చూసి భయపడుతున్నారు? అమెరికా సామ్రాజ్యవాదానికి భయపడేది వియత్నాం ప్రజలు, లావోటియస్ ప్రజలు, కంబోడియన్ ప్రజలు, పాలస్తీనా ప్రజలు, అరబ్బు ప్రజలు లేదా ప్రపంచంలోని ఇతర దేశాల ప్రజలు కాదు. అమెరికా సామ్రాజ్యవాదమే ప్రపంచ ప్రజలను చూసి భయపడిపోతోంది. గాలికి ఆకులు గలగలమనగానే, అది భీతిల్లి పోతోంది. ధర్మమైన ఆశయానికి పుష్కలంగా మద్ధతు దొరుకుతుందనీ, అధర్మ ఆశయానికి స్వల్ప మద్ధతు దొరుకుతుందనీ, ఒక బలహీనమైన దేశం, ఒక బలమైన దేశాన్ని ఓడించగలదని, ఒక చిన్న దేశం పెద్ద దేశాన్ని ఓడించగలదనీ అనేకానేక వాస్తవాలు రుజువు చేస్తున్నాయి. ఒక చిన్న దేశపు ప్రజలు పోరాటంలోకి దూకే సాహసం చేస్తే, ఆయుధాలను చేపట్టడానికి సాహసిస్తే, తమ దేశ భవిష్యత్తును తమ చేతుల్లోకే దృఢంగా పట్టుకోడానికి సాహసిస్తే, వారు ఖాయంగానే ఒక పెద్ద దేశ దురాక్రమణను ఓడించగలుగుతారు. ఇది చరిత్ర నియమం.'' (మావో రచనలు, 9వ సంపుటి, పేజి–410)

'పులుల గురించి మనం మాట్లాడుకున్నాం కాబట్టి, మీరు ఇప్పటికీ అణుబాంబును ఒక కాగితం పులిలా చూస్తూనే వున్నారా?' అని నేను (ఎడ్గార్ స్నో) అడిగాను.

అది విషయాన్ని ఒక ఉపమానం ద్వారా చెప్పడం, అతిశయోక్తి ద్వారా చెప్పడం. బాంబు ప్రజలను చంపగలదన్నది నిజమే. కానీ చివరికి ప్రజలే బాంబును నాశనం చేస్తారు. అది అప్పుడు నిజంగానే కాగితం పులి అవుతుంది...... ఒక్క ఆటంబాంబు మానవాళినంతటినీ నాశనం చేసి, శాంతి గురించి రాయబారం నడపటానికి ఒక్క ప్రభుత్వాన్ని కూడా కనుగొనలేని స్థితి వస్తుందని ఆయన (మావో) కు నమ్మకం లేదు. 1954 అక్టోబర్‌లో చైనా సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూతో మావో ఈ విషయాన్ని ప్రస్తావించారు. తాను భారత అణుశక్తి కమీషన్ ఛైర్మన్‌నని, అణుశక్తి యొక్క వినాశకర శక్తి ఎంతో తనకు బాగా తెలుసునని నెహ్రూ అన్నాడు. ఏ ఒక్కడూ బతికి బట్టలేడని నెహ్రూ దృఢంగా నమ్మాడు. అయితే అది నెహ్రూ చెప్పిన విధంగా జరగక పోవచ్చని మావో బదులిచ్చాడు. ప్రస్తుతం వున్న ప్రభుత్వాలు అంతర్ధానం అయిపోవచ్చుకానీ, వాటి స్థానంలోకి కొత్తవి పుట్టుకొస్తాయి......

'.... కొద్దికాలం క్రితమే సమస్త జీవరాసులను చంపేయగల మారణాయుధం తన దగ్గర వుందని కృశ్చేవ్ ప్రకటించాడని మావో అన్నాడు. ఇక ఆ తరువాత అతడుగా తన ప్రకటనని వెనక్కి తీసుకున్నాడు – ఒకసారి కాదు పలుమార్లు. అమెరికన్లు కూడా అణుబాంబు వినాశక శక్తిని గూర్చి ఎంతో ఆర్భాటం చేశారు. కృశ్చేవ్ దాని గురించి గోలగోల చేశాడు. ఈ సందర్భంగా మావో తనను అణుభీభత్సాన్ని గురించి పూర్తి అర్థం తెలియని మూర్ఖ రైతుగా పరిగణిస్తున్న వారిని ఎద్దేవా చేశాడు.

అయినాగానీ, బికినీ ద్వీపాలలో అణు పరీక్షలు జరిపిన ఆరేళ్ళ తరువాత అక్కడికి వెళ్ళి వచ్చిన అమెరికన్ల పరిశోధనా రిపోర్టులు ఆయన (మావో) దగ్గర వున్నాయి. 1959 నుండి పరిశోధకులు బికినికి వెళ్ళసాగారు. వారు మొదటి సారిగా ప్రధాన ద్వీపానికి వెళ్ళినపుడు వారికి బాటల కోసమై పొదలను నరకాల్సి వచ్చింది. ఆ సందర్భంగా ఎలుకలు అటూ ఇటూ పరుగెత్తడాన్ని, చేపలు సెలయేళ్ళలో యధావిధిగా ఈదుతూ వుండటాన్ని కనుగొన్నారు. బావిలోని నీరు తాగేందుకు యోగ్యంగానే వుండింది. పొదలు, లతలు సమృద్ధిగా పెరుగుతున్నాయి. పిట్టలు చెట్లపైన కిలకిలా రావాలు చేస్తూనే వున్నాయి. బ్యాక్టీరియా చదరపు కి.మీ.కి నాలుగు వందల కిలో గ్రాముల రేటు చొప్పున వృద్ధి చెందింది. అణుపరీక్షల తర్వాత బహుశా రెండు పాడు సంవత్సరాలు వుండి వుండవచ్చు. అయితే ప్రకృతి యధావిధిగా కొనసాగింది. ఎలుకలు ఎలా బతికి బయటపడ్డాయి? వృక్ష జాతులు నాశనం చేయబడ్డాయి అయితే విత్తనాలు మాత్రం నాశనం కాలేదు. అవి భూమి ఉపరితలం పరిశుభ్రమయ్యేదాకా భూమిలోనే నిద్రాణంగా వుండిపోయాయి. బ్యాక్టీరియాకు, పిట్టలకు, ఎలుకలకు, చెట్లకు అణుబాంబు నిజంగానే కాగితం పులే. అయితే మానవుడికి మాత్రం అది భిన్నంగా వుండే అవకాశం వుండవచ్చు.

మావో చివరి వ్యాఖ్యలోని లోతైన భావం ఏమిటంటే, మానవుడు భూమినుంచి అదృశ్యమైపోయినా (సామూహిక ఆత్మహత్యకు పాల్పడినా) మానవుడి బాంబు వల్ల 'జీవరాశి' అంతం చేయబడజాలదు.

**(జనవరి 9, 1965న అమెరికా పాత్రికేయుడు ఎడ్గార్ స్నోకు కామ్రేడ్ మావో ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి కొన్ని భాగాలు : మావో రచనలు, 9వ సంపుటి, పేజి: 438-439)**

# దండకారణ్యమంతటా వ్యాపించిన అమెరికా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు

అక్టోబర్ 18న మాడ్ డివిజన్‌కి చెందిన ఇంద్రావతి ప్రాంతం టేకిలోడ్ గ్రామంలో ఓ భారీ ప్రదర్శన జరిగింది. ఇంద్రావతి ఏరియా పార్టీ కమిటీ నిర్వహించిన ఈ ప్రదర్శనలో రెండు లోకల్ గెరిల్లా దళాలు, అన్ని ప్రజాసంఘాలూ పాల్గొన్నాయి. రాయ్‌పూర్ జిల్లా 'దైనిక్' దిన పత్రిక రిపోర్టర్ భాస్కర్‌ని ఈ ప్రదర్శనకు ఆహ్వానించారు. 25 గ్రామాల నుండి పలువురు మహిళలు, బడిపిల్లలతో సహా దాదాపు 7,000 మంది ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మొదట అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలిస్తూ ప్రజలు బ్యానర్లు, ప్లేకార్డులు పట్టుకుని భారీ ఊరేగింపు తీశారు. ''ప్రపంచ ప్రధాన టెర్రరిస్టు అమెరికా'', ''ప్రపంచ ప్రజల ప్రధాన శత్రులైన అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి'', ''ఇతర జాతుల స్వాతంత్ర్యానికి భంగం కల్గించిన ఏ జాతీ స్వతంత్రంగా బతకలేదు'', ''అమెరికా సామ్రాజ్యవాదంతో సహా ప్రపంచ సామ్రాజ్యవాదం ప్రజాయుద్ధంతోనే తప్ప టెర్రరిస్టు చర్యలతో నిర్మూలనం కాదు'', ''అమెరికా సామ్రాజ్యవాదం చేత పీడింపబడిన జాతులకు, ప్రజలకు ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువుపై ప్రతీకారం తీర్చుకునే హక్కు వుంది'' వంటి నినాదాలు ఈ ఊరేగింపు పొడవునా ప్రతిధ్వనించాయి.

ఆ సమయంలో పి.జి.ఏ. ప్రధాన బలగంకి చెందిన స్థానిక యోధులు ఈ ప్రదర్శనకు భద్రత కల్పించారు. విల్లు బాణాలువంటి సాంప్రదాయిక ఆయుధాలతో, నాటు తుపాకులతో సాయుధులైన డజన్ల కొలదీ వీరులు ఆ ప్రాంతమంతటా పలుచోట్ల సెంట్రీ పోస్టులు నిర్వహించి, విస్తృతంగా గస్తీ చేపట్టారు. శత్రువు ఈ ప్రదర్శన మీద ఏ రకంగా దాడి చేయడానికి ప్రయత్నించినా ప్రతిఘటించేలా రక్షణ ఏర్పాట్లు జరిగాయి.

తర్వాత సాయంత్రం పెద్ద బహిరంగ సభ జరిగింది. ఇంద్రావతి ఏరియా కమిటీ కార్యదర్శి కా॥ రాజ్‌మన్ సభనుద్దేశించి ప్రసంగించాడు. తన ప్రసంగంలో ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిని అతడు తీవ్రంగా ఖండించాడు. సెప్టెంబర్ 11 దాడులకు అమెరికాయే కారణమని ప్రజలకు చెప్పాడు. అమెరికా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని చంపిందని, లక్షలాది ప్రజలను చంపించడంలో మూడో ప్రపంచ దేశాల క్రూర పాలకులకు మద్దతు పలికిందని ప్రకటించాడు. ఒసామా బిన్ లాడెన్, తాలిబాన్లు అమెరికా తయారు చేసినవారే అని, ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువు అమెరికాయేనని ప్రకటించాడు. అమెరికా సామ్రాజ్యవాదం ముందు సాగిలపడిన భారతీయ పాలకుల నిర్లజ్జాపూరిత దాస్య స్వభావాన్ని కా॥ రాజ్‌మన్ విమర్శించాడు.

తర్వాత చేతన్ నాట్యమంచ్‌కి చెందిన స్థానిక యూనిట్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. సమావేశం చివర్లో ప్రపంచ ప్రధాన టెర్రరిస్టు బుష్, అమెరికా సామ్రాజ్యవాదానికి అత్యంత ప్రధాన పొత్తుదారైన వాజ్‌పేయిల గడ్డిబొమ్మను ప్రజలు తగులబెట్టారు.

**మాడ్ డివిజన్‌లోని ఇతర ప్రాంతాలలో ర్యాలీలు**

అక్టోబర్ చివరి వారంలో పరాల్ కోట్, కొఖమెట్టి ప్రాంతాల్లోని కుటుల్, కొఖమెట్ట, కుస్తుర్మెట్ట, సీతారామ్ గ్రామాలలో కూడా యుద్ధ వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. 60 గ్రామాలకు చెందిన ప్రజలు 250 నుండి 2,000 మంది దాకా వీటిలో పాల్గొన్నారు. ఈ గ్రామాలన్నింటిలో ఊరేగింపు తర్వాత బహిరంగ సభలు జరిగాయి. పి.జి.ఏ. కమాండర్లు, స్థానిక ప్రజాసంఘాల నేతలు ఈ సభల్లో ప్రసంగించారు. బుష్, వాజ్‌పేయిల గడ్డిబొమ్మలను తగులబెట్టారు. ఈ ఊరేగింపులన్నింటిలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేశారు.

**దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ డివిజన్లలో**

ఈ రెండు డివిజన్‌లలోని డివిజనల్ కమిటీలు 2001 సం॥రం అక్టోబర్ 24న ఉమ్మడిగా 'బంద్' పిలుపిచ్చాయి. అది. ఐక్యరాజ్య సమితి వార్షిక దినం కూడా. బంద్ సంపూర్ణంగా విజయవంతంగా జరిగింది. బస్తర్ వ్యాప్తంగా వున్న వారపు సంతలు అన్నీ మూతపడ్డాయి. బీజాపూర్, మాడెడ్, కొంట, భోపాలపట్నం తదితర ప్రాంతాలకు దారితీసే రోడ్ల మీద ట్రాఫిక్ స్తంభించి పోయింది. అన్ని పట్టణాలలో ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ పోస్టర్లు వేసి బ్యానర్లు కట్టారు. పార్టీ పిలుపుకు మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు గళమెత్తి నిలిచారు. షాపులు, పాఠశాలలు మొత్తంగా మూతపడ్డాయి.

## పోటోకి, నిర్బంధానికి వ్యతిరేకంగా బీహార్ జార్ఖండ్ పి.జి.ఏ. నిరసన

2001 డిసెంబర్ 20 ఉదయం 8 గంటలప్పుడు జార్ఖండ్ రాష్ట్రం జిల్లా కేంద్రానికి 30 కి.మీ. దూరంలో, చినియా అవుట్‌పోస్ట్ 3కి.మీ. దూరంలో తస్రార్ గ్రామ సమీపంలో వున్న దట్టమైన అడవిలోని ఘర్వా–చినియా రోడ్డుపై పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన పి.జి.ఏ. ప్లటూన్ మందుపాతర పేల్చింది. ఈ పేలుడులో ఒక సుబేదార్ మేజర్, ఇద్దరు సి.ఆర్.పి.యఫ్. పోలీసులు అక్కడికక్కడే చావగా జార్ఖండ్ మిలటరీ పోలీస్‌కి చెందిన ఒక పోలీసు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సంఘటనలో మరొక సి.ఆర్.పి.యఫ్. పోలీసు, ఇద్దరు జార్ఖండ్ మిలటరీ పోలీసులు గాయపడ్డారు. ఈ సందర్భంగా సి.ఆర్.పి.యఫ్. పి.జి.ఏ.ల మధ్య కాల్పులు జరిగినా, పి.జి.ఏ. ప్లటూన్ క్షేమంగా తప్పుకుంది.

2001, డిసెంబర్ 26 తెల్లవారు జాము 4 గంటలప్పుడు బీహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా భాగన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ ఘాట్ సమీపంలో ముషర్వా మాబా ప్రాంతంకి దగ్గరలో పి.జి.ఏ. మరొక మందుపాతరతో ఒక పోలీస్ వాహనం పేల్చేసింది. 14 మంది పోలీసులతో వున్న ఆ వాహనంలో ఒక హవల్దార్‌తో సహా ముగ్గురు కానిస్టేబుళ్ళు అక్కడికక్కడే చావగా 11 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా వుందని వార్తలు. ఈ ఆంబుష్‌లో పి.జి.ఏ. మొత్తంగా 13 .303 రైఫిళ్ళను, 650 తూటాలను చేజిక్కించుకుంది. నల్లచట్టమైన పోటోకి, బీహార్ జార్ఖండ్ ప్రాంతాల్లో నిర్బంధానికి వ్యతిరేకంగా ఈ సంఘటనలు జరిగాయి.

## రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కరపత్రం!

అడవుల్లో, మైదానాల్లో ప్రతిరోజూ విప్లవకారుల బుల్లెట్లను కాచుకుని తలపడే పోలీసులకు ఇదో కొత్త అనుభవం. ఈసారి పోలీసులు గెరిల్లాల బుల్లెట్లను కాక ఎర్ర అక్షరాల కరపత్రాలను ఎదుర్కొన్నారు. పీపుల్స్‌వార్ పార్టీ ఆంధ్ర రాష్ట్రకమిటీ ప్రచురించిన ఈ కరపత్రాలను ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పోలీస్ స్టేషనూ పోస్టు ద్వారా అందుకుంది. పోలీసు కానిస్టేబుళ్ళు ఈ కరపత్రం పట్ల బాగా స్పందించారు. పోలీసుల స్పందన ఏ స్థాయిలో వుండిందంటే తమకు చేరిన కరపత్రాలు కొన్నే కావటంతో వాటిని ఫోటో కాపీలు తీయించి మరీ తమ మిత్రులకు, సహోద్యోగులకు పంచిపెట్టారు.

ఈ కరపత్రం విస్తృత ప్రచారం పొందింది. సకల ప్రజా విభాగాలూ దీన్ని ఆహ్వానించాయి. కొన్ని తెలుగు పత్రికలయితే ఈ కరపత్రాన్ని యథాతథంగా ప్రకటించాయి. కొన్ని టీ.వీ. ఛానెళ్ళు ఈ కరపత్రాన్ని ప్రసారం చేసి మరీ స్పందించాయి. చివరకు రాష్ట్ర అసెంబ్లీలో సైతం ఈ కరపత్రం సంచలనం రేకెత్తించింది.

1970లలో విప్లవకవి చెరబండరాజు మామూలు పోలీసు కానిస్టేబుళ్ళ పట్ల విప్లవకారుల వైఖరిని ఇలా కవితాత్మకంగా సూచించాడు.

*మాలోని వాడివే*

*మా మనిషివే నీవు*

*పొట్టకూటికి నీవు*

*పోలీసువైనావు*

*అన్నన్న నీ బతుకు*

*బతుకు గాదోరన్న*

ఇపుడీ కరపత్రం చెబుతున్న దేమిటి? తేలికైన పదాలతో సుళువైన రీతిలో విప్లవోద్యమ ప్రయోజనాలు సాధారణ పోలీసుల ప్రయోజనాలకు వ్యతిరేకమైనవి కావని ఈ కరపత్రం వివరించింది. పోలీసులు కూడా పీడిత వర్గాల లోంచే వచ్చారు. విప్లవోద్యమ లక్ష్యం కూడా అణచివేత, బానిసత్వం నుండి పీడిత వర్గాలను విముక్తి చేయటమే. విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు పీడిత, తాడిత వర్గాల నుండే రాజ్యం తన బలగాన్ని రూపొందించుకుంటోంది. దోపిడీ వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు సాధారణ పోలీసులు తమ జీవితాలను ఎందుకు బలిపెట్టాలి. కేవలం కొన్ని ప్రమోషన్ల కోసమేనా? అలా అయితే కొన్ని ఎంగిలి మెతుకులకు ఆశపడుతూ మనం దోపిడీ వ్యవస్థను కొనసాగిద్దామా? ప్రభుత్వమూ, పోలీస్ వున్నతాధికారులే పోలీసుల మనసులలో విప్లవకారుల పట్ల ద్వేషాన్ని నూరిపోస్తున్నారు. అయితే పోలీసులు, తాము పీడిత వర్గంలో భాగమే అని విప్లవకారులు నొక్కి చెబుతున్నారు. ఈ కరపత్రం కూడా పోలీసు అధికారులు పోలీసులను ఎలా దోపిడీ చేస్తున్నారో సవివరంగా పేర్కొంది. కొనసాగుతున్న విప్లవోద్యమం పట్ల సంఘీభావం ప్రదర్శించి వుద్యమంలో చేరాల్సిందిగా ఈ కరపత్రం పోలీసులకు పిలుపిచ్చింది.

పోలీసు అధికార యంత్రాంగం ఈ కరపత్రాన్ని ఖండిస్తూ పోటీగా రెండు పాంప్లెట్లు ప్రచురించక తప్పింది కాదు. సాధారణ పోలీసుల సంక్షేమానికి తామెలా పాటుపడుతున్నదీ వివరిస్తూ పోలీసు అధికారులు పత్రికలకు ఇంటర్వ్యూ లివ్వడంలో పోటీలు పడ్డారు. వలస పాలన నాటి పోలీసు మాన్యువల్స్‌ని కూడా తాము మార్చేశామంటూ ఈ బాపతు అధికారులు గొప్పలకు పోయారు. భవిష్యత్తులో సాధారణ పోలీసులను నెంబర్లతో పిలవడం, నెంబర్ ప్లేట్లతో గుర్తించడం కాక పేర్లతో పిలిచేలా, నేమ్ ప్లేట్లు ధరించేలా చూస్తామని హామీల మీద హామీలు గుప్పించేశారు. వందేళ్ళకు పైగా చరిత్రలో మనుషులుగా పోలీసుల వునికిని సైతం ఈ రకంగా విప్లవోద్యమమే గుర్తింపజేసింది మరి. ఇకనుండి అధికారులు పిలిచినపుడు పోలీసులు నిలబడి మాట్లాడకుండా అధికార్ల ముందు కూర్చొని మాట్లాడవచ్చుట. పోలీసు అధికారుల ఈ అడ్డగోలు తాపత్రయం అంతా నక్క తన వూళను మార్చుకునే చందంగా కుయుక్తితోనే వుంది తప్ప నిరంకుశాధికార్ల హృదయంలోంచి వచ్చిన మాటలు గాదివి.

ఈ కరపత్రం 21వ శతాబ్దంలోనూ పోలీసుల దయనీయ పరిస్థితిని, తమ వేలితో తమ కంటినే పొడుచుకునేలా అధికార యంత్రాంగం పోలీసులను వాడుకుంటున్న తీరును చిత్రిక పట్టింది. అందుకే ఈ కరపత్రం సారాంశం పోలీసుల హృదయాలలో కలకాలం నిలిచి వుంటుంది. ❑

## క్రాంతి 25వ వార్షికోత్సవ కార్యక్రమాల నిర్వహణ

2002 సంవత్సరం ఏప్రిల్ 22 (పార్టీ ఆవిర్భావ దినం) నుండి మే 22 వరకు నెలరోజులపాటు పార్టీకి చెందిన అన్ని యూనిట్లు 'క్రాంతి' 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించాలి. ఈ సందర్భంగా ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టాలి.

1. క్రాంతిని పథకం ప్రకారం మరింత విస్తృతంగా విప్లవ ప్రజానీకంలోకి తీసుకుపోయే కార్యక్రమం.
2. క్రాంతి అమ్మకాల్ని, చందాదారుల్ని పెంచే కార్యక్రమం.
3. విప్లవ సాహిత్యాన్ని మరింత విస్తృతంగా ప్రజలలోకి తీసుకుపోవటం.
4. ప్రజల నుండి – ప్రజల వద్దకు అనే ప్రజాపంథా ప్రాతిపదికగా మన పార్టీకి చెందిన అన్ని యూనిట్లు 'క్రాంతి'పైనా, విప్లవ సాహిత్యంపైనా సభ్యుల నుండి, ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించి పైకమిటీలకు పంపే కార్యక్రమం.

**ఏ.పి. రాష్ట్రకమిటీ తీర్మానం నుండి.**

నేపాల్ పరిణామాలు

# చర్చల గమ్యం!

కా॥ గౌరవ్

*(నేపాల్‌లో మావోయిస్టులకు-ప్రభుత్వానికి మధ్య చర్చల సందర్భంగా చర్చల పట్ల నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అవగాహనని, దృక్పథాన్ని ఈ వ్యాసం తెలియజేస్తుంది- సంపాదకులు)*

మా పార్టీ - నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) (సి.పి.ఎన్. (ఎం-ఎం)- కేంద్ర ప్రతినిధులకు, షేర్ బహదూర్ దేబా ఆధ్వర్యంలోని ప్రస్తుత నేపాల్ ప్రభుత్వానికి మధ్య ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. తుపాకులు మోగటం నిల్చిపోయింది. మావోయిస్టులు పోలీస్ స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలను, మందుగుండును మొత్తంగా స్వాధీన పర్చుకున్నారనే వార్తలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో కన్పించటం పూర్తిగా ఆగిపోయింది.

తొలి విడత చర్చల కొనసాగింపుగా సెప్టెంబర్ 13, 14 తేదీలలో బర్దియా జాతీయ పార్క్ హోటల్‌లో జరిగిన రెండోవిడత చర్చ ఏ ఫలితం లేకుండానే ముగిసింది. ఇరుపక్షాలూ తమ తమ అభిప్రాయాలను అరమరికలు లేకుండా ముందుంచాయని, చర్చలను తిరిగి కొనసాగించడానికి నిర్ణయించుకున్నాయని వార్తలు రావటం తప్ప మరే ఫలితం రాలేదు. ఒక విషయం మాత్రం చాలా స్పష్టంగా ముందుకొచ్చింది. అదేమంటే గణతంత్ర రాజ్యాన్ని వ్యవస్థీకృతం చేయాలని, ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు పర్చి రాజ్యాంగబద్ధ శాసన సభ చేత మరో కొత్త రాజ్యాంగాన్ని రూపొందించాలని, మధ్యంతర ప్రభుత్వం నెలకొనాలని సి.పి.ఎన్. (మావోయిస్టు) ప్రతినిధి బృందం చేసిన మూడు నిర్దిష్ట ప్రతిపాదనలను ప్రభుత్వం, నేపాలీ కాంగ్రెస్ ప్రతినిధి బృందం నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. ఈ రెండు పక్షాలకు ఆమోదనీయం కాగల అంశమేదీ కనబడలేదు. అట్లే రెండు పక్షాలకూ మధ్య పరస్పర ఒడంబడికకు అవకాశం ఏ కోశానా కన్పించకుండా పోయింది. కాకపోతే 'చర్చలు' విఫలమయ్యాయని ఏ పక్షమూ ప్రకటించలేదంతే. మరో విడత చర్చలకు అవకాశం గురించి పలు ఊహాగానాలు తలెత్తి వ్యాపించాయి కాని ఎప్పుడు మొదలవుతాయన్నదే అనిశ్చితంగా వుంది.

### చర్చలు కొనసాగుతాయా?

మరో విడత 'చర్చలు' జరిగే అవకాశమేదయినా వుందా? అలాంటి అవకాశం పూర్తిగా కనుమరుగైపోలేదనే నా అభిప్రాయం. చర్చలు కొనసాగడానికి తగిన వాతావరణం కల్పించేందుకుగాను మా పార్టీ ప్రతినిధి బృందం పెట్టిన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేస్తేనే మరో విడత చర్చలు జరుగుతాయి. అయితే ఇప్పటి వరకయితే మా డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా తోసి పుచ్చింది. ఈ పరిస్థితి కొనసాగితే, చర్చలు ఇప్పటికీ నడుస్తాయని ఊహించడం కష్టమే. అలాంటపుడు చర్చల సాధ్యత అసాధ్యతగా మారుతుంది. అందుచేత చర్చలకు ఇష్టపడతారా లేక వాటిని ఆపివేస్తారా అన్నది ప్రస్తుత ప్రభుత్వం, పాలక పక్షమైన నేపాలీ కాంగ్రెస్ మీదే ఆధారపడి వుంది. ఆ విధంగా బంతి వారి కోర్టులోనే వుంది. 'చర్చలు' విఫలమైతే పరిణామాలు ఎలా వుంటాయనేది ఊహించడం కష్టమే. చర్చలు విఫలమైనాక ఏర్పడనున్న పరిస్థితి గురించి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అందుకనే, 'చర్చలు' విఫలమైనట్లయితే, తదనంతర పరిణామాలకు ప్రభుత్వం, పాలక నేపాలీ కాంగ్రెస్ పార్టీలే పూర్తిగా బాధ్యత వహించాలని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సి వుంది.

### చర్చల ద్వారా ప్రజలు పొందేదేమిటి?

ఈ చర్చలకు సంబంధించి ప్రజలకు తమవైన అంచనాలు, అభిప్రాయాలూ వుంటున్నాయి. ప్రతిదీ చర్చల ద్వారానే పరిష్కార మవుతాయని, కాబట్టి 'చర్చలు' ఫలప్రదమయ్యాక ఇక విప్లవం అవసరమే వుండదని కొంతమంది ప్రజలు అంటున్నారు. ఈ అభిప్రాయం తప్పు. ఇది విప్లవక్రమంలో చర్చలనేవి ఒక అడుగు మాత్రమే అనే విప్లవ సూత్రానికి అనుగుణంగా ఇది లేదు. చర్చల ద్వారా ఒరిగేదేమిటన్నది ప్రతినిధి బృందం, లేక ఏ పార్టీ యొక్క 'పవిత్ర వాంఛ'లపై ఆధారపడి వుండదు. కొన్ని నిర్దిష్ట అభివృద్ధి సూత్రాలు దానిని నిర్దేశిస్తాయి. మావోయిస్టులమైన మాకు సంబంధించినంతవరకు చర్చల అంతిమ ఫలితం గురించి మేం చాలా స్పష్టంగానే వున్నాం. వర్గ పోరాట రంగంలో, లేక ప్రజాయుద్ధంలో మేమేం సాధించామన్న దానిపైనే చర్చల్లో మేమేం పొందగలిగామన్నది ఆధారపడి వుంటుంది. మా ప్రతినిధి బృందం చర్చల క్రమంలో ముందుకు తెచ్చిన డిమాండ్లను గురించి ఎవరూ గందరగోళానికి గురికారాదు. అవి ప్రజాయుద్ధం ద్వారా మేం సాధించిన విజయాలని, వాటికి ఇప్పుడు మేం సాధికారత నివ్వాలనుకుంటున్నామనే విషయంలో ఎవరూ గందరగోళానికి గురికారాదు. 'చర్చల'లో మేం అసంబద్ధమైన, అనవసరమైన డిమాండ్లు లేవనెత్తామని నేపాల్ కాంగ్రెస్ వంటి ప్రతీఘాతుక పార్టీలూ, యునైటెడ్ మార్క్సిస్టు-లెనినిస్టు వంటి అవకాశవాద పార్టీలూ మమ్మల్ని తప్పు పడుతున్నాయి. ఈ పార్టీలు విప్లవానికి వ్యతిరేకం. అందుచేత విప్లవం సాధించిన విజయాల సాధికారత (లెజిటమసీ) గురించి వీళ్ళెన్నటికీ అర్థం చేసుకోలేరు. చర్చల సమయంలో మా ప్రతినిధి బృందం లేవనెత్తిన దాన్ని మేం ప్రజాయుద్ధంలో అప్పటికే సాధించుకున్నాం. మేం ఇప్పటికే సాధించిన విజయాలకు సాధికారత కల్పించటమే మా ధ్యేయం. ప్రజానీకం అప్పటికే రక్తం ధారపోసి పోరాట రంగంలో సాధించుకున్న విజయాలను చర్చల్లో ప్రస్తావించకుండా వుండటమే మహా విద్రోహకరమైనట్టిది. అందుకనే మేం ఈ డిమాండ్లను వదులుకోలేం. విడిచిపెట్టలేం కూడా. సమస్యకు శాంతియుత పరిష్కారానికి మార్గం చూపాలని ప్రభుత్వం, పార్లమెంటరీ పార్టీలూ నిజంగా అనుకుంటు న్నట్లయితే అవి మా పార్టీ ప్రతిపాదించిన డిమాండ్లను నెరవేర్చాలి. ప్రతి ఒక్కరూ వాస్తవికంగానే వుండాలి. దీనికర్థం ప్రతి ఒక్కరూ ప్రస్తుతం విప్లవోద్యమ వాస్తవికతను పోరాట రంగంలో విప్లవం సాధించిన విజయాలను ఆమోదించాల్సి వుందనే. ఈ షరతును నెరవేర్చిన తర్వాతే చర్చలనేవి నిజమైన మార్గాన్ని చూపించి సరైన పరిష్కారం వైపుకు నడుస్తాయి.

### ఇది 'ఎత్తుకు పై ఎత్తు''

ఒక పేరుమోసిన ప్రతీఘాతుక ప్రభుత్వంతో చర్చలకు సిద్ధపడడానికి

మమ్మల్ని పురికొల్పినదేమిటి? నేపాల్ నిర్దిష్ట, వాస్తవ పరిస్థితి, మావోయిజం బోధనలే మా పార్టీని ఈ విధమైన నిర్ణయం తీసుకునేలా చేశాయి. చర్చలకు, సంప్రదింపులకు సంబంధించి మా పార్టీ చేపట్టిన ఎత్తుగడల గురించి ఎవరూ గందరగోళ పడరాదు. చర్చలకు సిద్ధం కావడానికి, నిర్దిష్ట పరిస్థితిపై ఆధారపడి చర్చల నుండి వెనక్కు మరలడానికి మేం సమాన ప్రాధాన్యత నిచ్చి చూస్తున్నాం. ఎత్తుకు పై ఎత్తు వేయటంలో మేం సమర్థులమే. ''ఎత్తుకు పై ఎత్తు వేయటమెలాగన్నది పరిస్థితిపై ఆధారపడి వుంటుందని'' మా మహోపాధ్యాయుడు కామ్రేడ్ మావో చాలా చక్కగా చెప్పాడు. ''ఒక్కోసారి చర్చలకు అసలు పోకపోవడమే ఎత్తుకు పై ఎత్తు. ఒక్కోసారి చర్చలకు పోవడమే ఎత్తుకు పై ఎత్తు'' మేం ఈ సూత్రాన్ని బాగా అర్థం చేసుకున్నాం. అయితే మా శత్రువు దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. సమస్యల్లా ఇదే. ఒక్కోసారి బాగా స్థిరపడివున్న కొన్ని సూత్రాలను సైతం శత్రువు అర్థం చేసుకునేలా చేయాల్సిన అవసరముంది. వాళ్ళు వ్యక్తం చేసే తెలివి తక్కువ భావాలలో ఇది ప్రతిబింబించ బడుతుంటుంది. ఒకసారి మేం చర్చలకు సిద్ధపడి వస్తే ఇక వెనక్కిపోలేమని, తాము రుద్దే ప్రతిదీ మేం ఆమోదించక తప్పదని ప్రతీఘాతకులు కలలు గంటుంటారు. అయితే సంప్రదింపుల నుండి వెనుదిరిగి పోవాలని వాళ్ళు మమ్మల్ని బలవంతపెడితే మేమందుకు ఎప్పటికైనా సిద్ధంగానే వుంటామని వాళ్ళు గ్రహించి తీరాలి. మేం మావోయిస్టులం. నేపాల్ వాస్తవికతకు మావోయిజాన్ని అన్వయించే క్రమంలో మేం 'ప్రచండ పంథా'ని సృష్టించుకున్నాం. అందువల్ల 'ఎత్తుకు పై ఎత్తు' ఎలా వేయాలో మాకు తెలుసు. దాదాపు ఆరు సం॥ల ప్రజాయుద్ధ క్రమంలో ఇది పదే పదే రుజువైంది.

### ఆయుధాలను అప్పగించే సమస్య

మనదేశంలో - నేపాల్ - మన ప్రజలకు మాత్రమే బోధించటం కాక; మన శత్రువులకు కూడా తగినంతగా బోధించాల్సిన అవసరముందని నేను మరోసారి చెప్పాలనుకుంటున్నాను. 'మావోయిస్టులే గనుక సంప్రదింపులకు సిద్ధమైతే వారు ఆయుధాలను అప్పగించాల్సి వుంటుందని' పాలకవర్గ నేతలూ, ప్రభుత్వమూ నొక్కి చెబుతున్నాయి. ఇదొక చెత్త ప్రేలాపన తప్ప మరొకటి కాదు. ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన తెలివైన నాయకులైనా ఈ రకంగా చెప్పలేరు. ప్రపంచ చరిత్రలో చర్చలనేకం జరిగాయి. అయితే సంప్రదింపుల చరిత్రలో ఇలాంటి అపహాస్యపు తరహా ప్రకటనలను ఎక్కడా చూసి వుండం. చైనా చరిత్రలో కెల్లా సుప్రసిద్ధమైన చర్చ ఒకటుంది. దాన్ని 'చుంకింగ్ చర్చ' అంటున్నారు. ఇది చైనా కమ్యూనిస్టు పార్టీ, కొమింటాంగ్ అనే రెండు పోరాట శక్తుల మధ్య 1945 అక్టోబర్‌లో జరిగింది. చర్చల క్రమంలో కొమింటాంగ్ నేత చాంగ్‌కైషేక్ రెండు పక్షాలలో సైన్యం సంఖ్యను తగ్గించాలని డిమాండ్ తీసుకొచ్చాడు. కొమింటాంగ్‌తో చర్చలకు రావాలంటే చైనా కమ్యూనిస్టు పార్టీ తన సైన్యాన్ని, ఆయుధాలను అప్పగించాల్సి వుంటుందని చాంక్ కై షేక్ ప్రతిపాదించలేదు. ఈ చారిత్రక సంఘటన జరిగిన 60 సం॥ల తర్వాత సైతం గిరిజా కొయిరాలా, కె.పి. భట్టారాయ్‌లు ఈ కనీస ప్రమాణాన్ని అర్థం చేసుకోలేకున్నారంటేనే వింత గొల్పుతుంది. ఇందుకు సంబంధించి సైతం కా॥ మావో చాలా జాగ్రత్తగా మనకు బోధించాడు. ''ప్రజలకు సంబంధించిన ఆయుధాలను ప్రతి తుపాకీని, ప్రతి బుల్లెట్‌ని తప్పనిసరిగా అట్టిపెట్టుకోవాలి తప్ప వాటిని స్వాధీనం చేయకూడదు''. అందుకని మన పార్టీ మన ఆయుధాలను, ప్రజా సైన్యాన్ని ఎన్నటికీ అప్పగించదని ఈ ప్రతీఘాతుక నేతలు గ్రహించి తీరాలి. ఈ రకమైన హాస్యాస్పదమైన ప్రకటనలను గుప్పిస్తున్నందుకు వీళ్ళు సిగ్గుపడాలి.

### రాజకీయాలను వదిలివేయడానికి సంబంధించిన సమస్య

''మావోయిస్టులు తమ అతివాద రాజకీయాలను వదులుకుని ప్రధాన స్రవంతి రాజకీయాలలో రావాలంటూ గిరిజా కొయిరాలా, భట్టారాయ్‌లే కాకుండా దేబా, యు.ఎమ్.ఎల్. నేత మాధవ్ కుమార్ నేపాల్ తదితరులు సైతం పిలుస్తుండటమే చిత్రం. చర్చలకు రావడానికిగాను మా రాజకీయాలనే వదులుకోవాలని పిలుపివ్వడం నిజంగా మూర్ఖత్వం కాదా? ''రాజ్యాంగబద్ధ రాజరికం, బహుళ పార్టీ వ్యవస్థ చర్చనీయాంశాలు కావని'' వారు చేసిన మూర్ఖపు వాదనను వారే పునరుద్ఘాటిస్తున్నారు. ఆ విధంగా మనం మన రాజకీయాలను వదులుకుని వాళ్ళు అనుభవిస్తున్న దాంట్లో వాటా పొందటం కూసం తమతో కలిసి పొమ్మని వీళ్ళు మనకు పాఠాలు చెప్ప ప్రయత్నిస్తున్నారు. ప్రపంచంలో కెల్లా అత్యున్నతమైన, అత్యంత శాస్త్రీయమైన సిద్ధాంతాన్ని, ఆ సిద్ధాంతంతో వ్యక్తమవుతున్న రాజకీయాలను వదులుకోవాలని ఏ తెలివైన వ్యక్తి అయినా ప్రకటిస్తాడని మనం ఊహించగలమా? ఊహించలేం. అయితే నేపాల్‌లో జరుగుతున్నదేమంటే నిజంగా హాస్యాస్పదమైనది. గత ఆరేళ్ళుగా కఠినతరమైన, మిలిటెంట్ పోరాటాల అనుభవాల ద్వారా ప్రజలు స్వీకరించిన మా పార్టీ సిద్ధాంతాలను, రాజకీయాలనే వదులుకోవాల్సిందిగా ఈ మరుగుజ్జు ప్రజాస్వామికవాదులు మమ్మల్ని ఆదేశిస్తున్నారు!

### చర్చలను విచ్ఛిన్న పరుస్తున్న దెవరు?

చర్చలను నిజంగా విచ్ఛిన్నపరుస్తున్న దెవరో ఇప్పటికి ప్రతి ఒక్కరికీ స్పష్టమై పోతున్నది. రాజ మందిరం-గిరిజా కోయిరాల కూటమి, షేర్ బహదూర్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం విచ్ఛిన్న పరుస్తోందా లేక మావోయిస్టులమైన మేమా? మనందరం వాస్తవాలను నిగ్గుదీద్దాం. ప్రత్యర్థి-మావోయిస్టులు-తీసుకొచ్చిన ప్రతిపాదనలను చర్చకోసం కూడా ఆమోదించడానికి పూనుకోకుండా నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చినందుకు ప్రభుత్వం-నేపాల్ కాంగ్రెస్ కూటమి ప్రతినిధి వర్గం చాలా గర్వపడి పోతున్నది. ఇకపోతే చర్చలకు తగిన వాతావరణం సృష్టించేందుకుగాను మరో ఐదు అంశాలను నెరవేర్చాల్సిన అంశముంది. కానీ వాటిని ఈ కూటమి ఎన్నడూ నెరవేర్చలేదు సరికదా, అందుకుగాను కనీస ప్రయత్నం కూడా చేయలేదు. చర్చలు నిరాటంకంగా సాగిపోవాలని రెండు పక్షాలూ ప్రకటిస్తున్న నేపథ్యంలో సెప్టెంబర్ 21న మేం తలపెట్టాలని ప్రతిపాదించిన శాంతియుత ప్రజా ఊరేగింపును ప్రభుత్వం నిషేధించింది. రాజధానిలో అఖిల నేపాల్ జాతీయ స్వతంత్ర (విప్లవ) విద్యార్థుల సంఘం ఆర్గనైజ్ చేసిన స్టూడెంట్ కాన్ఫరెన్సును సైతం ప్రభుత్వం నిషేధించింది. మా పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలను, సానుభూతిపరులను అరెస్ట్ చేశారు. ఖాట్మండూలోని ప్రఖ్యాతి చెందిన విద్యార్థుల హాస్టళ్ళపై ప్రభుత్వ బలగాలు దాడిచేసి అనేకమంది విద్యార్థి నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. చర్చలు జరిగే పరిస్థితి లేని కాలంలో గిరిజా కోయిరాలా ప్రభుత్వం వెనక్కి తీసుకున్న ద్వేషింపబడిన 'సాయుధ పోలీస్ బలగాల' చట్టాన్ని సైతం వాళ్ళు పార్లమెంట్‌లో ఆమోదించారు. ప్రత్యేకించి మా పార్టీకి మంచి పట్టు కల్గిన, ప్రజా ప్రభుత్వాలు నడుస్తున్న ప్రాంతాలలో ప్రభుత్వం సాయుధ పోలీసులనే కాక సైన్యాన్ని కూడా దించింది. విప్లవోద్యమాన్ని

(తరువాయి 47వ పేజీలో...)

(48వ పేజీ తరువాయి...)

రంగంమీదకి వచ్చింది. మన ఉద్యమంపై శత్రువు అమలుచేస్తున్న అణచివేత మరో జుగుప్సాకరమైన రూపాన్ని తీసుకుంటోంది. ప్రభుత్వ వత్తాసుతో పోలీసులు యింతవరకు ప్రధానంగా రెండు రకాల హత్యాకాండలు చేస్తూవచ్చారు. ఒకటి బూటకపు ఎన్‌కౌంటర్ల హత్యాకాండ, రెండోది ఈ తీరులో సాధ్యంకాని పౌరహక్కుల నేతలు, కళా సాంస్కృతిక సంఘాలు, యితర ప్రజాసంఘాల నేతలపై కిరాయి గూండాలను ఉసిగొల్పి హత్యలు చేయించడం. వీటికి యిప్పుడు మరో రూపంలోని హత్యాకాండ తోడైంది. లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు లాంటి వృత్తి మేధావులనే గాక పదహారణాల ప్రభుత్వోద్యోగుల్ని సైతం పట్టుకుపోయి కాల్చేసి అజ్ఞాత నక్సలైట్లతో రహస్య సమావేశంలో వుండగా తమతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని ప్రకటించడమే ఈ మూడో రకం హత్యాకాండ. అంటే కొన్ని గంటల ముందు వరకూ విధి నిర్వహణలో వుండే ప్రభుత్వోద్యోగి అమాంతంగా అర్ధరాత్రి అజ్ఞాత సాయుధ నక్సలైట్లతో సమావేశం అయిపోవడం, తెల్లవారేసరికి శవమైపోవడం జరిగిపోతుందన్నమాట. ఇది భయంకరమైన ప్రమాద సూచిక.

డిసెంబరు 25 నాడు అందిన ఈ ప్రమాద సూచికతో మనం అప్రమత్తమవుతూ ప్రజల్ని అప్రమత్తం చేయడానికి నడుం బిగించాం. పోలీసుల ఘాతుకాన్ని పత్రికలు, టీవీలు పదునుగానే విమర్శిస్తూ ప్రచారం చేశాయి. తమ ఈ నేరాన్ని సమర్థించుకుంటూ వరంగల్ ఎస్పీ యిచ్చిన పొగరుబోతు ప్రకటనని దుయ్యబడుతూ వివిధ ప్రజాసంఘాలు, మేధావుల ప్రక్క నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు 'పారదర్శక ప్రభుత్వం'కి ముఖం ఎక్కడ దాచుకోవాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఈ హత్యాకాండపై ముఖ్యమంత్రి, హోమ్‌మంత్రి నోరు మెదపకుండా తేలు కుట్టిన దొంగల్లా తప్పించుకు తిరిగారు. ఈ వాతావరణం మరింత బలపడేదే. దీన్ని ఉద్యమానుకూలంగా మనం బాగా ఉపయోగించుకుని వుండేవాళ్ళం.

కానీ యింతలోనే మనం ఒక అనాలోచిత తొందరపాటు చర్యకి పాల్పడిపోయాం. డిసెంబరు 29న దేవరకొండ ఎమ్మెల్యే రాగ్యానాయక్‌ని ఖతంచేశాం. ఇతడు బూర్జువా రాజకీయ పార్టీ కాంగ్రెసుకి చెందిన శాసనసభ్యుడే కావచ్చు. కాని ఆదివాసీ బంజారా తెగకు చెందిన వాడు. ఆ తెగ ప్రజల్లో మంచి పలుకుబడి వున్నవాడనే ప్రచారం వుంది. ఆ ప్రచారంలోని నిజానిజాలు ఏమైనా తమ తెగ నుండి ఎదిగిన నాయకుడు అనే ఒక దగ్గరి భావం ఆదివాసీ ప్రజల్లో వుంటుంది. అలాంటి నాయకులు తమని నమ్ముకున్న ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా దోపిడీదారులుగా, పీడకులుగా మారిపోతే వారిని తగినంతగా ప్రజల్లో ఎండగట్టిన తరువాతనే అవసరమైతే మనం యిలాంటి తీవ్ర చర్యలకు దిగుతాం. లేక మన పార్టీ వ్యతిరేకిగా, ఉద్యమ వ్యతిరేకిగా పనిచేస్తున్నాడనే నిర్దిష్ట ఆరోపణలు, రుజువులు వుంటే వాటిని ప్రజల్లో పెట్టి మనం చర్యకు పూనుకుంటాం. అప్పుడు కూడా దిద్దుకోమని హెచ్చరిస్తాం. దిద్దుబాటుకు అవకాశమిస్తాం. ప్రజల్లో తగినంతగా బహిర్గతంకాని మేకవన్నె పులుల్లాంటి వర్గశత్రువుల విషయంలో సైతం మనం యిలాంటి జాగ్రత్తలు పాటిస్తాం. అలాంటిది ఒక ఆదివాసీ నాయకుని విషయంలో యివేవీ పట్టించుకోకపోవడం తప్పే. కాగా, చంపడం అవసరమనుకున్నప్పుడు కూడా అందుకు యిది తగిన సమయం కాదు, సందర్భం కాదు అని గుర్తించలేకపోవడం మరీ తప్పు.

తాత్కాలికంగానే అయినా మనం సమయానుకూలంగా, సమర ్ధవంతంగా వినియోగించుకుంటే డిసెంబరు 25 తర్వాతి పరిస్థితి మన ఉద్యమానికి ఎంతో ఉపయోగపడేది. పౌరస్పందన వేదికతో గొంతు కలుపుతూ ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్సే కాక తెలంగాణా ప్రాంతీయ పార్టీ టీ.ఆర్.ఎస్.తో పాటు మనకి సిద్ధాంత రాజకీయ బద్ధశత్రువైన బి.జె.పి. కూడా మనతో ప్రభుత్వం చర్చలకు సిద్ధపడాలని ఒత్తిడి చేస్తుండిన సమయం. పోలీసుల హత్యాకాండపై అన్ని ప్రక్కల నుంచి నిరసన పెల్లుబుకుతుండిన పరిస్థితి. తీవ్రాతి తీవ్రమైపోయిన ప్రభుత్వ నిర్బంధకాండ కారణంగా అచేతనమైపోయిన పౌరహక్కుల సంఘాలు, యితర ప్రజా సంఘాలు, మేధావులు తిరిగి ఉద్యమాభిమానంతో చురుగ్గా కదులుతుండిన పరిస్థితి. ఈ మొత్తం వాతావరణం అంతా 'చర్చలు' దిశగా బలపడుతుండిన పరిస్థితి. యింకోప్రక్క ప్రభుత్వం మరింతగా ఏకాకి అయిపోతుండిన స్థితి.

ఇదంతా చంద్రబాబుకి పెద్ద తలనొప్పి అయిపోయింది. మనతో చర్చలకు అతడు సుతరామూ సిద్ధంగా లేడు. చర్చలకు అనుకూలంగా బలపడుతున్న వాతావరణాన్ని చెడగొట్టడానికి చర్చల ప్రతిపాదనకి తూట్లు పొడవడానికి టక్కుటమార విద్యలన్నీ ప్రయోగిస్తూనే వచ్చాడు. 'పోటో' (టెర్రరిజం నిరోధక ఆర్డినెన్సు) పరిధిలోకి మన పార్టీని చేర్చి తద్వారా కేంద్ర స్థాయిలో కూడా మన పార్టీపై నిషేధాన్ని విధింపజేయడానికి తీవ్రంగా కృషిచేశాడు, సాధించాడు. మొదట్లో కేంద్రప్రభుత్వం మన పార్టీని పోటో పరిధిలో చేర్చలేదు. దీనిపై చంద్రబాబు తీవ్ర విస్మయాన్ని, విసుగును ప్రదర్శించాడు. చంద్రబాబు విసుగు, విస్మయాలు అర్ధవంతమైనవే. ఏమంటే, ఈ నల్లచట్టం లక్ష్యం, టెర్రరిజాన్ని నిరోధించడం కానేకాదు. ఆ పేరుతో, ఆ ముసుగులో దేశంలోని జాతుల పోరాటాల్ని, ప్రత్యేకించి కాశ్మీరు ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని, అలాగే మన పార్టీ మరికొన్ని సోదర విప్లవపార్టీల నేతృత్వంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో బలంగా సాగుతున్న సాయుధ విప్లవోద్యమాన్ని అణచివేయటమే ఈ ఆర్డినెన్సు అసలు లక్ష్యం. అంతేకాదు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, సంస్కరణల నేపథ్యంలో ప్రజల ప్రజాస్వామ్య హక్కులపైనా, ప్రజల జీవన హక్కులపైనా దాడులు ముమ్మరం అయిపోయాయి. ఇందుకు నిరసనగా ప్రజా ప్రతిఘటనా పోరాటాలు పెల్లుబుకుతున్నాయి.

నిజానికి రెండవ విడత సంస్కరణలతో (సెకండ్ జెనరేషన్ రిఫార్మ్స్) దేశం యావత్తూ ఒక యుద్ధభూమిగా మారిపోతోంది. దేశంలో ఒక తీవ్ర అంతర్యుద్ధ పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి దోపిడీ పాలకవర్గాలకి, వారి ప్రభుత్వాలకి అనేక విషపు కోరలు, కొమ్ములతో కూడిన ఇలాంటి నిర్బంధ చట్టాలు తప్పనిసరి. పోటో అసలు నేపథ్యం యిదే. ప్రపంచబ్యాంకు గురువు దగ్గర సుశిక్షితుడైన విద్యార్థిగా పాఠాలు నేర్చుకున్న చంద్రబాబుకి యీ నిజం బాగా తెలుసు. కనుకనే పోటో పరిధిలోకి మన పార్టీని చేర్చకపోవడం పట్ల అంతటి విస్మయాన్ని, విసుగును ప్రదర్శించాడు. అయితే మరి కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం దీన్ని అర్థంచేసుకోలేనంత అమాయక ప్రభుత్వం అనుకోవాలా? కానేకాదు, అది అమెరికా సామ్రాజ్యవాదాన్ని అంటకాగుతూ దానికి అన్ని విధాలా దాసోహమైపోతున్న ఫాసిస్టు బి.జె.పి. నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం. కరడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకత, జాతీయ దురహంకారం, మతఛాందసవాదం, యుద్ధోన్మాదం, విస్తరణవాదాలే తన సిద్ధాంత రాజకీయాలుగా పనిచేసే బి.జె.పి. నాయకత్వంలోని ప్రభుత్వం అది. కనుక, పోటో ప్రయోగ లక్ష్యాల గురించి చంద్రబాబు నుంచి చెప్పించుకోవలసిన స్థితిలో అది లేదు.

# హతుల వివరాలు

26 సంవత్సరాల బండేల సురేందర్ వరంగల్‌కి 15 కిలోమీటర్ల దూరంలోని గొర్రెకుంట గ్రామానికి చెందిన దళిత యువకుడు. వరంగల్‌లోని ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి (కార్మిక ఉపాధి భీమా ఆసుపత్రి)లో అంబులెన్స్ మెకానిక్‌గా పనిచేస్తూండేవాడు. తండ్రి ఆరోగ్య కారణాలతో స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తే వారసత్వ లబ్ధిదారుడుగా యితడు ఐదు సం॥ల క్రితం ఆ ఉద్యోగంలో చేరాడు. వీరిద్దరే అన్నదమ్ములు. అన్న ఐదు సం॥ల క్రితమే జబ్బుచేసి చనిపోయాడు. సురేందర్‌కి భార్య, ఒక కొడుకు వున్నారు. ముసలి తల్లిదండ్రులకి భార్యాబిడ్డలకి యితడే ఏకైక జీవనాధారం. సం॥ క్రితం అజ్ఞాత నక్సలైట్లతో సంబంధాలు అంటగడుతూ పోలీసులు పెట్టిన కేసులో మూడు నెలల జైలుశిక్ష అనుభవించి వచ్చాడు. అప్పటినుంచి పోలీసులు సురేందర్‌ని తరచుగా స్టేషన్ చుట్టూ తిప్పించుకునేవారు. ప్రతి ఆదివారం తప్పనిసరి. 22వ తేదీ ఆదివారం కూడా స్టేషన్‌కి పోయి సంతకం చేసి వచ్చాడు. మనం పోలీసు స్టేషన్‌ని పేల్చివేసిన 23వ తేదీ నాడు సురేందర్ రాత్రి డ్యూటీలో వున్నాడు. ఈ నిజాన్ని డ్యూటీ డాక్టరు, స్టాఫ్ నర్సు, అంబులెన్స్ డ్రైవరు కుండ బద్దలుకొట్టినట్లు చెప్పారు. వ్యాన్‌లో వచ్చివున్న వైద్యపరికరాలను, మందులను దించడానికి తన అనుమతి కోరుతూ ఆ రాత్రి 9.30 గం॥లకి సురేందర్ తనకు ఫోన్ చేశాడని ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వయంగా ప్రకటించాడు. సామాన్లు దింపిన తరువాత సురేందర్ ఆసుపత్రి వరండాలోనే పడుకున్నాడు. ఆ రాత్రి 2.00 గం॥ల ప్రాంతంలో వచ్చిన పోలీసులు సురేందర్‌ని పట్టుకుపోయారు.

35 సం॥ల గాలి చంద్రశేఖర్ ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టాడు. ఐదుగురు అన్నదమ్ముల్లో యితడొక్కడే చదువరి, ప్రభుత్వ ఉద్యోగి. మిగతా నలుగురు ఆటో డ్రైవర్లు. వర్ధన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్ హత్యకేసులోని నిందితులకి ఆశ్రయం కల్పించాడనే ఆరోపణతో పోలీసులు ఇతడిని అరెస్టుచేసి తప్పుడు కేసు పెట్టారు. సురేందర్ లాగానే ఇతడూ ప్రతి ఆదివారం స్టేషన్‌కి పోయి సంతకం పెట్టి వచ్చేవాడు. 23వ తేదీ నాటి అర్ధరాత్రి పోలీసులు చంద్రశేఖర్ యింటిపై పడి కుటుంబ సభ్యులు ఎంత వారిస్తున్నా పట్టించుకోకుండా చంద్రశేఖర్‌ని లాక్కుపోయారు. గతంలో కూడా యిలాగే అర్ధరాత్రిళ్ళు పోలీసులు తీసుకెళ్ళిన అనుభవం వున్నందున ఈసారి కూడా అలాగే మరునాడు క్షేమంగానే తిరిగి రాగలడని కుటుంబ సభ్యులు భ్రమపడ్డారు. ఆ రాత్రి జరిగిన పోలీసు స్టేషన్ పేల్చివేత వార్త గురించి వారికి తెలిసివుంటే తీవ్రంగానే ఆందోళన చెందివుండేవారు. కానీ వారికి ఆ వార్తే తెలియదు.

26 సం॥ల మంగలంపల్లి ఐలయ్య ఒక దళిత యువకుడు. మంచి జానపద కళాకారుడు. ప్రత్యేక తెలంగాణాని సమర్థించే 'జన కళా సమితి' సభ్యుడు. వరంగల్‌కి 60 కి.మీ. దూరంలో ఖమ్మంకి పోయే జాతీయ రహదారిని ఆనుకుని వుండే తొర్రూరు గ్రామస్థుడు. ప్రభుత్వం తన 'అక్షర సంక్రాంతి' కార్యక్రమంలో ఐలయ్య కళాసేవల్ని ఉపయోగించుకుని అతన్ని 'ఉత్తమ కళాకారుడు'గా సత్కరించింది కూడా. ఇతడెప్పుడూ ఎలాంటి ఆరోపణపైనా అరెస్టు కాలేదు. గడచిన సంవత్సరం నుంచి ఐలయ్య గుండెజబ్బుతో బాధపడుతూ వున్నాడు. చికిత్స కోసం ప్రభుత్వ సహాయం కోసం అర్జీ పెట్టుకున్నాడు కూడా. ఇలా వుండగా 24వ తేదీ రాత్రి షెడ్యూల్డ్‌కాస్ట్ కార్పొరేషన్‌కి చెందినవాళ్ళుగా చెప్పుకుని ఐలయ్య యింటికి యిద్దరు పోలీసులు సాదా దుస్తుల్లో వచ్చారు. ఐలయ్యకి ప్రభుత్వం వైద్యంకోసం మూడు లక్షల రూ॥లు మంజూరు చేసిందని చెప్పారు. ఆ డబ్బు తీసుకోవడానికి ఐలయ్యను తీసుకురమ్మని తమ అధికారులు పంపారని చెప్పారు. కొంత అనుమానంతోనే ఐలయ్య వారి వెంట యిల్లు కదిలాడు. ఐలయ్యని మోటారు సైకిల్ ఎక్కించేటప్పటికి అనుమానం వచ్చి కేకలేశాడు. అయినా పోలీసులు లాక్కుపోయారు. జన కళా సమితి మన కవర్ ఆర్గనైజేషన్ అనే అనుమానంతోనే ఐలయ్యని ఎంచుకుని పోలీసులు తీసుకుపోయారు.

25 సం॥ల బిశాది శంకర్ నిజాంపల్లి గ్రామస్థుడు. వరంగల్ పట్టణం కొత్తతోటలో నివాసం వుంటున్నాడు. మహారాష్ట్ర నుండి వలస వచ్చాడు. ఇతడిపై పోలీసులు నాలుగు కేసులు బనాయించారు. ఇతడు కూడా ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్‌లో సంతకం చేసి వస్తుండేవాడు. డిసెంబరు 24న కరీంనగర్ నుంచి ఒక ఆటోరిక్షాని కొనుక్కొచ్చాడు. దానికి అవసరమైన మరమ్మత్తులు చేయించుకుని రాత్రి 8.30 గం॥లకు యిల్లు చేరి తిండి తిని పడుకున్నాడు. ఆ రాత్రి ఒంటి గంట ప్రాంతంలో పోలీసులు తలుపు తట్టారు. శంకర్ భార్య ఊర్మిళ తలుపు తీసింది. కొంత సమాచారం కోసం శంకర్‌ని ప్రశ్నించాలంటూ నిద్ర లేపించారు. తిరిగి పంపివేస్తామని అతని భార్యతో చెప్పి శంకర్‌ని తమతో తీసుకుపోయారు. తర్వాత అతడు తిరిగి రాలేదు

ఈ నిరుపేద దళితుల దారుణ హత్యా వుదంతం మన సమాజంలోని పాలకవర్గ సంస్కృతిని చాటి చెప్పింది. ఒక అనాలోచితమైన, అసందర్భ సంఘటనలో ఎం.ఎల్.ఏ. రాగ్యానాయక్‌ని మన దళం చంపితే మిన్ను విరిగేటట్లు కోడై కూసిన పాలకవర్గ పార్టీలూ, చట్టసభలూ, మధ్యతరగతి జీవులూ అంతకు కొద్ది రోజుల క్రితమే పోలీసులు పాశవికంగా ఈ నిరుపేద దళితులను చంపివేస్తే కనీసం ఈ హత్యాకాండను ఖండించిన పాపాన పోలేదు. సామాజిక నిచ్చెన పైమెట్లలో వున్న వారి మరణాలకు, అధోజగత్తులో వున్న వారి మరణాలకు ఈ వర్గ సమాజ సంస్కృతి దృష్టి కోణమే ఈ విధమైన వ్యత్యాసాలను ఆపాదిస్తోంది. ఎవరి జీవితమైనా విలువైనదే కానీ ఈ అంతరాల వ్యవస్థలో పేదల జీవితాలకు విలువ శూన్యం. రాగ్యానాయక్ మరణం పట్ల సమాజం చూపిన తీవ్ర నిరసన ఈ నిరుపేదల హత్య పట్ల వ్యక్తం కాకపోవడంలో రహస్యం ఇదే. జీవితాలను, మరణాలను, వధలను చూసే కోణంలో కూడా వర్గ దృక్పథం ప్రతిబింబిస్తుంది. దోపిడీ వర్గాలతో పాటు దోపిడీ వర్గ సంస్కృతి కూడా నశించాలంటే పోరాడాల్సిందే. ఈ కోణంలోంచే, ఎవరికీ పట్టకపోయిన ఈ నిరుపేద దళితులకు నివాళి పలుకుదాం.

పోటో గురిపెట్టాల్సిన ఖచ్చితమైన టార్గెట్ మనమే నన్న సంగతి కేంద్రప్రభుత్వానికి ప్రత్యేకించి అద్వానీ నేతృత్వంలోని హోమ్ మంత్రిత్వ శాఖకి తెలియనిదేంకాదు. అయితే మొదట్లోనే మన పార్టీని పోటో పరిధిలో ఎందుకు చేర్చలేదు? ఇందుకు రెండు కారణాలు : ఒకటి, లోక్‌సభలో తనకుండే సంఖ్యాబలంతో అనేక సందర్భాల్లో తనపై వత్తిడి తెస్తూ యిబ్బంది పెడుతున్న చంద్రబాబుకి తాము సైతం అతడిని యిబ్బంది పెట్టగలమని తెలియజేస్తూ చిన్న మొట్టికాయ మొట్టడం; రెండవది, మన పార్టీని పోటో పరిధిలో చేర్చడానికి తమకైతే యిష్టం లేదుగానీ, చంద్రబాబు వత్తిడి వల్లనే చేర్చాల్సివచ్చిందనే భావాన్ని కల్గించడం. ఇదెందుకు అవసరమంటే, ఈ రాష్ట్రంలో ప్రత్యేకించి తెలంగాణాలో తమ పార్టీవారు మన కోపానికి గురికాకుండా జాగ్రత్త పడడంకోసం. ఎలాగైతేనేమి మన పార్టీని పోటో పరిధిలోకి చేరుస్తూ జాతీయ స్థాయిలో నిషేధించడం జరిగింది.

దీనికోసం చంద్రబాబు ఎందుకు అంతగా ఆరాటపడిపోయాడంటే, మనపై నిర్బంధాన్ని మరింత పెంచడం ద్వారానే మన ఉద్యమాన్ని ఎదుర్కోవాలని అతడు కృతనిశ్చయంతో ఉన్నాడు. చర్చల ప్రతిపాదనని అతడు పెద్ద ఆటంకంగానే భావిస్తున్నాడు. అయితే అన్ని ప్రక్కల నుంచి చర్చల కోసం వస్తున్న వత్తిడిని తట్టుకోలేక నోటితో పలుకరిస్తూ నొసటితో వెక్కిరించినట్లు తన ప్రభుత్వం చర్చలకు సిద్ధమేనని ఒక ప్రక్క అంటూ రెండో ప్రక్క చర్చల వాతావరణాన్ని కాలుష్యపర్చడానికి, చర్చల ప్రతిపాదనని దారి మళ్ళించడానికి పడరాని పాట్లన్నీ పడుతున్నాడు.

డిసెంబరు 25 తరువాత చంద్రబాబు ప్రభుత్వం యిబ్బందికర స్థితిలో పడింది. ప్రభుత్వ ఉద్యోగుల్ని సైతం పట్టుకుపోయి పిట్టల్ని కాల్చినట్లు కాల్చేస్తున్నా పోలీసు ఘాతుకాలపై తమ సంకుచిత పార్టీ రాజకీయాల పరిధిలోనే అయినా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ధ్వజమెత్తడానికి సిద్ధపడుతుండిన స్థితి. అలాంటి చర్చ తార్కికంగా 'చర్చల' వైపు మళ్ళి బలపడే వాతావరణం. అలాంటి పరిస్థితిలో డిసెంబరు 29 నాటి రాగ్యానాయక్ ఘటన చంద్రబాబుకి పెద్ద ఆటవిడుపు అయిపోయింది.

రాగ్యానాయక్ ఆకస్మిక మరణంపై శాసనసభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ముఖ్యమంత్రి ప్రదర్శించిన (టీవీలో శాసనసభ కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారం అయ్యాయి) కపట గాంభీర్యాన్ని, ముఖానికి పులుముకున్న విచారాన్ని, గొంతుకు అంటించుకున్న విషాదాన్ని చూసినవారికి 'మిత్రలాభం'లోని నక్క జ్ఞాపకం రాక తప్పదు (వేటగాని వలలో చిక్కిన లేడి మరికొద్దిసేపట్లో తనకు ఆహారం కాగలదని మనసులో సంబరపడిపోతూనే బయటికి మాత్రం లేడిపై జాలి కురిపిస్తూ ఏడుస్తుంది నక్క). మన చేతుల్లో ఖతమైపోయిన పాలకవర్గ రాజకీయ నాయకుల జాబితా వల్లించే సందర్భంలో చాణక్య చతురతని ప్రదర్శించాడు చంద్రబాబు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన 'కీర్తిశేషుల' జాబితానే పేరుపేరునా వల్లించాడు. ఇది సభనంతటినీ ఆకట్టుకునే ప్రయత్నం. కాగా, ఇందులోని మరో మర్మం ఏమంటే, తన పార్టీవారైన దగ్గుబాటి చెంచురామయ్య, బుడ్డా వెంగళరెడ్డి వంటివారు చెప్పలేనంత అపకీర్తే తప్ప ఎలాంటి కీర్తిశేషాలు వెనకేసుకున్నవారు కాకపోవడం. రాగ్యానాయక్ కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రకటించిన భారీ పరిహారాలు, రాయితీల సంగతి అలా వుంచి పచ్చి రాచరిక ఫ్యూడల్ తరహాలో అతడి మరణంతో ఏర్పడిన ఖాళీ స్థానానికి రాగ్యానాయక్ వారసుడు ఎన్నిక కావడానికి వీలుగా యింకెవరూ పోటీకి నిలవరాదని అనధికారిక తీర్మానం ఆమోదింపజేశాడు.

మనకు వ్యతిరేకంగా శాసనసభలో ఏకాభిప్రాయాన్ని కూడగట్టడానికి 'యిలాంటివారితో చర్చలేమిటబ్బా' అనే ఒక నిర్వేద స్థితిని కల్పించడానికి శాయశక్తులా కృషిచేశాడు చంద్రబాబు. అయితే అతడి సాముగరిడీలు అతడు ఆశించినంతగా పనిచేయలేదు. రాగ్యానాయక్ హత్యను ఖండించడంలోనూ, అతడి కుటుంబానికి రాయితీల జల్లులు కురిపించడంలోనూ చంద్రబాబుతో గొంతు కలిపిన ప్రతిపక్షాలు ఈ సాకుతో

(తరువాయి 36వ పేజీలో...)

(44వ పేజీ తరువాయి...)

అణచివేసేందుకు సైన్యాన్ని వినియోగించడానికిగాను లోపాయికారీ ఏర్పాట్లు కూడా శరవేగంగా చేసినట్లు తెలిసింది. నేపాల్ మావోయిస్టు వుద్యమాన్ని 'టెర్రరిస్టు'గా ఆరోపిస్తూ, భారత విదేశాంగ మంత్రి ఏ దేశ అంతర్గత వ్యవహారాల్లోనూ మరొకరు జోక్యం చేసుకోరాదన్న నియమాలన్నింటినీ పక్కనబెట్టి, ఈ ఉద్యమంతో పోరాడతామని, ప్రస్తుత పాలకవర్గానికి మద్దతునిస్తామని ప్రతిజ్ఞ చేశాడంటేనే ఈ ప్రతీఘాతుక, అవకాశవాద ప్రభుత్వ శక్తులు మన దేశాన్ని, దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టేసే కుట్రకు ఎలా పాల్పడుతున్నారో ప్రతి ఒక్కరికీ తెలిసిపోయింది. రాజమందిరంతో కుమ్మక్కైన ఈ ప్రభుత్వం, పాలక నేపాలీ కాంగ్రెస్సే చర్చలు విచ్ఛిన్నమయేందుకు పూర్తి బాధ్యులనే వాస్తవం సామాన్యులకు సైతం అర్థమైపోలేదా?

### మరి చర్చల గమ్యం ఏమిటి?

రాజమందిరం-గిరిజా కొయిరాల కూటమికి చెందిన ఆరిపోయే దీపం లాంటి దేబా ప్రభుత్వమే చర్చలు సాగించేందుకు తగిన పరిస్థితి అసాధ్యమై పోయిన స్థితిని వాస్తవంగానే సృష్టించిందని అందరికీ అర్థమైపోయింది. అందుచేత చర్చల గమ్యం పెద్దగా కన్పించటం లేదిపుడు. కాకపోతే మా పార్టీ తన వంతుగా 'చర్చలు' సాగేందుకుగాను సాధ్యమైన మేరకు ప్రయత్నిస్తుంది. మా ప్రయత్నమున్నప్పటికీ ప్రభుత్వమూ, పాలక పార్టీ ఈ పరిస్థితిని విచ్ఛిన్న పర్చాలని చూస్తే చర్చలకు తగిన వాతావరణం చెదిరిపోతుంది. ఇటువంటి అవాంఛనీయ పరిణామమే సంభవిస్తే, జరిగే పరిమాణాలన్నింటికీ ప్రస్తుత ప్రభుత్వము, దాని వంతదార్లదే పూర్తి బాధ్యత. ఆ సందర్భంగా జరిగే పరిణామాలను ఎదుర్కోడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా వుండాలి.

*(నవంబర్ 24న నేపాల్ మావోయిస్టులు నాలుగు నెలల కాల్పుల విరమణకు స్వస్తి చెబుతూ పోలీసు, ఆర్మీ స్థావరాలపై దాడులు ప్రారంభించాయి. కాల్పుల విరమణ సమయంలో ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య జరిగిన మూడు విడతల చర్చలు విఫలమయ్యాయి. చర్చల పర్వం ముగిసిపోయాక మావోయిస్టులు దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున దాడులకు దిగి వందలాదిమంది పోలీసులను హతమార్చడంతో నేపాల్‌లో మూడు నెలల అత్యవసర పరిస్థితి విధించి పత్రికలపై సైన్య సెన్సార్‌షిప్ ప్రకటించి సైన్యానికి సర్వాధికారాలు కట్టబెట్టారు. ఈ పరిణామాలన్నీ పై వ్యాసం సారాంశాన్ని చక్కగా నిరూపిస్తున్నాయి. - సంపాదకులు)*

❑

## మన ఉద్యమ ప్రజానాడిని దెబ్బతీయడమే లక్ష్యంగా సాగుతోంది పోలీసుల హత్యాకాండ!

## విప్లవకర ప్రజాపంథాకు దృఢంగా అంటిపెట్టుకోవడం ద్వారా ఈ దమనకాండను ఓడిద్దాం!!

ఈ డిసెంబరు చివరి వారంలో పరస్పరం సంబంధం గల వరుస ఘటనలు కొన్ని మన రాష్ట్రంలో జరిగాయి. ఇక్కడ మన ఉద్యమంపై ఎంతో ప్రభావం వేయగల ఘటనలు యివి. డిసెంబరు 23వ తేదీ రాత్రి 9.00-9.30 గంటల సమయంలో పి.జి.ఏ.కి చెందిన మన సాయుధ దళాలు వరంగల్ పోలీసు స్టేషన్ (భూపాలపల్లి) ని లాండ్‌మైన్స్ పెట్టి పేల్చివేశాయి. వాణిజ్య కార్యకలాపాలతో నిత్యం రద్దీగా వుండే హన్మకొండ చౌరస్తాకి కేవలం కొద్ది మీటర్ల దూరంలోనే వుంది ఈ స్టేషన్. ఈ ప్రేలుడు శబ్దానికి వరంగల్ పట్టణం దద్దరిల్లిపోయింది. కొన్ని కిలోమీటర్ల దూరం వరకు శబ్దం వినిపించింది. ఈ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గులాం సమ్ధానీని టార్గెట్‌గా చేసుకుని కూడా జరిగిన యాక్షన్ యిది. ఈ ఇన్‌స్పెక్టర్ చాలామంది మన సానుభూతిపరులను, మిలిటెంట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చిన నరహంతకుడు. సాధారణ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిన వీడు మనపై సాగించిన హత్యాకాండలతోనే ప్రమోషన్‌లమీద ప్రమోషన్‌లు కొట్టేసి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయిపోయాడు.

వరంగల్ పట్టణం నడిబొడ్డున మనం చేసిన ఈ సాహసోపేత చర్యతో జిల్లా పోలీసు యంత్రాంగం బిత్తరపోయింది. పిచ్చెత్తిపోయిన పోలీసులు పరమ నీచమైన పిరికిపంద ప్రతీకార చర్యలకు దిగిపోయారు. 23, 24 తేదీలు అర్ధరాత్రి వేళల్లో దొంగల్లా యిళ్ళమీద పడి నలుగురు అమాయకులను ఎత్తుకుపోయిమరీ నిలువునా కాల్చిచంపేశారు. అలవాటైపోయిన ఎన్‌కౌంటర్ కట్టుకథని 25వ తేదీ పత్రికల ద్వారా ప్రకటించారు. ఈ నలుగురికి 23వ తేదీ నాటి పోలీసు స్టేషన్ పేల్చివేతతో సంబంధం వున్నట్లుగా పోలీసులు చెప్పలేదు. సమీప అటవీ ప్రాంతంలో అజ్ఞాత నక్సలైట్లకూ తమకూ మధ్య 24వ తేదీ రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరు హతులైనట్లుగా ప్రకటించారు. పోలీసులు ఎప్పుడు రమ్మంటే అప్పుడు స్టేషన్‌కు పోయి హాజరు వేయించుకువస్తుండిన వాళ్ళే ఈ నలుగురూ. ప్రత్యేకించి ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా సంతకాలు పెట్టి వస్తుండేవారు. కారణం, అజ్ఞాత నక్సలైట్లతో వీరికి సంబంధాలున్నాయనే ఆరోపణతో పోలీసులు తప్పుడు కేసులు బనాయించి వీరిని స్టేషన్ చుట్టూ తిప్పించుకునేవారు. 22వ తేదీ ఆదివారం కూడా ఈ నలుగురూ స్టేషన్‌కు పోయి సంతకాలు పెట్టివచ్చారు. ఇలాంటివారు ఎన్‌కౌంటర్‌లో హతులవ్వడమేమిటి? అని పాత్రికేయులు పోలీసుల్ని బెరుకుగానే ప్రశ్నించారు. దీనికి వరంగల్ ఎస్పీ యిచ్చిన సమాధానం ఏమంటే, ''పగలల్లా వీళ్ళు తమతమ పనుల్లో మామూలుగానే వుంటారు. రాత్రయ్యేసరికి మాత్రం సాయుధ నక్సలైట్లతో సమావేశం కావడానికి సమీప అటవీ ప్రాంతాలకి పోయి వస్తూంటారు. కనుకనే సాయుధ నక్సలైట్లకీ మాకూ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో చిక్కుకుని వీరు హతులయ్యారు''. అదే నిజమైతే, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న ఏ ఒక్క పోలీసుకీ చిన్న గాయమైనా ఎందుకు కాలేదు? నిత్యం ప్రజల మధ్య కదలాడే ఈ నలుగురూ తప్ప యింకే ఒక్క అజ్ఞాత నక్సలైటూ ఎందుకు చనిపోలేదు? అనే ప్రశ్నలు పాత్రికేయుల పెదవుల వరకూ వచ్చేవుంటాయి. కానీ, అలాంటి కూపీలతో తామూ ఏదో 'ఎన్‌కౌంటర్'లో 'చిక్కుకోవలసి' వస్తుందని ఆగిపోయి వుంటారు.

ఈ పోలీసు హత్యాకాండని హతుల కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు తీవ్రంగా దుయ్యబట్టారు. పౌరహక్కుల సంఘాలూ, యితర ప్రజాసంఘాలే కాక పత్రికలు సైతం యివి పోలీసు హత్యలేనని తెగేసి చెప్పాయి. ఈ ప్రజా నిరసనతో నిప్పు తొక్కిన కోతిలా చిందులేసిన వరంగల్ ఎస్పీ 'సాక్ష్యాలుంటే కోర్టుకు పోవచ్చు' అని సవాలు విసిరాడు. అంటే కోర్టుకెళ్ళేవారి పని కూడా పడతామనే బెదిరింపు అన్న మాట. పేదలైన ముగ్గురు హతుల కుటుంబాల వారు పోలీసులతోనూ, కేసులతోనూ వేగలేమని బాధని దిగమింగుకుని వుండిపోయారు. కాని బండేలు సురేందర్ తల్లి మాత్రం పోలీసులకి వ్యతిరేకంగా కోర్టు పోరాటానికి కొంగు బిగించింది. ఇంకో బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చంపడానికి ఆమెకి మరి పిల్లలంటూ ఎవరూ లేరు కదా! అందుకే పోలీసు బెదిరింపులకు తలొగ్గకుండా ఆమె సాహసించి వుండాలి.

పోలీసులు చేసిన ఈ నాలుగు హత్యలూ మరోసారి ఒక వాస్తవాన్ని చాటాయి. మన ప్రజా పునాదిని, సాంఘిక పునాదిని, వర్గ పునాదిని నిర్మూలించడమే లక్ష్యంగా పోలీసు హత్యాకాండలు సాగుతున్నాయి. మన ప్రజాసంఘాల కార్యకర్తలు, మన ఉద్యమ సానుభూతిపరులు, మిలిటెంట్లు సాధారణంగా దళిత, వెనుకబడిన తరగతులకి చెందిన పేదలుగానే వుంటూవుంటారు. పోలీసులు వీరినే మట్టుపెడుతున్నారు. రాటుదేలుతున్న మన గెరిల్లాయుద్ధ ఎత్తుగడలకి ఖంగుతింటున్న పోలీసులు మనపై ప్రతీకారంగా యిలాంటి దారుణ హత్యాకాండకి దిగిపోతున్నారు. మన సానుభూతిపరుల్ని, మిలిటెంట్లని, ప్రజాసంఘాల కార్యకర్తల్ని, అలానే నిర్బంధానికి తాళలేక బైటికి పోయి బతకాలనుకునేవారిని, లొంగిపోయినా ఉద్యమ ద్రోహానికి పాల్పడకుండా తమ మానాన బ్రతకాలనుకునేవారిని ఇలాంటి వందలాదిమందిని తమ అదుపాజ్ఞల్లో వుంచుకుంటూ పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పించుకుంటూ మన వీరోచిత గెరిల్లా చర్యలకు ప్రతీకారంగా ఇలాంటి వారిని మట్టుబెడుతున్నారు. నిప్పులాంటి ఈ నిజాన్ని కప్పిపెట్టేస్తూ యివన్నీ మన ఉద్యమ కారణంగానే ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలుగా చిత్రిస్తూ ప్రభుత్వం, పోలీసులు విష ప్రచారం చేస్తున్నారు. ఈ నిజాన్ని నిజంగా యిలా చూడలేకపోతున్న లేక చూడడానికి యిష్టపడలేకపోతున్న కొందరు మేధావులు, రాజకీయ పండితులు మనకూ పోలీసులకూ మధ్య పడి ప్రజలు నలిగిపోతున్నారని వాపోతున్నారు. ఇది మన ఉద్యమం ప్రారంభం నుండీ సాగుతున్న తంతే.

కాగా, ఈ నలుగురి హత్యాకాండతో మరో దారుణ పరిణామం

(తరువాయి 45వ పేజీలో...)